www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 25-2-2024 | పేజీలు: 14+ 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 311 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: పాడ్యమి రా 8.37 తదుపరి విదియ; నక్షత్రం: పుబ్బ రా. 1.25 తదుపరి ఉత్తర; వర్జ్యం: ఉ 7.22-9.10; దుర్ముహూర్తం: సా.4.44-5.31; అమృతఘడియలు: సా.6.11-8.00; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## దేశంలోనే అత్యుత్తమం!

రాష్ట్రానికి గర్వకారణంగా మంగళగిరి ఎయిమ్స్

183 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మాణం

అన్ని రకాల అధునాతన వైద్యసేవలు

వివిధ ల్యాబ్‌లు.. అధునాతన బ్లడ్‌బ్యాంకు

2015లోనే నిర్మాణ పనులు ప్రారంభం

2019 ఎన్నికలకు ముందే ఓపీ సేవలు

నేడు జాతికి అంకితం చేయనున్న మోదీ



మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రి సముదాయం

3

# జన కంటకం.. జగన్ నాటకం!

"మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైలుకు పంపారు. స్కిల్ కేసులో ఆయన తప్పు చేశారనడానికి సరైన ఆధారాలు లేవు!"

- ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒకరు కేంద్ర పెద్దలకు అందజేసిన నివేదికలో పేర్కొన్న విషయమిది.



తన సభలకు తీసుకు వస్తున్న జనాలందరూ వెర్రిబాగులోళ్లు అని భావించే ముఖ్యమంత్రి చెప్పిన అబద్ధం చెప్పకుండా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబులాంటి వాడు రాజకీయాలలో ఇంకా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందని జగన్మోహన్ రెడ్డి తాజాగా సెలవిచ్చారు. జగన్ రెడ్డే రాజకీయాలలోకి వచ్చి ముఖ్యమంత్రి అవగలిగినప్పుడు రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు.

బడుగు బలహీన వర్గాల ఓట్లు కావాలి కనుక జగన్మోహన్ రెడ్డి 'నా' అనే పాట పాడుతుంటారు. తన పల్లకి మోసే బోయీలుగానే ఆ వర్గాలు ఉండిపోవాలని ఆయన కోరుకుంటారు. అందుకే అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా వారెవరినీ రానివ్వరు.

ఐదేళ్లలో అక్క చెల్లెమ్మలకు రెండున్నర లక్షల కోట్లు పంచిపెట్టానని జగన్ గొప్పలు చెప్పుకొంటున్నారు. అయిదేళ్లలో ఐదు లక్షల కోట్లు అప్పు చేసి రెండున్నర లక్షల కోట్లు పంచడం గొప్పా? ఈ ఐదేళ్లలో తన జేబు నుంచి ఒక్కరికైనా పది రూపాయలు సహాయం చేశానని జగన్ రెడ్డి చెప్పగలరా? ఈ ఐదేళ్లలో జగన్ రెడ్డి కంపెనీల లాభాలు పెరిగినట్టుగా పేదల ఆదాయం ఎందుకు పెరగలేదు?

జనం కళ్లలోకి సూటిగా చూస్తూ అలవోకగా అబద్ధాలు చెప్పగలిగేది ఎవరంటే , జగన్మోహన్ రెడ్డి అని చెప్పుకోవలసి ఉంటుంది. ఆయన హావభావాలను జాగ్రత్తగా గమనించిన వారికి 'నేను ముఖ్యమంత్రిని అయ్యానా?' అన్న అనుమానం అతడిలో అప్పుడప్పుడూ కలుగుతుందని మనకు తెలిసిపోతుంటుంది.

సొంత మీడియాకు వందల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెడుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి, ఈనాడు అని శోకాలు పెడుతుంటారు. ఈ క్రమంలోనే మీడియాపై దాడులకు తన వాళ్లను ప్రోత్సహిస్తున్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి తర్వాత వైసీపీ అధికారికంగా వెలిబుచ్చిన అభిప్రాయం మరీ దారుణంగా ఉంది. 'ప్రజల అభిప్రాయం తీసుకొని వార్తలు రాస్తే అందరూ హర్షిస్తారు. కానీ.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే ప్రభుత్వం కాదు, ప్రజలే బుద్ధి చెబుతారు' అని వైసీపీ 'ఎక్స్' ద్వారా సెలవిచ్చింది. అంటే, రాష్ట్రంలోని మీడియా సంస్థలన్నీ ఆ రోత పత్రిక, ఆ రోత చానల్‌కు అనుబంధంగా మారిపోయి ప్రస్తుత కూలి మీడియా బాటలో ముఖ్యమంత్రి భజన చేస్తూ వాళ్లు విసిరే ఎంగిలి మెతుకులు తినడానికి అలవాటుపడాలని కోరుకుంటున్నారన్న మాట!

తాను ఎప్పుడైతే ముఖ్యమంత్రి సీటులో కూర్చున్నారో అప్పుడే ప్రజలు ఉత్త అమాయకులు, వారిని పదే పదే బురిడీ కొట్టించవచ్చునని జగన్మోహన్ రెడ్డి నిర్ధారణకు వచ్చారు. అందుకే రాష్ట్రంలో కులాల కుంపట్లు రాజేసి చలి కాచుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

మీడియాపై మీ ఉన్మాద మూకలు చేయబోయే దాడులను ఎదుర్కోవడానికి మేం కూడా సిద్ధం. నియంతృత్వ పోకడలను, కపట విన్యాసాలను ప్రశ్నిస్తూనే ఉంటాం!

**కొత్త పలుకు** ఆర్కే విశ్లేషణ 4లో..





పవన్ కల్యాణ్‌తో కలిసి అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తున్న చంద్రబాబు

"టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించిన రోజే మనం గెలిచాం. ఆనాడే వైసీపీ కాడిపడేసింది. 5 కోట్ల మంది ప్రజలు ఒక వైపు.. రౌడీయిజం, అక్రమ సొమ్ము, ధనబలం, పెత్తందారులు ఉన్న వైసీపీ మరోవైపు ఉంది. రౌడీయిజం, దొంగ ఓట్లు చేర్చి గెలవాలని వైసీపీ నేతలు చూస్తున్నారు. అవినీతి డబ్బులతో ఓట్లు కొనే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఇది ప్రజాస్వామ్యం. ఒక వ్యక్తికి అధికారం శాశ్వతం కాదు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వచ్చింది. దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది"

- చంద్రబాబు

## జనసేనకు 24 సీట్లు

### రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

టీడీపీ, జనసేన ఓట్లు బదిలీ కావాలి.. త్యాగం చేసిన వారికి ప్రాధాన్యం

గట్టి పోటీ ఇవ్వాలనే 24 ఎమ్మెల్యే, 3 ఎంపీ సీట్లు తీసుకున్నాం: పవన్

తెనాలి నుంచి నాదెండ్ల, అనకాపల్లి నుంచి కొణతాల.. 5 పేర్లు ప్రకటన

బలరాం, నానాజీ, మాధవికి టికెట్లు.. 2,3 రోజుల్లో మిగిలిన పేర్లు వెల్లడి

2019 నుంచి అరాచకపాలనలో నలుగుతున్నాం. ఇలాంటి సమయంలో బాధ్యతతో ఆలోచించాం. 'కొందరు 45 సీట్లు కావాలి, 75 కావాలి' అని అన్నారు. 2019లో 10 స్థానాలన్నా గెలిచి ఉంటే నేడు ఎక్కువ స్థానాలు అడగడానికి అవకాశం ఉండేదని వారితో అప్పుడే చెప్పాను. అందుకే తక్కువ స్థానాల్లో పోటీ చేసినా గట్టి పోటీ ఇవ్వాలని 24 స్థానాల్లో బరిలోకి దిగుతున్నాం.

- పవన్ కల్యాణ్

11

# 94 టీడీపీ 5 జనసేన — గెలుపు గుర్రాలతో సై

99 మందితో తొలి జాబితా

## ఉమ్మడిగా ప్రకటించిన చంద్రబాబు, పవన్

**టీ**డీపీ, జనసేన అధిపతులు తొలి విడత 'గెలుపు గుర్రాల'తో సై అన్నారు. షెడ్యూలు విడుదలకంటే ముందే ... ఒకే రోజు, ఒకే విడతలో 99 సీట్లకు అభ్యర్థులను ప్రకటించారు. వీరిలో 94 మంది టీడీపీ అభ్యర్థులు.. ఐదుగురు జనసేన అభ్యర్థులు! పొత్తుల్లో భాగంగా జనసేనకు 24 అసెంబ్లీ, 3 లోక్‌సభ స్థానాలు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కూటమిలో కలవాలని భావిస్తున్న బీజేపీకి 4 లోక్‌సభ, నాలుగు అసెంబ్లీ స్థానాలు కేటాయించే అవకాశం కనిపిస్తోంది. ఒకటీ అరా పేర్లతో, అది కూడా 'మీరు అభ్యర్థులు కాదు.. సమన్వయకర్తలు మాత్రమే' అని అధికార పార్టీ తడబడుతుండగా... టీడీపీ దూకుడుగా ఒకేసారి 94 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడం గమనార్హం!



### 18 మంది సిటింగ్‌లు 24 మంది కొత్తవారు

- టీడీపీ, జనసేన తొలి జాబితాలో ఒకరు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఇద్దరు పీహెచ్‌డీ చేశారు. 30 మంది పీజీ చదివారు. ముగ్గురు ఎంబీబీఎస్ పూర్తి చేయగా, గ్రాడ్యుయేట్లు 63మంది ఉన్నారు.
- టీడీపీ టికెట్లు లభించిన 94 మందిలో 20 మంది దళితులు, 18 మంది బీసీలు, ముగ్గురు ఎస్టీలు, మైనారిటీ వర్గానికి చెందినవారు ఒకరు ఉన్నారు.
- కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు 21 మంది, రెడ్లు 17 మంది, క్షత్రియ కులస్థులు నలుగురు ఉండగా, వెలమకు ఒకటి, వైశ్యులకు 2, కాపులకు 7 సీట్లు లభించాయి.
- జనసేన ఇచ్చిన ఐదు సీట్లలో కాపులకు 2, గవర, బ్రాహ్మణ, కమ్మ వర్గాలకు ఒక్కొక్కటి దక్కాయి.

## చంద్రబాబు మాస్టర్ స్ట్రోక్

ఒకేసారి 94 మంది అభ్యర్థుల ప్రకటన

ఎన్నికల షెడ్యూల్‌కు ముందే భారీ జాబితా

టీడీపీ రాజకీయ చరిత్రలోనే అసాధారణం

ఇంకా ఇన్‌చార్జులను మార్చే దగ్గరే వైసీపీ..

అభ్యర్థుల ప్రకటనతో టీడీపీ సంచలనం

బీజేపీ కోసం ఆగిన టీడీపీ, సేన ఎంపీ జాబితా

పొత్తుపై క్లారిటీ రాగానే విడుదలకు వీలు

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఆకస్మిక సంచలనానికి తెరదీశారు. తమ పార్టీకి చెందిన 94 మంది అభ్యర్థుల జాబితాను శనివారం ఒకేసారి విడుదల చేశారు. జనసేనతో కలిపి మొత్తం తొంభై తొమ్మిది మంది అభ్యర్థులతో జాబితా విడుదల అయింది. చంద్రబాబు తెలుగుదేశం

మిగతా 2వ పేజీలో...

## రాష్ట్రం కోసం కలిసి వస్తున్నాం

ప్రజలే గెలిపించుకోవాలి.. మంచి ప్రయత్నానికి తొలి అడుగు పడింది

వ్యక్తుల కోసమో, పార్టీ లబ్ధి కోసమో మేం కలవలేదు

విభజన కంటే జగన్ నష్టమే అధికం.. ప్రజలను ఎంతో అవమానించారు

అన్యాయం జరిగితే చెప్పుకోలేని పరిస్థితి.. ఏపీ బ్రాండ్‌ను దెబ్బ తీశారు

మా అభ్యర్థుల్లో డాక్టర్లు, ఐఏఎస్‌లు, గ్రాడ్యుయేట్లు

వైసీపీలో స్మగ్లర్లు, గూండాలు, రౌడీలకు చాన్స్

టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలలో చంద్రబాబు వ్యాఖ్యలు

టీడీపీ, జనసేన శ్రేణులు సహకారంతో కదలాలి

11

## బీజేపీకి పరిమితమే!

4 అసెంబ్లీ, 4 లోక్‌సభ సీట్లు?

టీడీపీ, జనసేన వర్గాల్లో చర్చ

గెలుపొందే స్థానాలు ఇచ్చే అవకాశం

# అవినీతి 'కళ'

## నియోజకవర్గంలో అభివృద్ధి నిల్

## మహిళా ఎమ్మెల్యే అక్రమాల దందా

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చారు. తండ్రి ఎమ్మెల్యేగా, ఎంపీగా పనిచేశారు. ఆమె కూడా రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అయితే అక్రమార్జనపై ఉన్న శ్రద్ధ నియోజకవర్గ అభివృద్ధిపై ఏమాత్రం చూపడం లేదని చెబుతారు. వచ్చే ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ఏమో.. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్న చందంగా వ్యవహరిస్తున్నారు.

ఇసుక దందాలు, అక్రమ మట్టి తవ్వకాలు, భూ ఆక్రమణలు, అభివృద్ధి పనుల్లో కమీషన్లు.. ఇలా దోచుకోవడానికి అవకాశమున్న ఏ వనరునూ వదలకుండా సదరు నాయకురాలు సొమ్ములు వెనకేసుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకుని ఫాం హౌస్ నిర్మించుకున్నారు. నియోజకవర్గంలో అవినీతి 'కళ' తప్ప.. అభివృద్ధి మచ్చుకైనా కనిపించదనే విమర్శలు ఉన్నాయి.



సొంతూరులోనే చెరువు ఆక్రమణ

కబ్జా చేసిన భూముల్లో ఫాం హౌస్

ఏ శాఖ ద్వారా పనులు చేపట్టినా సదరు నేతకు వాటాలు ఇవ్వాల్సిందే

పీఏ ద్వారా కమీషన్ల వసూలు

ఇసుక అక్రమ తవ్వకాలతో సొమ్ములు

అమ్మో ఎమ్మెల్యే

(పార్వతీపురం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గిరిజన ప్రాంతమున్న నియోజకవర్గమది. స్థానిక ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి ఆమె ఏమాత్రం కృషి చేయలేదనే విమర్శలున్నాయి. బినామీలకు కేరాఫ్‌గా మారారు. అధికారంలో ఉంటామో లేదోననే భావనతో అక్రమార్జనకు తెరలేపారు. ప్రభుత్వ భూములు ఆక్రమించుకున్నారు. ఫాం హౌస్ నిర్మించుకుని ప్రభుత్వ నిధులతో రోడ్డు వేయించుకున్నారు. సొంత గ్రామంలోని చెరువును కూడా ఆక్రమించుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాల్లో సొమ్ములు వెనకేసుకున్నారు. తన పీఏ ద్వారా వాటాలు దండుకున్నారు. సదరు నాయకురాలు

మిగతా 2వ పేజీలో...



వారాణసిలో అమూల్ డెయిరీ ప్లాంట్ ప్రారంభోత్సవంలో మహిళలతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

## రూ.1.25 లక్షల కోట్లతో అతిపెద్ద ధాన్యం నిల్వ పథకం

ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ

ఐదేళ్లలో సహకార రంగంలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యం సృష్టి

దేశవ్యాప్తంగా వేలాది గోదాముల నిర్మాణం

12

## కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి

దేశమంతా భారతీయ న్యాయ సంహిత 12

## 5 రాష్ట్రాల్లో ఆప్-కాంగ్రెస్ పొత్తు

పంజాబ్‌లో మాత్రం ఎవరికివారే 12

దేశ ప్రయోజనం కోసం కలిశాం: ఆప్

# అక్కే.. అమ్మలా!

- ఐదేళ్లలోపు ఇద్దరు తమ్ముళ్లు, 5నెలల శిశువుకు తల్లయిన 8ఏళ్ల చిన్నారి
- వారికోసం ప్రభుత్వాస్పత్రిలో భిక్షాటన
- అక్కున చేర్చుకున్న శిశుగృహం అధికారులు

కర్నూలు, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి)/కర్నూలు హాస్పిటల్: మతి స్థిమితం కోల్పోయిన అమ్మ ఎక్కడుందో తెలియదు. అన్నీ తానై పిల్లలను కాపాడాల్సిన తండ్రి మద్యానికి బానిసై పట్టించుకోవడం మానేశాడు. ఆకలి బాధతో అల్లాడుతున్న ఐదేళ్లలోపు ఇద్దరు తమ్ముళ్లు, 5నెలల పసిపాపకు ఎనిమిదేళ్ల అక్క తల్లిగా మారింది. ఓ చెట్టు నీడను నివాసంగా చేసుకొని భిక్షాటన చేస్తూ వారి ఆకలి తీరుస్తోంది. తోబుట్టువులను పోషించుకోవడానికి ఆ చిన్నారి పడుతున్న తపన చూసిన ప్రతి ఒక్కరూ "అయ్యో పాపం పసిపిల్లలకు ఎంత కష్టం వచ్చిందో" అనుకుంటూ తోచిన సాయం చేస్తూ వచ్చారు. అనాథ పిల్లలు బతుకు వేటలో ఆకలి పోరు సాగిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు ఆ చిన్నారులను శిశుగృహానికి తీసుకెళ్లి ఆశ్రయం కల్పించారు. ఈ ఘటన కర్నూలు సర్వజన వైద్యశాలలో శనివారం వెలుగు చూసింది. కర్నూలు జిల్లా గూడూరుకు చెందిన బుడగ జంగాల సుంకన్న, లక్ష్మి నిరుపేద దంపతులు. రెక్కాడితే కానీ పూట గడవని దీనస్థితి. పదేళ్ల క్రితం పెద్దల ను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకోవడంతో బంధువులు పట్టించుకోవడం మానేశారు. ఈ దంపతులకు 8 ఏళ్ల పాప, 4, 5 ఏళ్ల వయసున్న ఇద్దరు కుమారులు, ఐదు నెలల పసిపాపతో కలిపి మొత్తం నలుగురు సంతానం. బేల్దారి పని చేసే సుంకన్న మద్యానికి బానిసై భార్య పిల్లలను పట్టించుకొనేవాడు కాదు. తల్లి కూడా మతిస్థిమితం కోల్పోయింది. ఆమెను వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు రెండు వారాల క్రితం తీసుకొచ్చారు. ఇప్పుడు ఆమె ఆస్పత్రిలో ఉందో.. ఎక్కడికైనా వెళ్లిపోయిందో ఆ చిన్నారులకు తెలియడం లేదు. సెంట్రల్ ల్యాబ్ సమీపంలో బర్త్ వార్డు పక్కనే ఉన్న ఓ రేకుల షెడ్డులో ఉంటూ 8ఏళ్ల చిన్నారి ముగ్గురు తోబుట్టువులకు అమ్మగా మారింది. ఆస్పత్రిలో భిక్షాటన చేస్తూ.. రోగులకు ఆస్పత్రి సిబ్బంది అందించే ఆహారం, పాలు తీసుకొచ్చి ముగ్గురు పిల్లల ఆకలి తీర్చింది. అక్కడే వారికి అమ్మ ప్రేమను పంచింది. సుంకన్న అప్పుడప్పుడు వచ్చి ఆ పిల్లలు భిక్షాటన చేసి తెచ్చిన డబ్బును బలవంతంగా తీసుకెళ్లేవాడని స్థానికులు చెబుతున్నారు. చిన్న వయసులోనే జన్మకు సరిపడా కష్టాలు పడుతున్న ఆ చిన్నారులను చూసి చలించిన రోగుల బంధువులు, వాచ్‌మెన్ 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట లక్ష్మమ్మ, ఐసీపీఎస్ జిల్లా అధికారి శారద, చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ సుంకన్న ఆస్పత్రికి చేరుకొని ఆ చిన్నారుల పరిస్థితి చూసి చలించిపోయారు. వారికి వైద్యపరీక్షలు చేయించగా, పూర్తి ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు ధ్రువీకరించారు. బాలల సంక్షేమ సమితి కి సమాచారం ఇచ్చి వారి ఆదేశాల మేరకు ఆ నలుగురు చిన్నారులను కర్నూలు సీక్యాంపులో ఉన్న శిశుగృహంలో చేర్పించారు.


ఆస్పత్రిలోని ఊయలలో పసికందు


శిశుగృహం అధికారుల సంరక్షణలో చిన్నారులు

## లోకం తీరు




## పొడవైన కురులతో ప్రపంచ రికార్డు



శిరోజాలపై మక్కువ చూపని మహిళలు ఉండరు. మురిపెంగా పెంచుకున్న ఆ శిరోజాలకు ప్రపంచ రికార్డు లభిస్తే!. పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన ప్రముఖ డాక్టర్ మామిళ్లపల్లి మధుసూదన రావు సతీమణి, సంఘ సేవకురాలు విజయలక్ష్మి అత్యంత పొడవైన శిరోజాలను పెంచి నోబెల్ బుక్‌లో స్థానం సంపాదించారు. ఆమె వయస్సు 72 సంవత్సరాలు. శిరోజాలను శ్రద్ధగా పెంచడంతో అవి 54 అంగుళాలకు చేరుకున్నాయి. దీంతో లక్నోలో ఉన్న ఇంటర్నేషనల్ నోబెల్ బుక్‌లో స్థానం కోసం 2024 జనవరి 17న దరఖాస్తు చేసుకున్నారు. 2024 ఫిబ్రవరి 13న ఆమెకు నోబెల్ రికార్డు ప్రకటించారు. తన తల్లి పాలడుగు రంగమ్మ నుంచి వారసత్వంగా జుట్టు పెరిగినట్టు విజయలక్ష్మి తెలిపారు. - అచ్చంపేట

# చంద్రబాబు మాస్టర్ స్ట్రోక్

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకొన్న తర్వాత గత 29 ఏళ్లలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడానికి ముందే ఇంత మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించడం ఇదే ప్రథమం. గతంలో ఎన్టీఆర్ పార్టీ అధ్యక్షునిగా ఉన్నప్పుడు ఎన్నికలకు 3 నెలల ముందు 40 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. ఆ తర్వాత ఇంత భారీగా జాబితా ప్రకటించడం ఇదే మొదలు. "చంద్రబాబు తన రాజకీయ ప్రత్యర్థులకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు. అధికార పార్టీ వైసీపీ ఇంతవరకూ అధికారికంగా తన అభ్యర్థులను ఎవరినీ ప్రకటించలేదు. ఇప్పటికి ప్రకటించిన వారంతా కేవలం ఇన్‌చార్జులు మాత్రమేనని.. ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. అభ్యర్థుల అసలు జాబితా తర్వాత ఎప్పుడో వస్తుందని ఆ పార్టీ చెబుతోంది. దాంతో పోలిస్తే చంద్రబాబు నేరుగా అభ్యర్థులను ప్రకటించేశారు. ఆయన ఇంత త్వరగా నిర్ణయం తీసుకొంటారని ప్రత్యర్థులు ఊహించలేదు" అని టీడీపీ ముఖ్యుడు ఒకరన్నారు. రాష్ట్రంలో మొత్తం 175 సీట్లు ఉండగా, అందులో 60 శాతం సీట్లకు అభ్యర్థులను చంద్రబాబు ప్రకటించారు. ఆయన పార్టీ అంతర్గత సమాచారం ప్రకారం, ఈ జాబితా పదిరోజుల క్రితమే ఖరారైంది. విడుదలకు ముందు మరోసారి తనిఖీ చేసి ఒకటి రెండు మార్పుచేర్పులు చేశారు. ఉదాహరణకు ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు జిల్లాలకు సంబంధించి తమ జాబితాలో ఒక్క మహిళ పేరు కూడా లేకపోవడం గమనించి ఆఖరు క్షణంలో నెల్లూరు జిల్లా సూళ్లూరుపేటలో డాక్టర్ నెలవల విజయశ్రీ పేరు చేర్చారు. ఆమె తండ్రి నెలవల సుబ్రమణ్యం ప్రస్తుతం ఆ నియోజకవర్గానికి టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్నారు. మహిళా అభ్యర్థి కోసం చేసిన అన్వేషణలో ఆయన కుమార్తెకు అవకాశం దక్కింది. రాజమండ్రి రూరల్ సిటింగ్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేరును జాబితాలో చేర్చాలా వద్దా అన్నదానిపై ముందురోజు అర్ధరాత్రి వరకూ తర్జనభర్జనలు జరిగాయి. ఇదే సీటును జనసేనలో ప్రముఖ నేత కందుల దుర్గేశ్ కూడా ఆశిస్తుండటంతో చివరకు పెండింగ్‌లో పడింది. అభ్యర్థుల ప్రకటన ముగిసిన తర్వాత చంద్రబాబు మీడియా ప్రతినిధులతో పిచ్చాపాటీగా మాట్లాడినప్పుడు గోరంట్ల ప్రస్తావన వచ్చింది. "బుచ్చయ్యను, దుర్గేశ్‌ను ఇద్దరినీ పిలిచి మాట్లాడాలని ఆపాం. ఆ ఇద్దరికీ చోటు లభిస్తుంది. బుచ్చయ్య సీనియర్ నాయకుడు. ఆయనకు ఉన్న చోటే అవకాశం లభిస్తుంది" అని చంద్రబాబు చెప్పారు.

### ముహూర్తం ప్రకారం...

తొలి జాబితాను చంద్రబాబు సరిగ్గా ముహూర్తం ప్రకారం విడుదల చేశారు. శనివారం మాఘ పౌర్ణమి సందర్భంగా ఉదయం పదకొండు గంటల నలభై నిమిషాలకు మంచి ఘడియలు ప్రారంభం అవుతుండటంతో, ఆ సమయంలో జాబితా ప్రకటన చేశారు. దీనికి ముందు జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్, ఆయన సోదరుడు నాగబాబు..టీడీపీ అధినేత నివాసానికి తమ పార్టీ నేతలతో కలిసి వచ్చారు. జాబితా విడుదల కోసం చంద్రబాబు నివాసం ఆవరణలో ఒక వేదిక ఏర్పాటు చేసి, దాని వద్దకు మీడియా ప్రతినిధులను ఆహ్వానించారు. కొందరు టీడీపీ సీనియర్లు కూడా చంద్రబాబు ఆహ్వానంతో సమావేశానికి హాజరయ్యారు. టీడీపీ, జనసేన ఎన్నికల గుర్తులు సైకిల్, గాజుగ్లాస్ కలిసి వచ్చేలా ఒక లోగో డిజైన్ చేసి ప్రదర్శించారు.

### తాడేపల్లి గూడెం సభ తర్వాత ఎంపీ జాబితా!

శనివారం టీడీపీ, జనసేనకు సంబంధించి కేవలం అసెంబ్లీ అభ్యర్థుల జాబితా మాత్రమే విడుదలైంది. ఎంపీ సీట్లకు కూడా ఈ రెండు పార్టీలు తమ అభ్యర్థులను చాలావరకు ఖరారు చేసుకొన్నా, ఆ పేర్లు విడుదల చేయలేదు. బీజేపీతో పొత్తు చర్చలు ఇంకా ఒక కొలిక్కి రాకపోవడంతో ఎంపీ అభ్యర్థుల ప్రకటన వాయిదా వేశారు. ఈ నెల 28వ తేదీన టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి బహిరంగ సభ తాడేపల్లి గూడెంలో జరగనుంది. ఆ సభ తర్వాత ఎంపీ అభ్యర్థుల పేర్లు, మరికొందరు అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు విడుదలయ్యే అవకాశం ఉంది.

## 'చలో విజయవాడ'ను సక్సెస్ చేయండి: ఏపీ జేఏసీ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 15 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ మూడో దశ ఆందోళనా కార్యక్రమంలో భాగంగా ఫిబ్రవరి 27న తలపెట్టిన 'చలో విజయవాడ'ను విజయవంతం చేయాలని ఏపీ జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ హృదయరాజు శనివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. దీనికి సంబంధించిన పోస్టరును శనివారం కర్నూలు జిల్లా ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆవిష్కరించారు.

## వైసీపీకి ప్రతిపక్ష హోదా కూడా కష్టమే: లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 24: 'టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కలిసి సంయుక్తంగా 99 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఇక వార్ వన్‌సైడ్... వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడ రాదు' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మాట్లాడారు. 'నేను నాలుగు సంవత్సరాల 10 నెలల పాటు మంగళగిరి ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉన్నా. అధికారంలోకి వచ్చిన వైసీపీ వాళ్లు ఇక్కడి ప్రజలకు ఏం చేశారు? నేను చేసినదాంట్లో కనీసం 10 శాతం సేవలను అందించలేకపోయారు. నేను ఇక్కడే నివశిస్తున్నాను. నా ఓటు ఈ నియోజకవర్గంలోనే వుంది. ఎమ్మెల్యే ఇల్లు ఎక్కడ వుందో మీరే చెప్పాలి. మంగళగిరిలో నా ప్రచారం నేను ఓటమి చెందిన మరుసటి రోజునుంచే ఆరంభమైంది. దాదాపు 80 శాతం మంగళగిరిలో నేను పర్యటించా. మిగిలిన ప్రాంతాల్లో కూడా పర్యటిస్తా' అని అన్నారు.



### 1 నుంచి సీమలో లోకేశ్ శంఖారావం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత లోకేశ్ రెండో విడత శంఖారావం పర్యటన మార్చి 1 నుంచి ప్రారంభం కానుంది. మొదటి విడతలో ఆయన ఉత్తరాంధ్రలోని 31 నియోజకవర్గాల్లో పర్యటించారు. ప్రతి నియోజకవర్గంలో పార్టీ శ్రేణులతో సమావేశమై వారిని ఎన్నికలకు సన్నద్ధం చేయడం కోసం శంఖారావం పేరుతో ఆయన పర్యటిస్తున్నారు. రెండో విడత పర్యటనను రాయలసీమ జిల్లాల నుంచి ప్రారంభించి ప్రకాశం జిల్లాతో పూర్తి చేయాలని ఆయన భావిస్తున్నారు.

## ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు అభ్యర్థులు కారు

- మార్చి 3 తరువాతే అధికారిక ప్రకటన
- వైసీపీ నేత వైవీ సుబ్బారెడ్డి



ఎండాడ (విశాఖపట్నం), ఫిబ్రవరి 24: వైసీపీలో ఉన్న ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలు వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు కారని, ఫైనల్‌గా ఇంకా సీట్లు ప్రకటించాల్సి ఉందని ఆ పార్టీ విశాఖ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి స్పష్టం చేశారు. రాజ్యసభకు ఎన్నికైన అనంతరం విశాఖ వచ్చిన ఆయన శనివారం ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మార్చి మూడో తేదీన ప్రకాశం జిల్లాలో సిద్ధం బహిరంగ సభ ముగిసిన అనంతరం వైసీపీ మేనిఫెస్టో ప్రకటించే అవకాశం ఉందని, నవరత్నాలు కొనసాగిస్తూనే మరిన్ని పథకాలను జోడిస్తామని తెలిపారు. ఆ తరువాతే అధికారికంగా ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేసే అవకాశం ఉందన్నారు. ఇతర పార్టీల్లో నుంచి వైసీపీలో చేరిన వారికి ప్రజల్లో ఉన్న పేరు ఆధారంగా సీటు కేటాయించే అవకాశం ఉందని వివరించారు. వైసీపీలో ఎమ్మెల్యేలకు సీట్లతో పనిలేదని, వారికి టికెట్ దక్కకపోయినా సీఎంతోనే ఉంటారని వ్యాఖ్యానించారు. సమావేశంలో ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ సత్యవతి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## ప్రైవేటుకే పెద్ద వాటా!

- కొణిజేడు మర్లపాడు ఐరన్‌ఓర్ ప్రాజెక్టుకు టెండర్లు
- 6 వరకు బిడ్ల స్వీకరణ
- ఏపీఎండీసీకి 11 శాతం, ప్రైవేటుకు 89 శాతం వాటా
- ఎంఎండీఆర్ చట్టానికి విరుద్ధంగా ప్రైవేటుకు పెద్ద షేర్
- రాజకీయ లబ్ధి కోసం జిందాల్‌కు కట్టబెట్టేందుకే?!

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లాలోని కొణిజేడు మర్లపాడు ఐరన్‌ఓర్ ప్రాజెక్టును జాయింట్ వెంచర్ (జేవీ) కింద చేపట్టేందుకు ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) టెండర్లు పిలిచింది. జేవీ ఏర్పాటుతోపాటు ముడి ఇనుప ఖనిజం (ఐరన్‌ఓర్) తవ్వకం, బెనిఫిసియేషన్ ప్లాంటు ఏర్పాటు కోసం ప్రైవేటు భాగస్వామిని ఎంపిక చేసేందుకు ఈ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలంలోని కొణిజేడు, మర్లపాడు పరిధిలోని 1307 ఎకరాల్లో ఐరన్‌ఓర్ నిక్షేపాలున్నాయి. ముడి ఖనిజంలో ఎక్కువగా అయస్కాంత ఆధారిత విలువ ఉంది. దాన్ని తవ్వితీసి, అనంతరం ప్రాసెస్ చేసి హైగ్రేడ్ ముడి ఇనుముగా మార్చే బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. ఈ కాంట్రాక్టు పరిధిలో ఐదు విలియన్ టన్నుల ఖనిజం తవ్వితీయాల్సి ఉంటుంది. ఏటా 1.5 లక్షల టన్నుల ఐరన్‌ఓర్ బెనిఫిసియేషన్ ప్లాంటును నిర్వహించాలి. మార్చి ఆరో తేదీ వరకు బిడ్‌లు స్వీకరిస్తారు. అదే రోజు సాయంత్రం బిడ్‌లు తెరుస్తారు. మార్చి 8వ తేదీన బిడ్డింగ్‌లో అర్హత సాధించిన కంపెనీల వివరాలను ప్రకటిస్తారు. ఐరన్ ఓర్ తవ్వకాల కోసం ఏర్పాటు చేసే జాయింట్ వెంచర్ కంపెనీలో ఏపీఎండీసీకి 11 శాతం వాటా, ప్రైవేటు సంస్థకు 89 శాతం ఉండేలా నిబంధనలు రూపొందించారు. నిజానికి ఎంఎండీఆర్ చట్టం-1956 ప్రకారం ఏపీఎండీసీకి 75 శాతంపైనే వాటా ఉండాలి. అదీ కుదరకపోతే 50 శాతం వాటా అయినా ఉండాలి. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో తొలిసారి కాంట్రాక్టు ఒప్పందం కుదిరినప్పుడు ఏపీఎండీసీకి 51 శాతం వాటా నిర్ధారించారు. ఇప్పుడు ఆయన తనయుడు జగన్‌రెడ్డి పాలనలో ఏపీఎండీసీకి 11 శాతం వాటా చాలని నిర్ణయించారు. ఈ టెండర్‌ను జిందాల్ కంపెనీకి కట్టబోతున్నారని ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశంపై స్పందించేందుకు గనుల శాఖ అధికారులు అందుబాటులోకి రాలేదు.

## వైసీపీకి ఎంపీ రఘురామరాజు రాజీనామా

- నన్ను డిస్‌క్వాలిఫై చేయడానికి చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి
- భౌతికంగా నిర్మూలించడానికి చేసిన పనులు నాకు మరింత శక్తినిచ్చాయి
- జగన్‌కు పంపిన లేఖలో రఘురామకృష్ణరాజు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి ఎంపీ రఘురామకృష్ణరాజు రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా లేఖను వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి పంపారు. 'మహమ్మద్ గజినీ తరహాలో ఎన్నోసార్లు నన్ను డిస్ క్వాలిఫై చేయించడానికి ఎంతోమంది పారిశ్రామికవేత్తలను పంపించారు. ఎన్నో ప్రయత్నాలు చేశారు. నీ ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. నాలుగేళ్లుగా భౌతికంగా నన్ను నిర్మూలించడానికి చేసిన నీ ప్రయత్నాలన్నీ నాకు మరింత శక్తిని ఇచ్చాయి. ప్రజాసేవ చేయడానికి దోహదపడ్డాయి' అని లేఖలో పేర్కొన్నారు. శనివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "నా రాజీనామాపై సజ్జలకు చెందిన రెండు టీవీ చానళ్లు 'జగన్ దెబ్బకు భయపడ్డారు' అంటూ వార్తా కథనాన్ని ప్రసారం చేశాయి. అంత వీరుడా జగన్మోహన్‌రెడ్డి..! ఆయన దెబ్బకు భయపడడానికి. నాలుగేళ్ల చాన్స్ ఇచ్చాను... ఎంత మగాడివో ప్రూవ్ చేసుకొమ్మని. దిక్కుమాలిన పోలీసులను పంపించి దొంగ అరెస్టు చేయించి, చీకట్లో దెబ్బలు కొట్టించే తింగరి వేషాలు వేయాల్సిందే తప్ప... ప్రత్యక్షంగా నన్ను ఎదుర్కోలేవు జగన్మోహన్‌రెడ్డి' అని రఘురామకృష్ణరాజు అన్నారు. మూడు పార్టీల మధ్య పొత్తు కుదరటం ఖాయమన్న ఆయన... టీడీపీ నేతృత్వంలో కూటమి అప్రతిహత విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల ప్రకటనతో వైసీపీకి ఏడుపు ఒక్కటే మిగిలిందని ఎద్దేవా చేశారు.

## టీడీపీ జాబితాలో 24 మందికి ఫస్ట్ చాన్స్

- 18మంది సిటింగ్‌లకు అవకాశం
- టీడీపీ జాబితాలో మూడో వంతు పీజీలు
- బలహీన వర్గాలకు ప్రాధాన్యం
- టీడీపీ తొలి జాబితా విశేషాలు ఇవే
- కోటి మంది నుంచి అభిప్రాయ సేకరణ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాలో 18 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు చోటు దక్కింది. గత ఎన్నికల్లో ఆ పార్టీ తరఫున 23మంది గెలిచారు. అందులో ఐదుగురు ఎమ్మెల్యేలు వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఇక అధికార వైసీపీ నుంచి కొందరు వచ్చి టీడీపీలో చేరారు.

- తొలి జాబితాలో అవకాశం దక్కిన సిటింగ్‌లలో చంద్రబాబు, అచ్చెన్నాయుడు, బెందాళం అశోక్, వెలగపూడి రామకృష్ణ, గణబాబు, నిమ్మకాయల చినరాజప్ప, వేగుళ్ల జోగేశ్వరరావు, నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, గద్దె రామ్మోహనరావు, అనగాని సత్యప్రసాద్, ఏలూరి సాంబశివ రావు, గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి, పయ్యావుల కేశవ్, నందమూరి బాలకృష్ణ ఉన్నారు. వీరందరికీ తమ సిటింగ్ స్థానాల్లోనే పోటీకి అవకాశం లభించింది.
- వైసీపీ నుంచి వచ్చి టీడీపీలో చేరిన ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కొలుసు పార్థసారథికి కూడా టికెట్లు దక్కాయి. వైసీపీ నుంచి ఇప్పటికే వచ్చిన, ఇకపై రాబోతున్న వారిలో మరో ఇద్దరు ముగ్గురు సిటింగ్‌లకు మలి జాబితాలో సీటు దక్కే అవకాశం ఉందని పార్టీ వర్గాల అంచనా.
- గత ఎన్నికల్లో టీడీపీ తరఫున గెలిచినవారిలో ముగ్గురి పేర్లు జాబితాలో లేవు. రాజమహేంద్రవరం నుంచి గెలిచిన ఆదిరెడ్డి భవాని ఈసారి పోటీ నుంచి తప్పుకొన్నారు. ఆమె భర్త ఆదిరెడ్డి శ్రీనివాస్ బరిలోకి దిగుతున్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సీటును జనసేన కోరడంతో ప్రతిష్టంభన నెలకొంది. విశాఖ నగర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు టికెట్ ఇవ్వడం ఖాయమైనా ఆయన ఏ సీటు నుంచి పోటీ చేస్తారో స్పష్టత రాలేదు.

### మొదటిసారి టికెట్లు వీరికే

తోయక జగదీశ్వరి (కురుపాం), బోనెల విజయ్(పార్వతీపురం), కొండపల్లి శ్రీనివాస్ (గజపతినగరం), యనమల దివ్య (తుని), మహాసేన రాజేశ్(పి.గన్నవరం), ఆదిరెడ్డి శ్రీనివాస్ (రాజమహేంద్రవరం సిటీ), బడేటి రాధాకృష్ణ (ఏలూరు), సొంగా రోషన్ (చింతలపూడి), కొలికపూడి శ్రీనివాసరావు (తిరువూరు), వెనిగండ్ల రాము (గుడివాడ), వర్ల కుమార్ రాజా (పామర్రు), వేగేశ్న నరేంద్ర వర్మ (బాపట్ల), గూడూరి ఎరిక్షన్ బాబు (ఎర్రగొండపాలెం), కావ్య కృష్ణారెడ్డి (కావలి), నెలవల విజయశ్రీ(సూళ్లూరుపేట), కాకర్ల సురేష్(ఉదయగిరి), రెడ్డప్పగారి మాధవి(కడప), బొగ్గుల దస్తగిరి (కోడుమూరు), అమిలినేని సురేంద్రబాబు(కల్యాణదుర్గం), ఎంఈ సునీల్ కుమార్ (మడకశిర), సంజీవరెడ్డి గారి సవిత (పెనుగొండ), సైకం జయచంద్రారెడ్డి (తంబళ్లపల్లి), డాక్టర్ వి.ఎం. థామస్ (జీడీ నెల్లూరు), గురజాల జగన్మోహన్ (చిత్తూరు) ఉన్నారు.

### అందరూ విద్యావంతులే...

టీడీపీ, జనసేన తొలి జాబితాలో మూడో వంతు మంది అభ్యర్థులు పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారున్నారు. ఒకరు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి. ఇద్దరు పీహెచ్‌డీ చేశారు. 30 మంది పీజీ చదివారు. ముగ్గురు ఎంబీబీఎస్ పూర్తి చేయగా, గ్రాడ్యుయేట్లు 63మంది ఉన్నారు. ఒక్క ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ముగ్గురు మహిళలకు(పరిటాల సునీత, సవిత, బండారు శ్రావణి) సీట్లు లభించాయి.

### 20 మంది దళితులకు టికెట్

టీడీపీ టికెట్లు లభించిన 94 మందిలో 20 మంది దళితులు, 18 మంది బీసీలు, ముగ్గురు ఎస్టీలు, మైనారిటీ వర్గానికి చెందినవారు ఒకరు మొత్తం 42 మంది ఉన్నారు.

- కమ్మ సామాజిక వర్గానికి చెందినవారు 21 మంది, రెడ్లు 17 మంది, క్షత్రియ కులస్థులు నలుగురు ఉండగా, వెలమకు ఒకటి, వైశ్యులకు 2, కాపులకు 7 సీట్లు లభించాయి.
- బీసీల్లో కొప్పుల వెలమకు 3, తూర్పు కాపులకు 2, గౌడకు 3 యాదవులకు 3, కాళింగకు 2, మత్స్యకార, కురబ, బోయ, శెట్టి బలిజ, గవర కులాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించారు.
- అభ్యర్థుల ఎంపిక కసరత్తులో భాగంగా ఫోన్ల ద్వారా మొత్తం 1,03,33,000 మంది నుంచి అభిప్రాయాలు తీసుకొన్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

# అవినీతి 'కళ'

(మొదటి పేజీ తరువాయి)




సొంత నియోజకవర్గంలో ఓ గ్రామ సమీపంలో 18 ఎకరాల డీ పట్టా భూమిని ముగ్గురు వ్యక్తుల నుంచి కొనుగోలు చేసి, చుట్టుపక్కల ఉన్న 12 ఎకరాల ప్రభుత్వ భూవిని ఆక్రమించుకున్నారు. సుమారు 30 ఎకరాల్లో ఫాం హౌస్ నిర్మించుకున్నారు. దానికి అవసరమైన రవాణా మార్గాన్ని ఐటీడీఏ నిధుల ద్వారా నిర్మించుకున్నారు. ఫాం హౌస్‌కు సమీపంలోనే గ్రామం పేరు చెప్పి బీటీ రోడ్డు వేయించుకున్నారు. ఎమ్మెల్యే అక్రమాలకు పాల్పడ్డారని ఒక జాతీయ పార్టీ నాయకుడు వచ్చి ఆరోపించినప్పటికీ ఆమె ఖండించలేదు. గిరిజన మండలంతో పాటు ఓ మైదాన మండలంలో కూడా పలుచోట్ల ఆమె భూములు ఆక్రమించుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఆమె అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో ఏ ఒక్కరూ ముందుకువచ్చి ఫిర్యాదు చేసే పరిస్థితి లేదు.

### వాటా ఇవ్వాల్సిందే..

కొన్ని శాఖలకు సంబంధించి ఆర్థికపరమైన పనులు జరిగితే ఎమ్మెల్యేకు వాటా ఇవ్వాల్సిందే. ఏమాత్రం మొహమాటం లేకుండా తన వ్యక్తిగత సహాయకుడి ద్వారా సదరు ఎమ్మెల్యే డిమాండ్ చేస్తారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో కొందరు అధికారులు వాటాలు పంపాల్సిన పరిస్థితి. తమ శాఖ పరిధిలో జరిగిన పనులకు సంబంధించి ప్రతిఫలాలను ఎమ్మెల్యేకు అందిస్తున్నారనే ఆరోపణలు బాగా ఉన్నాయి. కాగా ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడే బినామీ పేర్లతో కాంట్రాక్ట్ పనులు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

### ముందుగా 'లెక్కలు' తేలాకే..

నియోజకవర్గంలో ఏ ఇంజనీరింగ్ శాఖ ద్వారా ఏ పనులు చేపట్టాలన్నా ఎమ్మెల్యే అనుమతి ముందుగా పొందాల్సిందే. వాటికి సంబంధించిన 'లెక్కలు' ముందుగా తేల్చుకున్న తర్వాతే పనుల కేటాయింపు జరుగుతుందన్న ప్రచారం ఉంది.

### ఇసుక దందా..

నియోజకవర్గంలో ఇసుక దందా విపరీతంగా ఉంది. ఒక గిరిజన మండలంలో ఎమ్మెల్యే కనుసన్నల్లో ఇసుకదందా అధికంగా సాగుతోంది. ఎమ్మెల్యే తన సొంత గ్రామంలోనే చెరువు ఆక్రమణకు పాల్పడ్డారు. దీనిపై స్థానికులకు, ఆ ఎమ్మెల్యేకు మధ్య వివాదం కొనసాగుతోంది. చెరువు తన పూర్వీకులదని చెబుతూ దాన్ని కబ్జా చేశారు. ఇది గ్రామానికి చెందిన చెరువు అని కొంతమంది అడ్డు తగిలారు. ఆమె అధికార పార్టీ ఎమ్మెల్యే కావడంతో ఏమీ చేయలేని పరిస్థితి.

### ఎమ్మెల్యే అనుచరులు కూడా..

ఎమ్మెల్యే అనుచరులు కూడా అభివృద్ధి పనుల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. తెరవెనుక ఎమ్మెల్యే ఉన్నట్లు సమాచారం. దీన్ని స్థానికులు వ్యతిరేకిస్తూ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అక్రమార్కుల వెనుక ఎమ్మెల్యే ఉండడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.


తహసీల్దార్ కార్యాలయంలో తయారు చేసిన నకిలీ పట్టాలతో బైఠాయించి నిరసన తెలుపుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

## నకిలీ పట్టాలతో ఓటర్లకు గేలం!

- అనపర్తిలో నకిలీ ఇళ్ల పట్టాలు తయారు చేస్తూ టీడీపీ శ్రేణులకు పట్టుబడ్డ డిప్యూటీ తహసీల్దార్
- నిరసన తెలిపిన టీడీపీ నేత రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 24: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో రెవెన్యూ అధికారులతో కలిసి అధికార పార్టీ వైసీపీ నకిలీ ఇంటి పట్టాల పంపిణీకి తెరదీసింది. కేవలం ప్రపోజల్స్ పంపిన భూములకు చెందిన సర్వే నెంబర్లతో ఓటర్లకు గేలం వేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఆయా భూములకు నకిలీ పట్టాల తయారీకి వైసీపీ నేతలు శ్రీకారం చుట్టారు. అనపర్తిలో అనేక మంది లబ్ధిదారులు జగనన్న ఇళ్ల స్థలాల కోసం నాలుగేళ్లుగా ఎదురుచూస్తున్నారు. ఏడాదిన్నర కిందట ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు కొన్ని గ్రామాల్లో భూములను సేకరించింది. అయితే, ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా సొమ్ములు చెల్లించక పోవడంతో అవి కేవలం ప్రతిపాదనలుగానే మిగిలాయి. అయితే, ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఇంటి పట్టాల వ్యవహారం తమ కొంప ముంచుతుందని భావించిన వైసీపీ నాయకులు ప్రతిపాదనల్లో ఉన్న భూములకు సంబంధించిన సర్వే నెంబర్లనే వినియోగించి లబ్ధిదారుల పేరుతో నకిలీ పట్టాలు తయారు చేస్తున్నారు. ఇదంతా అనపర్తి తహసీల్దార్ కార్యాలయం వేదికగా జరగడం విశేషం. శనివారం డిప్యూటీ తహసీల్దార్ శశిధర్ తన కార్యాలయంలోనే పట్టాలు తయారుచేసే పనిలో ఉండగా అక్కడికి వెళ్లిన కొందరు టీడీపీ నాయకులు దీనిని గమనించారు. ఈ నకిలీల వ్యవహారాన్ని వెంటనే వారు మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి సమాచారం అందించడంతో ఆయన అక్కడికి చేరుకుని డీటీ శశిధర్‌ను నిలదీశారు. అయితే, ఆయన పొంతన లేని సమాధానాలు చెప్పడం, కలెక్టర్ ఆదేశాల మేరకు తయారు చేస్తున్నామని అనడంతో రామకృష్ణారెడ్డి ఆగ్రహించారు. భూసేకరణ జరుగకుండా పట్టాలు ఎలాతయారు చేస్తారంటూ అక్కడే నకిలీపట్టాలతో నేలపై బైఠాయించి నిరసనవ్యక్తం చేశారు.

## జగన్, ధర్మానపై సీఈసీకి ఫిర్యాదు

- వలంటీర్లను పూర్తిగా పక్కన పెట్టాలి: పురందేశ్వరి



అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): 'ఓటర్లు ఫ్యాన్ గుర్తుపై ఓటేసేలా వలంటీర్లు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్ చెబుతుంటే పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా వైసీపీ తరఫున ఉండాలంటూ మంత్రి ధర్మాన ప్రసాద రావు చెప్పడం ఎన్నికల కమిషన్ ఆదేశాలను లెక్కచేయని తనమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. అధికార వైసీపీ నేతలకు వ్యవస్థలంటే లెక్కలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే వలంటీర్లను పూర్తిగా పక్కన బెట్టాలని కేంద్ర ఎన్నికల కమిషన్(సీఈసీ)కు ఫిర్యాదు చేసినట్లు పురందేశ్వరి వెల్లడించారు. సీఎం, రెవెన్యూ మంత్రి తాజా వ్యాఖ్యలు పొందు పరుస్తూ.. దొంగ ఓటర్లను చేర్చడం, జాబితాలు మార్చేయడం లాంటి చర్యలపైనా మరో మారు ఫిర్యాదు చేశామన్నారు. ప్రజాపోరు యాత్రలో భాగంగా నరేంద్రమోదీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన మేలును గురించి చెబుతుండటంతో ప్రజలు ఆశీర్వదిస్తున్నారని చెప్పారు.

# దేశంలోనే అత్యుత్తమం!

## రాష్ట్రానికి గర్వకారణంగా మంగళగిరి ఎయిమ్స్‌.. 183 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో నిర్మాణం

- అన్ని రకాల అధునాతన వైద్యసేవలు
- అత్యాధునిక వైద్యయంత్ర పరికరాలు
- వివిధ ల్యాబ్‌లు..అధునాతన బ్లడ్‌బ్యాంకు
- 2015లోనే నిర్మాణ పనులు ప్రారంభం
- 2019 ఎన్నికలకు ముందే అందుబాటులోకి ఓపీ సేవలు

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్‌)ను నిర్మించింది. 2015 డిసెంబరు 19న ఇక్కడి కొండల నడుమ ఉన్న 183.11 ఎకరాల విస్తీర్ణంలో రూ.1618.23 కోట్ల వ్యయంతో మంగళగిరి ఎయిమ్స్‌కు నాటి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా శంకుస్థాపన చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనులు జరుగుతుండగానే 2018లో ఎయిమ్స్‌కు అనుబంధంగా ఏర్పాటుచేయనున్న వైద్యకళాశాల తాలూకు తొలిబ్యాచ్ 50మంది వైద్యవిద్యార్థులకు విజయవాడ సిద్దార్థ వైద్యకళాశాలలో తరగతులను ప్రారంభించారు. 2019 ఎన్నికలకు ముందే ఓపీ విభాగం బ్లాక్‌ను పూర్తిచేసి అవుట్ పేషెంట్ వైద్యసేవలను ఇందులో లాంఛనంగా ప్రారంభించారు. ఎయిమ్స్‌లో 41 బ్రాడ్ అండ్ సూపర్ స్పెషాలిటీ విభాగాలు పనిచేస్తున్నాయి. 2019 మార్చి 12 నుంచి అవుట్ పేషెంట్ విభాగం పనిచేస్తుండగా, ప్రస్తుతం ఓపీ విభాగంలో ప్రతిరోజూ సగటున 2,500 మంది రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి 15 లక్షల ఓపీ సేవలు అందించారు. అలాగే, ఇప్పటివరకు 20వేలకు పైగా ఇన్ పేషెంట్ అడ్మిషన్లు, మరో 12వేల మంది అత్యవసర సేవలు పొందారు. మంగళగిరి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ కోర్సును 2018లో ప్రారంభించగా, ప్రస్తుతం 600 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చదువుకుంటున్నారు. మరో వంద మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ కోర్సులను అభ్యసిస్తున్నారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సులు కూడా విజయవంతంగా నడుస్తున్నాయి. ఈ విద్యా సంవత్సరం నుంచి పారామెడికల్ కోర్సులను కూడా ప్రారంభించనున్నారు.

దేశంలో కెల్లా అత్యుత్తమ ఎయిమ్స్‌ మంగళగిరిలో రూపుదిద్దుకుంది. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులే ఈ మేరకు కితాబునిచ్చారు. సువిశాల విస్తీర్ణంలో, పచ్చని కొండల నడుమ, ఆహ్లాదకరమైన గ్రీనరీ మధ్య చాల సుందరంగా మంగళగిరి ఎయిమ్స్ రూపుదిద్దుకుంది. విజయవాడ-గుంటూరు నడుమ, నవ్యరాజధాని అమరావతికి అత్యంత చేరువలో ఇది ఉంది. ఇన్ని అనుకూలతలున్న ఎయిమ్స్ దేశంలో మరెక్కడా లేవన్నది కేంద్ర వైద్యఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల మాట! వచ్చే యాభై ఏళ్లలో కూడా దీనికి సాటి రాగల ఎయిమ్స్ మరొకటి ఉండదని అంటున్నారు. అంతగొప్ప సంస్థ ఇక్కడ ఆవిష్కృతం కావడం మన రాష్ట్రానికే గర్వకారణం. - మంగళగిరి

### 7,200కుపైగా శస్త్ర చికిత్సలు..

ఆసుపత్రిలో ఇన్‌పేషెంట్ డిపార్టుమెంట్ భవనం కూడా అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం ఇన్‌పేషెంట్ బెడ్ ఆక్యుపెన్సీ 65 శాతంగా ఉంది. డయాగ్నస్టిక్ ల్యాబ్ సేవలను


ఎయిమ్స్‌లోని ఇన్‌పేషెంట్ విభాగం

కూడా పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చారు. రేడియో డయాగ్నోసిస్ కింద ఎక్స్‌రే, మామోగ్రఫీ, అల్ట్రాసోనోగ్రఫీ, సిటీ అండ్ ఎమ్మారై, న్యూక్లియర్ మెడిసిన్ కింద పెట్ స్కాన్ సేవలను సైతం అందిస్తున్నారు. ఈ డయాగ్నోస్టిక్స్ సేవలను ఇప్పటివరకు 20,80,335 మందికి అందించారు. ఇక సర్జరీల విషయానికొస్తే.. ఇప్పటివరకు న్యూరోసర్జరీ, పీడియాట్రిక్ సర్జరీ, యూరాలజీ సహా వివిధ విభాగాలలో 7,200కు పైగా శస్త్రచికిత్సలను జరిపించారు. రెండు లైనాక్ రేడియోథెరపీ యంత్రాలు, సిటీ స్టిమ్యులేటర్, హెచ్‌డీ బ్రాకీథెరపీ పాలియేటివ్ కేర్ తదితర అధునాతన సమగ్ర కేన్సర్ చికిత్స సౌకర్యాలను సైతం ఇప్పటికే అందుబాటులోకి తెచ్చి ఉత్తమ వైద్యసేవలను అందిస్తున్నారు. డయాలసిస్ సౌకర్యం, అధునాతన బ్లడ్‌బ్యాంకు, రాష్ట్ర స్థాయి వీఆర్‌డీయల్ సౌకర్యం, ట్రేస్ ఎలిమెంట్ అండ్ మాలిక్యులర్ బయాలజీ ల్యాబ్, అధునాతన రోబోటిక్ ఫిజియోథెరపీ సౌకర్యం, ఇంట్రా యుటిరైన్ ఇన్సెమినేషన్, ఆడియోమెట్రీ అండ్ వెస్టిబ్యులర్ ఫంక్షన్ ల్యాబ్, నరాల ప్రసరణ అధ్యయనాలు, స్పిరోమెట్రీ, యూరోఫ్లోమెట్రీ వంటి అన్ని రకాల వైద్యసేవలను వినియోగంలోకి తెచ్చారు.

### నేడు జాతికి అంకితం

- వర్చువల్‌గా చేయనున్న ప్రధాని మోదీ
- 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు శంకుస్థాపన కూడా
- విశాఖలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్..
- రాష్ట్రంలో 4 మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లూ ప్రారంభం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 24: మంగళగిరి ఎయిమ్స్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం జాతికి అంకితం చేయనున్నారు. అలాగే, ఎయిమ్స్ ప్రాంగణంలో 9 క్రిటికల్ కేర్ బ్లాకులకు వర్చువల్ విధానంలో మోదీ శంకుస్థాపన చేయనున్నారు. దీంతో పాటు విశాఖపట్నంలో మైక్రోబయాలజీ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీ, రాష్ట్రంలో నాలుగు మొబైల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌లను కూడా ఈ సందర్భంగా ప్రారంభించనున్నారు. మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్, సీఈవో డాక్టర్ మధుబానందకర్ ఈ వివరాలను వెల్లడించారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రులు డాక్టర్ మన్సూఖ్ మాండవీయ, ప్రహ్లాద్ జోషి, భారతీ ప్రవీణ్ పవార్, ప్రొఫెసర్ ఎస్పీ సింగ్ బఘేల్, గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని హాజరుకానున్నారని చెప్పారు. మంగళగిరి ఎయిమ్స్‌లో రోగుల సంరక్షణతోపాటు విద్య, పరిశోధనల్లో ఉన్నత స్థాయి ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి పారామెడికల్ కోర్సులను కూడా ప్రారంభించాలని యోచిస్తున్నట్టు డాక్టర్ మధుబానందకర్ చెప్పారు.



## ఉప లోకాయుక్తగా రజని బాధ్యతల స్వీకరణ

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 24: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప లోకాయుక్తగా పగిడి రజని నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె స్థానిక సంతోష్‌నగర్‌లోని లోకాయుక్త కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఉప లోకాయుక్త పగిడి రజని చేత ప్రమాణ స్వీకారం చేయించారు.

# ప్రతి మహిళా విశ్వగురు స్థాయికి ఎదగాలి

- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీ నరసింహ
- విద్యతోనే మహిళా సాధికారిత: జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్
- పోక్సో కేసులపై ప్రతి వారం విచారణ జరగాలి: జస్టిస్ దుర్గాప్రసాద్



సదస్సులో ప్రసంగిస్తున్న జస్టిస్ శ్రీ నరసింహ, జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ దుర్గాప్రసాద్

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళా విశ్వగురు స్థాయికి ఎదగాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ ఆకాంక్షించారు. 'ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ లాయర్స్' ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఓ హోటల్‌లో 'మహిళా సాధికారిత-రాజ్యాంగ ఆవశ్యకత' అనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారిత ప్రస్తుతం చాలా అవసరమన్నారు. భారతీయ మహిళలు సమానత్వం సాధించడం ద్వారా సాధికారితను పొందగలుగుతారన్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు గౌరవాన్ని కల్పించాలని సూచించారు. దేశవ్యాప్తంగా 15 శాతం మంది మహిళా న్యాయవాదులు ఉన్నారని, ఏపీ, తెలంగాణలో 36 శాతం మంది ఉన్నారన్నారు. రెండు రాష్ట్రాల్లో మహిళా న్యాయవాదుల సంఖ్య అధికంగా ఉందని, ఇది మరింత పెరగాలని ఆయన ఆకాంక్షించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై వేధింపులు పెరిగాయన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ గణాంకాల ప్రకారం 27 శాతం మంది మహిళలపై భాగస్వాములే వేధింపులకు పాల్పడుతున్నారన్నారు. విద్య మాత్రమే మహిళను సాధికారిత దిశగా నడిపిస్తుందన్నారు. ఒక మహిళను విద్యావంతురాలిగా చేస్తే.. మొత్తం సమాజాన్ని విద్యవంతులుగా చేస్తుందన్న గాంధీజీ వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తించుకోవాలని ఆయన సూచించారు. హైకోర్టు న్యాయమూర్తి (అడ్మినిస్ట్రేటివ్) జస్టిస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చంద్రయాన్ ప్రయోగంలోనూ మహిళా శాస్త్రవేత్తలు భాగస్వాములయ్యారని, ఇప్పటికీ మహిళా సాధికారిత దిశగా ఆలోచించాల్సి రావడం దురదృష్టకరమన్నారు. 2022 నేషనల్ క్రైమ్ బ్యూరో గణాంకాల ప్రకారం 4.4 లక్షల మంది మహిళలు వేధింపులకు గురవుతున్నారన్నారు. 2023లో ఇదే సంస్థ ఇచ్చిన నివేదిక ప్రకారం మహిళలపై లైంగిక వేధింపులకు సంబంధించిన గంటకు ఒక ఎఫ్ఐఆర్ నమోదవుతోందన్నారు. ప్రతివారం కోర్టులో పోక్సో యాక్టుకు సంబంధించిన కేసులు విచారణ సాగించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జ్యోతిర్మయి, జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

### ధర్మ సంస్థాపన చేసే యజ్ఞశాలే కోర్టు: జస్టిస్ శ్రీనరసింహ

బొబ్బిలి, ఫిబ్రవరి 24: ధర్మ సంస్థాపన చేసే యజ్ఞశాలే కోర్టు ప్రాంగణమని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనరసింహ అన్నారు. విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలో రూ.3.20 కోట్లతో నిర్మించనున్న నాలుగు కోర్టుల భవన సముదాయానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు, హైకోర్టులపైనే కాకుండా డిస్ట్రిక్ట్ జ్యూడీషియరీపై దృష్టి సారించాలని సూచించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ యు.దుర్గాప్రసాద్, జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, జిల్లా న్యాయాధికారి బి.సాయికళ్యాణ్ చక్రవర్తి పాల్గొన్నారు.






## శ్రీవారి సేవలో జస్టిస్ జేకే మహేశ్వరి


తిరుమల ఆలయం ముందు జస్టిస్ జేకే మహేశ్వరి

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి శనివారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకుని రంగనాయక మండపానికి చేరుకున్న ఆయనకు వేదపండితులు ఆశీర్వదించారు. ఆలయ అధికారులు లడ్డూప్రసాదాలు అంద జేశారు. అలాగే చెన్నై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నాగార్జున కూడా శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు.


## విభజన హామీల అమలుకు ఉమ్మడి పోరాటం: లక్ష్మీనారాయణ

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విభజన జరిగి పదేళ్లు పూర్తయినా ఇప్పటికీ విభజన హామీలు నెరవేర్చకుండా తెలుగు ప్రజల భవిష్యత్తును కాలరాస్తున్నారని జైభారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 13 కోట్ల తెలుగు జాతి హక్కు లు, ఆత్మగౌరవ సాధన కోసం.. అంటూ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ ఫిబ్రవరి 20వ తేదీకి విభజన హామీలు ఇచ్చి పదేళ్లు గడిచిందని తెలిపారు. ప్రజ ల్లో చైతన్యం పెంచి విభజన హక్కుల కోసం ఉ మ్మడిగా ఉద్యమం చేస్తామన్నారు. విభజన హామీ ల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్ర భు త్వం వివక్ష చూపుతోందని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాన్ని విభజించి హామీలు నెరవేర్చకుండా రాజకీయ నేతలతో ఆటలాడుతున్నారని విమర్శించారు.



# రమణ దీక్షితులుపై టీటీడీ కేసు

- శ్రీవారి ఆలయంలో ప్రత్యక్షమైన గౌరవ ప్రధానార్చకుడు
- వివాదాస్పద వ్యాఖ్యలు చేయలేదని స్పష్టీకరణ


శ్రీవారి ఆలయం వద్ద రమణదీక్షితులు

తిరుమల, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయ గౌరవ ప్రధానార్చకుడు రమణ దీక్షితులుపై టీటీడీ ఫిర్యాదుతో తిరుమల వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్టు సమాచారం. టీటీడీ పరిపాలన అంశాలు, అధికారులు, పోటు సిబ్బంది, జీయంగార్లపై రమణ దీక్షితులు తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేసినట్టు సోషల్ మీడియాలో ఓ వీడియో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీటీడీ ప్రతిష్ఠ దిగజార్చేలా రమణ దీక్షితులు వ్యాఖ్యలు చేశారంటూ టీటీడీకి చెందిన సైబర్ సెక్యూరిటీ అండ్ సోషల్ మీడియా మానిటరింగ్ సెల్ అధికారి మురళీ సందీప్ శుక్రవారం రాత్రి 10 గంటలకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీనిపై పోలీసులు సెక్షన్ 153ఏ, 295, 295ఏ, 505(2), రెడ్‌విత్ 120 మేరకు కేసు నమోదు చేసినట్టు సమాచారం. మరోవైపు నిధుల కోసం ప్రయత్నిస్తున్నామంటూ రమణదీక్షితులు తమపై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ అహోబిలం మఠం నుంచి కూడా టీటీడీకి శనివారం ఓ లేఖ అందింది. ఇదిలా ఉండగా చాలాకాలం తరువాత శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారి ఆలయంలో రమణదీక్షితులు ప్రత్యక్షం కావడం విశేషం. శ్రీవారిని దర్శించుకుని సుమారు గంటపాటు ఆలయంలోనే గడిపిన ఆయన చిరునవ్వుతో అందరినీ పలకరిస్తూ కనిపించారు. ఆలయం నుంచి వెలుపలకు వచ్చిన అనంతరం రమణదీక్షితులు మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఆలయంలో కైంకర్యాలు సక్రమంగానే జరుగుతున్నాయా అనే ప్రశ్నకు బదులిస్తూ.. తరతరాలుగా చేసే కైంకర్యాలనే ఇప్పటికీ చూస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వీడియో తనది కాదని ఇప్పటికే స్పష్టత ఇచ్చానన్నారు. తానెప్పుడు అలా మాట్లాడలేదని, అది తన స్వభావం, సంస్కృతి కాదన్నారు. చేయని తప్పునకు తనను బాధితుడిని చేస్తే ఏం చేయలేనన్నారు. పోలీసు కేసు అంశంపై మీడియా ప్రశ్నించగా 'చూస్తాను' అంటూ వెళ్లిపోయారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆర్కే RK



కొత్తపలుకు

# జన కంటకం... జగన్ నాటకం!

"మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అన్యాయంగా జైలుకు పంపారు. స్కిల్ కేసులో ఆయన తప్పు చేశారనడానికి సరైన ఆధారాలు లేవు!" - ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న ఒకరు కేంద్ర పెద్దలకు అందజేసిన నివేదికలో పేర్కొన్న విషయమిది. రాష్ట్రంలో పరిపాలన సక్రమంగా లేదనీ, అభివృద్ధి మచ్చుకు కూడా లేదని ఆయన అభిప్రాయపడ్డారు. తన పాలన అద్భుతంగా ఉందని జబ్బలు చరుచుకుంటున్న జగన్‌రెడ్డికి ఈ నివేదికలోని అంశాలు సహజంగానే రుచించవు. తన ప్రభుత్వాన్ని విమర్శించేవారు ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్లు కూడా కాదని, పొరుగు రాష్ట్రాల్లో నివసించే వారే విమర్శిస్తుంటారని ముఖ్యమంత్రి శుక్రవారం నాడు ప్రకాశం జిల్లాలో జరిగిన సభలో వ్యాఖ్యానించారు. రాజకీయ నాయకులు ఉన్నవీ లేనివీ చెప్పడం సహజమే కానీ జగన్మోహన్ రెడ్డిలా పచ్చి అబద్ధాలు చెప్పేవారిని ఇప్పుడే చూస్తున్నాం. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి కూడా తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక

> ముఖ్యమంత్రికి ఎక్కడో ఓటమి భయం పట్టుకుంది. అందుకే మీడియాపైకి తన ఉన్మాద మూకలను ఉసిగొల్పుతున్నారు. రాధాకృష్ణ, రామోజీరావు కనిపిస్తే కాళ్లు విరిచే వారు అని కొడాలి నాని వంటి పిచ్చివాళ్లు వాగుతున్నారంటే ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియడం లేదా? తాను అధికారంలోకి వచ్చే వరకు రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితులు ఉన్నాయన్నట్టుగా జగన్‌రెడ్డి చేస్తున్న ప్రచారం నిజమైతే... రాజశేఖర రెడ్డి ఐదున్నరేళ్ల పాలన కూడా దరిద్రంగా ఉన్నట్టే కదా? అలాంటప్పుడు రాజన్న రాజ్యం తెస్తామని ఎన్నికల్లో చెప్పడంలోని ఔచిత్యం ఏమిటి? పేదల ప్రతినిధికి విలాసవంతమైన రాజ ప్రాసాదాలు ఊరూరా ఎందుకో చెబుతారా? నీ కుమార్తెల వలె పేదల పిల్లలను కూడా ప్యారిస్, లండన్‌లో చదివించవచ్చు కదా? ఇలా ప్రశ్నిస్తామనే దాడులకు తెగబడుతున్నారు. నీ సొంత చెల్లి ఇప్పుడు నిన్ను కడిగిపారేస్తున్నారు కదా, నీ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు కదా! ఇప్పుడు ఆమెపై కూడా దాడులు చేయిస్తారా?

ఇచ్చినందున ఆయనను కూడా మన రాష్ట్రానికి చెందినవాడు కాదని దాడి ప్రారంభించినా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. తన సభలకు తీసుకు వస్తున్న జనాలందరూ వెర్రిబాగులోళ్లు అని భావించే ముఖ్యమంత్రి, చెప్పిన అబద్ధం చెప్పకుండా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబులాంటి వాడు రాజకీయాలలో ఇంకా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందని జగన్మోహన్ రెడ్డి తాజాగా సెలవిచ్చారు. చంద్రబాబు విధానాలతో, రాజకీయాలతో విభేదించే వాళ్లు కూడా ఆయన రాజకీయాలలో ఉండదగిన వ్యక్తి కాదని విమర్శించే సాహసం చేయరు. జగన్‌రెడ్డే రాజకీయాలలోకి వచ్చి ముఖ్యమంత్రి కాగలిగినప్పుడు రాజకీయాల్లోకి ఎవరైనా రావొచ్చు. ఒక్క జగన్ మాత్రమే చంద్రబాబు రాజకీయాలలో ఉండడాన్ని సహించలేకపోతున్నారు. అందుకే ఆయన రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి కుప్పం పర్యటన సందర్భంగా సరదాగా చేసిన వ్యాఖ్యలను కూడా వక్రీకరించే సాహసానికి ముఖ్యమంత్రి ఒడిగట్టారు. రాజకీయాల నుంచి చంద్రబాబు రిటైర్ కావాలని ఆయన సతీమణి స్వయంగా కోరుకుంటున్నారని ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. చంద్రబాబు లక్ష్యంగా ముఖ్యమంత్రి చేస్తున్న విమర్శలను గమనిస్తే... తన ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారెవరూ రాష్ట్ర రాజకీయాల్లో ఉండకూడదనీ, రాష్ట్రాన్ని తనకు, తన భార్యకు అప్పగించేసి అందరూ రాజకీయ సన్యాసం తీసుకోవాలని ఆయన కోరుకుంటున్నట్టుగా ఉంది. తనను తాను పేదల ప్రతినిధిగా చెప్పుకునే జగన్మోహన్ రెడ్డి అడుగు బయటపెట్టాలంటే రెండు హెలికాప్టర్‌లు సిద్ధంగా ఉండాలి మరి!

## బడాయి బిల్డప్‌లు...

తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకు రాష్ట్రంలో పేద ప్రజలకు ఆంగ్ల భాషే రాదన్నట్టుగా జగన్ బిల్డప్ ఇస్తున్నారు. 'సర్వరోగ నివారిణి జిందా తిలిస్మాత్' అన్నట్టుగా ఆంగ్ల భాష వస్తే చాలు అన్నీ వచ్చి పడిపోతాయి అన్నట్టుగా ప్రజలను మభ్యపెడుతున్నారు. అమెరికన్లు మాట్లాడేది ఆంగ్లంలోనే కదా? అయినా ఆ దేశంలో మన దేశానికి చెందినవారు ఉన్నత స్థానాల్లో ఉండటానికి కారణం ఏమిటో జగన్మోహన్ రెడ్డి చెప్పగలరా? అంతెందుకు... కేరళ, తమిళనాడు, కన్నడిగులకు ఆంగ్ల భాషపై పట్టు లేదా? అయినా వాళ్లు తమ మాతృభాషను విస్మరించడం లేదే? ఇంగ్లీష్ భాషతోపాటు తెలుగు భాషను కూడా ప్రోత్సహించాలని, మాతృభాషను మృత భాషగా మార్చకూడదని చెప్పడమే పాపమన్నట్టుగా చిత్రీకరించే ప్రయత్నాన్ని జగన్‌రెడ్డి చేయడం విడ్డూరంగా ఉంది. తెలుగు భాషలో మాట్లాడే వారి కంటే తక్కువ జనాభా ఉన్న అనేక యూరోపియన్ దేశాలు తమ మాతృభాషను విస్మరించడం లేదు కదా? స్పానిష్, ఫ్రెంచ్ భాషలను నేర్చుకునేందుకు మన పిల్లలు ఉత్సాహపడటం లేదా? ప్రజలు సొంతంగా ఆలోచించకూడదని, వాళ్లు తమ కాళ్ల మీద తాము ఆధారపడకూడదన్నది ముఖ్యమంత్రి అభిప్రాయంగా కనిపిస్తోంది. అడుగడుగునా వంచనతో వ్యవహరించే జగన్మోహన్ రెడ్డి ఎన్నికలు సమీపించడంతో.. 'నా పేదలు, నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు' అనే పాట అందుకున్నారు. దళిత జనోద్ధారణకు జీవితాంతం కృషి చేసిన జాతిపిత మహాత్మా గాంధీ కూడా ఇంతలా బిల్డప్ ఇచ్చుకోలేదు. ఆయన చిత్తశుద్ధితో పనిచేశారు కనుక జగన్‌రెడ్డిలా సొల్లు మాటలు చెప్పలేదు.

## ఓట్ల కోసం 'నా... నా' రాగాలు

బడుగు బలహీన వర్గాల ఓట్లు కావాలి కనుక జగన్మోహన్ రెడ్డి 'నా' అనే పాట పాడుతుంటారు. తన పల్లకి మోసే బోయీలుగానే ఆ వర్గాలు ఉండిపోవాలని ఆయన కోరుకుంటారు. అందుకే అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా వారెవరినీ రానివ్వరు. అంతెందుకూ... రాజకీయంగా, ప్రభుత్వపరంగా తన తరఫున వ్యవహారాలను చక్కదిద్దుతున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎంత మంది ఉన్నారో జగన్మోహన్ రెడ్డి చెప్పాలి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జవహర్ రెడ్డి ఎవరు? పార్టీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, విజయసాయి రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎవరు? తనకు నెల నెలా వసూళ్లు చేసి పెడుతున్న గనుల శాఖ డైరెక్టర్ వెంకట రెడ్డి, మద్యం సరఫరా చేసే సంస్థ ఎండీ వాసుదేవ రెడ్డి ఎవరు? వీళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎందుకు లేరు? అంటే ఆ వర్గాలలో సమర్థులు లేరా? లేక వారిపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా? ఊరి వెలుపల దళితవాడలను ఏర్పాటు చేసినట్టుగా తాడేపల్లి ప్యాలెస్‌కు దళిత వర్గాలు ఆమడ దూరంలో ఉండాల్సిందే. ఆయా వర్గాలను మభ్యపెట్టేందుకు విధిలేని పరిస్థితులలో కొన్ని పదవులు కట్టబెట్టినా, వారిని అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా రానివ్వడం లేదే? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నిజంగా నీ వాళ్లయితే ఆ వర్గాలతో వియ్యం అందుకోగలవా, బంధుత్వం పెట్టుకోగలవా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే తప్పేమిటి? ఐదేళ్లలో అక్క చెల్లెమ్మలకు రెండున్నర లక్షల కోట్లు పంచిపెట్టానని జగన్ గొప్పలు చెప్పుకొంటున్నారు. అయిదేళ్లలో ఐదు లక్షల కోట్లు అప్పు చేసి రెండున్నర లక్షల కోట్లు పంచడం గొప్పా? ఈ ఐదేళ్లలో తన జేబు నుంచి ఒక్కరికైనా పది రూపాయలు సహాయం చేశానని జగన్‌రెడ్డి చెప్పగలరా? ఈ ఐదేళ్లలో జగన్ రెడ్డి కంపెనీల లాభాలు పెరిగినట్టుగా పేదల ఆదాయం ఎందుకు పెరగలేదు? బటన్లు నొక్కడం వల్ల ఒక్క పేదవాడైనా పేదరికం నుంచి బయటకు వచ్చి పన్ను కట్టే స్థాయికి ఎదిగాడా? అదే నిజమైతే తెల్ల రేషన్ కార్డుల సంఖ్య తగ్గుతూ రావాలి కదా?

## దాడులకా 'సిద్ధం'?

జగన్మోహన్ రెడ్డి పాలన నిజంగా గొప్పగా ఉంటే పొద్దున లేచిన దగ్గర నుంచి ప్రతిపక్షాలు, మీడియా మీద పడి ఏడవడం ఎందుకు? జనం కళ్లలోకి సూటిగా చూస్తూ అలవోకగా అబద్ధాలు చెప్పగలిగేది ఎవరంటే, జగన్మోహన్ రెడ్డి అని చెప్పుకోవలసి ఉంటుంది. జనం నెత్తి మీద కూర్చొని 'మీ సేవకుడిని' అని గొప్పలు పోగలిగేవాడు, ఇల్లు గుల్ల చేస్తూ 'మీ సేవకుడిని' అని మభ్యపెట్టగలిగేవాడు, చేతికీ నోటికీ తాళం వేసి ఎంత స్వేచ్ఛ అనుభవిస్తున్నావో చూడు అని నమ్మించగలిగేవాడు, కొంపకు నిప్పు పెట్టి చలిమంట వేశాను - చలి కాచుకోమని బురిడీ కొట్టించగలవాడు ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి మాత్రమే. జగన్మోహన్ రెడ్డి హావభావాలను జాగ్రత్తగా గమనించిన వారికి 'నేను ముఖ్యమంత్రిని అయ్యానా?' అన్న అనుమానం అతడిలో అప్పుడప్పుడూ కలుగుతుందని మనకు తెలిసిపోతుంటుంది. అందుకే తన లాంటి వాడికి ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టిన జనాలను ఆయన వెర్రిబాగులోళ్లుగా పరిగణిస్తున్నారు. అందుకే నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతుంటారు. ముఖ్యమంత్రి నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నందుకు మీడియాపై కత్తిగట్టారు. సొంత మీడియాకు వందల కోట్ల ప్రజాధనాన్ని దోచిపెడుతూ ప్రజల దృష్టి మళ్లించేందుకు ఆంధ్రజ్యోతి, ఈనాడు అని శోకాలు పెడుతుంటారు. ఈ క్రమంలోనే మీడియాపై దాడులకు తన వాళ్లను ప్రోత్సహిస్తున్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో నిర్వహించిన సభలో ఆంధ్రజ్యోతి, ఈనాడుకు వ్యతిరేకంగా 'మీరు సిద్ధమేనా?' అని స్వయంగా ముఖ్యమంత్రి ప్రశ్నించడంతో అసలే మద్యం మత్తులో ఉన్న ఉన్మాద మూక రెచ్చిపోయింది. 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను దారుణంగా హింసించారు. సొంత మీడియా కలిగి ఉండి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛ గురించి ఉపన్యాసాలు దంచిన జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజ స్వరూపం బయటపెట్టుకుంటున్నారు. రేపు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే తన మీడియాలో పనిచేసే వారిపై ఇటువంటి దాడులు జరిగితే జగన్ ఎలా స్పందిస్తారో చూడాలి. ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి తర్వాత వైసీపీ అధికారికంగా వెలిబుచ్చిన అభిప్రాయం మరీ దారుణంగా ఉంది. 'ప్రజల అభిప్రాయం తీసుకొని వార్తలు రాస్తే అందరూ హర్షిస్తారు. కానీ.. ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా వార్తలు రాస్తే ప్రభుత్వం కాదు, ప్రజలే బుద్ధి చెబుతారు' అని వైసీపీ 'ఎక్స్' ద్వారా సెలవిచ్చింది. అంటే, రాష్ట్రంలోని మీడియా సంస్థలన్నీ ఆ రోత పత్రిక, ఆ రోత చానల్‌కు అనుబంధంగా మారిపోయి ప్రస్తుత కూలి మీడియా బాటలో ముఖ్యమంత్రి భజన చేస్తూ వాళ్లు విసిరే ఎంగిలి మెతుకులు తినడానికి అలవాటుపడాలని కోరుకుంటున్నారన్న మాట! రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకే ఉండకూడదని అనుకోవడం, ప్రజలందరూ మూకుమ్మడిగా మద్దతు ఇవ్వాల్సిందే అని భావించడం, తప్పులు ఎత్తి చూపే ప్రతిపక్షం, మీడియా ఉండకూడదని కోరుకోవడం నియంతృత్వం కాదా? ముఖ్యమంత్రికి ఎక్కడో ఓటమి భయం పట్టుకుంది. అందుకే మీడియాపైకి తన ఉన్మాద మూకలను ఉసిగొల్పుతున్నారు. రాధాకృష్ణ, రామోజీరావు కనిపిస్తే కాళ్లు విరిచే వారు అని కొడాలి నాని వంటి పిచ్చివాళ్లు వాగుతున్నారంటే ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలియడం లేదా? తాను అధికారంలోకి వచ్చే వరకు రాష్ట్రంలో పేదలు బతకలేని పరిస్థితులు ఉన్నాయన్నట్టుగా జగన్‌రెడ్డి చేస్తున్న ప్రచారం నిజమైతే... రాజశేఖర రెడ్డి ఐదున్నరేళ్ల పాలన కూడా దరిద్రంగా ఉన్నట్టే కదా? అలాంటప్పుడు రాజన్న రాజ్యం తెస్తామని ఎన్నికల్లో చెప్పడంలోని ఔచిత్యం ఏమిటి? పేదల ప్రతినిధికి విలాసవంతమైన రాజప్రాసాదాలు ఊరూరా ఎందుకో చెబుతారా? విశాఖపట్నంలో తన నివాసం కోసం ఐదు వందల కోట్లు ఖర్చు చేసి మరో విలాసవంతమైన భవనం నిర్మించుకోవడంలో ఔచిత్యం ఏమిటి? పేదలు మాత్రం సెంటు స్థలంలోనే ఇల్లు కట్టుకొని రాజప్రాసాదంగా భావించాలని కోరుకోవడం వంచన కాదా? నీ పిల్లలు విదేశాల్లో చదువుకోవాలిగానీ పేదల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని కోరుకోవడం పేదల ప్రతినిధి చేసే పనేనా? నీ కుమార్తెల వలె పేదల పిల్లలను కూడా ప్యారిస్, లండన్‌లో చదివించవచ్చు కదా? ఇలా ప్రశ్నిస్తామనే దాడులకు తెగబడుతున్నారు. నీ సొంత చెల్లి ఇప్పుడు నిన్ను కడిగిపారేస్తున్నారు కదా, నీ నిజ స్వరూపాన్ని ప్రజలకు వివరిస్తున్నారు కదా! ఇప్పుడు ఆమెపై కూడా దాడులు చేయిస్తారా? మీడియాపైకి ప్రజలే తిరగబడుతున్నారని చెబుతున్నారు కదా, అదే నిజమైతే, ప్రజల్లో నిజంగా అంత చైతన్యమే ఉంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఎప్పుడో తరిమికొట్టేవారు. అసలు ఆయనను ముఖ్యమంత్రి పీఠంపైనే కూర్చోబెట్టేవారు కారు. తాను ఎప్పుడైతే ముఖ్యమంత్రి సీటులో కూర్చున్నారో అప్పుడే ప్రజలు ఉత్త అమాయకులని, వారిని పదే పదే బురిడీ కొట్టించవచ్చునని జగన్మోహన్ రెడ్డి నిర్ధారణకు వచ్చారు. అందుకే రాష్ట్రంలో కులాల కుంపట్లు రాజేసి చలి కాచుకొనే ప్రయత్నం చేస్తున్నారు. రాజధాని అమరావతిని చంపేసి, మూడు రాజధానుల పాట పాడుతూ ఐదేళ్ల కాలక్షేపం చేసి ఇప్పుడు మరికొంత కాలం హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా ఉండాలనడం ప్రజలు అమాయకులు, ఏదీ పట్టించుకోరనే కదా? రాష్ట్రం కర్మ కాలి జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వస్తే వాషింగ్టన్ రాజధానిగా ఉండాలని వాదిస్తారేమో తెలియదు. ఏది ఏమైనా మీడియాపై మీ ఉన్మాద మూకలు చేయబోయే దాడులను ఎదుర్కోవడానికి మేం కూడా సిద్ధం. నియంతృత్వ పోకడలను, కపట విన్యాసాలను మేం ప్రశ్నిస్తూనే ఉంటాం!

> సొంత మీడియా కలిగి ఉండి, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పత్రికా స్వేచ్ఛ గురించి ఉపన్యాసాలు దంచిన జగన్‌రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తన నిజ స్వరూపం బయటపెట్టుకుంటున్నారు. రేపు రాష్ట్రంలో ప్రభుత్వం మారితే తన మీడియాలో పనిచేసే వారిపై ఇటువంటి దాడులు జరిగితే జగన్ ఎలా స్పందిస్తారో చూడాలి.




> బడుగు బలహీన వర్గాల ఓట్లు కావాలి కనుక జగన్మోహన్ రెడ్డి 'నా' అనే పాట పాడుతుంటారు. తన పల్లకి మోసే బోయీలుగానే ఆ వర్గాలు ఉండిపోవాలని ఆయన కోరుకుంటారు. అందుకే అధికార కేంద్రాల దరిదాపుల్లోకి కూడా వారెవరినీ రానివ్వరు. రాజకీయంగా, ప్రభుత్వపరంగా తన తరఫున వ్యవహారాలను చక్కదిద్దుతున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎంత మంది ఉన్నారో జగన్మోహన్ రెడ్డి చెప్పాలి. ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, జవహర్ రెడ్డి ఎవరు? పార్టీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణా రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, మిథున్ రెడ్డి, విజయసాయి రెడ్డి, చెవిరెడ్డి భాస్కర రెడ్డి ఎవరు? తనకు నెల నెలా వసూళ్లు చేసి పెడుతున్న గనుల శాఖ డైరెక్టర్ వెంకట రెడ్డి, మద్యం సరఫరా చేసే సంస్థ ఎండీ వాసుదేవ రెడ్డి ఎవరు? వీళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఎందుకు లేరు? అంటే ఆ వర్గాలలో సమర్థులు లేరా? లేక వారిపై ముఖ్యమంత్రికి నమ్మకం లేదా? ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు నిజంగా నీ వాళ్లయితే ఆ వర్గాలతో వియ్యం అందుకోగలవా, బంధుత్వం పెట్టుకోగలవా? అని ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే తప్పేమిటి?

## బీజేపీ పాత్ర ఏమిటో!?

తెలుగు రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ ఎటువంటి పాత్ర పోషించబోతోంది అన్నది ఇప్పుడు తెలుగునాట చర్చనీయాంశంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం, జనసేనతో చేతులు కలుపుతామని చెప్పి పదిహేను రోజులు దాటినా బీజేపీ నుంచి స్పందన లేకపోవడం అనేక ఊహాగానాలకు తావిస్తున్నది. జగన్మోహన్ రెడ్డి కోరికను మన్నించి ఈ రెండు పార్టీలతో పొత్తుకు ప్రధాని మోదీ విముఖత వ్యక్తం చేస్తారా? అన్న అనుమానం ఆయా పార్టీల నాయకుల్లో వ్యక్తమవుతోంది. రేపో మాపో కబురు చేస్తామంటూ పక్షం రోజులు గడచినా బీజేపీ నుంచి ఉలుకూ పలుకూ లేకపోవడంతో తెలుగుదేశం, జనసేన పార్టీలు తమ అభ్యర్థుల జాబితాను శనివారం ప్రకటించాయి. భారతీయ జనతా పార్టీతో పొత్తు ఉన్నా లేకపోయినా కలిసే వెళ్లాలని తెలుగుదేశం-జనసేన నిర్ణయించుకున్నాయి. ఎన్నికలు సజావుగా జరగాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం అవుతున్నందున బీజేపీతో కలవాల్సిన పరిస్థితి ఈ కూటమికి ఏర్పడుతోందన్నది బహిరంగ రహస్యమే. ప్రస్తుతానికి బీజేపీ కేంద్ర నాయకత్వం గుంభనంగా ఉంది. రాబోయే కొద్ది రోజుల్లో బీజేపీ పెద్దలు తమ వైఖరి స్పష్టం చేసే అవకాశముంది. ఆ తర్వాత మాత్రమే రాష్ట్ర రాజకీయాల్లో స్పష్టత వస్తుంది. తెలంగాణ విషయానికి వస్తే భారత రాష్ట్ర సమితితో పొత్తు పెట్టుకోకూడదని బీజేపీ అగ్ర నాయకత్వం నిర్ణయానికి వచ్చింది. పొత్తు ప్రతిపాదనలతో వచ్చిన బీఆర్ఎస్ ప్రతినిధుల వద్ద బీజేపీ పెద్దలు తమ వైఖరి స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో వాతావరణం తమకు అనుకూలంగా ఉందని బీజేపీ నాయకులు నమ్ముతున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను దెబ్బతీయగలిగితే రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదగవచ్చునన్నది వారి ఆలోచన. బీజేపీ పెద్దలు భావిస్తున్నట్టు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిజంగా దెబ్బతింటే దాని ప్రభావం ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైన కూడా పడుతుంది. బీఆర్ఎస్ దెబ్బ తింటే బీజేపీని ఎదుర్కోవడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అంత ఈజీ కాదు. బీజేపీతో బీఆర్ఎస్ కూడా ఎంతో కొంత బలంగా నిలబడటం కాంగ్రెస్ పార్టీకి అవసరం. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా ఉన్నప్పుడు కేసీఆర్ ప్రభుత్వం తమకు ఢోకా లేదన్న భరోసాతో ఉండింది. ఆ తర్వాత జరిగిన కొన్ని పరిణామాలతో బీజేపీ బలహీనపడటంతో కేసీఆర్ ఓడిపోయి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో భారత రాష్ట్ర సమితి తన ఉనికిని కోల్పోకుండా మనగలిగితే కాంగ్రెస్ ప్రభుత్వానికి పరోక్షంగా కవచంలా ఉపయోగపడుతుంది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ముఖ్యులు కూడా గుర్తించారు. తాజా సర్వేల ప్రకారం లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రథమ స్థానంలో, బీజేపీ ద్వితీయ స్థానంలో, బీఆర్ఎస్ తృతీయ స్థానంలో ఉండబోతున్నాయి. ఇదే నిజమైతే ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలు పక్కచూపులు చూడకుండా కట్టడి చేయడం కేసీఆర్‌కు శక్తికి మించిన పనే. శాసనసభ ఎన్నికల్లో బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన ఈటల రాజేందర్, బండి సంజయ్ వంటి వారు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయబోతున్నారు. మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి ఈటల రాజేందర్ పోటీ చేసే అవకాశముంది. ఈ ఇరువురూ గెలిస్తే, వారిలో ఒకరు కేంద్ర మంత్రి అవుతారన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో తమకు అధికారం వస్తే బీసీనే ముఖ్యమంత్రి అవుతారని ప్రధాని మోదీ స్వయంగా ప్రకటించి ఉన్నందున రేసులో ఈటల, బండి ఉంటారు. ఏ కారణం వల్లనైనా ఎన్నికల తర్వాత బీఆర్ఎస్‌కు చెందిన మెజారిటీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరితే రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిక్కులు తప్పవు. కేంద్రంలో మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కుదురుగా ఉండనిస్తారని భావించలేం. చండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా ఏం జరిగిందో చూశాం. సుప్రీంకోర్టులో విచారణ జరిగి ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన వ్యక్తిని మేయర్‌గా ప్రకటించిన తర్వాత కూడా ఆ పార్టీకి చెందిన ముగ్గురు కార్పొరేటర్లను బీజేపీలో చేర్చుకున్నారు. విలువలతో కూడిన రాజకీయాలకు ఇవి రోజులు కావు. ప్రధాని మోదీ కూడా నైతికత కంటే గెలుపునకే ప్రాధాన్యత ఇస్తారని అనేక సందర్భాలలో రుజువైంది. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఎలా ఉండబోతుందన్న విషయమై ఆసక్తి నెలకొంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పూర్తి కాలం అధికారంలో కొనసాగనిస్తారా? అన్న సందేహం పలువురిలో ఏర్పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఏమి జరుగుతున్నదో తెలుసు. బీజేపీ నుంచి ఎదురుకాబోతున్న ప్రమాదం నుంచి బయటపడేందుకు రేవంత్ రెడ్డి ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి. శాసనసభలో ప్రస్తుతం ఎనిమిది సీట్లు మాత్రమే ఉన్న బీజేపీ నుంచి ఇటు అధికార పక్షం, అటు ప్రధాన ప్రతిపక్షం ముప్పును ఎదుర్కోవలసి రావడం నరేంద్ర మోదీ మహిమే అని చెప్పుకోవలసి ఉంటుంది. మహారాష్ట్రలో ఏం జరిగిందో తెలిసిందే! శివసేన, ఎన్సీపీ వంటి పార్టీలు చేతులు మారాయి. ఆ పార్టీల అధినేతలైన ఉద్ధవ్ ఠాక్రే, శరద్ పవార్ తమ పార్టీలకు వేరే పేర్లు పెట్టుకున్నారు. మోదీ మార్కు రాజకీయం ఇలాగే ఉంటుంది మరి!

> రాజకీయ నాయకులు ఉన్నవీ లేనివీ చెప్పడం సహజమే కానీ జగన్మోహన్ రెడ్డిలా పచ్చి అబద్ధాలు చెప్పేవారిని ఇప్పుడే చూస్తున్నాం. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తి తన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నివేదిక ఇచ్చినందున ఆయనను మన రాష్ట్రానికి చెందినవాడు కాదని దాడి ప్రారంభించినా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు. తన సభలకు తీసుకు వస్తున్న జనాలందరూ వెర్రిబాగులోళ్లు అని భావించే ముఖ్యమంత్రి, చెప్పిన అబద్ధం చెప్పకుండా తన నటనా విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నారు. చంద్రబాబులాంటి వాడు రాజకీయాలలో ఇంకా కొనసాగడం ఆశ్చర్యం కలిగిస్తోందని జగన్మోహన్ రెడ్డి తాజాగా సెలవిచ్చారు. చంద్రబాబు విధానాలతో, రాజకీయాలతో విభేదించే వాళ్లు కూడా ఆయన రాజకీయాలలో ఉండదగిన వ్యక్తి కాదని విమర్శించే సాహసం చేయరు. ఒక్క జగన్ మాత్రమే చంద్రబాబు రాజకీయాలలో ఉండడాన్ని సహించలేకపోతున్నారు. అందుకే ఆయన రాజకీయాల నుంచి ఎప్పుడు తప్పుకుంటారా? అని ఆశగా ఎదురుచూస్తున్నారు.



# జబ్బు కంటే ప్రమాదం 'మద్దతు' ఔషధం

పంజాబ్ రైతుల ఆందోళన భారతీయ వ్యవసాయం, రైతుల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను లేవనెత్తుతోంది. స్వాతంత్ర్యం వచ్చాక అనుసరించిన అసంబద్ధమైన లైసెన్స్ 'పర్మిట్' కోటా రాజ్యవ్యవస్థకి దశాబ్దాల తరబడి బాధితులు మన రైతులు. వారి జీవితాలను పణంగా పెట్టి వ్యవసాయోత్పత్తుల ధరల్ని తగ్గించటమే ధ్యేయంగా సాగు రంగంలో మన విధాన నిర్ణేతలు వ్యవహరించారు. నిరంతరం ఉప్పు, నిప్పుగా వ్యవహరించే పార్టీలు ఈ విషయంలో మాత్రం విభేదాలను అధిగమించి రాజకీయాలకతీతంగా ఏకమయ్యాయి. ధరల పెరుగుదలకు అవసరమైన పద్ధతుల్ని, ప్రోత్సాహకాల్ని ఎన్నడూ పనిచేయనివ్వలేదు. రైతుల్ని ఒక పద్ధతి ప్రకారం పేదలుగా, నిరంతరం చేయి జాచి అర్థించేవారుగా తయారుచేశారు. రవాణా, నిల్వ, అమ్మకాలపై అసంబద్ధమైన, అహేతుకమైన, అవినీతిమయమైన నియంత్రణల వల్ల మార్కెట్లు అపసవ్యంగా మారి ధరల అంతరాలు సాధారణమయ్యాయి. తక్కువ ధరలతో బలవంతంగా ఆహారధాన్యాలను సేకరించటం వల్ల రైతులు పేదరిక విషవలయంలో కూరుకుపోయారు. అవినీతి నిండిన నియంత్రణ, సేకరణ, ప్రజా పంపిణీ లొసుగులమయమై దళారీల్ని పెంచింది. ఖజానాకి నష్టాలు కలిగించటంతోపాటు రైతుల నడ్డి విరిచింది.

నిల్వ ఉండే ఉత్పత్తుల విషయంలో కూడా ధరల ఒడిదుడుకుల్ని తట్టుకుని రైతులు నిలబడగలిగేలా సరైన ఏర్పాట్లు లేవు. నిల్వ సామర్థ్యం, రుణ సదుపాయం చాలా తక్కువగా ఉన్నాయి. శీతల నిల్వ సౌకర్యాలు, ప్రాసెసింగ్ లేక కుళ్లిపోయే పంటల్లో 30 శాతం వృథా అవుతున్నాయి. చాంతాడంత పొడవున్న, అసమర్థమైన మార్కెట్ గొలుసు వల్ల వినియోగదారులు చెల్లించే డబ్బులో అత్యధికంగా దళారీలకే పోతోంది. రైతులకు కేవలం 25-30శాతం దక్కుతోంది.

పరిష్కారం మార్కెట్లను మరింత తారుమారు చేయటం, వ్యవసాయోత్పత్తుల సేకరణ, ఎంఎస్‌పి (కనీస మద్దతు ధర)ను చట్టబద్ధం చేయటంలో లేదు. 2006 ప్రాంతం వరకు ఆహారధాన్యాలను తక్కువ ధరనిచ్చి బలవంతంగా సేకరించటం నిబంధనగా ఉండేది. అప్పట్నుంచి కొన్ని రకాల ఆహారధాన్యాలకు ఎంఎస్‌పిని మార్కెట్ ధరల కంటే ఎక్కువగా పెంచారు. దీంతో సేకరణకి డిమాండ్ పెరుగుతూ వచ్చింది. అంతకుముందు ప్రభుత్వ జోక్యం చాలామేరకు మార్కెట్ ధరలను అణగదొక్కగా, ఇప్పుడు ఆహారధాన్యాల తప్పనిసరి సేకరణ ధరల సంకేతాల్ని అపసవ్యం చేసింది. ధరల పెరుగుదలకు అవరోధమయ్యే మూర్ఖమైన ప్రోత్సాహకాన్ని సృష్టించింది. దీంతో, మనం అవసరాలకి మించి ఆహారధాన్యాలు ఉత్పత్తి చేస్తున్నాం, మార్కెట్‌లో నిల్వలు పేరుకుపోతున్నాయి. మరోవంక ఇతర రకాల ఆహార వినియోగం పెరిగి బియ్యం, గోధుమ వంటి ధాన్యాల తలసరి వినియోగం

> మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు వ్యవసాయోత్పత్తులను సేకరించటానికి చట్టబద్ధత ఇచ్చి నిరంతరం కొనసాగించటానికి అవసరమైన భారీ మొత్తాల్ని కేటాయించటానికి ఖజానాలో డబ్బు ఉంటే గదా! పంట ధరల్ని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణల్ని తొలగించటం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించటం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, రుణ వ్యవస్థల్ని బలోపేతం చేయటం, అదనపు విలువను ప్రోత్సహించటం, మార్కెట్ గొలుసును కుదించటానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులను పెంచటం మాత్రమే పరిష్కారం.

తగ్గుతోంది. పండ్లు, కూరగాయలు, పాలు, గుడ్లు, మాంసం, చేపలకు డిమాండ్ వేగంగా పెరుగుతుండగా, మరింత ఎక్కువ మంది రైతులు మరింత ఎక్కువ గోధుమలు, వరి పండించటానికి ప్రోత్సాహకాలనిస్తున్నారు! వరి సాగు విస్తీర్ణం సుమారు తొమ్మిది రెట్లు, 5 మిలియన్ హెక్టార్ల నుంచి 44 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. గోధుమ మూడు రెట్లు, 9.8 నుంచి 29.8 మిలియన్ హెక్టార్లకు పెరిగింది. ఈ సంవత్సరం మన ధాన్యం ఉత్పత్తి రికార్డు స్థాయిలో 330 మిలియన్ టన్నులు ఉంది. కాబట్టి ఎంఎస్‌పి, ధాన్యం సేకరణ కేవలం ఒక సంక్షోభ పరిస్థితికి తాత్కాలిక అత్యవసర చర్య మాత్రమే తప్ప, రైతులకి, దేశానికి దీర్ఘకాల ప్రయోజనాలని చేకూర్చదు.

ధరల సంకేతాలకు వ్యతిరేక దిశలో వ్యవహరించటం, మార్కెట్ డిమాండ్‌తో సంబంధం లేకుండా మూర్ఖమైన ప్రోత్సాహకాలను కొనసాగించటమంటే, రైతులను శాశ్వతంగా ఆచరణసాధ్యంకాని ఆర్థిక భారంతో ప్రభుత్వం అందించాల్సిన సాయంపై ఆధారపడేవారుగా తయారుచేయటం. 2023–24 తాత్కాలిక బడ్జెట్ అంచనాల ప్రకారం, యూనియన్ ప్రభుత్వ స్థూల ఆదాయాలన్నీ కలిపినా రాష్ట్రాలకు బదిలీ చేసే మొత్తం నిధులు, వడ్డీ చెల్లింపులు, జీతాలు, పెన్షన్లకే అరకొరగా సరిపోతోంది. సబ్సిడీలకు (ఎక్కువగా ఎరువులు, ఆహారం), వివిధ సంక్షేమ కార్యక్రమాలకు కూడా దేశం అప్పులు చేయాల్సి వస్తోంది. మార్కెట్ ధరల కంటే ఎక్కువ ధరలకు వ్యవసాయోత్పత్తులను సేకరించటానికి చట్టబద్ధత ఇచ్చి నిరంతరం కొనసాగించటానికి అవసరమైన భారీ మొత్తాల్ని కేటాయించటానికి ఖజానాలో డబ్బు ఉంటే గదా!




సమాధానం ఏమిటి? పంట ధరల్ని అణగదొక్కుతున్న అన్ని నియంత్రణల్ని తొలగించటం, చౌక ధర దిగుమతులు వెల్లువెత్తకుండా హేతుబద్ధమైన సుంకం విధించటం, ధరల అంతరాల్ని తట్టుకునేలా నిల్వ, రుణ వ్యవస్థల్ని బలోపేతం చేయటం, అదనపు విలువను ప్రోత్సహించటం, మార్కెట్ గొలుసును కుదించటానికి రిటైల్ చెయిన్ల ఏర్పాటు, ఎగుమతులను పెంచటం మాత్రమే పరిష్కారం.

మన నిరసనలు, ఆందోళనల రాజకీయాల్లో రైతుల సంక్షేమం, దేశ దీర్ఘకాల ప్రయోజనాలు ఎలా విస్మరణకు గురయ్యాయో పంజాబ్ రైతుల డిమాండ్లు తేటతెల్లం చేస్తున్నాయి. రుణ మాఫీ, డబ్ల్యుటిఓ నుంచి ఉపసంహరణ, విద్యుత్ చట్టం ఉపసంహరణ, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల రద్దు వగైరా డిమాండ్లు చూస్తే రైతుల నిజమైన సమస్యను నిష్ప్రయోజనకర రీతిలోకి మళ్లించారని స్పష్టమవుతుంది. రైతులకి ఎక్కువ ఆదాయాలతో మెరుగైన భవిష్యత్తును నిర్మించటానికి బదులు పిడివాదం, బూజుపట్టిన ఆలోచనాధోరణులతో ఇంకా అదే తరహా విఫల, తిరోగమన విధానాల కోసమే వాదిస్తున్నారన్నది సుస్పష్టం. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణ నేపథ్యంలో జాతీయ స్థాయి ప్రభుత్వం బియ్యం ఎగుమతిని నిషేధించింది. అలాగే చవకగా దిగుమతి అయ్యే పామ్ ఆయిల్‌పైన సుంకాలని తొలగించటంతో మన రైతులకి రక్షణ లేకుండా పోయింది. కిలో ఆయిల్‌పామ్ పళ్ళ ధర రూ.23 నుంచి ప్రస్తుతం రూ.12కి పడిపోయింది. పంజాబ్ రైతుల డిమాండ్లు అటువంటి అంశాల్ని కనీసం ప్రస్తావించకపోవటాన్ని చూస్తే, ఒక నిర్దిష్టమైన స్థానిక సమస్యను జాతీయ సమస్యగా మారుస్తున్నారని, నిరసనకారుల నాయకులు, వారి తరఫున మాట్లాడుతున్న వారికి నిజంగా రైతుల సంక్షేమానికి అవసరమైన ఒక సమగ్ర ఎజెండా లేదని స్పష్టమవుతుంది.

భారత్‌లో 45శాతం జనాభాని 18–20శాతం జీడీపీ వాటా గల వ్యవసాయం పోషించటం సాధ్యం కాదు. పంజాబ్ రైతుల డిమాండ్లలో చాలా వరకు అసంబద్ధమైనా, ఆ ఆందోళన ఒక మేలుకొలుపు కావాలి, గ్రామీణ, వ్యవసాయరంగ సంక్షోభాన్ని దృఢ నిశ్చయంతో పరిష్కరించాలి.

• డాక్టర్ జయప్రకాష్ నారాయణ్
ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు

## నేడు, రేపు భారత్ బచావో సదస్సు

భారత్ బచావో అఖిలభారత విద్యార్థుల సదస్సు ఫిబ్రవరి 25, 26 తేదీలలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతుంది. భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యాల ఆశయాల సాధనలో భాగంగా జాతీయ విద్యావిధానం రద్దు చేయాలి, ఫీజుల పెంపును వ్యతిరేకించాలి, ఉమ్మడి శాస్త్రీయ విద్యావిధానాన్ని అమలు చేయాలి, విశ్వవిద్యాలయాల్లో బోధన, బోధనేతర ఖాళీలను భర్తీ చేయాలి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వోద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి, విశ్వవిద్యాలయాల్లో లింగ, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలి, స్కాలర్‌షిప్, ఫెలోషిప్‌ల పునరుద్ధరణ, పెంపులను అమలు చేయాలి, క్యాంపస్ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే డిమాండ్లతో ఈ సదస్సు జరుగుతోంది. మనోరంజన్ మహంతి, హరగోపాల్, అన్వర్‌ఖాన్, జస్టిస్ కోల్సే పాటిల్, రాంపునియాని, లక్ష్మీనారాయణ, పద్మజా షా, అనితా రాంపాల్, మధుప్రసాద్, నిరంజన్ ఆరాధ్య, పిఎల్ విశ్వేశ్వర రావు, తిరుమలి ఇనుకొండ, దాసోజు లలిత, జెబి రాజు, విమలక్క, కె.శ్రీనివాస్, ఆకునూరి మురళి, పాశం యాదగిరి తదితరులు ప్రసంగిస్తారు.

– అఖిలభారత విశ్వవిద్యాలయాల విద్యార్థులు




రెండు జిల్లాల్లో టీడీపీ అభ్యర్థులు వీరే..

| నియోజకవర్గం | అభ్యర్థులు |
|---|---|
| విజయవాడ తూర్పు | గద్దె రామ్మోహన్ |
| విజయవాడ సెంట్రల్ | బొండా ఉమామహేశ్వరరావు |
| నందిగామ | తంగిరాల సౌమ్య |
| జగ్గయ్యపేట | శ్రీరాం రాజగోపాల్ తాతయ్య |
| తిరువూరు | కొలికపూడి శ్రీనివాస్ |
| మచిలీపట్నం | కొల్లు రవీంద్ర |
| పెడన | కాగిత కృష్ణప్రసాద్ |
| గుడివాడ | వెనిగండ్ల రాము |
| గన్నవరం | యార్లగడ్డ వెంకట్రావు |
| పామర్రు | వర్ల కుమార్ రాజా |


కొల్లు రవీంద్ర (మచిలీపట్నం)


వెనిగండ్ల రాము (గుడివాడ)


యార్లగడ్డ వెంకట్రావు (గన్నవరం)


వర్ల కుమార్ రాజా (పామర్రు)


కాగిత కృష్ణప్రసాద్ (పెడన)


తంగిరాల సౌమ్య (నందిగామ)




# తొలి పది

## రెండు జిల్లాల్లో పదిమంది టీడీపీ అభ్యర్థులు ఖరారు

ఉత్కంఠకు తెరపడింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసిన టీడీపీ-జనసేన అభ్యర్థుల జాబితా శనివారం విడుదలైంది. రెండు జిల్లాల్లో 14 నియోజకవర్గాల్లోని 10 స్థానాలకు టీడీపీ అభ్యర్థులు ఖరారయ్యారు. విధేయతకు పట్టం కడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులకే పదింట ఆరు స్థానాల్లో అధినేత చంద్రబాబు అవకాశం ఇవ్వగా, నాలుగింట కొత్తవారు బరిలో దిగుతున్నారు. ఇక ఇరు జిల్లాల్లోని జనసేన టికెట్లు, అభ్యర్థుల అంశంపై మాత్రం స్పష్టత రాలేదు. టీడీపీ అధినేత నిర్ణయంపై అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.


గద్దె రామ్మోహన్ (విజయవాడ తూర్పు)


బొండా ఉమామహేశ్వరరావు (విజయవాడ సెంట్రల్)


శ్రీరాం రాజగోపాల్ తాతయ్య (జగ్గయ్యపేట)

- పెనమలూరు, అవనిగడ్డ, పశ్చిమ, మైలవరం పెండింగ్
- పదింట ఆరుగురు పాత అభ్యర్థులకే అవకాశం
- నాలుగు స్థానాల్లో కొత్తవారు
- చంద్రబాబు తొలి జాబితాపై హర్షాతిరేకాలు
- జనసేన టికెట్లు, అభ్యర్థులపై రాని స్పష్టత
- రెండు జిల్లాల్లో రెండు సీట్లు కేటాయించే చాన్స్

అభ్యర్థుల బయోడేటాలు - 6లో..

(విజయవాడ/మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి) : సార్వత్రిక ఎన్నికల సమరానికి ప్రధాన పార్టీలు సమాయత్తమవుతున్నాయి. అధికార వైసీపీ ఇప్పటికే పలు విడతలుగా తన అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా టీడీపీ-జనసేన ఉమ్మడిగా పోటీచేసే తమ అభ్యర్థులను శనివారం ప్రకటించాయి. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థుల పేర్లు కూడా తొలి జాబితాలో ఉన్నాయి. మొత్తం 14 నియోజకవర్గాల్లో 10 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. ప్రస్తుతం ప్రకటించినవన్నీ టీడీపీ పోటీచేసే స్థానాలు కాగా, జనసేన అభ్యర్థులపై స్పష్టత రావాల్సి ఉంది. వైసీపీ ఏడు విడతలుగా 8 మంది అభ్యర్థులనే ప్రకటించగా, టీడీపీ-జనసేన ఒకేసారి 10 స్థానాలకు ప్రకటించడం విశేషం. ఎన్టీఆర్ జిల్లాలో మైలవరం, విజయవాడ పశ్చిమ, కృష్ణాజిల్లాలో పెనమలూరు, అవనిగడ్డకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ నాలుగు స్థానాల్లో రెండు జనసేనకు ఇస్తారని సమాచారం. పెనమలూరు, మైలవరం స్థానాల నుంచి బరిలోకి దిగేందుకు అభ్యర్థుల నడుమ పోటీ ఎక్కువగా ఉంది. మాజీ మంత్రి దేవినేని ఉమా, వైసీపీ నుంచి టీడీపీలో చేరనున్న వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్ ఈ రెండు స్థానాల కోసం రేసులో ఉన్నారు. కాగా, ప్రస్తుతం ప్రకటించిన జాబితా విషయంలో టీడీపీ-జనసేన శ్రేణులు ఆనందంగా ఉన్నాయి.


కొలికపూడి శ్రీనివాస్ (తిరువూరు)


కొలుసు పార్థసారథి (నూజివీడు)

### తిరువూరులో మార్పు

ప్రస్తుతం ప్రకటించిన 10 స్థానాల్లో ఒక్క తిరువూరులోనే ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న శావల దేవదత్ స్థానంలో కొలికపూడి శ్రీనివాసరావుకు టికెట్ లభించింది. అయితే, ఇక్కడ అభ్యర్థి మార్పుపై శావల దేవదత్‌తో ముందే పార్టీ పెద్దలు చర్చలు జరిపారు. దీంతో ఆయన నుంచి ఎలాంటి అసంతృప్తి వ్యక్తం కాలేదు. పార్టీ అధికారంలోకి వచ్చాక దేవదత్‌కు తగిన గుర్తింపు ఇస్తామని పెద్దలు అభయమిచ్చారు. దీంతో కొలికపూడి శ్రీనివాస్ అభ్యర్థిత్వాన్ని దత్ స్వాగతించారు. ఇక పెడన నియోజకవర్గం నుంచి టికెట్ ఆశించిన టీడీపీ నేత బూరగడ్డ వేదవ్యాస్ పార్టీ నిర్ణయంపై అసంతృప్తితో ఉన్నారు. తొలి జాబితాలో చోటు దక్కని అవనిగడ్డ నియోజకవర్గంలో పార్టీ శ్రేణులు కాస్త అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, వారందరికీ సర్దిచెబుతూ మండలి బుద్ధప్రసాద్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఇక పెనమలూరు సిట్టింగ్ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి నూజివీడు టికెట్ కేటాయించారు.



రాణిగారితోటలోని నాలుగు రోడ్ల సెంటర్‌లో టీడీపీ శ్రేణుల సంబరాలు

**ఆరుగురు పాత.. నలుగురు కొత్త..**

టీడీపీ-జనసేన తొలి జాబితాలో చోటు దక్కించుకున్న 10 మంది అభ్యర్థుల్లో ఆరుగురు 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున అవే స్థానాల నుంచి పోటీ చేసినవారే. తిరువూరు, పామర్రు, గన్నవరం, గుడివాడ కొత్తవారికి అవకాశం కల్పించారు. వీరిలో గన్నవరం నుంచి బరిలో ఉన్న యార్లగడ్డ వెంకట్రావు 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున అదే స్థానం నుంచి పోటీపడిన వారే. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం ముగ్గురే తొలిసారి పోటీ చేస్తున్నవారు.


రొయ్యూరు క్వారీలో బారులుగా నిలిచిన ఇసుక లారీలు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు

# అర్ధరాత్రి అడ్డగింపు

## రొయ్యూరులో ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్థులు

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 24 : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో అక్రమంగా తవ్వుతున్న ఇసుక తవ్వకాలను శుక్రవారం అర్ధరాత్రి గ్రామస్థులు అడ్డుకున్నారు. మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు ఆధ్వర్యంలో సుమారు 20 మంది అర్ధరాత్రి 11 గంటలకు రెండు ట్రాక్టర్లను తెచ్చి రహదారికి అడ్డుగా పెట్టి ఇసుక లారీలను నిలిపివేశారు. పట్టా భూములకు అనుమతి తీసుకుని, ప్రభుత్వ భూముల్లో - మిగతా 6లో

- రహదారికి ట్రాక్టర్ అడ్డుపెట్టి లారీల నిలిపివేత
- పలాయనం చిత్తగించిన నిర్వాహకులు, మంత్రి అనుచరులు

# వెలుగులోకి మరిన్ని వెకిలి చేష్టలు

**బయటకొస్తున్న స్పెషల్ డివిజన్ సూపరింటెండెంట్ బాధితులు**

## జలవనరుల శాఖలో చర్చనీయాంశంగా మారిన ఉద్యోగి లీలలు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : జలవనరుల శాఖ స్పెషల్ డివిజన్ సూపరింటెండెంట్ లీలలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఉద్యోగినులను టార్గెట్ చేసుకుని ఆయన చేసిన వెకిలిచేష్టలకు బాధితులు ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నారు. స్పెషల్ డివిజన్‌లో జరుగుతున్న ఈ లీలలపై 'వెకిలి చేష్టలు.. వెక్కిరింతలు..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం జలవనరుల శాఖలో ప్రకంపనలు సృష్టించింది. దీనిపై ఉన్నతాధికారులు సీరియస్‌గా ఉన్నారు. ఇంతకుముందు ఈ ఉద్యోగి కృష్ణా సెంట్రల్ డివిజన్‌లో పనిచేశాడు. అక్కడా మహిళా అటెండర్లు, గుమస్తాల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడని తెలిసింది. ఆయన ఆగడాలు శ్రుతిమించడంతో బాధితులు ఉద్యోగ సంఘ నేతలకు ఫిర్యాదు చేశారు. వారు.. ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. అయినా ఆ ఉద్యోగి పద్ధతి మార్చుకోలేదు.

### సెలవుల్లో మహిళా ఉద్యోగులకు విధులు

స్పెషల్ డివిజన్‌లో ఐదుగురు మహిళా అటెండర్లు ఉన్నారు. వారికి సెలవుల్లోనూ ఈ సూపరింటెండెంట్ కావాలని విధులు కేటాయించేవాడని సమాచారం. పండుగలు, రెండో శనివారం, ఆదివారాల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవులు ఉంటాయి. అత్యవసర పరిస్థితులు ఏర్పడతాయన్న ఉద్దేశంతో కిందిస్థాయి ఉద్యోగులకు డ్యూటీలు వేస్తారు. దీన్ని అవకాశంగా మార్చుకుని ఈ ఉద్యోగి మహిళా అటెండర్లతో సెలవు రోజుల్లో డ్యూటీలు చేయించేవాడు. ఒక్కోసారి ఒక్కొక్కరికి డ్యూటీలు వేసేవాడు. ఆరోజు ఆయన కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకపోయినా పని ఉన్నట్టు వచ్చి ఆఫీసులోనే ఉండేవాడు. కార్యాలయానికి రెండువైపులా తలుపులు ఉన్నప్పటికీ ఒకవైపు ఉన్న తలుపులు మాత్రమే తీసి ఉంచేవాడు. మహిళా ఉద్యోగులు ఒంటరిగా ఉండటంతో ద్వంద్వార్థాలతో మాట్లాడేవాడని కన్నీరుమున్నీరయ్యారు. ఈ వేధింపులు భరించలేక మహిళా ఉద్యోగులు ఇతర డివిజన్లకు బదిలీపై వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నారు. దీనికీ ఆయన అడ్డుకట్ట వేసేవాడు. కిందిస్థాయి ఉద్యోగులు లేకపోతే కార్యాలయం ఫైళ్లు అధికారుల వద్దకు వెళ్లవని, మిగిలిన ఉద్యోగులకు ఇబ్బంది అవుతుందని ఉన్నతాధికారులకు చెప్పి బదిలీలకు బ్రేక్‌లు వేయించేవాడు. ఓ మహిళా ఉద్యోగిని వేధించడంతో ఆమె తండ్రి కార్యాలయంలోనే ఆ ఉద్యోగి చెంపచెళ్లుమనిపించిన విషయం తెలిసిందే. ఇలాంటి వారిని బయట ప్రాంగణంలో చెంప చెళ్లుమనిపించాలని మహిళా ఉద్యోగులు వ్యాఖ్యానించారు.

**నేడు గ్రూప్-2 పరీక్ష**
- 54 పరీక్షా కేంద్రాలు, 24,373 మంది అభ్యర్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ - 6లో..

అధికార వైసీపీ నాయకులు మహిళా పొదుపు సంఘాలనూ వదలట్లేదు. పేద రోగులకు లాభాపేక్ష లేకుండా ఖరీదైన మందులు ఇవ్వాలన్న లక్ష్యంతో పాత, కొత్త ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళా పొదుపు సంఘాలు నిర్వహిస్తున్న జనరికల్ మెడికల్ దుకాణాలను మూసివేయించే కుట్ర పన్నారు. అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో ఇప్పుడు ఆ షాపులు మూసివేయించి ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు ఆసుపత్రి అధికారులు పావులు కదుపుతున్నారు.




# పొదుపు మహిళల పొట్టకొడుతున్నారు

## ప్రభుత్వ ఆసుపత్రుల్లోని మెడికల్ షాపులపై వైసీపీ నేత కన్ను

- పొదుపు సంఘాల ఆధ్వర్యంలో షాపుల నిర్వహణ
- వారిని సాగనంపి.. షాపులను దక్కించుకునే ప్రయత్నం
- నిబంధనలను తుంగలో తొక్కి టెండర్ నోటిఫికేషన్
- వైసీపీ నాయకుడికి షాపులు కట్టబెట్టే కుట్ర

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా అమల్లో ఉన్న విధానానికి అనుగుణంగా విజయవాడ పాత, కొత్త ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళా పొదుపు సంఘాలు జనరిక్ మందుల షాపులను నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసే మందుల్లో అన్నీ అందుబాటులో ఉండవు. ఈ కారణంగా గతంలో ఆసుపత్రికి వచ్చే రోగులు వాటిని బయట మందుల షాపుల్లో కొనుగోలు చేసుకోవాల్సి వచ్చేది. ఇది పేద రోగులకు ఆర్థికంగా భారంగా పరిణమించేది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఆసుపత్రిలోనే జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ జనరిక్ మందుల షాపులు ఏర్పాటయ్యాయి. వీటిని ఏర్పాటు చేసుకునే అవకాశాన్ని మహిళా పొదుపు సంఘాలకు అప్పగించారు. ఇక్కడ మందులపై 60 నుంచి 80 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారు.

### పాత, కొత్త ఆసుపత్రుల్లోని షాపులపై దృష్టి

విజయవాడలోనూ పాత, కొత్త ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రణీత మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలోనే జనరిక్ మందుల షాపులు నిర్వహిస్తున్నారు. 2019, ఆగస్టులో వీరికి స్థలం కేటాయించగా, అందులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో పొదుపు సంఘం మహిళలు దుకాణం నిర్మించుకున్నారు. పదిమంది సభ్యులు కలిసి ఈ దుకాణాన్ని నిర్వహించుకుంటున్నారు. రెంటల్ అడ్వాన్సుగా రెండు షాపులకు రూ.90 వేల చొప్పున చెల్లించారు. కరోనా సమయమైన 2020, మార్చి నుంచి 9 నెలలు, 2021, ఏప్రిల్ నుంచి 6 నెలలు మందుల దుకాణం నడవలేదు. అయినా కూడా ప్రభుత్వానికి అద్దె చెల్లిస్తూ వచ్చారు. ఇటీవల ఈ దుకాణాలపై నగరానికి చెందిన ఓ వైసీపీ నాయకుడి కన్ను పడింది. దీంతో ఎలాగైనా ప్రస్తుతం ఉన్న మహిళలను ఖాళీ చేయించి మెడికల్ షాపులను కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. బలవంతంగా షాపులను ఖాళీ చేయించేలా ఆసుపత్రి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అందులో భాగంగా ఎక్కడా లేని విధంగా పాత, కొత్త ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెడికల్ షాపులను టెండర్ పద్ధతిపై కేటాయించేందుకు ఇటీవల నోటిఫికేషన్ ఇచ్చారు. అంతా పారదర్శకంగా నిర్వహిస్తున్నామన్నట్టు చూపేందుకు ఈ టెండర్ పద్ధతిని తెరపైకి తెచ్చారు. బెదిరింపులతో టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా చేసి అతి తక్కువ ధరకు మెడికల్ షాపులను దక్కించుకోవాలన్న ఆలోచన చేశాడు సదరు వైసీపీ నాయకుడు.

### ప్రైవేటుకు అప్పగించే యత్నం

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ జనరిక్ మందుల షాపులను మహిళా పొదుపు సంఘాలే నిర్వహిస్తున్నాయి. గుంటూరు, ఏలూరు, రాజమండ్రి.. ఇలా ఎక్కడైనా నిర్వహణ మహిళా పొదుపు సంఘాలదే. విజయవాడలో మాత్రం అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. టెండర్ ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు షాపులను అప్పగించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వ ఆసుపత్రిలో మందులను విక్రయించడం ప్రారంభిస్తే ప్రభుత్వం ఈ షాపులను మొదలుపెట్టిన ఉద్దేశమే దెబ్బతినే ప్రమాదం ఉంది. తక్కువ ధరకు నాణ్యమైన మందులను పేద రోగులకు అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడిచేలా ఆసుపత్రి అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పేద రోగులపై భారం మోపేలా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారంటున్నారు.

# కుమారుడు సహా తల్లి ఆత్మహత్య

**కుటుంబ కలహాల కారణంగానే..**

వత్సవాయి, ఫిబ్రవరి 24 : కుటుంబ కలహాలతో ఒక మహిళ కుమారుడితో కలిసి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వత్సవాయి మండలం భీమవరం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన ఫాతిమా (30)కు సూర్యాపేట జిల్లా రామాపురం గ్రామానికి చెందిన నాగుల్‌మీరాతో వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్యాభర్తల మధ్య వివాదం కారణంగా ఫాతిమా పుట్టింట్లోనే ఉంటోంది. ఇటీవల పెద్దలు రాజీ చేసి ఫాతిమాను కాపురానికి పంపాలనుకున్నారు. ఈ నేపథ్యంలో శనివారం చిన్న కుమారుడిని (3) తీసుకుని బయటకు వెళ్లిన ఫాతిమా ఎంతకీ ఇంటికి రాకపోవటంతో తల్లిదండ్రులు గ్రామంలో విచారణ చేశారు. వ్యవసాయ బావిలో వారిద్దరు శవాలై కనిపించటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. వత్సవాయి ఎస్సై అభిమన్యు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తల్లీకొడుకు మృతదేహాలు

**చూసిన కనులదే భాగ్యము**


మాఘపౌర్ణమి సందర్భంగా గంగా సమేత దుర్గామల్లేశ్వరుల గిరిప్రదక్షిణ శనివారం ఘనంగా జరిగింది. ఇంద్రకీలాద్రి టోల్‌గేట్ వద్ద బయల్దేరిన ఉత్సవం కుమ్మరిపాలెం, సొరంగం సెంటర్, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రి చేరుకుంది.

## టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అభ్యర్థుల వివరాలు

**నియోజకవర్గం:** విజయవాడ సెంట్రల్
**అభ్యర్థి పేరు:** బొండా ఉమామహేశ్వరరావు
**విద్యాభ్యాసం:** అండర్ గ్రాడ్యుయేషన్
**కులం:** కాపు
**వయస్సు:** 58
**భార్య పేరు:** బొండా సుజాత
**పిల్లలు:** బొండా సిద్ధార్థ(అమెరికా), జశ్వంతి (కోడలు), బొండారవితేజ(లాయర్)

**రాజకీయ నేపథ్యం:** టీడీపీలో 2013 నుంచి పనిచేస్తున్నారు. 2014లో విజయ వాడ సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా వైసీపీ అభ్యర్థి పూనూరు గౌతమ్‌రెడ్డిపై 25 వేలపై చిలుకు ఓట్లతో గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ తరపున పోటీ చేసి వైసీపీ అభ్యర్థి మల్లాది విష్ణు చేతిలో 25 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

**నియోజకవర్గం:** విజయవాడ తూర్పు
**అభ్యర్థి పేరు:** గద్దె రామ్మోహన్
**విద్యాభ్యాసం:** ఎంఎస్సీ మైక్రోబయాలజీ
**కులం:** కమ్మ
**వయస్సు:** 64
**భార్య పేరు:** గద్దె అనురాధ
**పిల్లలు:** ఇద్దరు కుమారులు

**రాజకీయ నేపథ్యం:** గన్నవరం నియోజకవర్గం నుంచి 1994లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందారు. తర్వాత టీడీపీలో చేరి 1999లో విజయవాడ ఎంపీగా గెలుపొందారు. 2004లో కంకిపాడు నుంచి పోటీచేసి ఓడిపోయారు. 2009లో విజయవాడ తూర్పు నుంచి ఓడిపోయారు. 2014, 2019 ఎన్నికల్లో తూర్పు నుంచి పోటీ చేసి వరుస విజయాలు సాధించారు.

**నియోజకవర్గం:** తిరువూరు
**అభ్యర్థి పేరు:** కొలికపూడి శ్రీనివాసరావు
**విద్యాభ్యాసం:** డబుల్ ఎం.ఎ, కేఎస్‌రావు ఐఎఎస్ అకాడమీ నిర్వాహకుడు
**కులం:** ఎస్సీ(మాదిగ)
**వయస్సు:** 56
**భార్య పేరు:** మాధవి
**పిల్లలు:** కుమార్తె(సాయిఅక్షర)

**రాజకీయ నేపథ్యం:** స్వస్థలం గుంటూరు జిల్లా తాడికొండ. అమరావతి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. తిరువూరు నియోజకవర్గంలో కిడ్నీ బాధితులకు తాగునీటి కోసం పాదయాత్ర చేయడంతో పాటు పలు ప్రజా సమస్యలపై ఉద్యమిస్తుంటారు.

**నియోజకవర్గం:** నందిగామ
**అభ్యర్థి పేరు:** తంగిరాల సౌమ్య
**విద్యాభ్యాసం:** బీటెక్ చేశారు. బెంగళూరులో కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేశారు.
**కులం:** ఎస్సీ(మాదిగ)
**వయస్సు:** 43
**భర్త పేరు:** మోహనరావు
**పిల్లలు:** ఇద్దరు(కుమార్తె, కుమారుడు)

**రాజకీయ నేపథ్యం:** తండ్రి తంగిరాల ప్రభాకరరావు నందిగామ శాసనసభ్యుడిగా 2009, 2014లో గెలుపొందారు. ఆయన అకాల మరణంతో రాజకీయాలలోకి వచ్చిన సౌమ్య ఉప ఎన్నికలో భారీ మెజారిటీతో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో ఆమె ఓటమి చెందారు.

**నియోజకవర్గం:** జగ్గయ్యపేట
**అభ్యర్థి పేరు:** శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)
**విద్యాభ్యాసం:** డిగ్రీ
**కులం:** వైశ్య
**వయస్సు:** 55
**భార్య పేరు:** శ్రీదేవి
**పిల్లలు:** ఇద్దరు(కుమార్తె, కుమారుడు) డాక్టర్ కృష్ణ మైథిలి, కృష్ణ పవన్

**రాజకీయ నేపథ్యం:** కళాశాల నుంచే విద్యార్థి సంఘ రాజకీయాల్లో చురుగ్గా ఉండేవారు. కాంగ్రెస్ జగ్గయ్యపేట పట్టణ అధ్యక్షుడిగా 20 ఏళ్ల పైగా పనిచేశారు. జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్‌గా పనిచేశారు. ఆ తర్వాత టీడీపీలో చేరారు. 2009, 2014లో వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2019లో ఓడిపోయారు.

## కృష్ణా జిల్లా అభ్యర్థుల వివరాలు

**నియోజకవర్గం:** పెడన
**అభ్యర్థి పేరు:** కాగిత కృష్ణ ప్రసాద్
**విద్యాభ్యాసం:** బీటెక్(కొంతకాలం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు)
**కులం:** గౌడ
**వయస్సు:** 42
**భార్య పేరు:** కాగిత శిరీష
**పిల్లలు:** కుమార్తె, కుమారుడు(కాగిత లలిత వెంకటచంద్ర)

**రాజకీయ నేపథ్యం:** తండ్రి కాగిత వెంకట్రావు టీడీపీ ఆవిర్భావం నుంచి తుదిశ్వాస విడిచే వరకు పార్టీలో ఉండి అనేక పదవులు చేపట్టారు. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన కృష్ణ ప్రసాద్ 2019లో పోటీ చేసి ఓడిపోయారు.

**నియోజకవర్గం:** పామర్రు
**అభ్యర్థి పేరు:** వర్ల కుమార్ రాజా
**విద్యాభ్యాసం:** బీటెక్
**కులం:** ఎస్సీ(మాదిగ)
**వయస్సు:** 46
**భార్య పేరు:** విశ్రమ
**పిల్లలు:** కుమార్తె, కుమారుడు(అలాన జోయల్, రోయస్ యుగంధర్)

**రాజకీయ నేపథ్యం:** తండ్రి టీడీపీ సీనియర్ నాయకుడు వర్ల రామయ్య. ఆయన రాజకీయ వారసుడిగా 2008లో టీడీపీలో చేరడం ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. అప్పటి నుంచి పార్టీకి సేవలందిస్తున్నారు.

**నియోజకవర్గం:** మచిలీపట్నం
**అభ్యర్థి పేరు:** కొల్లు రవీంద్ర
**విద్యాభ్యాసం:** బీఏ, ఎల్ఎల్‌బీ
**కులం:** అగ్నికుల క్షత్రియ
**వయస్సు:** 51
**భార్య పేరు:** కొల్లు నీలిమ
**పిల్లలు:** ఇద్దరుకుమారులు (పునీత్ చంద్ర(బీటెక్), కొల్లు నవీన్)

**రాజకీయ నేపథ్యం:** ప్రముఖ బీసీ నాయకుడు దివంగత నడకుదిటి నరసింహారావుకు రవీంద్ర అల్లుడు. ఆయన ప్రోద్బలంతో రాజకీయాల్లోకి వచ్చిన రవీంద్ర టీడీపీలో డివిజన్ స్థాయి నాయకుడిగా తన ప్రస్థానం ప్రారంభించి అంచెలంచెలుగా రాష్ట్ర నాయకుడిగా ఎదిగారు. 2009లో తొలిసారి మచిలీపట్నం ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2014లో ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేశారు. 2019లో ఓటమిపాలయ్యారు.

**నియోజకవర్గం:** గన్నవరం
**అభ్యర్థి పేరు:** యార్లగడ్డ వెంకట్రావు
**విద్యాభ్యాసం:** బీఎస్సీ(కంప్యూటర్స్), అమెరికాలో ఫస్ట్ ఆబ్జెక్ట్ పేరుతో సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నారు.
**కులం:** కమ్మ
**కులం:** 49
**భార్య పేరు:** జ్ఞానేశ్వరి
**పిల్లలు:** కుమార్తె, కుమారుడు(సహస్ర, సహర్షిరామ్)

**రాజకీయ నేపథ్యం:** రాజకీయాలపై ఆసక్తితో 2019లో గన్నవరం వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 2 సంవత్సరాలు బాధ్యతలు నిర్వహించారు. ఆ సమయంలో వినూత్న పథకాలతో రైతులకు ఉపయోగపడే విధంగా సేవలందించారు.

**నియోజకవర్గం:** గుడివాడ
**అభ్యర్థి పేరు:** వెనిగండ్ల రాము
**విద్యాభ్యాసం:** బీటెక్(ఈసీఈ), అమెరికాలో ఎపిసెన్స్ సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ సంస్థ నిర్వాహకులు
**కులం:** కమ్మ
**వయస్సు:** 53
**భార్య పేరు:** సుఖద(ఎస్సీ-మాల)
**పిల్లలు:** ఇద్దరు కుమార్తెలు(ప్రణతి, ప్రత్యూష)

**రాజకీయ నేపథ్యం:** రాజకీయాలపై ఆసక్తితో సొంత ఊరిలో గత కొన్నేళ్లుగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు.

# హంసలదీవికి పోటెత్తిన భక్తులు

**సింధు స్నానాలు ఆచరించిన 40 వేల మంది**

**కోడూరు, ఫిబ్రవరి 24:** కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తు లతో హంసలదీవి సముద్రతీరం కిటకిటలాడింది. మాఘ పౌర్ణమి సందర్భంగా సింధు స్నానాలు ఆచరించటానికి 40వేల మంది భక్తులు విచ్చేశారు. సముద్ర తీరంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పవిత్ర సంగమ ప్రదేశంలో జల్లుస్నానాలు ఆచరించారు. కృష్ణవేణమ్మ పాదాల వద్ద, బాల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీ ధర్ పర్యవేక్షణలో అవనిగడ్డ సీఐ త్రినాథ్, ఎస్ఐ శిరీష ల ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచ్ కొక్కిలిగడ్డ భిక్షాలు, పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. జనసేన నాయకుడు మాదివాడ వెంకటకృష్ణ 7 వేల మందికి పులిహోర పంపిణీ చేశారు. జనసేన నాయకుడు చిలకలపూడి పాపారావు మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు.


సముద్రతీరంలో గౌరీ వ్రతాలు చేస్తున్న భక్తులు

# సంప్రదాయబద్ధంగా జలబిందెల మహోత్సవం

**పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 24:** పెనుగంచిప్రోలు తిరునాళ్లలో రెండో రోజు శనివారం అమ్మవారికి జలబిందెల మహోత్సవాన్ని నిర్వహించారు. దేవస్థానంలో పూజలు నిర్వహించిన ఐదు కుండలను మునేటి వద్దకు ఊరేగింపుగా ప్రధానార్చకుడు మర్రిబోయిన గోపి తీసుకెళ్లి, వాటిని కొత్త నీటితో నింపారు. సంప్రదాయం ప్రకారం కర్ల, సూరంపల్లి, వడ్లముడి, నల్లపునేని, గజ్జి వంశీకులు రామకృష్ణ, ఫణికృష్ణ, భాస్కరరావు, నగేష్, శివకృష్ణలు బిందెలను తలపై ఉంచుకుని దేవస్థానం వరకు మోసుకొచ్చారు. గ్రామస్థులు జలబిందెలకు స్వాగతం పలికి వార పోసి అనుసరించారు. పెనుగంచిప్రోలు ఎస్సై రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లోకి జలబిందెలను తీసుకువెళ్లారు. తెచ్చిన జలబిందెలను దేవస్థానంలోని అంకమ్మ తల్లి ఉపాలయంలో ఉంచారు.


జలబిందెలు తీసుకుని వస్తున్న భక్తులు

### తిరునాళ్లకొచ్చిన వృద్ధురాలు
## గుండెపోటుతో మృతి

**పెనుగంచిప్రోలు:** తిరుపతమ్మ కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన గుంటూరుజిల్లా తెనాలికి చెందిన వృద్ధురాలు దేశ ధనలక్ష్మి (61) గుండెపోటుతో మృతి చెందింది. బంధువులతో కలిసి వచ్చిన ఆమె శనివారం గుంటూరు వెళ్లేందుకు పోలీస్ స్టేషన్ సెంటర్‌లో బస్సు ఎక్కేందుకు ఆగినప్పుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే మృతి చెందినట్టు సిబ్బంది చెప్పారు. ఆమె భౌతికకాయాన్ని బంధువులు తెనాలికి తీసుకెళ్లారు.


కుప్పకూలిన ధనలక్ష్మి

### నిష్పక్షపాతంగా ఎన్నికల
## విధులు నిర్వహించండి

- ఎన్నికల అధికారుల శిక్షణలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

**వన్‌టౌన్, ఫిబ్రవరి 24:** నిబద్ధతతో పనిచేయాలని, నిష్పక్షపాతంగా అభ్యర్థుల ఎన్నికల వ్యయనిర్వహణపై నిఘా ఉంచాలని అధికారులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు సూచించారు. తుమ్మలపల్లివారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఎన్నికల వ్యయనిర్వహణపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు, ఫ్లయింగ్‌స్క్వాడ్, స్టాటిక్, వీడియో సర్వైలెన్స్ వీడియో వ్యూయింగ్, అకౌంటింగ్, మీడియా సర్టిఫికేషన్, మీడియా మానిటరింగ్ కమిటీ, ఎన్నికల పర్యవేక్షణ కమిటీల అధికారులు, సిబ్బందికి శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విధివిధానాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కొత్తగా ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టంను ప్రవేశపెట్టారని తెలిపారు. దీనిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అవగాహన కల్పించుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ సంపత్‌కుమార్, విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీసీపీ కృష్ణకాంత్ పటేల్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, శిక్షకుడు చక్రపాణి, ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, పి.సాయిబాబు, కె.మాధవి, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

### ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్‌గా బత్తిన రామకృష్ణ

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా చైర్మన్‌గా బత్తిన రామకృష్ణ ఎన్నికయ్యారు. ప్రస్తుతం జిల్లా చైర్మన్‌గా ఉన్న డి.ఈశ్వర్ రాష్ట్ర కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. దీంతో ఆ పదవికి రామకృష్ణ ఎన్నికయ్యారు. శనివారం ఏపీ రెవెన్యూభవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి ఎన్టీఆర్ జిల్లా ఖాళీ పదవుల భర్తీ కార్యక్రమాన్ని నిర్వహించింది. వైస్ చైర్మన్‌గా ఉన్న కె.రమాదేవి పదోన్నతిపై వేరే జిల్లాకు బదిలీపై వెళ్లారు. దీంతో మరో రెండు వైస్ చైర్మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. చైర్మన్‌తో పాటు మూడు వైస్ చైర్మన్ పోస్టులను కో-ఆప్షన్ ద్వారా ఎన్నుకోవటానికి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. కార్యవర్గ సమావేశంలో ఖాళీ పదవులకు ఎన్నిక ఏకగ్రీవమైంది. చైర్మన్‌గా బత్తిన రామకృష్ణ, వైస్ చైర్మన్లుగా సీహెచ్ కోటేశ్వరి, ఎం.శ్యాంసురేంద్ర, టి.రాజేష్ ఎన్నియ్యారు. ఎన్నికలనంతరం నిర్వహించిన సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా విచ్చేశారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఏపీ జేఏసీ ఎన్టీఆర్ జిల్లా అసోసియేట్ చైర్మన్ డి.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నా పేరు ప్రకటించకపోవడం మహదానందం

- సామాజిక మాధ్యమాల్లో మండలి బుద్ధప్రసాద్ ఆవేదనతో పోస్టు
- తొలి జాబితాలో అవనిగడ్డ సీటు ప్రకటించకపోవటంపై కినుక

**అవనిగడ్డ, ఫిబ్రవరి 24:** టీడీపీ - జనసేన కూటమి తొలి జాబితాలో మచిలీపట్నం పార్లమెంట్‌లో అవనిగడ్డ సీటును ప్రకటించకపోవడంపై మండలి బుద్ధప్రసాద్ ఒకింత అసహనం వ్యక్తంచేశారు. 2019లో టీడీపీ ఓటమి చెందిన నాటి నుంచి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాటం చేసిన బుద్ధప్రసాద్ పేరు తొలి జాబితాలో ప్రకటిస్తారని అందరూ భావించారు. కానీ ఆయన పేరు లేకపోవటంతో కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ పార్టీ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దీనిపై బుద్ధప్రసాద్ స్పందించారు. "నా పేరు ప్రకటించనందుకు మహదానందంగా ఉంది. ప్రజల నుంచి వచ్చిన పక్షిలాగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు పొందినట్లు ఉంది. నేను పదవుల కోసం పుట్టలేదు. పదవులు లభించనప్పుడు ప్రజలకు మేలు చేయటానికి, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రయత్నించానే తప్ప పదవులను అడ్డుపెట్టుకుని దోచుకోలేదు, దాచుకోలేదు. రాజకీయాలకు డబ్బు ప్రధానమైంది. ఓటరును కొనుగోలుగా రాజకీయ పక్షాలు భావిస్తున్న ఈ తరుణంలో ధనవంతుల కోసం అన్వేషణలు జరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో నాబోటి వారు ఎన్నికల్లో నిలబడాలని భావించటం సమంజసం కాదు. పరిస్థితులను కార్యకర్తలు, ప్రజలు అర్థం చేసుకోవాలి." అని పార్టీ సోషల్ మీడియా గ్రూపుల్లోనూ, తన వ్యక్తిగత ఫేస్ బుక్ అకౌంట్‌లోనూ ఆయన ఆవేదనతో పోస్టు చేశారు. ఈ పోస్టు నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. అవనిగడ్డ సీటును టీడీపీకి ఇస్తారా? లేక జనసేన పార్టీకి కేటాయించారా? అన్న విషయం అర్థం కాక కార్యకర్తలు, రాజకీయ వర్గాలు అయోమయంలో ఉన్నాయి.

# దేవదత్‌ను కలిసిన కొలికపూడి



**తిరువూరు, ఫిబ్రవరి 24:** ప్రస్తుత నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్‌ను టీడీపీ తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నియోజకవర్గ కార్యాలయంలో ఉన్న తనను కలిసేందుకు వచ్చిన కొలికపూడిని దేవదత్ సాదరరంగా ఆహ్వానించారు. ఇప్పటి వరకు పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించానని, భవిష్యత్‌లో పార్టీకి అవసరమైన సేవలు అందిస్తానని అన్నారు. కొలికపూడిని అభినందించారు.

# పెడనలో గెలుపే లక్ష్యం

**టికెట్ ఇచ్చినందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్‌కు కృతజ్ఞతలు: కాగిత**

**బంటుమిల్లి, ఫిబ్రవరి 24:** టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తల సహకారంతో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని టీడీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. నిరంతరం ప్రజలలో ఉంటూ అభివృద్ధే లక్ష్యంగా, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. శనివారం నాగేశ్వరరావుపేటలోని తన ఇంటివద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించినందుకు చంద్రబాబు, పవన్, లోకేశ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ పాలనలో పెడన నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేదన్నారు.




శ్రీకాకుళంలో ఇసుక డంపింగ్ చేస్తున్న ప్రాంతంలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నేతలు, కొటికలపూడిలో దేవినేని ఉమా, జనసేన నేతలు, తోట్లవల్లూరులో ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు

# నిరసన వెల్లువ

## అనధికార ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా టీడీపీ-జనసేన ఆందోళన

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 24:** రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతల కనుసన్నల్లో 500కు పైగా రీచ్‌ల్లో ఈసీలు లేకుండా అనధికారికంగా ఇసుక తవ్వకాలు చేస్తూ రోజుకు 2వేల టన్నుల ఇసుకను తవ్వితీసి టన్ను రూ.475 చొప్పున విక్రయిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి వద్ద కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాల ప్రాంతంలో టీడీపీ-జనసేన నేతలతో కలిసి శనివారం ఉమా నిరసన తెలిపారు. ఇసుక దందాలో ఎన్టీఆర్ జిల్లా నుంచి తాడేపల్లి ప్యాలెస్‌కు రూ.23 కోట్లు కప్పం చెల్లించిన ఈ ఎమ్మెల్యేలను, మంత్రిని తరిమి కొట్టాలన్నారు. గూగుల్ ఎర్త్‌లో 2021 నుంచి అందుబాటులో ఉన్న శాటిలైట్ చిత్రాలను విశ్లేషిస్తే విజయవాడ గనుల శాఖ ఏడీ జారీ చేసిన లీజు ప్రాంతానికి బయట ఇసుక తవ్వుతున్నట్లు స్పష్టంగా కనిపించిందన్నారు. డిసెంబరు నుంచి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో జీసీ కేసీ ప్రాజెక్ట్ సంస్థ భారీ యంత్రాలతో ఇసుక తవ్వుతోందని దీనికి ఎటువంటి అనుమతులు లేవన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత జిల్లా చిత్తూరులో అక్రమ ఇసుక రవాణాపై రూ.18 కోట్ల జరిమానా విధించిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జగన్ రెడ్డి ఇసుక దోపిడీకి 130 మంది భవన నిర్మాణ కార్మికులు బలయ్యారన్నారు. ఇసుకలో దోచుకున్న డబ్బుతో ఎన్నికల్లో గెలవాలని జగన్ రెడ్డి కుట్రలు చేస్తున్నాడన్నారు. జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్ (రాజ), పల్లె శ్రీనివాసరావు, కోలకాని వెంకట్రావ్, మల్లీడు మంగేశ్వరరావు, రెంటపల్లి వెంకటేశ్వరరావు, యడ్లూరి పూర్ణచంద్రరావు పాల్గొన్నారు.

### ఇసుక, బుసక తవ్వకాలు నిలుపుదల చేయాలి

**ఘంటసాల:** శ్రీకాకుళంలో అనధికార ఇసుక, బుసక తవ్వకాలను నిలుపుదల చేయాలంటూ టీడీపీ, జనసేన పార్టీల నేతలు శనివారం నిరసన తెలిపారు. కరకట్ట వద్ద టీడీపీ కార్యాలయం నుంచి ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని ఇసుక అనధికార తవ్వకాలు నిలుపుదల చేయాలంటూ సమీపంలోని ఇసుక డంపింగ్ యార్డు వద్దకు వెళ్లి నిరసన తెలిపారు. ఇసుక తవ్వకాలపై గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను, సీఆర్‌జడ్ నిబంధనలను తుంగలో తొక్కారని జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు ఆరోపించారు. యథేచ్ఛగా ఇసుక, బుసక తవ్వకాలు చేస్తున్నా అధికార యంత్రాంగం అధికారపార్టీకి తొత్తుగా వ్యవహరిస్తోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరు వెంకటేశ్వరరావు విమర్శించారు. శ్రీకాకుళంలో జరిపిన అనధికార తవ్వకాల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు వాటా ఎంతో వెల్లడించాలని ఆయన డిమాండ్‌చేశారు. తవ్వకాలను నిలుపుదల చేయకపోతే ఇరుపార్టీలు ఉమ్మడిగా కార్యాచరణ ప్రకటిస్తాయని హెచ్చరించారు.



గనిఆత్కూరులో లారీలను అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

### 20 లారీలు పోలీసులకు అప్పగింత

**కంచికచర్ల:** అనుమతులు లేకుండా కృష్ణానది రీచ్‌ల నుంచి ఇసుక తవ్వి, హైదరాబాద్ తరలిస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపించారు. గనిఆత్కూరు, చెవిటికల్లు, మున్నలూరు రీచ్‌ల వద్ద టీడీపీ శ్రేణులు శుక్రవారం రాత్రి ఆందోళనకు దిగాయి. రీచ్‌ల నుంచి బయటకు వస్తున్న ఇసుక లారీలను అడ్డగించాయి. మూడు రీచ్‌ల వద్ద 20కి పైగా ఇసుక లారీలను అడ్డగించి, పోలీసులకు అప్పగించాయి. కలెక్టర్ తక్షణమే స్పందించాలని కోరారు. గనిఆత్కూరులో ఉపసర్పంచ్ మూరకొండ ఏడుకొండలు, ఎంపీటీసీ సభ్యుడు వెంపరాల వెంకటేశ్వరరావు, గుదే నరేష్, షేక్ సైదా ఆందోళనలో పాల్గొన్నారు. వేబిల్లులు సక్రమంగా ఉన్నాయని పదికి పైగా లారీలను పోలీసులు విడిచిపెట్టారు. అధిక లోడ్ పేరుతో కేసులు నమోదు చేసి, ఎనిమిది లారీలను మార్కెట్‌యార్డుకు తరలించారు.

(ఐదో పేజీ తరువాయి)

### అర్ధరాత్రి అడ్డగింపు

ఇసుక కొల్లగొడుతున్నారని, తాము ట్రాక్టర్లను తీసేది లేదని నినాదాలు చేశారు. దీంతో నిర్వాహకులు, మంత్రి అనుచరులు ఏమీ చేయలేక క్వారీ నుంచి కరకట్టపైకి చేరుకున్నారు. ప్రభుత్వం తమకు క్వారీ ఇచ్చిందని, అన్నిరకాల అనుమతులు తెచ్చుకున్నామని చెప్పిన నిర్వాహకులు ఆ తర్వాత పలాయనం చిత్తగించారు. శుక్రవారం అర్ధరాత్రి 11 నుంచి శనివారం మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఆందోళన చేసినా నిర్వాహకులు అడుగు పెట్టలేదు. 12 గంటల పాటు ఆకలిదప్పులతో అలమటిస్తున్నామని లారీడ్రైవర్లు వేడుకోవటంతో మధ్యాహ్నం 12.30 గంటలకు ఆందోళన విరమించారు. మళ్లీ క్వారీలో తవ్వకాలు జరగకుండా సాయంత్రం వరకు అడ్డుకున్నారు.

### అనుమతి పెట్టింది ఒకచోట.. తవ్వేది ఇంకోచోట..

అనుమతి వచ్చిందని తమకు ఓ పత్రం ఇచ్చారని, అందులో ప్రైవేట్ పట్టా భూమి 2.75 ఎకరాల్లో ఇసుక తవ్వకానికి అనుమతి పెట్టి పెద్దపేటిపాయలోని ప్రభుత్వ భూముల్లో భారీగా తవ్వుతున్నారని మోర్ల రాంబాబు, లుక్కా నాగబాబు పేర్కొన్నారు. రొయ్యూరు రహదారిని బాగుచేయటంతో పాటు కార్మికులకు ఇసుక లోడింగ్ పని కల్పించి ఉపాధి చూపాలని డిమాండ్ చేశారు.

### రొయ్యూరులో అక్రమ క్వారీ..మంత్రి అనుచరుల మరో దోపిడీ

మంత్రి జోగి రమేశ్ అనుచరులు రొయ్యూరులో శనివారం ఒక ప్రైవేట్ క్వారీని అక్రమంగా తెరిచారు. రైతుల పట్టా భూముల్లో గ్రావెల్‌తో దారి నిర్మించి ఇసుక తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే, పాత క్వారీ వద్ద శనివారం గ్రామస్థులు ఆందోళన చేపట్టడంతో దీనిని కూడా తాత్కాలికంగా ఆపారు. కోలవెన్నుకు చెందిన ఓ వ్యక్తితో ఈ ప్రైవేట్ క్వారీకి అనుమతి పెట్టించి, ఇంకా అనుమతి రాకుండానే క్వారీని తెరిచేశారు. దీనిపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారి వివరణ ఇస్తూ రొయ్యూరులో పట్టా భూముల్లో ఇసుక తవ్వకానికి కలెక్టర్‌కు దరఖాస్తు చేశారని, ఇంకా ఎలాంటి అనుమతి రాలేదన్నారు.

## నేడే గ్రూప్-2 పరీక్ష

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ):** ఏపీపీఎస్సీ గ్రూప్-2 స్క్రీనింగ్ పరీక్షలు ఆదివారం ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 54 కేంద్రాల్లో నిర్వహించనున్నారు. పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సకల ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 24,373 మంది అభ్యర్థులు పరీక్షలను రాయనున్నారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అన్ని పరీక్షా కేంద్రాల దగ్గర 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షలకు వచ్చే అభ్యర్థులు ఉదయం 9.30 గంటల నుంచి 10 గంటల మధ్య అభ్యర్థులు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. మొబైల్‌ఫోన్, కాలిక్యులేటర్, ట్యాబ్, ఐపాడ్, బ్లూటూత్, పేజర్ వంటి ఎలాంటి ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి ఉండదు. అభ్యర్థి హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. ఆధార్, పాన్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటో, ఓటరు ఐడీలలో ఏదైనా ఒకటి గుర్తింపు కార్డుగా తీసుకెళ్లాలి. డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్‌పై ఫొటో, సిగ్నేచర్ సరిగా కనిపించకపోతే అలాంటి వారు గజిటెడ్ ఆఫీసర్ అటెస్ట్ చేసిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలను తీసుకొచ్చి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాలి. అభ్యర్థులకు సందేహాలుంటే 0866 - 2575833 కి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

# నా కుమార్తె బాధితురాలు

- నిందితురాలు కాదు
- యూనియన్ బ్యాంక్ మాజీ మేనేజర్ ప్రభావతి తండ్రి వెంకటరంగారావు

**విజయవాడ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి):** తన కుమార్తె నిందితురాలు కాదని, ఓ వ్యక్తి చేసిన మోసంలో బాధితురాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గంగూరు బ్రాంచ్ మాజీ మేనేజర్ దావులూరి ప్రభావతి తండ్రి వెంకటరంగారావు తెలిపారు. ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభావతికి క్రాగడ్డ విజ యకృష్ణతో 2020లో వివాహమైందని, భార్యాభర్త లిద్దరి మధ్య కొంతకాలంగా వివాదాలు ఉన్నాయని తెలిపారు. వాటిని పరిష్కరిస్తానని చెప్పి తమకు దూరపు బంధువైన కవులూరి యోగేశ్వరరావు ఆమె వద్దకు వచ్చాడని పేర్కొన్నారు. కొన్నిరోజుల తర్వాత తనకు డబ్బు అవసరం ఉందని అప్పు అడిగితే ప్రభావతి తన వద్ద ఉన్న బంగారం ఇచ్చిందని తెలిపారు. యోగేశ్వరరావు దీన్ని తిరిగి ఇవ్వకుండా, ఆమె పనిచేస్తున్న బ్యాంకులోనే తాకట్టు పెట్టాడని వివరించారు. తర్వాత ప్రభావతితో అసభ్యకరంగా ప్రవర్తించడంతో నూజివీడు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని తెలిపారు.

## శనగలు క్వింటాలు రూ.5,440

**వన్‌టౌన్, ఫిబ్రవరి 24:** ఎన్టీఆర్ జిల్లాలో 2023-2024లో పండించిన శనగలను క్వింటాల్‌కు రూ.5,440 చొప్పున మద్దతు ధరతో ఆర్బీకేల్లో కొనుగోలు చేస్తారని ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్ తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ-క్రాప్‌లో ఇప్పటికే నమోదు చేసుకున్న రైతులు వాటిని అమ్మదలిస్తే సమీపంలోని ఆర్బీకేలకు వెళ్లి పేర్లను సీఎం యాప్‌లో ఈనెల 27వ తేదీ నుంచి నమోదు చేయించుకోవాలని సూచించారు.

## మాతృభాషలోనే బోధన చేయాలి

**విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి):** మాతృభాషలో బోధన చేయాల్సిన ఆవశ్యకత తెలుగు రాష్ట్రాల్లో ఉందని మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో తెలుగు భాషోద్యమ సమాఖ్య శనివారం నిర్వహించిన ప్రజాచైతన్య సభలో ఆయన మాట్లాడారు. నూతన విద్యావిధానం వల్ల విద్యార్థుల్లో భాషాపరిజ్ఞానం పూర్తిగా లోపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. సాహిత్య అభిలాష, పఠనాశక్తి లేకపోవడంతో ప్రాపంచిక విషయాలు తెలియడం లేదన్నారు. డాక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్, సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు, జనసేన నేత పోతిన మహేష్, సీపీఎం నేత మంతెన సీతారాం, కాంగ్రెస్ నేత కొలనుకొండ శివాజీ, ఐలు జాతీయ అధ్యక్షుడు సుంకర రాజేంద్రప్రసాద్, సమాఖ్య గౌరవాధ్యక్షుడు సామల రమేష్‌బాబు, కార్యదర్శి మొవ్వా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి (రూ.లలో)



| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 159, 168, 179 |
| చికెన్ విత్ స్కిన్ | 308 |
| చికెన్ స్కిన్‌లెస్ | 316 |

**నెక్ కోడిగుడ్డు ధర**

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

## కంప్యూటర్ సైన్స్‌పై లయోలలో అవగాహన సదస్సు

**భారతీనగర్, ఫిబ్రవరి 24:** ఆంధ్రా లయోల ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కేప్ కామరిన్ ట్రస్ట్, మిన్ దానో స్టేట్ యూనివర్సిటీ, సులు ఫిలిపిన్స్ సంస్థ సహకారంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ (కంప్యూటర్ సైన్స్) అంశంపై శనివారం అవగాహన సదస్సు కళాశాల సెమినార్ హాల్‌లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎ. శ్రీనివాసరావు మాట్లాడుతూ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ ప్రకారంగా విద్యలో పరిశోధన ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం ప్రోగ్రామ్ ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్‌పై పలు అంశాలను వివరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఫాదర్ బాలస్వామి మాట్లాడుతూ ఈ సదస్సు నేటి నుంచి గురువారం వరకు ఏడు రోజులపాటు కళాశాలలో జరుగుతుందన్నారు.

# 50 వేల ఓట్ల మెజార్టీతో గద్దెను గెలిపిస్తాం

**13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్**

● తూర్పు అభ్యర్థిగా గద్దె పేరు ప్రకటనపై టీడీపీ శ్రేణుల సంబరాలు



13వ డివిజన్‌లో సంబరాలు

**పటమట, ఫిబ్రవరి 24 :** తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను 2024 ఎన్నికల్లో 50,000 ఓట్ల మెజార్టీతో తిరిగి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని 13వ డివిజన్ కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్ చెప్పారు. తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గద్దె రామ్మోహన్‌ను ప్రకటించడంతో 13వ డివిజన్ టీడీపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఈ సందర్భంగా ముమ్మనేని ప్రసాద్ మాట్లాడుతూ గద్దెను తూర్పు అభ్యర్థిగా ప్రకటించినందుకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు, ప్రధాన కార్యదర్శి లోకేష్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. గత పది సంవత్సరాల కాలం నుంచి తూర్పు అభివృద్ధికి గద్దె నిరంతర కృషిసల్పారని అన్నారు. నిరుపేదలకు తన సొంత నిధుల నుంచి తోపుడు బండ్లు, టిఫిన్ బండ్లు, ఇస్త్రీ పెట్టెలు, ప్రతిభ గల నిరుపేద విద్యార్థులకు చదువుల నిమిత్తం విరాళాలు ఇచ్చారని, ఆయన చేసిన కార్యక్రమాలే ఆయనను తిరిగి గెలిపిస్తాయని ముమ్మనేని ప్రసాద్ తెలిపారు. డివిజన్ పార్టీ అధ్యక్షుడు గద్దె ప్రసాద్, వీరంకి డాంగే కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మిఠాయిలు పంపిణీ**

**రాణిగారితోట:** విజయవాడ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడోసారి హ్యాట్రిక్ కొట్టబోతున్న గద్దె రామ్మోహన్‌ను ప్రకటించడం శుభపరిణామం అని 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు వేముల దుర్గారావు అన్నారు. తూర్పుకు గద్దె రామ్మోహన్‌ను అభ్యర్థిగా ప్రకటించడంపై డివిజన్ టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ రాణిగారితోట నాలుగు రోడ్ల సెంటర్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూర్పు అభ్యర్థిగా గద్దె రామ్మోహన్‌ను ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. పీరుబాబు, కాశి, కాశయ్య, శ్రీను, గంధ్ర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్లిస్తామని మోసం

**సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు**




**సత్యనారాయణపురం, ఫిబ్రవరి 24:** పేదలకు ఇళ్లు ఇస్తామని వైసీపీ ప్రభుత్వం మోసగించిందని, స్థలాలు చూపకుండా రిజిస్ట్రేషన్ అంటూ దగా చేస్తున్నారని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆరోపించారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు నేతృత్వంలో జన శంఖారావం యాత్ర శనివారం దుర్గాపురం, బావాజీపేట, భానునగర్, గులాబితోట, రైల్వేకాలనీ, గుణదలలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30లక్షల ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేశామని సీఎం గొప్పలు చెప్పుకుంటున్నారని, ఈ రిజిస్ట్రేషన్లు ఎందుకూ పనికి రానప్పుడు ఉపయోగం ఏముందని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి 4.5 కోట్ల జనం సొమ్ముతో ప్యాలెస్ నిర్మించుకున్నారని, అదే డబ్బుతో నగరంలో పేదలందరికి ఇళ్లు నిర్మించవచ్చునన్నారు. స్థానిక సమస్యలు పట్టించుకునే నాథుడే లేడు, జనం గోడు వినే వాడు కరువయ్యారని, అందుకే సీపీఎం జన శంఖారావం పూరించిందన్నారు. సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, రాష్ట్రకమిటీ సభ్యులు కె. శ్రీదేవి, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ , స్థానిక నాయకులు పి.కృష్ణమూర్తి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన



**చిట్టినగర్, ఫిబ్రవరి 24:** విజయవాడ పార్లమెంట్ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ నాయకులు ఎంఎస్ బేగ్ ఆదేశాల మేరకు టీం టీడీపీ విజయవాడ తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో శనివారం 49వ డివిజన్ గొల్లపాలెంగట్టు, జోడు బొమ్మలసెంటర్‌లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించారు. పాదయాత్ర నిర్వహించి మహిళలకు సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. టీడీపీ మహిళా నేతలు చెన్నుపాటి ఉషారాణి, సుకాశి సరిత, నజీమా, ఎల్. శాంతి, షకీలా, లంక బుజ్జి, మల్లేశ్వరి, అపర్ణ, రామలక్ష్మి జానకి, వాణి, ఇట్టా భవాని, మున్నీసా పాల్గొన్నారు.

## విజయవాడ ఎంపీగా చిన్నిని గెలిపించుకుంటాం

● దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న మైనార్టీ నాయకులు

**భవానీపురం, ఫిబ్రవరి 24 :** విజయవాడ పార్లమెంట్ సభ్యులుగా కేశినేని శివనాథ్(చిన్ని)ని 3 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిపించుకుంటామని పశ్చిమ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రజావుల్లా అన్నారు. 41వ డివిజన్‌లోని హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గాలో శనివారం ప్రార్థనలు చేశారు. అల్లా సహకారంతో చిన్ని రికార్డు విజయం సాధిస్తారన్నారు. విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రియాజ్, షేక్ బడేషా, కార్యదర్శి మొహ్మద్ జాహిద్‌లు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే చంద్రబాబు నాయకత్వంలో టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలో రావాలని, ఇందుకు ముస్లిం మైనార్టీలు అండగా ఉండాలన్నారు. మైనార్టీ నాయకులు తమిమ్ అన్సారీ, షేక్ ఫిరోజ్, మతిన్, ఇస్మాయిల్, నౌషద్‌లు పాల్గొన్నారు.

## ఆసిఫ్‌కు ముస్లింల మద్దతు ఏదీ?

**వన్‌టౌన్, ఫిబ్రవరి 24:** ఇస్లాం మత నిషేధిత మద్యం, జూదం వంటి వ్యాపార లావాదేవీలలో ఆరితేరిన పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆసిఫ్‌కు సొంత సామాజిక వర్గ ముస్లింల మద్దతు లభించడం లేదని టీడీపీ ఎన్‌టీఆర్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మీర్జా ముజఫర్ బేగ్ విమర్శించారు ఈమేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో గత పది రోజులుగా అతని ఎన్నికల ప్రచారాన్ని గమనిస్తే పేలవంగా సాగుతున్నాయని అన్నారు. పశ్చిమంలో జనసేన- టీడీపీ కూటమి అభ్యర్థిని జనం ఆదరిస్తారని తెలిపారు.

**టీడీపీ- జనసేన మొదటి లిస్ట్‌తోనే**

## వైసీపీలో ఓటమి భయం: బొండా ఉమా



అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న టీడీపీ నేతలు

**పాయకాపురం, ఫిబ్రవరి 24 :** టీడీపీ, జనసేన పార్టీల మొదటి లిస్ట్‌తోనే వైసీపీలో ఓటమి భయం పట్టుకుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో శనివారం విలేకర్ల సమావేశంలో ఉమా మాట్లాడుతూ మొదటి లిస్ట్‌లోనే తనకు సెంట్రల్ నియోజకవర్గ సీటును ప్రకటించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. 175 నియోజకవర్గాల్లో గెలిచి తీరుతామని ప్రగల్భాలు పలుకుతున్న సీఎం జగన్ ఇప్పటి వరకు వైసీపీ అభ్యర్థుల పేర్లు ప్రకటించలేదని విమర్శించారు. అసలు వైసీపీలో అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి అభ్యర్థులు ఉన్నారా అని ప్రశ్నించారు. వైసీపీ తరఫున పోటీ చేయడానికి అభ్యర్థులు కరువయ్యారని, సొంత మనుషులే జగన్‌ను నమ్మే పరిస్థితి లేదన్నారు. వైసీపీ ఓటమి ముందుగానే అర్థమైపోయిందని పేర్కొన్నారు.

**మొక్కు చెల్లించిన టీడీపీ నేతలు**

**పాయకాపురం:** టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థిగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావును ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని సెంట్రల్ టీడీపీ నేతలు పెనుగంచిప్రోలులోని శ్రీశ్రీశ్రీ లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి శనివారం మొక్కు చెల్లించారు. ప్రత్యేక పూజలు చేశారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టీడీపీ నాయీబ్రాహ్మణ సంఘం పార్లమెంట్ అధ్యక్షుడు సూరవరపు నాగరాజు, నేతలు రాజా, రాజేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**సెంట్రల్‌లో సంబరాలు**

**అజిత్‌సింగ్‌నగర్:** టీడీపీ సెంట్రల్ నియోజకవర్గం అభ్యర్థిగా బొండా ఉమామహేశ్వరరావును ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ టీడీపీ నేతలు శనివారం సంబరాలు చేసుకున్నారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొండా ఉమా తనయుడు బొండా సిద్ధార్థ ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరుసగా మూడవ సారి కూడా సెంట్రల్ టీడీపీ సీటు బొండా ఉమాకు కేటాయించినందుకు చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీకి ఓటు వేసి బొండా ఉమామహేశ్వరరావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



మిఠాయిలు తినిపించుకుంటున్న టీడీపీ నేతలు

## వంట గ్యాస్ వినియోగంలో రక్షణ చర్యలపై అవగాహన



**భవానీపురం, ఫిబ్రవరి 24 :** వంట గ్యాస్‌ను మహిళలు వినియోగించేటప్పుడు అప్రమత్తతతో పాటు, కొన్ని విషయాల్లో పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని భారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ భవానీ గ్యాస్ కంపెనీ అధినేత గద్దె హరిబాబు అన్నారు. విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్‌లో వంట గ్యాస్ వాడకంలో జాగ్రత్తలు, ఆదా వ్యవహారాలపై వినియోగదారులైన గృహిణులకు శనివారం అవగాహన కార్యక్రమం(సేఫ్టీ క్లినిక్)లో ఆయన పలు విషయాలను వివరించారు. గ్యాస్ కంపెనీ మెకానిక్‌లు సాయి, ఆసిఫ్‌ల ఆధ్వర్యంలో సిలిండర్ డెలివరీ సమయంలోను, లీకులు విషయంలో ఏ విధంగా అప్రమత్తంగా ఉండాలో వివరించారు. ఏదైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉంటే గ్యాస్ టోల్ ఫ్రీ నెంబర్ 1906కు చేసి వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చునని హరిబాబు తెలిపారు.

## ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

● ఇంటింటికీ జనసేన కార్యక్రమంలో పోతిన మహేశ్



మేనిఫెస్టోలోని అంశాలను వివరిస్తున్న పోతిన మహేశ్

**భవానీపురం, ఫిబ్రవరి 24 :** ప్రజలను అన్నివిధాల మోసగించిన వైసీపీ ప్రభుత్వానికి చెంపపెట్టుగా ఫ్యాన్ రెక్కలు విరిచేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ అన్నారు. 45వ డివిజన్ జనసేన అధ్యక్షురాలు బొమ్ము గోవింద్‌లక్ష్మి, రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఇంటింటికీ రాబోయే జనసేన ప్రభుత్వం కార్యక్రమం రోటరీనగర్ నుంచి పలు ప్రాంతాల్లో మహేశ్ పాల్గొన్నారు. కార్పొరేషన్ నిధులతో అరకొర పనులు చేసిన వైసీపీని సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మామిడి చిన్నక్రిష్, రామానాయుడు, శ్రీను, కె.ప్రసాద్‌లు పాల్గొన్నారు.

**మహేశ్ ఆర్థిక సహాయం**

**వన్‌టౌన్:** జనసేన అధికార ప్రతినిధి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పోతిన మహేశ్ శనివారం పలువురికి ఆర్థిక సహాయాన్ని అందించారు. విద్యార్థిని ధనలక్ష్మికి ఉపకార వేతనం కింద రూ.8 వేలు, వైద్య ఖర్చుల నిమిత్తం వస్త్రలతలోని నీలమ్మకు రూ.4వేలు, వైద్య ఖర్చుల నిమిత్తం శ్రీనివాస్‌కు రూ.5వేలు, సెంట్రల్ నియోజకవర్గానికి చెందిన రమేష్‌కు రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం చేశారు. 42వ డివిజన్‌హెచ్‌బీ కాలనీకి చెందిన సీహెచ్ కిరణ్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. తిరుపతి సురేష్, అల్లా భక్ష, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం

**అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 24 :** న్యూ రాజరాజేశ్వరిపేటలోని శ్రీ సుదర్శన వెంకటేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం వేద పండితుల మంత్రోచ్ఛరణలతో శనివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన అన్న సంతర్పణ లో పాల్గొని భక్తులకు భోజనం అందజేశారు.

**భౌతికశాస్త్ర అభ్యాస దీపికల అందజేత**

62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్ర అభ్యాస దీపికలను శనివారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసంగించారు.

## సమాజాభివృద్ధిలో భాషకు ప్రాధాన్యం

● తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు గారపాటి



ప్రసంగిస్తున్న గారపాటి ఉమామహేశ్వరరావు

**లబ్బీపేట, ఫిబ్రవరి24:** సమాజం అభివృద్ధి చెందడంలో భాష ప్రముఖ పాత్ర పోషిస్తుందని, భాషకి, మనిషికి అవినాభావ సంబంధం ఉందని తెలుగు భాషోద్యమ సమాఖ్య అధ్యక్షుడు గారపాటి ఉమామహేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా శనివారం సిద్ధార్థ మహిళా కళాశాలలో తెలుగు భాషోద్యమ సమాఖ్య ఆధ్వర్యంలో ప్రజా చైతన్య సభ నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భాష లేకపోతే మనిషి మనుగడే లేదని, భావవ్యక్తీకరణ దైనందిన వ్యవహారాలకు భాష అవసరమని అన్నారు. సాహిత్యంలో భాషకు, వ్యాకరణ భాషకు, నిత్యజీవితంలోని వ్యవహారిక భాషకు తేడా ఉంటుందని, విద్యాధికులు మాట్లాడే భాషకు తేడా ఉంటుందని, ఎన్ని తేడాలున్నా భావ వ్యక్తీకరణే భాష లక్ష్యం అని అన్నారు. మనదేశంలో మన ఆంధ్రప్రదేశ్‌లో మాతృభాష ప్రాముఖ్యతకు ఆదరణ తగ్గి ఇతర భాషల వ్యామోహంలో పడి అన్ని రంగాల వైపు ఆదరణ కరువైందని దీనిని అధిగమించాలంటే మన మాతృభాషను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని అన్నారు. కళాశాల డైరెక్టర్ టి.విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, కె.సరళ, మంజుల పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

**భవానీపురం, ఫిబ్రవరి 24 :** కబేళా విద్యుత్ ఉపకేంద్రం మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు ఇండస్ట్రియల్ ఏరియా, కబేళా సెంటర్, ఊర్మిళానగర్, జోజినగర్, పోలీస్‌కాలనీ, టెలిఫోన్స్ కాలనీ, సితార సెంటర్, లేబర్‌కాలనీ, మిథిలానగర్, ఆర్టీసీ వర్క్‌షాపురోడ్డు, చెరువుసెంటర్, మర్రిచెట్టు సెంటర్, పెద్ద సాయిబాబాగుడి, రైతుబజార్ రోడ్డు, లలితానగర్, మానవ మందిర్ రోడ్డు, టీవీ కృష్ణారావు వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయవాడ విద్యుత్ టౌన్ ఈఈ బీవీ. సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

**వన్‌టౌన్:** నెహ్రూ రోడ్డు ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాజా రంగయ్యప్పారావు వీధి, నెహ్రూ రోడ్డు, కాన్వెంట్ వీధి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఈఈ బీవీ సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**మల్కాపురం మునేరు వద్ద**

## టీడీపీ-జనసేన ఆందోళన

**జగ్గయ్యపేట రూరల్, ఫిబ్రవరి 24:** ఇసుక అక్రమ దోపిడీకి సహకరించి తప్పుడు నివేదికలు అందిస్తున్న కలెక్టర్‌లు పుట్టుమునగటం తప్పదని మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ హెచ్చరించారు. మల్కాపురం మునేరులో శనివారం ఇసుక అక్రమ రవాణా జరుగుతుందనే సమాచారంతో టీడీపీ జనసేన నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇసుక బంగారమైందని వైసీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇసుక మాఫియా రాష్ట్ర సరిహద్దులు దాటిస్తూ కోట్లు గడిస్తున్నారన్నారు. అక్రమ సంపాదనతో రానున్న ఎన్నికల్లో గెలుపొందాలని ధీమాగా ఉన్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఉచితంగా అందించిన ఇసుక నేడు బంగారంగా మారిందన్నారు. పేదలకు ఇసుక అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉండి గెలిపిస్తే ఉచిత ఇసుక అమలు చేయటం జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణాను నిలుపుదల చేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కట్టా నరసింహారావు, ప్రసాద్, కల్యాణం భాస్కర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# టీఎస్ ఈఏపీసెట్ నోటిఫికేషన్

## దిక్సూచి

తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్‌ఈ)- స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈఏపీసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షను హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయుహెచ్) నిర్వహిస్తోంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

**కోర్సులు**

- బీఈ, బీటెక్; బీటెక్(బయోటెక్నాలజీ/డెయిరీ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/ఫుడ్ టెక్నాలజీ); బీఫార్మసీ; బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/హార్టికల్చర్); బీఎస్సీ ఫారెస్ట్రీ; బీవీఎస్సీ అండ్ ఏహెచ్; బీఎఫ్ఎస్సీ
- ఫార్మా-డీ(డాక్టర్ ఆఫ్ ఫార్మసీ)
- బీఎస్సీ నర్సింగ్

**అర్హత:** అభ్యర్థులు చేరదలచుకున్న కోర్సును అనుసరించి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ/బయోటెక్నాలజీ/బయాలజీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.



**టీఎస్ ఈఏపీసెట్ 2024 వివరాలు**

- ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 160 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే కనీసం 25 శాతం మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.
- ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్ అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 80 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్ అభ్యర్థులకు బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ నుంచి ఒక్కోదానిలో 40 ప్రశ్నలు ఇస్తారు.
- **దరఖాస్తు ప్రక్రియ:** ఫిబ్రవరి 26 నుంచి
- **ఏదేని ఒక స్ట్రీమ్‌నకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **రెండు స్ట్రీమ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ1800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 6
- **టీఎస్ ఈఏపీసెట్ 2024 తేదీలు:** ఇంజనీరింగ్(ఇ) స్ట్రీమ్‌కు మే 9, 10; అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ(ఏపీ) స్ట్రీమ్‌కు మే 11, 12
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్(నాలుగు జోన్‌లు), నల్లగొండ, కోదాడ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట్, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు.
- **వెబ్‌సైట్:** eapcet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PWo1UkFలో చదవండి.

## హాలియాలో విశ్వంభర చిత్రీకరణ





వశిష్ఠ దర్శకత్వంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న 'విశ్వంభర' సినిమా షూటింగ్ శనివారం నల్లగొండ జిల్లా హాలియాలోని వజ్రతేజ రైస్ ఇండస్ట్రీలో జరిగింది. పలు సన్నివేశాలు చిత్రీకరించారు. చిరంజీవితో పాటు నటులు రాజారవీంద్ర, హర్షవర్ధన్, వెన్నెల కిశోర్, చమ్మక్ చంద్ర, ప్రవీణ్, రోహన్, అకుల్, కుసుం చిత్రీకరణలో పాల్గొన్నారు. హాస్యనటులు, చిరంజీవికి మధ్య పలు సన్నివేశాలను చిత్రీకరించారు. వజ్రతేజ రైస్‌మిల్‌లో విశ్వంభర షూటింగ్ గురించి తెలుసుకున్న చిరంజీవి అభిమానులు, స్థానికులు ఉదయం నుంచే రైస్‌మిల్ వద్దకు భారీగా తరలివచ్చారు. హాలియా సీఐ రాఘవరావు అధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి షూటింగ్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు. ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటిస్తున్నారు.

## మే 9నే కల్కి రాక

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కల్కి 2898 ఏడీ'. సి. అశ్వనీదత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మే 9న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల వాయిదా పడనుందంటూ డిజిటల్ మీడియాలో వస్తున్న వదంతులపై నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ స్పందించింది. ముందు ప్రకటించినట్లు మే 9న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు స్పష్టం చేశారు. నేపథ్యంలో వినిపిస్తున్న



సంగీతానికి అనుగుణంగా ప్రభాస్ పాదం కదుపుతున్న వీడియోను శనివారం మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే నటిస్తున్నారు. కమల్‌హాసన్ ప్రతినాయక పాత్రలో కనిపించనున్నారు.




## భిన్నమైన పాత్రల్లో భీమా

గోపీచంద్ కథానాయకుడిగా ఏ. హర్ష దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలు. కేకే రాధామోహన్ నిర్మించారు. మార్చి 8న విడుదలవుతోంది. శనివారం



చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. గోపీచంద్ రెండు విభిన్నమైన పాత్రల్లో ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతూ 'దర్శకుడు హర్ష కథను అద్భుతంగా తెరపైకి తెచ్చాడు. రవి బస్రూర్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఇరగదీశాడు. ప్రేక్షకులు ఈ సినిమాను ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. యాక్షన్‌తో పాటు కామెడీ, ఎంటర్టైన్‌మెంట్ చాలా గొప్పగా ఉంటుందని హర్ష తెలిపారు.

## శనివారం సూర్య వేట



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ఆగస్టు 29న విడుదలవుతోంది. శనివారం నాని పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది. సూర్య అనే పాత్రలో నాని స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఆయన పాత్రను మలచిన తీరు సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ఈ చిత్రంలో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక.

**సుజీత్ దర్శకత్వంలో**

అలాగే నాని నటించే తదుపరి చిత్రాన్ని పుట్టిన రోజు సందర్భంగా ప్రకటించారు. 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. డీవీవీ దానయ్య నిర్మాత. 2025లో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇతర వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

## బహుముఖం ఉత్కంఠభరితం



హర్షివ్ కార్తిక్ హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రం టీజర్‌ను శనివారం దర్శకుడు శశి కిరణ్ తిక్క చేతుల మీదుగా విడుదల చేశారు. 'టీజర్ బాగుంది. విజువల్స్‌తో పాటు సౌండ్‌కి చాలా ప్రాధాన్యత ఇచ్చారు. శ్రీచరణ్ బీజీఎం అదరగొట్టారు' అని ఆయన చిత్రబృందాన్ని ప్రశంసించారు. ఊహించని మలుపులతో కథ ఉత్కంఠభరితంగా సాగుతుందని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. చాలా ప్రేమతో, కష్టంతో చేసిన సినిమా ఇది, ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉందని హర్షివ్ కార్తిక్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఫణి కల్యాణ్. బ్యాగ్రౌండ్ స్కోర్: శ్రీచరణ్ పాకాల. సినిమాటోగ్రఫీ: ల్యూక్ ప్లెచర్














అలనాటి కథ

**పాకిస్థాన్ రాజకీయాలు ఇప్పటికీ నాకు ఆసక్తి కలిగిస్తూనే ఉంటాయి.. ఎందుకంటే- ఒకప్పటి నా జీవితం వాళ్లతోనే పెనవేసుకు ఉండేది. పాకిస్థాన్‌లో తాజా రాజకీయ పరిణామాలు చూస్తుంటే- జ్ఞాపకాల పొరల నుంచి అనేక సంఘటనలు గుర్తుకొచ్చాయి. జుల్ఫికర్ అలీ భుట్టోతో కలిసి చదివిన రోజులు, తన ప్రేమకు నేను అందించిన సాయం... ఎన్నో జ్ఞాపకాలు ఒక్కసారి చుట్టుముట్టాయి.**

# భుట్టో ప్రేమలేఖలు



సుమారు 75 ఏళ్ల క్రితం- నేను ముంబాయిలో సెయింట్ మేరీస్ హైస్కూల్లో చదువుతూ ఉండేదాన్ని. ముంబాయిలోని సంపన్నుల పిల్లలందరూ ఆ స్కూల్లోనే చదివేవారు. సురయ్యా కరెంబోయ్, జుల్ఫికర్ అలీ భుట్టో, మనోహర్ శిరోద్కర్... వీళ్లందరూ నా స్నేహితులు. ఒక్కొక్కరికి ఒకో ముద్దు పేరు. భుట్టోను 'జుల్ఫి' అని పిలిచేవాళ్లం. జుల్ఫి నాన్న- షహనవాజ్ భుట్టో జూనాఘడ్ సంస్థానంలో దివాన్. అంతే కాకుండా వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యుడు కూడా! మా నాన్న (రాజా ధన్‌రాజ్‌గిరి)కు మంచి స్నేహితుడు. గేట్ వే ఆఫ్ ఇండియా ఎదురుగా మా ప్యాలెస్ ఉండేది. మా ప్యాలెస్ పక్కనే జుల్ఫి నాన్నగారికి కూడా కొన్ని భవంతులుండేవి. ఆయన అప్పుడప్పుడు అక్కడకి వస్తూ ఉండేవారు.

నేను, మా తమ్ముళ్లిద్దరు, సురయా- అప్పుడప్పుడు గేట్‌వే ఆఫ్ ఇండియా దగ్గరకు వెళ్లేవాళ్లం. మా యూరోపియన్ గవర్నెస్ అక్కడ మాకు అక్కడ పిస్తా, బాదం పప్పు కొని పెట్టేది. గేట్ వే దగ్గర కూర్చుని వాటిని తినటం మాకొక సరదా! ఆ రోజుల్లో మా అందరికీ గుర్రపు స్వారీ, విలువిద్య, కత్తి సాము- ఇలా ఏదో ఒకటి నేర్పించేవారు. నాకు గుర్రపు స్వారీ నేర్పించారు. ఇతర ఆటల్లో అంత ప్రావీణ్యం ఉండేది కాదు. సురయా మాత్రం అథ్లెటిక్స్‌లో ముందు ఉండేది. ప్రీ ఒలింపిక్స్ హైజంప్ కాంపిటేషన్‌లో గెలిచి... ఒలింపిక్స్‌కు కూడా ఎంపికయింది. కానీ వాళ్ల నాన్న( ఇస్మాయిల్ చుర్రంబోయ్) సురయాను ఒలింపిక్స్‌కు పంపటానికి ఒప్పుకోలేదు. సురాయా అడిగితే- "నువ్వు అమ్మాయివి. నీ భవిష్యత్ అది కాదు" అన్నారట. దాంతో తను ఆగిపోవాల్సి వచ్చింది. లేకపోతే తను ఒలింపిక్స్‌కు వెళ్ళి మెడల్ తెచ్చేదేమో! ఆ విషయాన్ని పక్కన పెడితే- సురయా చూడటానికి ముట్టుకుంటే కమిలిపోతుందా? అన్నంత తెల్లగా, అందంగా ఉండేది. దీంతో ఆమెకు స్కూల్లో అబ్బాయిల ఫాలోయింగ్ ఎక్కువగా ఉండేది. అలా తన వెంటపడిన వారిలో జుల్ఫి కూడా ఒకడు. సురయాకు కూడా తనంటే ఇష్టమే ఉండేది. వారిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడిచేది. వారిద్దరూ ఒకరికొకరు ఉత్తరాలు రాసుకుంటూ ఉండేవారు. వాళ్లిద్దరూ నా స్నేహితులు కావటంతో - ఆ ఉత్తరాలను రహస్యంగా ఒకరికొకరికి అందించే బాధ్యత నాపై పడింది. ఇలా కొద్ది కాలం నడిచింది. ఎలా తెలిసిందో తెలియదు కానీ.. వీరి ప్రేమ వ్యవహారం జుల్ఫి వాళ్ల నాన్న (సర్ షా నవాజ్)కు తెలిసిపోయింది. ఒక రోజు ఆ విషయం మాట్లాడటానికి మా నాన్న దగ్గరకు ఆయన వచ్చారు. తెలిసిన సంబంధం. పైగా సమాజంలో దాదాపు సరిసమానపు హోదా ఉన్నవారు. దాంతో షా నవాజ్‌కు ఈ సంబంధం కలుపుకోవటానికి అభ్యంతరమేమీ లేదు. సురయా తల్లితండ్రులతో మాట్లాడమని నాన్నతో చెప్పారు. సురాయా వాళ్ల అమ్మ మా ఇంటికి తరచూ వస్తూ ఉండేది. ఒక రోజు మా నాన్న- సురయా వాళ్ల అమ్మ దగ్గర ఈ విషయం లేవనెత్తారు. అప్పుడు- ఆమెకు ఈ ప్రేమ వ్యవహారం ఇష్టం లేదని తెలిసింది. మా నాన్న- ఆమెకు ఎన్నో రకాలుగా నచ్చ చెప్పటానికి ప్రయత్నించారు. ఆమె వినలేదు. అంతేకాదు. ఈ విషయం తన భర్తకు చెప్పవద్దని హెచ్చరించింది. దీనితో నాన్న- ఏం చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోయారు.

ఇక్కడే కథ మరో మలుపు తిరిగింది. ఇలా గొడవలు జరుగుతున్న సమయంలోనే- జుల్ఫి ఉన్నత విద్య కోసం అమెరికాలోని బర్క్‌లీ విశ్వవిద్యాలయానికి వెళ్లాడు. అప్పటికే ఆ విశ్వవిద్యాలయంలో సురయా కజిన్ ఆసీఫ్ కూడా చదువుతున్నాడు. జుల్ఫీకి హాస్టల్‌లో రూమ్ కావాల్సి వచ్చింది. ఆసీఫ్, జుల్ఫి - ఇద్దరూ భారతీయులే కాబట్టి విశ్వవిద్యాలయం అధికారులు ఇద్దరికీ ఒక రూమ్ కేటాయించారు. రూమ్‌లో జుల్ఫీ చేరేనాటికి ఆసీఫ్‌తో తనకు పెద్ద స్నేహం



లేదు. జుల్ఫి రూమ్‌లో చేరిన వెంటనే తన దుస్తులన్నీ బయటకు తీసి హ్యాంగర్లకు తగిలించుకున్నాడు. తన సామాన్లన్నీ అరల్లో పెట్టుకున్నాడు. తనకు కేటాయించిన స్టడీ టేబుల్ మీద సురయా ఫొటో ఉన్న ఫ్రేమ్ పెట్టాడు. ఆ ఫొటోను చూసిన వెంటనే ఆసీఫ్ షాక్ తిన్నాడు. విషయం అర్థమయింది. కానీ నిర్ధారణకు రావాలి కదా! అందుకోసం జుల్ఫితో ఆసీఫ్ ఎక్కువ స్నేహం నటించటం మొదలుపెట్టాడు. వ్యక్తిగత విషయాలను అడగటం మొదలుపెట్టాడు. అసలు విషయం తెలియని జుల్ఫి అన్ని విషయాలు ఆసీఫ్‌తో పంచుకోవటం మొదలుపెట్టాడు. చివరకు సురయా గురించి కూడా చెప్పేశాడు. ఈ విషయం తెలిసిన వెంటనే - ఆసీఫ్- ఇంట్లో వాళ్లను చూడాలనే మిషతో ముంబాయి వచ్చేశాడు. సురయా వాళ్లింటికి ప్రతి రోజు వెళ్లటం మొదలుపెట్టాడు. ఆసీఫ్ బంధువే కావటంతో సురాయా వాళ్లింట్లో పెద్ద అభ్యంతరాలు ఉండేవి కావు. నెమ్మదిగా సురాయా అమ్మ, నాన్న.. ఆసీఫ్‌ను ఇష్టపడటం మొదలుపెట్టారు.

బొంబాయిలో జరుగుతున్న విషయాలేమి- జుల్ఫీకి తెలియవు. ఒక వైపు దూరాభారం. మరో వైపు పరీక్షల హడావిడి. ఈలోపు సురయా నుంచి ఉత్తరాలు రావటం మానేసాయి. ఎందుకో తెలుసుకొనే లోపులోనే సురయా- ఆసీఫ్‌ల వివాహం నిశ్చమయిపోయింది. నిఖా వైభవంగా జరిగింది. నిఖా చేయటానికి ఆ సమయంలో ముస్లింలందరికీ పెద్ద అయిన ఆగాఖాన్ వచ్చారు. ఈ సంఘటనల నేపథ్యంలోనే- దేశ విభజన జరిగింది. జుల్ఫీ కుటుంబం పాకిస్థాన్‌కు వెళ్లిపోయింది. మేమందరం బొంబాయిలో ఉండిపోయాం. 1951లో నుసరత్‌ను జుల్ఫీ పెళ్లి చేసుకున్నాడు. ఆ పెళ్లికి నేను వెళ్లలేదు. ఆ తర్వాత మా మధ్య సంబంధాలు తగ్గిపోయాయి. అయితే ఎప్పుడైనా తను బొంబాయి వస్తే తప్పనిసరిగా నన్ను కలిసేవాడు. మేము పాత జ్ఞాపకాలు నెమరువేసుకొనేవాళ్లం. సరదగా నవ్వుకొనేవాళ్లం. మనకు పాకిస్థాన్‌కు మధ్య వైరం బాగా పెరిగిన రోజుల్లో ఒక సారి జుల్ఫీ- ఇందిరా గాంధీని కలవటానికి ఢిల్లీ వచ్చాడు. అశోక హోటల్‌లో దిగాడు. అక్కడి నుంచి నాకు ఫోన్ చేశాడు. కాసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాక- "మీ భారత్‌కు ఏం కావాలి?" అని అడిగాడు. ఒక్క క్షణం ఏం చెప్పాలో నాకు అర్థం కాలేదు. "స్నేహం" అని సమాధానమిచ్చా. అవే నేను తనతో మాట్లాడిన చివరి మాటలు.

1979, ఏప్రిల్ నాలుగో తేదీన నేను, శేషేంద్ర బొంబాయి వెళ్లాం. అక్కడ ఒబరాయ్ హోటల్‌లో దిగాం. ఆ మర్నాడు ఉదయం లేచి చూస్తే- పత్రికల్లో జుల్ఫీని ఉరితీశారనే వార్త కనిపించింది. నాకు కాళ్ల కింద భూమి కంపించినట్లు అనిపించింది. ఎందుకో తెలియదు.. స్నేహితుడు, జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత సర్దార్ జాఫ్రీ- సరిహద్దు అనే కవితలోని 'తుం భీ గులాం థే.. హం భీ గులాం థే' అనే పంక్తులు గుర్తుకొచ్చాయి. ఆ రోజంతా భారంగానే గడిచింది. ఆ సాయంత్రం మమల్ని సురాయా విల్లింగ్టన్ క్లబ్‌లో డిన్నర్‌కు పిలిచింది. మేమిద్దరం వెళ్లాం. పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. ఎవ్వరూ జుల్ఫీ గురించి మాట్లాడలేదు. కానీ అందరి హృదయాల్లోను ఉన్న ఆవేదన తెలుస్తూనే ఉంది. డిన్నర్ పూర్తయిన తర్వాత సురయా మమల్ని సాగనంపటానికి కారు దాకా వచ్చింది. నా చేతులు పట్టుకుంది. తన చేతులు వణుకుతున్నాయి. తన కళ్లల్లో నీటి పొర..

ఆ తర్వాత కూడా నేను ఎప్పుడూ జుల్ఫీ భార్య నుసరత్‌తో కానీ, కూతురు బెనజీర్‌తో కానీ మాట్లాడలేదు. బహుశా మా స్నేహం గురించి వాళ్లకు తెలిసి ఉండకపోవచ్చు. ఎందుకంటే కొన్ని చిన్ననాటి స్నేహాలు మనస్సులోనే గుర్తులుగా పదిలంగా ఉండిపోతాయి. జుల్ఫీ కూడా అలాంటి ఒక గుర్తే!

• ప్రిన్సెస్ ఇందిరాదేవి ధనరాజ్‌గిర్





సండే సెలబ్రిటీ



**మంచి పాత్రలతో పేరు పొందే నటులు కొందరైతే, తమ అభినయ కౌశలంతో ఎలాంటి పాత్రకైనా వన్నెతేగల వాళ్లు ఇంకొందరు. రెండో కోవకు చెందిన ఈ తరం నటి డాక్టర్ కామాక్షి భాస్కర్ల. కథానాయికగా ఆమె చేసిన సినిమాలు తక్కువే అయినా పాత్రను రక్తి కట్టించగల కొద్దిమంది నవతరం హీరోయిన్లలో మేటి అనిపించుకున్నారు. సగటు హీరోయిన్ పాత్రలకు భిన్నంగా వెళ్తూ టాలీవుడ్‌లో ప్రతిభావంతురాలైన కథానాయికగా ఆమె గుర్తింపు తెచ్చుకున్నారు. అవకాశాల అన్వేషణలో అవమానాలు ఎదుర్కొన్న స్థాయి నుంచి... విమర్శకుల ప్రశంసలు అందుకొనేదాకా సాగిన ఆమె సినీ ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు.**

# మనం మనలా జీవించడమే అందం

**మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి?**

మచిలీపట్నం మా సొంతూరు. నేను చెన్నైలో పుట్టాను. హైదరాబాద్‌లో పెరిగాను. ఇంటర్ వరకూ ఇక్కడే చదివాను. పుదుచ్చేరిలో ఎంబీబీఎస్ సీటు వచ్చినా ఆ సమయంలో విదేశాలకు వెళ్లాలనుకున్నాను. అలా చైనాలో వైద్యవిద్య పూర్తి చేశాను.

**కెరీర్ ఆరంభంలో డీ గ్లామర్ పాత్రల్లో కనిపిస్తే గ్లామర్ తారగా ఎదగలేరు కదా?**

ఆ రెండు రకాల పాత్రలు చేయగలిగే సత్తా నాలో ఉందని నమ్ముతున్నాను. నన్ను ఎలాంటి పాత్రల్లో చూపించాలనేది దర్శకుల నిర్ణయం. ఇకపై రెగ్యులర్ హీరోయిన్ తరహా పాత్రలు కూడా చేస్తాను. హీరో అడుగులకు మడుగులొత్తే తరహావి అయినా నటిస్తాను. అయితే అలాంటి పాత్రలు నేను కూడా చేయగలను అని నిరూపించుకోవడానికి మాత్రమే.

> **'కష్టాన్ని నమ్ముకోవాలి, విలువలతో బతకాలి. మేలు చేయకపోయినా ఫరవాలేదు, ఎవరికీ కీడు చేయకూడదు' అని చిన్నప్పటి నుంచి ఇంట్లో నేర్పారు. వాటిని పాటించటం వల్లే ఈ రోజు నేను ఒక స్థాయిలో ఉన్నాననుకుంటున్నాను.**

**అభిప్రాయం పరిశ్రమలో ఉంది కదా?**

మనదగ్గర హీరోయిన్ అంటే తెల్లగా ఉండాలని చాలా బలంగా నమ్ముతారు. నాది చామనచాయ కావడంతో వివక్ష ఎదుర్కొన్నాను. ఆరంభంలో రెండు చిన్న సినిమాల్లో అవకాశమిచ్చి మధ్యలో తప్పించారు. 'లీడ్ రోల్ కోసం నన్ను కూడా ఆడిషన్ చేస్తారా' అని అడిగితే 'మీరు తెల్లగా లేరని చెప్పడానికి ఇబ్బందిపడేవారు. అయితే దర్శకుడు బొమ్మరిల్లు భాస్కర్, విక్రమ్ కె కుమార్ నా నటనను మెచ్చుకున్నారు. 'నీకు మంచి భవిష్యత్ ఉంద'ని ప్రోత్సహించారు.

**అడ్డంకులు ఎదురైనప్పుడు ఈ రంగాన్ని వదిలేద్దాం అనిపించలేదా?**

నటన అనేది నాకు పూర్తిగా కొత్త రంగం. డాక్టర్‌గా నేను గొప్ప కావొచ్చేమే కానీ ఇక్కడ కాదు. నటిగా నా ప్రయాణం సున్నా నుంచి మొదలుపెట్టాను. అయితే కొన్నిసార్లు అవకాశాలు దక్కకుండా చేసినప్పుడు కొంచెం నిరుత్సాహం కలిగింది. కానీ ఈ రంగాన్ని వదిలేద్దామని అనిపించలేదు.

**మీకు ఎలాంటి పాత్రల్లో నటించాలనుంది?**

తెరపైకి రాని ఎందరో బడుగు బలహీనవర్గాలకు చెందిన మహిళల పాత్రలను పోషించాలని ఉంది. అట్టడుగు వర్గాల కథలు ఇప్పటిదాకా మనం జనాలకు చూపించలేదు. 'పొలిమేర 2'లో లక్ష్మి పాత్రనే తీసుకుంటే తనో నిరక్షరాస్యురాలు. కుటుంబమే సర్వస్వం అనుకుంటుంది. కానీ అసహనానికి గురై జీవితంలో తెగించి నిర్ణయాలు తీసుకుంటుంది. డీగ్లామర్ రోల్స్‌లో ఈ తరహా పాత్ర ఇప్పటిదాకా రాలేదు. నేను చేయగలిగాను. ఇలాంటివే సవాల్ విసిరేలా పాత్రలు మరిన్ని చేయాలనుంది.

**టాలీవుడ్‌లో తెలుగు అమ్మాయిలకు ప్రోత్సాహం లభిస్తోందా?**

మన దర్శకులు, నిర్మాతలు లోకల్ టాలెంట్‌ను ప్రోత్సహించడం లేదు అనడం తప్పు. సమస్య క్యాస్టింగ్ డైరెక్టర్ల దగ్గరే వస్తుంది. దర్శకులకు వారి కథపైనే ఫోకస్ ఉంటుంది. వారు నటీనటుల ఎంపికకు క్యాస్టింగ్ డైరెక్టర్లపైనే ఎక్కువగా ఆధారపడతారు. టాలీవుడ్‌లో క్యాస్టింగ్ డైరెక్టర్ల కొరత ఉంది. ముంబై, బెంగళూరు లాంటి చోట్ల క్యాస్టింగ్ ఏజెన్సీలు ఉంటాయి. అక్కడ నుంచి క్యాస్టింగ్ డైరెక్టర్లను మన దర్శకులు తీసుకుంటారు. వాళ్ల దగ్గర తెలుగు అమ్మాయిల ప్రొఫైల్స్ ఉండవు. ముంబై, బెంగళూరు హీరోయిన్ల ప్రొఫైల్స్ ఉంటాయి. అందులో నుంచి ఒకరిని దర్శకులు ఎంపిక చేసుకుంటారు. ముందు మనం మన క్యాస్టింగ్ డైరెక్టర్లకు పెద్దపీట వేయాలి. అప్పుడే మనవాళ్లకు అవకాశాలు వస్తాయి.

**బాగా చదువుకొని సినిమాల్లోకి వస్తానంటే ఇంట్లో వాళ్లు ఒప్పుకొన్నారా?**

'సినిమా అనేది వ్యాపారం. నువ్వు ఎమోషనల్‌గా, సెన్సిటివ్‌గా ఉంటావు. నెగ్గుకు రాలేవు. డాక్టర్‌గా మంచి జీవితం ఉంటుంద'ని అన్నారు. నేను ఇప్పుడున్న స్థాయికి చేరతానని ఆరోజే ఊహించాను. అందుకే వెనక్కు తగ్గలేదు. నేను ఎదిగే క్రమం చూసి, ఇంట్లో వాళ్లు క్రమంగా సపోర్ట్ చేశారు.

**హీరోయిన్ అంటే తెల్లగా ఉండాలనే** 

**మీ టాలెంట్ అందరికీ తెలిసింది. ఇకపై పెద్ద హీరోలు, దర్శకులు అవకాశం ఇస్తారంటారా?**

అవకాశం వస్తే మంచిదే. రాకపోతే మరింత కష్టపడతాను. జీవితం అంత సులువైనదని నేను అనుకోవడం లేదు. స్టార్ హీరోల సరసన అవకాశం వస్తే మంచిదే, చేస్తాను. కానీ వాళ్లతో నటించాలనే కోరికతో అయితే నేను పరిశ్రమకు రాలేదు. రచయితగా, దర్శకురాలిగా, నిర్మాతగా... ఇలా విభాగంతో సంబంధం లేకుండా పరిశ్రమలో ఉండడం, ప్రేక్షకులకు ఓ మంచి కథ చెప్పడమే నాకు ముఖ్యం.



> **సమాజంలో అందమైనవాళ్లకు మాత్రమే కథలు ఉంటాయా? ప్రతి ఒక్కరికీ కథ ఉంటుంది. రాళ్లెత్తే కూలీలు, ఇంట్లో పనిమనిషికి కూడా ఒక కథ ఉంటుంది. వాళ్ల జీవితాల్లోనూ మంచీ చెడూ, సంఘర్షణ ఉంటాయి. తెలుగు సినిమా అంతర్జాతీయ స్థాయికి చేరిందంటున్నారు. ఇంకా మనం ఒక అందమైన అమ్మాయి, ఆమెను కాపాడే హీరో అనే ఆలోచన దగ్గరే ఆగిపోదామా?**

**చిరంజీవి 'వశిష్ఠ'లో మీనాక్షిని హీరోయిన్‌గా తీసుకుంటున్నారనే టాక్ వినిపిస్తోంది?**

నాక్కూడా తెలియదు. అందరూ అంటున్నారు. నిజమైతే బాగుంటుంది.

**మీ అభిమాన రచయిత, మీపై ప్రభావం చూపిన పుస్తకం?**

చలంగారి ప్రభావం నాపైన చాలా ఉంది. ఆయన రచనల్లో 'స్త్రీ', 'బిడ్డల శిక్షణ', 'మైదానం' ఇష్టం. గొల్లపూడి మారుతీరావు పుస్తకాలు బాగా చదువుతాను. ఆంగ్లంలో యువల్ హరారీ, ఎడిత్ ఎవా ఎగెర్ రచనలు చదువుతాను.

**'మిస్ తెలంగాణ' టైటిల్ గెలుచుకున్నప్పుడు, 'మిస్ ఇండియా' తుదిపోరులో వెనుదిరిగినప్పుడు.. మీ మానసిక స్థితి ఎలా ఉంది?**

2018 ఫిబ్రవరిలో మిస్ తెలంగాణ గెలిచాను. జూన్‌లో మిస్ ఇండియా పోటీలకు వెళ్లాను. టాప్ 15 వరకూ పోటీ ఇచ్చాను. అంతవరకే అందరికీ తెలుసు కానీ ఈ పోటీల కోసం 2016 నుంచి సన్నద్ధమయ్యాను. అప్పుడు చైనాలో ఉన్నాను. ఆర్థికంగా ఇంట్లో భారం అవ్వకూడదని ఉదయం డాక్టర్‌గా జాబ్ చేస్తూ, సాయంత్రం చైనాలోని ఓ ఇండియన్ రెస్టారెంట్‌లో క్లాసికల్ డాన్స్‌లో ప్రదర్శనలు ఇచ్చేదాన్ని. రోజుకు నాలుగు గంటలే నిద్రపోయేదాన్ని. ఈ కష్టమంతా ప్రేక్షకులకు తెలియదు. వందమంది అమ్మాయిల్లో ఒక్కరు గెలిచారంటే మిగిలినవాళ్లంతా పరాజితులు అని కాదు. నా దృష్టిలో మనం అనుకున్న లక్ష్యం వైపు శక్తివంచన లేకుండా ప్రయత్నించడమే సక్సెస్. తుదికంటా పోరాడితే అది నా సక్సెస్. మధ్యలోనే వదిలేస్తే అది నా ఫెయిల్యూర్.

**'పొలిమేర 2'కు డైలాగ్స్, స్క్రీన్‌ప్లే రచయితగా, అసిస్టెంట్ డైరెక్టర్‌గా, నటిగా పలు శాఖల్లో పని చేశారు. సినిమాపై అంత మమకారం ఏమిటి?**

సినిమా అనేకాదు, స్వచ్ఛందసంస్థలో పని చేసినా, నాటకరంగంలో ఉన్నా, మెడిసిన్ చేసినా నేను ఇలానే కష్టపడ్డాను. 24 విభాగాల్లో యాక్టింగ్ అనేది ఒకటి మాత్రమే. యాక్టర్‌గా నా వల్లే సినిమా ఆడుతోంది అనుకోవడం సరికాదు.

**కొత్తగా వచ్చేవాళ్లకు మీరిచ్చే సలహా?**

వారసత్వంగా పరిశ్రమకు వచ్చేవాళ్లకు ఓ సౌలభ్యం ఉంటుంది. చిన్నప్పటి నుంచి వాళ్లు సినిమా మేకింగ్‌ను దగ్గర్నుంచి చూస్తారు. ఇంట్లోనే యాక్టర్‌లు ఉంటారు. సెట్స్‌కు వెళ్లి చూస్తూ నేర్చుకునే అవకాశం ఉంటుంది. కానీ బయటవాళ్లకు ఆ అవకాశం ఉండదు. అందుకే నాటకరంగంలో పనిచేయాలి. అక్కడ టెక్నిక్ పట్టుబడుతుంది. అప్పుడు మాత్రమే ప్రకాశ్‌రాజ్‌లా కొన్ని వందల సినిమాలు చేసినా జనాలకు మొనాటనీ రాదు. లేదంటే రెండు మూడు సినిమాలకే వెనక్కివెళ్లిపోవాల్సి వస్తుంది. అలాగే ఇక్కడ ఫెయిలైనా ఇబ్బందిపడకుండా మరో ప్రత్యామ్నాయం సిద్ధంగా ఉంచుకోవాలి. చాలా మంది ప్యాషన్ అని చెప్పి చిన్న వయసులోనే ఇండస్ట్రీకి వస్తారు. మొదట్లో బాగున్నా తర్వాత అవకాశాలు తగ్గితే మళ్లీ వెనక్కు వెళ్లి ఆర్థికంగా స్థిరపడడం కష్టం. అందుకే ముందు బాగా చదువుకోవాలి.

**చైనాలో ఆరేళ్లున్నారు. అక్కడ ప్రభుత్వం ప్రజలను అణచివేస్తుందనేది నిజమా?**

మనం బయటివాళ్లగా అక్కడి పరిస్థితుల గురించి కామెంట్ చేయకూడదు. చైనా ప్రజలు చాలా కష్టపడతారు. క్రమశిక్షణతో ఉంటారు. సమయపాలనను కచ్చితంగా పాటిస్తారు. వాళ్లను చూసి నేనూ అలా మారాను. వాళ్లు అక్కడి సిస్టమ్‌కు అలవాటుపడిపోయారనుకుంటా. 'మా జీవితం బాగాలే'దని ప్రజలు ఫిర్యాదు చేయడం నేను ఎక్కడా చూడలేదు. వినలేదు. చేసే పనితో వాళ్లు సంతోషంగా ఉన్నారు. వైద్య సదుపాయాలు మనకన్నా అక్కడ మెరుగ్గా ఉన్నాయి. ప్రైవేట్ హాస్పిటల్స్ లేవు. అందరికీ మెడికల్ ఇన్సూరెన్స్ ఉంటుంది. మారుమూల గ్రామాలకు కూడా వైద్యం అందుతుంది.

> **అందానికి మీరిచ్చే నిర్వచనం?**
> **భౌతిక సౌందర్యం అనేది ఇవాళ ఉంటుంది రేపు ఉండదు. మనం మనలా నిర్మొహమాటంగా జీవించగలగటమే అందం.**

**మహిళల కోసం పోరాడే క్రమంలో భౌతిక దాడులు కూడా ఎదుర్కొన్నారు?**

మధ్యతరగతి నేపథ్యమే దానికి కారణం. బాల్యం నుంచి నేను ఎదుర్కొన్న సంఘటనలు నన్ను ప్రభావితం చేశాయి. అందుకే ఒక స్థాయికి వచ్చాక ఇతరులకు నాకు చేతనైన సాయం చేయాలనుకున్నాను. పలు స్వచ్ఛంద సంస్థలతో కలసి పని చేస్తున్నాను.

• దండేల కృష్ణ

# అలాంటివేమీ పట్టించుకోను!

**బాలీవుడ్ నటిగా విపరీతమైన క్రేజ్ ఉన్న కథానాయిక కత్రినా కైఫ్. పెళ్లయ్యాక కూడా కత్రినా హవా ఏమాత్రం తగ్గలేదు. బ్రాండ్ అంబాసిడర్, నటి, ఇన్‌ఫ్లూయన్సర్‌గా, ఎంటర్‌ప్రెన్యూర్‌గా.... ఆమె ఫాలోయింగ్ అదుర్స్.. కత్రినా గురించి కొన్ని విశేషాలు...**

ఇన్‌స్టాలో కత్రినా కైఫ్‌ను ఎనిమిది కోట్ల మంది ఫాలో అవుతున్నారంటే. ఆమె క్రేజ్ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ సంఖ్య.. షుమారు మన రెండు తెలుగురాష్ట్రాల్లో ఉండే జన సంఖ్య అంత! ఇంతటి పాపులారిటీ ఒక్కరోజులో రాలేదు. ఎన్నో ఇబ్బందులు, వివాదాలు, బోయ్ ఫ్రెండ్స్ సృష్టించిన సమస్యలను దాటి ప్రయాణించింది కత్రినా. అందుకే నిలబడింది. అసలు నటిగానే పనికిరావు అన్న స్థితి నుంచి మంచి నటి అనిపించుకునే స్థాయికి ఎదిగింది. ఇదే ఆమె సక్సెస్!

**పదిహేడేళ్ల వయసులో ఇండస్ట్రీలోకి..**

కత్రినా కైఫ్ అంటే మనదేశమే అనుకునేంతగా మారిపోయింది. వాస్తవానికి హాంగ్‌కాంగ్‌లో పుట్టి పెరిగిన బ్రిటీష్ యువతి కత్రినా. టీనేజ్‌లోనే ర్యాంప్‌వాక్ చేసింది. బాలీవుడ్ దర్శకుడు కైజద్ చూసి 'బూమ్' సినిమాలో అవకాశం ఇచ్చాడు. ఆ సినిమా ఫ్లాపయ్యింది. 'మల్లీశ్వరి'తో తెలుగువారికి పరిచయమైంది. కత్రినా అంటే స్కిన్ షోనే తప్ప నటనే రాదని చాలా మంది తేల్చి చెప్పారు. ఆమె ఏమీ పట్టించుకోలేదు. 'సర్కార్', 'నమస్తే లండన్', 'వెల్‌కమ్', 'రేస్'లతో విజయకేతాన్ని ఎగరేసింది. 'రాజ్‌నీతి' చిత్రంతో నటిగా పేరు తెచ్చుకుంది. 'తీస్‌మార్ ఖాన్', 'జిందగీ నా మిలేగీ దొబారా', 'ఏక్తా టైగర్', 'జబ్ తక్ హై జాన్', 'ధూమ్ 3'.. మొన్నటి 'టైగర్ 3' వరకూ ఆమెకు దాదాపు మంచి విజయాలే దక్కాయి. 'అప్పుడూ ఇప్పుడూ అంతే. ఎన్ని సవాళ్లు వచ్చినా ఎదుర్కొన్నా. నా వరకూ రిగ్రెట్ లేవు. రిగ్రెట్ అనేది యూజ్‌లెస్ ఎమోషన్' అంటుంది కత్రినా. 'నన్ను నన్నుగా ఇష్టపడే విక్కీతో జీవితం పంచుకోవటం అదృష్టం' అంటుందీమె.



**ఎప్పుడూ ఇలానే ఉండదు..**

'ఇక్కడ విజయాలే ఉంటాయి. స్టార్సు నిలబడతారు. నా వరకూ ది బెస్ట్ అనిపించుకోవాలనుకుంటూ. ఇంకొకరిని ఫాలో అవ్వను. ఎనిమిదేళ్ల కితం వచ్చిన కథలు.. ఇప్పుడు వచ్చే కథలకు వ్యత్యాసం ఉంది. కాలం ఎప్పుడూ ఇలానే ఉండదంటే ఇదే'నంటుంది కత్రినా కైఫ్. ప్రతి పాత్రకూ హోమ్ వర్క్ చేస్తుంది. 'ఇక్కడ ఒక్కోసారి ఫార్ములాలనే నిలబడుతుంటాయి. అయితే మనకు ఇచ్చిన పాత్రలో ఎంత ఒదిగిపోయామన్నదే నటిగా సంతృప్తి' అంటుందీమె. 'సెట్స్‌లో నాచుట్టూ ఉండి నటించిన నటులంతా ఎంతో నేర్పించారు. ఎంతో మంది గురూస్ ఉన్నారు. నాలెడ్జ్, నటన, జీవితం తెలిసింది అంతా సెట్స్‌లోనే' అంటుంది కత్రినా.

**యోగానే బలం..**

'నటిగా స్లిమ్‌గా ఉండాలంటే పిజ్జా లాంటి ఆహారాన్ని తినలేను. ప్రతిరోజూ వర్కవుట్స్ చేస్తా. కనీసం రెండు గంటల పాటు జిమ్‌లో గడుపుతా. చదవటం, వ్యాయామాలే హ్యాపీనెస్ ఇస్తాయి. కొందరు జనాలు ఎమోషనల్‌గా ఇబ్బంది పెడతారు. మంచి ఆలోచనలు, మానసికంగా బలమైన స్థితిలో ఉండటానికి యోగానే ఎంతో సాయపడింది. యోగానే నా బలం. మనచుట్టూ ఎంతో నెగటివిటీ ఉంటుంది. మనతో పాటు కూడా నెగటివ్‌నెస్ ప్రయాణిస్తుంది. అలాంటివేమీ పట్టించుకోను. మైండ్ ప్రశాంతంగా ఉండాలంటే యోగా తప్పనిసరి' అంటూ కోట్ చేస్తుంది కత్రినా.

**అదే నా డ్రీమ్..**

విక్కీ కౌశల్‌ను పెళ్లి చేసుకున్న కత్రినా తక్కువగా మీడియాముందుకు వస్తోంది. విదేశాలకు ట్రిప్స్ వెళ్లిన ఫొటోలను కూడా షేర్ చేయటం తగ్గించేసింది. విపరీతమైన క్రేజ్ ఉన్న ఇన్‌స్టాలోనూ ఎలాంటి పర్సనల్ డీటైల్స్ షేర్ చేయదు కత్రినా. కత్రినా అమ్మ చారిటబుల్ వర్క్స్ చేస్తుంది. 'మా అమ్మనే నా బలం. ఆమెను చూసే జీవితం తెలుసుకున్నా. ఏడు మంది అక్కచెల్లెళ్లం. ఒక తమ్ముడు. అందరినీ పెంచి పోషించింది. ఆమె సంకల్పం గొప్పది' అంటుంది కత్రినా. 'అలియా భట్ యాంగ్జయిటీని ఓవర్‌కమ్ చేసింది. దీపికా పదుకోన్ డిప్రెషన్‌లోంచి బయటికొచ్చింది. ఇక్కడ ఎవరి సమస్యలు వారివే. వాటినుంచి బయటకు రావాలి. వారి సంకల్పం మీదనే జీవితం ఆధారపడి ఉంటుంద'టుందీమె. ఇప్పటికే బ్యూటీ ఇండస్ట్రీలోకి ఎంటర్‌ప్రెన్యూర్‌గా అడుగుపెట్టింది కత్రినా కైఫ్. స్ట్రగులింగ్ మదర్ రోల్స్ చేయాలనే ఆలోచన ఆమెకు ఉంది. నటిగా కొనసాగుతూనే.. సొంతంగా ప్రొడక్షన్ హౌస్ నెలకొల్పి.. సినిమాలు తీయాలనే డ్రీమ్ ఉందంటుంది కత్రినా కైఫ్.

మేకప్

## ఫేస్ మసాజ్ మంచిదే!

- ముఖం మీద స్క్రబ్ రాసుకోవటం మంచిదే. దీనివల్ల మృత కణాలు తొలగిపోతాయి. ముఖ్యంగా దుమ్ము, ధూళి కారణంగా ముఖం మీద అట్టకట్టినట్లుంది. దీనివల్ల సీబం ఉత్పత్తి అయి చర్మం జిడ్డుగా మారి రకరకాల సమస్యలు వస్తాయి. అందుకే స్క్రబర్స్‌తో ముఖాన్ని రుద్దుకోవాలి.
- స్క్రబ్ చేసే ముందు కచ్చితంగా ముఖాన్ని గోరువెచ్చటి నీటితో కడిగేయాలి. ఆ తర్వాత మెత్తని టవల్‌తో తుడుచుకోవాలి. ఇలా స్మూత్‌గా ఉన్నప్పుడే స్క్రబ్ చేసుకోవాల్సి ఉంటుంది.
- బొప్పాయి స్క్రబ్, గ్రీన్ టీ స్క్రబ్, కోకనట్- నిమ్మ స్క్రబ్, కుకుంబర్- మింట్ స్క్రబ్.. లాంటి చల్లని స్క్రబ్స్ మాత్రమే ముఖం మీద అప్లై చేయాలి. ఇలా చేయటం వల్ల చర్మం చల్లగా ఉంటుంది.
- స్క్రబర్స్‌తో మరీ గట్టిగా చర్మాన్ని రుద్దకూడదు. దీనివల్ల చర్మం ఎర్రగా కందిపోతుంది. మరిన్ని చర్మ సమస్యలు వస్తాయి.
- మొత్తానికి ముఖ చర్మం బట్టి స్క్రబర్స్ ఎంపిక చేసుకోవాలి. ముఖ చర్మం మీద మసాజ్‌లా మెల్లగా రుద్దాలి. దీని వల్ల రక్తప్రసరణ సాఫీగా జరుగుతుంది. ముఖం కాంతివంతంగా మెరుస్తుంది.



నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YE1MfRP లో చదవండి.

# స్పోర్ట్స్



## ఆమిర్.. రియల్ హీరో



కశ్మీర్ దివ్యాంగ క్రికెటర్‌కు సచిన్ ప్రశంసలు

శ్రీనగర్: రెండు చేతులూ లేకపోయినా బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ కూడా చేయగల కశ్మీర్ యువకుడు ఆమిర్ హుస్సేన్ ప్రతిభకు దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ అబ్బురపడ్డాడు. ఇటీవల అతడి వీడియోను చూసిన సచిన్ ఏదో ఒక రోజు కలుస్తానని సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ప్రస్తుతం సచిన్ కశ్మీర్ పర్యటనలోనే ఉండడంతో తన మాటను నిలబెట్టుకున్నాడు. కశ్మీర్ పారా క్రికెట్ జట్టు కెప్టెన్ కూడా అయిన 34 ఏళ్ల ఆమిర్‌ను మాస్టర్ తన విడిదికి పిలిపించుకుని ఆప్యాయంగా మాట్లాడాడు. అంతేకాకుండా తన సంతకంతో కూడిన బ్యాట్‌ను అతడికి బహుమతిగా అందించాడు. 'ఆమిర్ నిజమైన హీరో. నువ్విలాగే ఎంతో మందికి స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నా. నిన్ను కలిసినందుకు సంతోషంగా ఉంది' అని సచిన్ ఓ వీడియోను పోస్ట్ చేశాడు.

**ప్రమాదంలో చేతులు కోల్పోయినా..**

ఎనిమిదేళ్ల వయస్సులో తన తండ్రి మిల్లులో జరిగిన ప్రమాదంలో ఆమిర్ రెండు చేతులను కోల్పోయాడు. అయినా కుంగిపోకుండా మెడ, భుజం సాయంతో బ్యాట్ పట్టుకుని బ్యాటింగ్‌లో రాటుదేలాడు. అలాగే కుడి కాళ్ల మధ్య వేలిలో బంతిని ఇరికించుకుని బౌలింగ్ కూడా చేయగలడు. 2013 నుంచి ఆమిర్ ప్రొఫెషనల్ క్రికెటర్‌గా మారి రాష్ట్ర జట్టు కెప్టెన్ అయ్యాడు.

## హైదరాబాద్‌లో ప్రొ కబడ్డీ ప్లేఆఫ్స్ రేపటి నుంచి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) సీజన్ 10 ప్లేఆఫ్స్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం నుంచి ప్లేఆఫ్స్ పోటీలు జరగనున్నాయి. శనివారం నగరంలో జరిగిన కార్యక్రమంలో ప్లేఆఫ్స్ చేరిన ఆరు జట్ల కెప్టెన్లు ట్రోఫీతో ఫోజులిచ్చారు. సోమవారం జరిగే తొలి ఎలిమినేటర్‌లో దబాంగ్ ఢిల్లీతో పట్నా పైరేట్స్, రెండో ఎలిమినేటర్‌లో గుజరాత్ జెయింట్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడనున్నాయి. ఈనెల 28న సెమీఫైనల్స్, మార్చి 1న ఫైనల్ జరగనుంది.

## ఆంధ్ర 172 ఆలౌట్

ఇండోర్: రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో పోరులో ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో తేలిపోయింది. ఆటకు రెండోరోజైన శనివారం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర 172 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ రికీ భుయ్ (32), కరణ్ షిండే (38) మినహా అంతా విఫలమయ్యారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో మధ్యప్రదేశ్ ఆట ముగిసేసరికి 7 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 21 రన్స్ చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 234/9తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన మధ్యప్రదేశ్ ఎదుర్కొన్న తొలి బంతికే ఆఖరి వికెట్ కోల్పోయి ఆలౌటైంది.



సజన

## తగ్గేదేలె..

మహిళల ప్రీమియర్ లీగ్ తొలి మ్యాచ్‌లో ఆఖరి బంతికి సిక్స్ కొట్టి ముంబైకు సంచలన విజయం అందించిన కేరళ క్రికెటర్ సజన..ఆ ప్రదర్శనతో ఒక్కసారిగా స్టార్ అయిపోయింది. అయితే, ఆమె ఈస్థాయికి రావడం వెనుక ఎంతో పట్టుదల, శ్రమ దాగుంది. 29 ఏళ్ల సజనది వాయనాడ్‌లోని మనంతవాడి గ్రామం. తండ్రి సజీవన్ ఆటోడ్రైవర్. అరకొర ఆదాయంతో ఇల్లు గడవడమే కష్టమైనా.. కుమార్తె ఆసక్తిని గమనించిన తండ్రి ఆమెను క్రికెట్‌లో ప్రోత్సహించాడు. 2013లో కేరళ క్రికెట్ సంఘం అకాడమీలో సీటు సంపాదించిన సజన.. అంతర్ జిల్లా అండర్-19 టోర్నీలో రాణించడం ఆమె కెరీర్‌కు మలుపు. హార్డ్ హిట్టింగ్ బ్యాటర్, ఆఫ్‌స్పిన్ ఆల్‌రౌండర్‌గా కేరళ అండర్-19 జట్టులో చోటు దక్కించుకొన్న ఆమె.. వెంటనే సారథిగా జట్టు పగ్గాలందుకొంది. ఈ క్రమంలో తన ఏజ్ గ్రూప్ క్రికెట్‌లో వేగవంతమైన శతకం బాది రికార్డు సృష్టించింది. కేరళకు అండర్-23 టీ20 టైటిల్ అందించడంలో కీలకపాత్ర పోషించింది. భారత్-ఎ తరఫున సత్తా చాటింది. అంతా సవ్యంగా సాగిపోతుందనుకుంటున్న దశలో.. 2018లో వచ్చిన వరదల్లో తన ఇల్లు కొట్టుకుపోవడం, కరోనా సమయంలో అనారోగ్యానికి గురవడం లాంటి ఎన్నో సమస్యలు చుట్టుముట్టినా సజన మనోధైర్యంతో నిలబడింది. తొలి డబ్ల్యూపీఎల్ వేలంలో ఏ జట్టూ తనను తీసుకోకపోయినా నిరాశపడకుండా ఆటపైనే దృష్టి సారించింది. ఈసారి వేలంలో ముంబై జట్టుకు ఎంపికైంది. ఇక, ఆరంభ మ్యాచ్‌లోనే తాను ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్ బాది ముంబైని గెలిపించిన సజనను సహచరులంతా తమ జట్టు 'పొలార్డ్ అం టూ' ప్రశంసిస్తున్నారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా ఆటలో మాత్రం తగ్గేదేలె అన్నట్టుగా సజన దూసుకెళుతోంది.

- (ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

## ఆశా.. పాంచ్ పటాకా



ఆశా శోభన (5/22)

యూపీపై 2 పరుగులతో బెంగళూరు గెలుపు ● మెరిసిన మేఘన, రిచా



రిచా (62) మేఘన (53)

**సంక్షిప్త స్కోర్లు**

**బెంగళూరు:** 20 ఓవర్లలో 157/6 (రిచా ఘోష్ 62, మేఘన 53, రాజేశ్వరి 2/24).

**యూపీ:** 20 ఓవర్లలో 155/7 (గ్రేస్ హారిస్ 38, శ్వేతా షెరావత్ 31, తహిల 22, ఆశా శోభన 5/22).

**డబ్ల్యూపీఎల్‌లో నేడు**
**గుజరాత్ X ముంబై**
**రాత్రి 7.30 గం. నుంచి**

**బెంగళూరు:** స్పిన్నర్ ఆశా శోభన (5/22) తిప్పేయడంతో.. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు బోణీ చేసింది. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో శనివారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 2 పరుగులతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. రిచా ఘోష్ (37 బంతుల్లో 12 ఫోర్లతో 62), తెలుగ మ్మాయి సబ్బినేని మేఘన (44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 53) అర్ధ శతకాలతో అదరగొట్టడంతో.. తొలుత బెంగళూరు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 157 పరుగులు చేసింది. ఛేదనలో యూపీ ఓవర్లన్నీ ఆడి 155/7 స్కోరు మాత్రమే చేసింది. గ్రేస్ హ్యారిస్ (38), శ్వేతా షెరావత్ (31) టాప్‌స్కోరర్లు. ఆశా శోభనకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**ఒకే ఓవర్‌లో 3 వికెట్లు:** ఛేదనలో కెప్టెన్ హీలీ (5) రెండో ఓవర్‌లోనే అవుటైనా.. బ్రింద (18), తహిల మెక్‌గ్రాత్ (22) ఆచితూచి ఆడడంతో పవర్‌ప్లే ముగిసేసరికి యూపీ 36/1తో నిలిచింది. అయితే, రెండో వికెట్‌కు 38 పరుగులు జోడించిన బ్రింద, మెక్‌గ్రాత్‌లను 9వ ఓవర్‌లో ఆశా అవుట్ చేసింది. హ్యారిస్, శ్వేత నాలుగో వికెట్‌కు 77 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. చివరి 5 ఓవర్లలో 42 పరుగులు కావాల్సి రావడంతో వారియర్స్ గెలుపు ఖాయమనిపించింది. కానీ, 17వ ఓవర్‌లో శ్వేత, హ్యారిస్, కిరణ్‌ను అవుట్ చేసిన ఆశా.. మ్యాచ్‌ను మలుపు తిప్పింది. పూనమ్ (14)ను వేర్హమ్ బౌల్డ్ చేసింది. చివరి 6 బంతుల్లో 11 రన్స్ అవసరమవగా.. దీప్తి (13 నాటౌట్)ని భారీ షాట్లు ఆడకుండా మోలినెక్స్ కట్టడి చేసింది.

**ఆరంభంలో తడబాటు:** టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు.. డివైన్ (1), కెప్టెన్ స్మృతి మంధాన (13), పెర్రీ (8) స్వల్ప స్కోర్లకే వెనుదిరగడంతో ఆదిలోనే 54/3తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో మేఘన, రిచా నాలుగో వికెట్‌కు 71 పరుగులు జోడించారు. గైక్వాడ్ బౌలింగ్‌లో సిక్స్ బాదిన మేఘన.. సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొంది. కాగా, 14వ ఓవర్‌లో సైమా బౌలింగ్‌లో రిచా నాలుగు ఫోర్లతో 17 రన్స్ రాబట్టింది. అయితే, మేఘన, వేర్హమ్ (0)ను ఒకే ఓవర్‌లో రాజేశ్వరి వెనక్కిపంపింది. రిచా వరుస బౌండ్రీలతో అర్ధ శతకం చేసినా.. దీప్తి బౌలింగ్‌లో అవుటైంది. ఆఖరి ఓవర్‌లో శ్రేయాంక (8 నాటౌట్) భారీ సిక్స్‌తో జట్టు స్కోరును 160కి చేరువ చేసింది.

# తడ 'బ్యాటు'



షోయబ్ బషీర్ (4/84)



జైస్వాల్ (73)

నాలుగో టెస్టు

- భారత్ మొదటి ఇన్నింగ్స్ 219/7 • యశస్వీ అర్ధసెంచరీ
- స్పిన్నర్ బషీర్‌కు నాలుగు వికెట్లు • ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 353

**స్కోరుబోర్డు**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353**

**భారత్ మొదటి ఇన్నింగ్స్:** జైస్వాల్ (బి) బషీర్ 73; రోహిత్ (సి) ఫోక్స్ (బి) అండర్సన్ 2; గిల్ (ఎల్బీ) బషీర్ 38; రజత్ (ఎల్బీ) బషీర్ 17; జడేజా (సి) పోప్ (బి) బషీర్ 12; సర్ఫరాజ్ (సి) రూట్ (బి) హార్ట్‌లీ 14; జురెల్ (బ్యాటింగ్) 30; అశ్విన్ (ఎల్బీ) హార్ట్‌లీ 1; కుల్దీప్ (బ్యాటింగ్) 17; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 73 ఓవర్లలో 219/7. వికెట్ల పతనం:** 1-4, 2-86, 3-112, 4-130, 5-161, 6-171, 7-177. **బౌలింగ్:** అండర్సన్ 12-4-36-1; రాబిన్సన్ 9-0-39-0; బషీర్ 32-4-84-4; హార్ట్‌లీ 19-5-47-2; రూట్ 1-0-1-0.

**ఈసారి ఇంగ్లండ్‌కు కలిసొచ్చె..**

రాజ్‌కోట్‌లో జరిగిన మూడో టెస్టులో ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంపైర్ కాల్‌పై అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం గుర్తుండే ఉంటుంది. తమ స్టార్ ఓపెనర్ జాక్ క్రాలే ఆ విధంగా అవుట్ కావడమే దానికి కారణం. కానీ తాజా టెస్టు రెండో రోజు ఆటలో అదే అంపైర్ కాల్ కారణంగా ఇంగ్లండ్ భారీగా లాభపడింది. ఎందుకంటే క్రీజులో నిలదొక్కుకున్న గిల్‌తో పాటు రజత్ పటీదార్, అశ్విన్ సైతం అంపైర్ కాల్‌తోనే పెవిలియన్‌కు చేరాల్సి వచ్చింది. వీరి ఎల్బీల విషయంలో భారత్ డీఆర్ఎస్ తీసుకున్నా ఫీల్డ్ అంపైర్ అవుట్ ఇవ్వడం.. అటు ఇంపాక్ట్‌లోనూ అంపైర్ కాల్ రావడంతో చేసేదేమీ లేకపోయింది.

**5**వ టెస్టు సిరీస్‌లో 600+ పరుగులు సాధించిన ఐదో భారత బ్యాటర్‌గా జైస్వాల్ (618). గతంలో సర్దేశాయ్, గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ ఈ ఫీట్ సాధించారు.

రాంచీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టులో భారత జట్టు రెండో రోజు కూడా ఆకట్టుకోలేకపోయింది. ఈసారి బ్యాటర్లు సత్తాచాటడంలో విఫలమయ్యారు. 20 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ షోయబ్ బషీర్ (4/84) తన మ్యాజిక్ బంతులతో భారత టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్‌ను వణికించాడు. దీంతో జట్టు భారీ స్కోరుపై ప్రభావం పడింది. అదీగాకుండా అంపైర్ కాల్స్ కారణంగా మూడుసార్లు భారత్‌కు ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయి. యువ ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (117 బంతుల్లో 8 ఫోర్లు, సిక్సర్‌తో 73) మాత్రం అర్ధసెంచరీతో ఫామ్‌ను చాటుకోగా.. గిల్ (38), క్రీజులో ఉన్న ధ్రువ్ జురెల్ (30 బ్యాటింగ్) పర్వా లేదనిపించారు. ఫలితంగా రెండోరోజు శనివారం ఆట ముగిసేసరికి భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 73 ఓవర్లలో 7 వికెట్లకు 219 పరుగులు చేసింది. హార్ట్‌లీకి రెండు వికెట్లు దక్కాయి. ఇంకా 134 పరుగులు వెనుకబడి ఉన్న దశలో, మూడో రోజున జురెల్, కుల్దీప్ (17 బ్యాటింగ్) ఎంతసేపు వికెట్‌ను కాపాడుకుంటారనేది చూడాలి. పైగా మరో మూడు ఓవర్లలో ఇంగ్లండ్ కొత్త బంతిని తీసుకునే అవకాశం కూడా ఉంది. అంతకుముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగులకు ఆలౌటైంది. రూట్ (122 నాటౌట్) అజేయంగా నిలవగా, రాబిన్సన్ (58) అర్ధసెంచరీ సాధించాడు. ఎనిమిదో వికెట్‌కు ఈ జోడీ 102 పరుగుల భాగస్వామ్యం అందించింది. జడేజాకు నాలుగు, ఆకాశ్‌కు మూడు, సిరాజ్‌కు రెండు వికెట్లు దక్కాయి.

**జైస్వాల్ పోరాడినా..:** భారత్ తొలి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ ఆటే హైలైట్. మరో ఎండ్‌లో స్పిన్నర్ బషీర్ టపటపా వికెట్లు నేలకూలుస్తున్నా.. జైస్వాల్ మాత్రం ఆత్మవిశ్వాసంతో నిలిచాడు. మూడో ఓవర్‌లోనే రోహిత్ (2)ను అండర్సన్ అవుట్ చేయగా.. గిల్, యశస్వీ ఆదుకునే ప్రయత్నం చేశారు. లంచ్ బ్రేక్ తర్వాత గిల్ కాస్త జోరు పెంచి అండర్సన్ ఓవర్‌లో రెండు ఫోర్లు బాదాడు. కానీ బషీర్ ఈ ప్రమాదకర జోడీని విడదీస్తూ గిల్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో రెండో వికెట్‌కు 82 పరుగుల విలువైన భాగస్వామ్యం ముగిసింది. ఇక రజత్ పటీదార్ (17), జడేజా (12)లను బషీర్ వరుస ఓవర్లలో అవుట్ చేశాడు. అంతేకాకుండా స్వల్ప వ్యవధిలోనే బషీర్ భారత్‌కు మరో ఝలక్ ఇచ్చాడు. సెంచరీ వైపు వెళుతున్న జైస్వాల్‌ను తక్కువ బౌన్స్‌తో వచ్చిన బంతికి బౌల్డ్ చేశాడు. ఇక సర్ఫరాజ్ (14), అశ్విన్ (1)లను హార్ట్‌లీ అవుట్ చేయడంతో భారత్ ఇబ్బందుల్లో పడింది.

**ఆదుకున్న జురెల్-కుల్దీప్:** ఓ దశలో 177/7 స్కోరుతో ఉన్న జట్టు 200 పరుగులైనా చేయగలుగుతుందా? అనిపించింది. కానీ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, కుల్దీప్ యాదవ్ ఇంగ్లండ్ బౌలర్లను విసిగిస్తూ బ్యాటింగ్ సాగించారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా వికెట్‌ను కాపాడుకోవడమే లక్ష్యంగా ఆడారు. ఈ క్రమంలో ఇద్దరూ ఎనిమిదో వికెట్‌కు అజేయంగా 42 పరుగులు జోడించగా.. తామెదుర్కొన్న 106 బంతుల్లో రెండు ఫోర్లు, ఓ సిక్స్ మాత్రమే రావడం వీరి డిఫెన్సివ్ ఆటతీరును చూపుతోంది.

## 2025 నాటికి 170 గిగావాట్లకు పునరుత్పాక ఇంధన సామర్థ్యం



ఇక్రా వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో భారీ హైడ్రో విద్యుత్ ప్రాజెక్టులు ఉత్పత్తి చేసే విద్యుత్ మినహా మొత్తం పునరుత్పాదక ఇంధన స్థాపిత సామర్థ్యం వచ్చే ఏడాది మార్చి నాటికి 170 గిగావాట్లకు పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. గత ఏడాది డిసెంబరు నాటికి ఇది 135 గిగావాట్లుగా ఉంది. వచ్చే ఐదారు సంవత్సరాల కాలంలో పునరుత్పాదక ఇంధన (రెన్యువబుల్ ఎనర్జీ, ఆర్ఈ) సామర్థ్యాలు పెరగడంతో దేశవ్యాప్త విద్యుదుత్పత్తిలో భారీ హైడ్రో ప్రాజెక్టులు ఉత్పత్తి చేసే విద్యుత్ సహా మొత్తం ఆర్ఈ సామర్థ్యం 23 శాతం నుంచి 40 శాతానికి పెరుగుతుందని ఇక్రా అంచనా. దేశంలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలంటే ఆర్ఈ వనరుల విద్యుత్ అత్యంత కీలకమని పేర్కొంది. ప్రధానంగా ఇంధన నిల్వ వ్యవస్థల మద్దతుతో పాటు పవన, సౌర విద్యుత్ ఇంధన వినియోగం ఇందుకు ప్రధానంగా సహాయకారిగా ఉంటుందని తెలిపింది. కేంద్ర నోడల్ సంస్థలు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 16 గిగావాట్ల ప్రాజెక్టుల బిడ్లు ఆమోదించగా మరో 17 గిగావాట్ల బిడ్లు పరిశీలన దశలో ఉన్నాయని, ఇది పునరుత్పాదక ఇంధన విభాగానికి మరింత మద్దతు ఇస్తుందని ఇక్రా వెల్లడించింది.

**ఏటా 50 గిగావాట్లకు బిడ్డింగ్:** దేశంలో ఇంధన లభ్యత పెంచేందుకు ఏటా 50 గిగావాట్ల వార్షిక బిడ్డింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వం గత ఏడాది మార్చిలో ప్రకటించింది. అయితే విద్యుత్ నిల్వకు అయ్యే వ్యయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే ఆర్ఈ- రౌండ్ ది క్లాక్ (ఆర్‌టీసీ) విభాగంలో టారిఫ్‌లు విడిగా పవన, సౌర విద్యుత్ టారిఫ్‌లతో పోల్చితే అధికంగా ఉన్నట్టు ఇక్రా కార్పొరేట్ రేటింగ్స్ విభాగం హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ గిరీష్‌కుమార్ కదమ్ తెలిపారు. ఇటీవల ఆర్‌టీసీ బిడ్ టారిఫ్‌లు యూనిట్‌కు రూ.4 నుంచి రూ.4.50 మధ్యన ఉన్నాయి. అయితే పవన విద్యుత్ ప్రాజెక్టుల విభాగంలో ఎదురవుతున్న సరఫరా వ్యవస్థ సవాళ్లు ఆర్‌టీసీ ప్రాజెక్టుల అమలుకు అవరోధంగా నిలుస్తున్నట్టు ఆయన చెప్పారు.

అలాగే భూసేకరణ, ట్రాన్స్‌మిషన్ కనెక్టివిటీ సవాళ్లు కూడా సామర్థ్యాల జోడింపు అవకాశాలను దెబ్బ తీయవచ్చని పేర్కొన్నారు. ఇటీవల పీవీ సెల్ ధరలు 65 శాతం, పీవీ మాడ్యూల్ ధరలు 50 శాతం తగ్గడం వల్ల సౌర విద్యుత్ రంగంలో రుణ కవరేజీ మెట్రిక్స్ కూడా మెరుగుపడతాయంటున్నారు. దిగుమతి చేసుకున్న పీవీ సెల్స్‌తో దేశీయ ఓఈఎంలు తయారుచేసిన మాడ్యూల్స్‌ను సేకరించి, యూనిట్ రూ.2.5 బిడ్డింగ్ టారిఫ్‌తో వచ్చే సౌర విద్యుత్ ప్రాజెక్టులకు డెట్ సర్వీస్ కవరేజీ నిష్పత్తి (డీఎస్‌సీఆర్-ప్రస్తుత రుణ బాధ్యతలు తీర్చేందుకు అవసరమైన నగదు ప్రవాహం) 0.35 శాతం మెరుగుపడిందని కదమ్ అన్నారు.

# మార్కెట్ అవకతవకలపై జాగ్రత్త

బ్రోకర్లను హెచ్చరించిన సెబీ



న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్లో అవకతవకలపై మార్కెట్ నియంత్రణ మండలి సెబీ శాశ్వత సభ్యుడు కమలేశ్ చంద్ర హెచ్చరించారు. బ్రోకర్లు వీటిపై సదా కన్నేసి ఉంచాలని, ఆ తరహా ఉదంతాలను నిరోధించాలని ఆయన సూచించారు. మార్కెట్లో నేరాలకు పాల్పడిన వారిపై సెబీ కఠిన చర్యలు చేపడుతున్నదన్నారు. మదుపరులు విశ్వాసం కోల్పోతే మార్కెట్ మొత్తం విఫలమవుతుందన్నారు. ఇప్పటికీ మార్కెట్లో మోసా లు జరుగుతున్నాయని, అన్నింటిలోనూ నియంత్రణ మండలి కలుగజేసుకోలేదన్నారు. కొందరు బ్రోకర్లు మార్కెట్లో మోసాలకు పాల్పడుతున్నారు, మీ సంఘమే ఈ ఉదంతాలపై కన్నేసి ఉంచాలన్నారు. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ ఎక్స్ఛేంజెస్ మెంబర్స్ ఆఫ్ ఇండియా (ఏఎన్ఎంఐ) నిర్వహించిన 13 అంతర్జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

**ఏఐ సాయంతో దర్యాప్తు**

సెబీ తన దర్యాప్తులతో పాటు చాలా అంశాల్లో కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను వినియోగించుకుంటున్నదని కమలేశ్ చంద్ర తెలిపారు. వ్యాపార అభివృద్ధి, నిర్వహణ దక్షతను పెంచుకునే విషయంలో ఆధునిక సాంకేతిక వినియోగంపై దృష్టిసారించాలని ఆయన ఈ సందర్భంగా బ్రోకర్లకు సూచించారు.

## రైల్వేల చేతికి ఆర్ఐఎన్ఎల్ ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్!



న్యూఢిల్లీ: రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్, విశాఖ ఉక్కు)కు ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీలో ఉన్న ఫోర్జ్‌డ్ వీల్ ప్లాంట్ కొనుగోలు బరిలో భారతీయ రైల్వే ముందంజలో ఉన్నట్లు తెలిసింది. ఈ ప్లాంట్ టేకోవర్, ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు రైల్వే శాఖ ఇప్పటికే సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిందని సమాచారం. ఈ ప్రతిపాదనను త్వరలోనే కేబినెట్ ఆమోదం కోసం పంపే అవకాశం ఉంది. పూర్తి వాటా కొనుగోలు లేదా ఔట్‌సోర్స్ అగ్రిమెంట్ (ఉత్పత్తి ఆధారంగా చెల్లింపు) లేదా ఇతర రూపంలో డీల్ కుదిరే వీలుంది. ఈ విషయంపై ఇంకా తుది నిర్ణయానికి రావాల్సి ఉంది.

2021లో ఏర్పాటైన ఈ ప్లాంట్‌పై ఆర్ఐఎన్ఎల్ ఇప్పటికే రూ.2,250 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టింది. ఈ ప్లాంట్ ఏటా 80,000 ఫోర్జ్‌డ్ వీల్స్ తయారీ సామర్థ్యాన్ని కలిగి ఉంది. తొలుత లభించిన 2,000 వీల్స్ ఆర్డర్ల డెలివరీ 2022-23 ఆర్థిక సంవత్సరం నాటికి పూర్తయింది. కానీ, పలు కారణాల వల్ల ఈ ప్లాంట్ పూర్తి సామర్థ్యం మేరకు ఉత్పత్తి చేయలేకపోతోంది. ప్లాంట్ టేకోవర్ తర్వాత రైల్వేస్ ఉత్పత్తి సామర్థ్యాన్ని తొలి దశలో 40,000 యూనిట్లు, రెండో దశలో 60,000 యూనిట్లకు పెంచాలని భావిస్తోంది. ఈ ప్లాంట్ కొనుగోలు రైల్వేస్‌కు కలిసిరానుంది. ఎందుకంటే, రైల్వే శాఖ వీల్స్‌ను యూకే, చెక్ రిపబ్లిక్, బ్రెజిల్, రొమేనియా, జపాన్, చైనా, ఉక్రెయిన్, రష్యా నుంచి దిగుమతి చేసుకుంటోంది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.520 కోట్ల విలువైన 80,000 వీల్స్‌ను చైనా, రష్యా నుంచి దిగుమతి చేసుకుంది. మరో 40,000 వీల్స్‌ను సెయిల్ నుంచి కొనుగోలు చేసింది.

## 'దివాలా' చట్టంతో రూ.12.95 లక్షల కోట్లు

దారికొస్తున్న ఘరానా ప్రమోటర్లు : ఐబీబీఐ

న్యూఢిల్లీ: కొంతమంది ప్రమోటర్లపై దివాలా చట్టం (ఐబీసీ) బాగానే పని చేస్తోంది. ఈ చట్టం కారణంగా కంపెనీల యాజమాన్యం ఎక్కడ తమ నుంచి తప్పిపోతుందోనని భయపడుతున్నారు. రుణదాతలు తమను ఎన్‌సీఎల్‌టీలకు లాగక ముందే బకాయిలు క్లియర్ చేస్తున్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చిన 2016 డిసెంబరు నుంచి గత ఏడాది అక్టోబరు వరకు రూ.9.74 లక్షల కోట్ల బకాయిలు చెల్లించేశారు. ఇందుకోసం రుణదాతలకు 27,514 అప్లికేషన్లు అందాయి. ది ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ బోర్డ్ ఆఫ్ ఇండియా (ఐబీబీఐ) తన తాజా న్యూస్‌లెటర్‌లో ఈ విషయం తెలిపింది. మరో రూ.3.21 లక్షల కోట్లను రుణదాతలు ఎన్‌సీఎల్‌టీలకు వెళ్లి వసూలు చేసుకున్నారు. ఎన్‌సీఎల్‌టీలు స్వీకరించిన దివాలా కేసుల్లో రుణదాతల వసూళ్లు, మొత్తం బకాయిల్లో 32 శాతం మించడం లేదు. రుణదాతలు ఎంతకీ తేల్చకపోవడం ఇందుకు ప్రధాన కారణమని ఐబీబీఐ చైర్‌పర్సన్ రవి మిట్టల్ తెలిపారు.

# బిజినెస్

## ఉబెర్‌తో అదానీ భాగస్వామ్యం

భవిష్యత్‌లో జరగవచ్చని గౌతమ్ అదానీ సంకేతాలు



న్యూఢిల్లీ: ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తున్న ఉబెర్ సీఈఓ దారా ఖోస్రోషాహీ శనివారం అదానీ గ్రూప్ అధిపతి గౌతమ్ అదానీని కలిశారు. భవిష్యత్‌లో ఉబెర్‌తో తమ గ్రూప్ జట్టుకట్టే అవకాశాలున్నాయని ఈ సందర్భంగా అదానీ సంకేతాలిచ్చారు. ఈ భేటీలో భారత్ వృద్ధి అవకాశాలు, ఇక్కడి మార్కెట్‌పై తమ లక్ష్యాల గురించి చర్చించినట్లు ఇరువురు అధిపతులు ఎక్స్ (గతంలో ట్విటర్)లో పోస్ట్ చేశారు. "ఉబెర్ సీఈఓ దారా‌తో చర్చ ఆహ్లాదకరంగా జరిగింది. భారత్‌లో ఉబెర్ సేవల విస్తరణ, ముఖ్యంగా డ్రైవర్ల ఉద్ధరణ, వారి గౌరవాన్ని పెంచే విషయంలో ఆయన లక్ష్యాలు స్ఫూర్తిదాయకం. భవిష్యత్‌లో దారా, ఉబెర్ ఇండియా బృందంతో భాగస్వామ్యం కోసం ఉత్సాహంగా ఉన్నాం" అని అదానీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

## కార్మిక సంస్కరణలు చేపట్టాలి..

- నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు కల్పించలేకపోవడమే అసలు సమస్య
- 16వ ఆర్థిక సంఘం చైర్మన్ పనగడియా

ముంబై: దేశంలో కార్మిక సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని 16వ ఆర్థిక సంఘం చైర్మన్, నీతి ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియా అన్నారు. దేశంలో నిరుద్యోగిత అసలు సమస్య కాదని, కార్మికుల నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలు కల్పించలేకపోవడమేనని.. అందుకే దేశంలో ఉత్పాదకత తక్కువగా ఉందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఒకరు చేయగలిగే పనిని ఇద్దరు, ముగ్గురు నిర్వహిస్తున్నారని.. దాంతో మంచి వేతనంతో కూడిన అధిక ఉత్పాదక ఉద్యోగాల కల్పన సవాలుగా మారిందన్నారు. 'ఐడియాస్ ఆఫ్ ఇండియా సమ్మిట్ 3.0'లో దేశ ఆర్థికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన అంశంపై జరిగిన చర్చలో పాల్గొన్న సందర్భంగా పనగడియా ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే, వచ్చే 10 ఏళ్లలో దేశంలో ఉద్యోగాల కల్పన సమస్య పరిష్కారం కావచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ శ్రమ సమృద్ధి-పెట్టుబడుల కొరత దేశమని పనగడియా అభిప్రాయపడ్డారు.

**ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)**




| | | | |
|---|---|---|---|
| **24వ తేదీ** | | విజయవాడ | 515 |
| హైదరాబాద్ | 520 | విశాఖపట్నం | 525 |
| **25వ తేదీ** | | వరంగల్ | 522 |
| చిత్తూరు | 568 | డజను గుడ్లు రూ.72 | |
| గోదావరి | 515 | | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 140 | గోదావరి | 144 |
| వరంగల్ | 140 | విజయవాడ | 144 |
| కరీంనగర్ | 140 | గుంటూరు | 144 |
| మహబూబ్‌నగర్ | 140 | ఒంగోలు | 144 |
| కర్నూలు | 140 | చిత్తూరు | 144 |
| విశాఖపట్నం | 127 | | |

# బిల్డర్లకు నోటీసులు ఎందుకు వస్తున్నాయ్..?





రాంబాబు గొండాల

ఈ మధ్య కాలంలో నిర్మాణ రంగంలోని వారికి జీఎస్‌టీకి సంబంధించిన నోటీసులు రావటం గమనిస్తున్నాం. ముఖ్యంగా జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన 2017 జూలై నుంచి 2019 మార్చి మధ్య కాలానికి గాను ఎక్కువగా నోటీసులు వస్తున్నాయి. దీనికి కారణాలు అనేకం ఉన్నప్పటికీ ముఖ్య కారణం మాత్రం ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ను రివర్స్ చేయాల్సిన సందర్భాల్లో రివర్స్ చేయకపోవటం. దీని గురించి చాలా మంది బిల్డర్లకు అవగాహన లేకపోవటం వల్ల అధికారుల నుంచి నోటీసులు అందుకోవాల్సి వస్తుంది. అసలు తీసుకున్న ఐటీసీ ఎందుకు రివర్స్ చేయాలనే సందేహం చాలా మందిలో ఉండవచ్చు.

ఏదేనీ సరఫరా పన్ను పరిధిలోకి వస్తుంటే.. ఆ సరఫరా అందించటానికి పొందే ముడి పదార్థాలు, సేవల మీద ఐటీసీ తీసుకోవచ్చనే విషయం అందరికీ తెలిసిందే. అంటే నిర్మాణ రంగంలో ఉండే బిల్డర్లు తమ నిర్మాణానికి ఉపయోగపడే సిమెంట్, స్టీల్, టైల్స్, రంగులు, శానిటరీ వస్తువులతో పాటు తాము పొందే వివిధ రకాల సేవలు అంటే ఇంజనీరింగ్, రవాణా, మానవ వనరులు మొదలైన వాటి మీద ఐటీసీ తీసుకోవచ్చు. ఇలా తీసుకునే క్రెడిట్‌ను తాము అమ్మే అపార్ట్‌మెంట్స్ మీద కట్టాల్సిన పన్ను కోసం సర్దుబాటు చేసుకోవచ్చు. అయితే అపార్ట్‌మెంట్స్‌కు సంబంధించి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత జరిగే అమ్మకాలకు ఎలాంటి జీఎస్‌టీ చెల్లించాల్సిన అవసరం లేదు. మామూలుగా అయితే ఏదేనీ సరఫరా, పన్ను పరిధి నుంచి పన్ను మినహాయింపులోకి వస్తే, మినహాయింపు వచ్చిన తేదీ నాటికి తన దగ్గర మిగిలి ఉన్న స్టాక్ ఆధారంగా ఐటీసీని రివర్స్ చేయాలి. ఎందుకంటే, ఆ స్టాక్‌కు సంబంధించి ఇప్పుడు ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. కానీ, ఆ స్టాక్ మీద ఇంతకు ముందే క్రెడిట్ పొంది ఉన్నాడు. ఎప్పుడైతే అంతిమ సరఫరా పన్ను పరిధిలోకి రాదో దానికి సంబంధించిన ఇన్‌పుట్స్ మీద క్రెడిట్ రాదు. అందుకే, తన వద్ద మిగిలి ఉన్న స్టాక్‌కు సంబంధించి తీసుకున్న క్రెడిట్ రివర్స్ చేయాలి. ఈ విధంగా చూస్తే బిల్డర్ కూడా తనకు పన్ను మినహాయింపు నాటికి అంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి తాను ఐటీసీ పొంది, మిగిలి ఉన్న స్టాక్‌కు సంబంధించిన క్రెడిట్ రివర్స్ చేయాలి. ఇక్కడ తెలుసుకోవాల్సిన విషయం ఏమిటంటే, మిగిలి ఉన్న స్టాక్ అంటే మిగిలిన సిమెంట్, స్టీల్, టైల్స్ అని అర్థం కాదు. తాను ఏ ఇన్‌పుట్స్ ఉపయోగించి నిర్మాణం చేసాడో.. ఆ నిర్మాణానికి సంబంధించి అమ్ముడుపోకుండా మిగిలిన భాగం అని అర్థం.

అందుకే, ఎంత క్రెడిట్ రివర్స్ చేయాలి అనటానికి ఒక సులువైన ఫార్ములా ఉంది. మొదట, ఆ ప్రాజెక్ట్‌లో తీసుకున్న మొత్తం ఐటీసీని అంటే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చేంత వరకు తీసుకున్న క్రెడిట్‌ను లెక్కించాలి. అలాగే, ఆ ప్రాజెక్ట్‌లో మొత్తం కార్పెట్ ఏరియా, అమ్ముడు కాకుండా మిగిలిన కార్పెట్ ఏరియాను తీసుకుని , దామాషా పద్ధతిలో క్రెడిట్ రివర్స్ చేయాలి. ఉదాహరణకు ఒక ప్రాజెక్ట్‌లో మొత్తం నిర్మాణం 20 వేల చదరపు అడుగులు అనుకుందాం. అలాగే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి తీసుకున్న మొత్తం క్రెడిట్ రూ. కోటి అనుకుందాం. అలాగే కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి ఇంకా 5 వేల చదరపు అడుగుల నిర్మాణం అమ్మకం జరగకుండా మిగిలి ఉన్నదనుకుంటే, మొత్తం నిర్మాణంలో మిగిలిన నిర్మాణం 25 శాతం కాబట్టి, తీసుకున్న క్రెడిట్‌లో 25 శాతం అంటే రూ.25 లక్షల మేర క్రెడిట్ రివర్స్ చేయాలి. అయితే చాలా మంది బిల్డర్లు ఎదుర్కొనే సమస్య ఏమిటంటే తాము తీసుకున్న క్రెడిట్ మొత్తం, చెల్లించాల్సిన ట్యాక్స్ కోసం వాడుకుంటారు. కాబట్టి కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చే నాటికి వారి దగ్గర ఎలాంటి క్రెడిట్ మిగిలి ఉండదు. తమ దగ్గర ఎలాంటి క్రెడిట్ మిగల లేదు కాబట్టి, తాము క్రెడిట్ రివర్స్ చేయాల్సిన అవసరం లేదనుకుంటారు. కానీ, అది తప్పు. తమ దగ్గర క్రెడిట్ ఉన్నా లేకున్నా పైన చెప్పిన ఉదాహరణలో లాగా చెల్లించాల్సిన మొత్తం ప్రభుత్వానికి చెల్లించాలి.

ఇలా చెల్లించాల్సిన మొత్తాన్ని కంప్లీషన్ సర్టిఫికెట్ వచ్చిన తదుపరి ఆర్థిక సంవత్సరం సెప్టెంబరులోపు రివర్స్ చేయాలి. ఉదాహరణకు ఏదేనీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కంప్లీషన్ సర్టిఫికెట్ 2018-19లో వచ్చి ఉంటే, 2019 సెప్టెంబరు లోపు తాను రివర్స్ చేయాల్సిన మొత్తం ప్రభుత్వానికి చెల్లించాలి. అయితే ఆ మొత్తాన్ని 2018-19 ఆర్థిక సంవత్సరం చివరి నాటికి అంటే 31 మార్చిలోపు చెల్లిస్తే ఎలాంటి వడ్డీ చెల్లించనవసరం లేదు. లేదంటే 2019 ఏప్రిల్ 1 నుంచి వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. పైన చెప్పిన విషయాలను జాగ్రత్తగా పాటించటంతో పాటుగా ఇతర అంశాల పట్ల కూడా చట్టపరమైన అవగాహన కలిగి ఉండటం ఎంతో అవసరం.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

## టీడీపీ అసెంబ్లీ అభ్యర్థుల జాబితా

| సంఖ్య | నియోజకవర్గం | అభ్యర్థి పేరు | సామాజికవర్గం |
|---|---|---|---|
| 1. | ఇచ్ఛాపురం | బెందాళం అశోక్ | కాళింగ |
| 2. | టెక్కలి | కింజరాపు అచ్చెన్నాయుడు | పోలినాటి వెలమ |
| 3. | ఆముదాలవలస | కూన రవికుమార్ | కాళింగ |
| 4. | రాజాం(ఎస్సీ) | కోండ్రు మురళీమోహన్ | ఎస్సీ మాల |
| 5. | కురుపాం(ఎస్టీ) | తోయ్యక జగదీశ్వరి | ఎస్టీ జాతాపు |
| 6. | పార్వతీపురం(ఎస్సీ) | విజయ్ బోనెల | ఎస్సీ మాల |
| 7. | సాలూరు(ఎస్టీ) | గుమ్మడి సంధ్యారాణి | కొండదొర |
| 8. | బొబ్బిలి | ఆర్ఎస్‌వీకేకే రంగారావు | వెలమ |
| 9. | గజపతినగరం | కొండపల్లి శ్రీనివాస్ | తూర్పుకాపు |
| 10. | విజయనగరం | పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు | క్షత్రియ |
| 11. | విశాఖపట్నం తూర్పు | వెలగపూడి రామకృష్ణబాబు | కమ్మ |
| 12. | విశాఖపట్నం వెస్ట్ | పీజీవీఆర్ నాయుడు(గణబాబు) | గవర |
| 13. | అరకు లోయ(ఎస్టీ) | సియ్యారి దొన్నుదొర | ఎస్టీ కొండ దొర |
| 14. | పాయకరావుపేట(ఎస్సీ) | వంగలపూడి అనిత | ఎస్సీ మాదిగ |
| 15. | నర్సీపట్నం | చింతకాయల అయ్యన్నపాత్రుడు | కొప్పుల వెలమ |
| 16. | తుని | యనమల దివ్య | యాదవ |
| 17. | పెద్దాపురం | నిమ్మకాయల చినరాజప్ప | కాపు |
| 18. | అనపర్తి | నల్లిమిల్లి రామకృష్ణారెడ్డి | రెడ్డి |
| 19. | ముమ్మిడివరం | దాట్ల సుబ్బరాజు | క్షత్రియ |
| 20. | పి.గన్నవరం(ఎస్సీ) | సరిపెల్ల రాజేష్ కుమార్ (మహాసేన రాజేష్) | ఎస్సీ మాల |
| 21. | కొత్తపేట | బండారు సత్యానందరావు | కాపు |
| 22. | మండపేట | వేగుళ్ల జోగేశ్వరరావు | కమ్మ |
| 23. | రాజమండ్రి సిటీ | ఆదిరెడ్డి వాసు | కొప్పుల వెలమ |
| 24. | జగ్గంపేట | జ్యోతుల వెంకటప్పారావు(నెహ్రూ) | కాపు |
| 25. | ఆచంట | పితాని సత్యనారాయణ | శెట్టిబలిజ |
| 26. | పాలకొల్లు | నిమ్మల రామానాయుడు | కాపు |
| 27. | ఉండి | మంతెన రామరాజు | క్షత్రియ |
| 28. | తణుకు | ఆరుమిల్లి రాధాకృష్ణ | కమ్మ |
| 29. | ఏలూరు | బడేటి రాధాకృష్ణ | కాపు |
| 30. | చింతలపూడి(ఎస్సీ) | సొంగా రోషన్ | ఎస్సీ మాదిగ |
| 31. | తిరువూరు(ఎస్సీ) | కొలికపూడి శ్రీనివాసరావు | ఎస్సీ మాదిగ |
| 32. | నూజివీడు | కొలుసు పార్థసారథి | యాదవ |
| 33. | గన్నవరం | యార్లగడ్డ వెంకట్రావు | కమ్మ |
| 34. | గుడివాడ | వెనిగండ్ల రాము | కమ్మ |
| 35. | పెడన | కాగిత కృష్ణ ప్రసాద్ | గౌడ |
| 36. | మచిలీపట్నం | కొల్లు రవీంద్ర | అగ్నికుల క్షత్రియ |
| 37. | పామర్రు(ఎస్సీ) | వర్ల కుమార్ రాజా | ఎస్సీ మాదిగ |
| 38. | విజయవాడ సెంట్రల్ | బొండా ఉమామహేశ్వరరావు | తూర్పు కాపు |
| 39. | విజయవాడ ఈస్ట్ | గద్దె రామ్మోహన్‌రావు | కమ్మ |
| 40. | నందిగామ(ఎస్సీ) | తంగిరాల సౌమ్య | ఎస్సీ మాదిగ |
| 41. | జగ్గయ్యపేట | శ్రీరామ్ రాజగోపాల తాతయ్య | వైశ్య |
| 42. | తాడికొండ(ఎస్సీ) | తెనాలి శ్రావణ్‌కుమార్ | ఎస్సీ మాదిగ |
| 43. | మంగళగిరి | నారా లోకేశ్ | కమ్మ |
| 44. | పొన్నూరు | ధూళిపాళ్ల నరేంద్ర | కమ్మ |
| 45. | వేమూరు(ఎస్సీ) | నక్కా ఆనంద్‌బాబు | ఎస్సీ మాల |
| 46. | రేపల్లె | అనగాని సత్యప్రసాద్ | గౌడ్ |
| 47. | బాపట్ల | వేగేశ్న నరేంద్ర వర్మ | క్షత్రియ |
| 48. | ప్రత్తిపాడు(ఎస్సీ) | బూర్ల రామాంజనేయులు | ఎస్సీ మాదిగ |
| 49. | చిలకలూరిపేట | ప్రత్తిపాటి పుల్లారావు | కమ్మ |
| 50. | సత్తెనపల్లి | కన్నా లక్ష్మీనారాయణ | కాపు |
| 51. | వినుకొండ | జీవీ ఆంజనేయులు | కమ్మ |
| 52. | మాచర్ల | జూలకంటి బ్రహ్మానందరెడ్డి | రెడ్డి |
| 53. | ఎర్రగొండపాలెం(ఎస్సీ) | గూడూరి ఎరిక్షన్ బాబు | ఎస్సీ మాదిగ |
| 54. | పరుచూరు | ఏలూరి సాంబశివరావు | కమ్మ |
| 55. | అద్దంకి | గొట్టిపాటి రవికుమార్ | కమ్మ |
| 56. | సంతనూతలపాడు(ఎస్సీ) | బొమ్మాజి నిరంజన్ విజయ్‌కుమార్ | ఎస్సీ మాల |
| 57. | ఒంగోలు | దామచర్ల జనార్దన్‌రావు | కమ్మ |
| 58. | కొండెపి(ఎస్సీ) | డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి | ఎస్సీ మాల |
| 59. | కనిగిరి | ముక్కు ఉగ్రనరసింహారెడ్డి | రెడ్డి |
| 60. | కావలి | కావ్య కృష్ణారెడ్డి | రెడ్డి |
| 61. | నెల్లూరు సిటీ | పొంగూరు నారాయణ | తెలగ కాపు |
| 62. | నెల్లూరు రూరల్ | కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి | రెడ్డి |
| 63. | గూడూరు(ఎస్సీ) | పాశం సునీల్‌కుమార్ | ఎస్సీ మాల |
| 64. | సూళ్లూరుపేట (ఎస్సీ) | నెలవల విజయశ్రీ | ఎస్సీ మాల |
| 65. | ఉదయగిరి | కాకర్ల సురేష్ | కమ్మ |
| 66. | కడప | రెడ్డప్పగారి మాధవీరెడ్డి | రెడ్డి |
| 67. | రాయచోటి | మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి | రెడ్డి |
| 68. | పులివెందుల | మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) | రెడ్డి |
| 69. | మైదుకూరు | పుట్టా సుధాకర్‌యాదవ్ | యాదవ |
| 70. | ఆళ్లగడ్డ | భూమా అఖిలప్రియ రెడ్డి | రెడ్డి |
| 71. | శ్రీశైలం | బుడ్డా రాజశేఖర్‌రెడ్డి | రెడ్డి |
| 72. | కర్నూలు | టీజీ భరత్ | వైశ్య |
| 73. | పాణ్యం | గౌరు చరితారెడ్డి | రెడ్డి |
| 74. | నంద్యాల | ఎన్ఎండీ ఫరూఖ్ | ముస్లిం మైనారిటీ |
| 75. | బనగానపల్లి | బీసీ జనార్దన్‌రెడ్డి | రెడ్డి |
| 76. | డోన్ | కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి | రెడ్డి |
| 77. | పత్తికొండ | కేఈ శ్యాంబాబు | ఈడిగ-గౌడ్ |
| 78. | కోడుమూరు(ఎస్సీ) | బొగ్గుల దస్తగిరి | ఎస్సీ మాదిగ |
| 79. | రాయదుర్గం | కాల్వ శ్రీనివాసులు | బోయ |
| 80. | ఉరవకొండ | పయ్యావుల కేశవ్ | కమ్మ |
| 81. | తాడిపత్రి | జేసీ అస్మిత్‌రెడ్డి | రెడ్డి |
| 82. | శింగనమల(ఎస్సీ) | బండారు శ్రావణిశ్రీ | ఎస్సీ మాదిగ |
| 83. | కల్యాణదుర్గం | అమిలినేని సురేంద్రబాబు | కమ్మ |
| 84. | రాప్తాడు | పరిటాల సునీత | కమ్మ |
| 85. | మడకశిర(ఎస్సీ) | ఎంఈ సునీల్‌కుమార్ | ఎస్సీ మాదిగ |
| 86. | హిందూపురం | నందమూరి బాలకృష్ణ | కమ్మ |
| 87. | పెనుగొండ | సంజీవరెడ్డిగారి సవిత | కురబ |
| 88. | తంబళ్లపల్లి | సైకం జయచంద్రారెడ్డి | రెడ్డి |
| 89. | పీలేరు | నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి | రెడ్డి |
| 90. | నగరి | గాలి భానుప్రకాశ్ | కమ్మ |
| 91. | గంగాధర నెల్లూరు(ఎస్సీ) | డాక్టర్ వీఎం థామస్ | ఎస్సీ మాల |
| 92. | చిత్తూరు | గురజాల జగన్‌మోహన్ | కమ్మ |
| 93. | పలమనేరు | ఎన్ అమర్నాథ్‌రెడ్డి | రెడ్డి |
| 94. | కుప్పం | నారా చంద్రబాబునాయుడు | కమ్మ |

# రాష్ట్రం కోసం కలిసి వస్తున్నాం

**టీడీపీ, జనసేన శ్రేణులు ఐక్యంగా కదలాలి**
**టీడీపీ అభ్యర్థుల తొలి జాబితా విడుదలలో చంద్రబాబు**

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ-జనసేన కలిసి పోటీ చేస్తున్నాయని, వ్యక్తులు, పార్టీ ప్రయోజనం కోసం తాము కలవలేదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. శనివారం ఉండవల్లిలోని తన నివాసంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌తో కలిసి టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలి జాబితాను ఆయన విడుదల చేశారు. ఐదు కోట్ల మంది ప్రజల ప్రయోజనాల కోసం టీడీపీ-జనసేన కలిసి పనిచేయాలని నిర్ణయించాయని ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు. "ఇది రాష్ట్రానికి చరిత్రాత్మక రోజు. మంచి ప్రయత్నానికి ఇది తొలి అడుగు. రాష్ట్రం విడిపోవడం వల్ల జరిగిన నష్టం కంటే జగన్ సీఎం అయ్యాక ఏపీకి ఎక్కువ నష్టం జరిగింది. రాష్ట్రాన్ని అన్ని విధాలా కోలుకోలేకుండా దెబ్బతీశారు. ఇది నాకు, పవన్‌కు జరిగిన నష్టంకాదు. ఏపీ బ్రాండ్‌ను దెబ్బతీశారు. ఒక వ్యక్తి బయటకు వచ్చి అన్యాయం జరిగిందని చెప్పుకోలేని పరిస్థితి ఉంది. ప్రతి ఒక్కరినీ అవమానించారు. ఈ అవమానాలను ప్రజలు, మా కార్యకర్తలు, మేం కూడా భరించాం" అని చంద్రబాబు అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..


టీడీపీ, జనసేన అభ్యర్థుల జాబితాలను ప్రదర్శిస్తున్న చంద్రబాబు, పవన్

### మావైపు గ్రాడ్యుయేట్లు.. అటు గూండాలు

"టీడీపీ-జనసేన ఉమ్మడి తొలిజాబితాలో 99 మంది అభ్యర్థులను ఎంపిక చేశాం. ఇందులో టీడీపీ నుంచి 94 మందిని ప్రకటించాం. టీడీపీ జాబితాలోని 24 మంది మొదటిసారి పోటీకి సిద్ధమవుతున్నారు. డాక్టర్లు, ఐఏఎస్‌లు, గ్రాడ్యుయేట్లకు అవకాశం ఇచ్చాం. మరోవైపు వైసీపీ నేతలు... ఎర్రచందనం స్మగ్లర్లు, రౌడీలు, గూండాలను ఇన్‌చార్జులుగా ప్రకటించారు. మేం ప్రజలకు జవాబుదారీగా ఉండేవారినే ప్రకటించాం. రాగద్వేషాలకు అతీతంగా టీడీపీ-జనసేన శ్రేణులు పనిచేసి ప్రజల్లో బలమైన నమ్మకం కలిగించాలి. జనసేన నుంచి మంచి అభ్యర్థులను పవన్ కల్యాణ్ ప్రకటించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో నా రాజకీయ జీవితంలో ఎప్పుడూ చేయనంత కసరత్తు చేశాం. సుమారు 1.30 కోట్ల మంది అభిప్రాయాలు తీసుకున్నాం. అన్నికోణాల్లో విశ్లేషించిన తర్వాతే అభ్యర్థులను ఎంపిక చేశాం. "మాఘ పౌర్ణమి శుభ దినాన అభ్యర్థులను ప్రకటించాం. తొలి జాబితాపై చాలాసార్లు చర్చలు జరిపాం. 24 అసెంబ్లీ, 3 పార్లమెంటు సీట్లలో జనసేన పోటీచేస్తుంది. మిగిలిన సీట్లలో టీడీపీ పోటీ చేస్తుంది. బీజేపీ కూడా కలిసి వస్తే తగిన సమయంలో తగిన నిర్ణయం తీసుకుంటాం. రాష్ట్రాన్ని జగన్ నుంచి విముక్తి చేయడానికి రాష్ట్ర భవిష్యత్తు కోసం మేం పని చేస్తున్నాం. టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించిన రోజే మనం గెలిచాం. ఆనాడే వైసీపీ కాడి పడేసింది. రౌడీయిజం, దొంగ ఓట్లు చేర్చి గెలవాలని వైసీపీ నేతలు చూస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యం. ఒక వ్యక్తికి అధికారం శాశ్వతం కాదు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి ముప్పు వచ్చింది. దాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. మా దగ్గర డబ్బులు లేకపోవచ్చు. కానీ ప్రజాబలం ఉంది. విలువలతో కూడిన రాజకీయాలు చేశాం. ప్రజలే ముందుకొచ్చి టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించుకోవాలి."

## అర్థం చేసుకోండి... సహకరించండి

**బొల్లినేని, డోన్ సుబ్బారెడ్డికి చంద్రబాబు ఫోన్**

టీడీపీ టికెట్ ఆశించి భంగపడిన ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేనికి చంద్రబాబు ఫోన్ చేశారు. 'మిమ్మల్ని ఢిల్లీ ప్రతినిధిగా పార్టీ ఉపయోగించుకోవాలని అనుకొంటోంది. ఈ ఎన్నికల్లో ఉదయగిరిలో పార్టీ అభ్యర్థి కాకర్ల సురేశ్ విజయానికి సహకరించండి. పార్టీ జాతీయ కమిటీలోకి తీసుకొని ఢిల్లీ స్థాయిలో పార్టీ బాధ్యతలు అప్పగిస్తాం' అని చెప్పారు. దీనికి బొల్లినేని ఆమోదం తెలిపారు. డోన్ సుబ్బారెడ్డితోకూడా బాబు మాట్లాడారు. 'కొన్ని రాజకీయ సమీకరణాల వల్ల మీకు టికెట్టు ఇవ్వలేకపోతున్నాం. పార్టీ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి పని చేయండి' అని చంద్రబాబు విజ్ఞప్తి చేశారు.

## జనసేనకు 24 ఎమ్మెల్యే, 3 ఎంపీ

## రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

- బరిలో నిలిచే స్థానాల్లో గట్టి పోటీ ఇస్తాం: పవన్
- ఐదుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటన

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల్లో 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ నియోజకవర్గాల నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేస్తున్నారని ఆ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. శనివారం ఉండవల్లిలో టీడీపీ అధినేత చంద్రబాబుతో కలిసి టీడీపీ-జనసేన అభ్యర్థుల తొలిజాబితా విడుదల చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. ఎక్కువ స్థానాలు తీసుకుని ప్రయోగం చేసే కంటే తక్కువ స్థానాలు తీసుకుని రాష్ట్ర ప్రయోజనాలకు ఉపయోగపడేలా ముందుకెళ్తున్నామన్నారు. రాష్ట్రాన్ని దారిలో పెట్టడమే లక్ష్యమని, పార్టీ, వ్యక్తిగత ప్రయోజనాలు దాటి రాష్ట్ర ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకున్నామన్నారు. పార్లమెంట్ స్థానాల పరిధిని కలుపుకొంటే 40స్థానాల్లో పోటీ చేస్తున్నట్లే లెక్క అన్నారు. టీడీపీ-జనసేన పొత్తు బలంగా ఉండాలని బీజేపీని దృష్టిలో పెట్టుకున్నామన్నారు. నాయకులందరూ వ్యక్తిగత ప్రయోజనాలు పక్కనబెట్టి రాష్ట్ర ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటు చేయగానే త్యాగాలు చేసిన వారికి ప్రతిభను బట్టి భవిష్యత్తులో ప్రతిఫలం ఉంటుందని హామీ ఇచ్చారు. జనసేన ఓటు టీడీపీకి వెళ్లడం ఎంత ముఖ్యమో, టీడీపీ ఓటు జనసేనకు వెళ్లడమూ అంతే ముఖ్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు అద్భుతంగా ఉంటుందని, ఇరు పార్టీ నేతల మధ్య పొరపొచ్చాలు రాకూడదన్నారు. 'ఆయన(జగన్) సిద్ధం అంటున్నాడు. మేం యుద్ధం చేస్తాం. మనం గెలుస్తున్నాం. మన ప్రభుత్వం రాబోతుంది' అని పవన్ ధీమా వ్యక్తం చేశారు.

### ఆచితూచి ప్రకటన

జనసేన అభ్యర్థుల ప్రకటన విషయంలో పవన్ ఆచితూచి వ్యవహరించారు. 24 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించినా, ఐదు స్థానాలకు మాత్రమే అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. మిగతా నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల జాబితాను రెండు మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. తెనాలి నుంచి నాదెండ్ల మనోహర్, నెలిమర్ల నుంచి లోకం మాధవి, రాజానగరం నుంచి బత్తుల బలరామకృష్ణ, కాకినాడ రూరల్ నుంచి పంతం నానాజీ, అనకాపల్లి నుంచి కొణతాల రామకృష్ణ పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. ఉమ్మడి తూర్పుగోదావరిలో రెండు, విజయనగరంలో ఒకటి, విశాఖపట్నంలో ఒకటి, గుంటూరు జిల్లాలో ఒక స్థానానికి అభ్యర్థులను ప్రకటించారు. మరోవైపు సామాజిక వర్గాలకు ప్రాధాన్యం ఇచ్చారు. బ్రాహ్మణ, గవర, కమ్మ నుంచి ఒక్కొక్కరికి, ఇద్దరు కాపులకు సీట్లు ప్రకటించారు. టికెట్లు పొందినవారిలో నాదెండ్ల మనోహర్ తొలి నుంచి పవన్ వెన్నంటే ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. నెల్లిమర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న లోకం మాధవి ఇస్రోలో పని చేశారు. 2019లో కూడా నెల్లిమర్ల నుంచి పోటీ చేసిన ఆమె పార్టీ కోసం ఎంతో కష్టపడుతున్నారు. ఇటీవల పార్టీలో చేరిన సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణకు ప్రాధాన్యం ఇచ్చి టికెట్ కేటాయించారు. ఆయన అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గమంతా ప్రభావం చూపగల నాయకుడు. ఇక బత్తుల బలరామకృష్ణ, పంతం నానాజీ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్నారు. స్థానికంగా టీడీపీ నేతలను కలుపుకొని వెళ్తున్నారు.

### జనసేన అభ్యర్థులు

| నియోజకవర్గం | అభ్యర్థి పేరు | సామాజికవర్గం |
|---|---|---|
| తెనాలి | నాదెండ్ల మనోహర్ | కమ్మ |
| నెల్లిమర్ల | లోకం మాధవి | బ్రాహ్మణ |
| అనకాపల్లి | కొణతాల రామకృష్ణ | గవర |
| రాజానగరం | బత్తుల బలరామకృష్ణ | కాపు |
| కాకినాడ రూరల్ | పంతం నానాజీ | కాపు |

### '24'కు ప్రత్యేకత

జనసేన 24 అసెంబ్లీ స్థానాల నుంచి పోటీ చేస్తున్నట్టు పవన్ ప్రకటించిన ఆ సంఖ్యకు ఓ ప్రత్యేకత ఉంది. 2024లో అందులోనూ ఫిబ్రవరి 24వ తేదీన 24 స్థానాల్లో పోటీ చేస్తామని పవన్ ప్రకటించారు. ఇలా సంవత్సరం, తేదీ, సీట్ల సంఖ్యలో '24' ఉండటం విశేషం. ఇది యాధృచ్ఛికమైనా మూడు '24'లు రావడంపై పార్టీలో చర్చ జరుగుతోంది. ఇదేదో కలిసొచ్చే అంశంగా భావించే అధినేత ఇలా మూడు 24లు వచ్చేలా ప్లాన్ చేశారని కొంతమంది నాయకులు అంటున్నారు.

## సీట్లు కాదు.. నెగ్గడమే ముఖ్యం

- వైసీపీ ఓటమే లక్ష్యంగా పవన్ అడుగులు
- గెలిచే సీట్లపైనే జనసేనాని ఫోకస్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఎట్టి పరిస్థితుల్లోనూ వైసీపీని గద్దెదింపడమే లక్ష్యంగా జనసేనాని పవన్ కల్యాణ్ అడుగులు వేస్తున్నారు. పొత్తులో సీట్ల విషయంపై పూర్తి స్పష్టతతో వ్యవహరిస్తున్నారు. 'ఇక మాటల్లేవ్.. ఇదే ఫైనల్' అంటూ సీట్ల విషయంలో పార్టీ నాయకులకు, కేడర్‌కు క్లారిటీ ఇచ్చేశారు. మొన్నటి వరకూ జనసేన ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలి.. ఆ సీటు తీసుకోవాలి.. ఈ సీటు తీసుకోవాలి అంటూ పార్టీ నాయకులు, సానుభూతిపరులు, కాపు నేతలు స్టేట్‌మెంట్లు ఇచ్చేవారు. జనసేన 40 స్థానాల్లో పోటీ చేయాలని కొందరు.. 60 స్థానాల్లో అని మరికొందరు ప్రకటనలు ఇచ్చారు. అయితే పార్టీ బలం, నాయకుల పనితీరు, గెలుపు అవకాశాలను పరిగణనలోకి తీసుకుని సీట్లు ఎంపిక చేసుకున్నారు. జనసేన 24 అసెంబ్లీ, 3 పార్లమెంట్ నియోజకవర్గవర్గాల్లో పోటీ చేస్తుందని స్పష్టత ఇచ్చారు. ఎక్కువ సీట్లు తీసుకుని బలమైన అభ్యర్థులను నిలబెట్టకపోతే వాటిలో ఎక్కువ శాతం సీట్లు వైసీపీకి వెళ్లే ప్రమాదం లేకపోలేదు. వైసీపీని ఓడించడమే జనసేన లక్ష్యమని పవన్ పదేపదే కేడర్‌కు చెబుతూ పొత్తుకు వారిని సన్నద్ధం చేస్తూ వచ్చారు. పైగా జనసేన ఆశించే స్థానాల్లో టీడీపీకి బలమైన అభ్యర్థులున్నారు. వారిని కాదని జనసేనకు సీట్లు ఇస్తే ఇరు పార్టీల నేతల మధ్య సఖ్యత కుదరకపోవచ్చు. దీనివల్ల అంతిమంగా వైసీపీకి లాభం చేకూరుతుంది. ఈ పరిస్థితుల్లో తక్కువ సీట్లు తీసుకుని, అందులో 99%మందిని గెలిపించుకోవాలనే సంకల్పంతో ఉన్నారు. జనసేన-టీడీపీ-బీజేపీ పొత్తుల్లో పవన్ కీలకంగా వ్యవహరిస్తున్నారు. పొత్తులో బీజేపీకి కొన్ని సీట్లు కచ్చితంగా ఇవ్వాలి. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే జనసేన 24 అసెంబ్లీ స్థానాలు, 3 పార్లమెంట్ స్థానాలు తీసుకుంటుంది. తానొక్కడే అసెంబ్లీకి వెళ్లడం కాదు పోటీ చేసిన అందర్నీ అసెంబ్లీలో కూర్చోబెట్టాలన్న లక్ష్యంతో ఉన్నానని పవన్ అనేకసార్లు చెప్పారు. జనసేన తీసుకున్న స్థానాల్లో 99% గెలిస్తే అసెంబ్లీలో జనసేనకు ప్రాధాన్యం ఉంటుంది. ఇదే లక్ష్యంతోనే జనసేనాని అడుగులేస్తున్నారు. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్లు.. వైసీపీని ఓడించాలనే లక్ష్యం నెరవేర్చుకోవడంతో పాటు జనసేన నుంచి ఎక్కువమంది అసెంబ్లీకి వెళ్లాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు. అయితే కనీసం 30స్థానాలు తీసుకుంటే బాగుండేదన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. దీనిపై పవన్ పార్టీ నాయకులకు, కేడర్‌కు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

## బీజేపీకి పరిమితమే!

**4 అసెంబ్లీ, 4 లోక్‌సభ సీట్లు?**

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన కూటమితో చేతులు కలిపేందుకు సిద్ధంగా ఉన్న బీజేపీకి పొత్తులో భాగంగా ఇచ్చే సీట్లు పరిమితంగానే ఉంటాయని విపక్షం వర్గాల్లో చర్చసాగుతోంది. బీజేపీ జాతీయ నాయకత్వం కూడా ఎక్కువ సీట్లు కోరే ఆలోచనలో లేదని, తమకు ఏపీలో ప్రాతినిధ్యం ఉంటే చాలని భావిస్తోందని అంటున్నారు. బీజేపీకి 4 అసెంబ్లీ, 4 లోక్‌సభ సీట్లు ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. బీజేపీకి రాష్ట్రంలో పెద్దగా పట్టు లేదని, మరీ ఎక్కువ సీట్లు ఇస్తే ప్రత్యర్థి పార్టీ లాభపడే ప్రమాదం ఉందని టీడీపీ, జనసేన నేతలు భావిస్తున్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 13 అసెంబ్లీ సీట్లు ఇవ్వగా వాటిలో ఆ పార్టీ నాలుగు చోట్లే గెలిచింది. ఈసారి ఆ పరిస్థితి రానివ్వకుండా చూడాలని, అత్యధిక భాగం గెలుపొందే సీట్లే ఇవ్వాలన్న యోచనలో టీడీపీ, జనసేన ఉన్నాయి. విశాఖ(ఉత్తరం), కైకలూరు, ధర్మవరం తదితర సీట్లు ఆ పార్టీకి కేటాయించే అవకాశం ఉందని వినిపిస్తోంది. లోక్‌సభ స్థానాల్లో అరకు(ఎస్టీ), నర్సాపురం, రాజమహేంద్రవరం లేదా ఏలూరు, తిరుపతి(ఎస్సీ) ఇవ్వవచ్చని ప్రచారం జరుగుతోంది. రాయలసీమలో మరేదైనా సీటుపై కూడా పరిశీలన జరగవచ్చని అంటున్నారు. కాగా, అనకాపల్లి ఎంపీ సీటు జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలిసింది. ఆ పార్టీకి రెండు ఎంపీ సీట్లు ఇవ్వాలని గతంలో నిర్ణయం జరిగింది. తాము 3ఎంపీ సీట్లలో పోటీ చేస్తున్నట్లు పవన్ శనివారం ప్రకటించారు. మూడో సీటు అనకాపల్లి అని తెలిసింది. కాకినాడ, మచిలీపట్నం స్థానాలు గతంలో ఆ పార్టీకి కేటాయించారు. పవన్ సోదరుడు నాగబాబు అనకాపల్లి నుంచి ఎంపీగా పోటీ చేయబోతున్నారని, ఆయన కోసమే మూడో సీటును ఆ పార్టీ తీసుకుందని వినిపిస్తోంది.

# యూసీసీపై అసోం ముందడుగు

**» ముస్లిం వివాహ, విడాకుల నమోదు చట్టం రద్దు**

గువాహటి, ఫిబ్రవరి 24: ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) అమలు దిశగా అసోం ప్రభుత్వం ముందడుగు వేసింది. దీనిలో భాగంగా ముస్లిం వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టాన్ని రద్దు చేయాలని కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ప్రతిపాదనను 23న నిర్వహించిన కేబినెట్ భేటీలో ఆమోదించినట్లు ఆ రాష్ట్ర మంత్రి జయంత్ బారువా వెల్లడించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉంది. యూసీసీ అమలుకు అడుగులు వేయబోతున్నామని సీఎం హిమంత బిశ్వశర్మ ఇటీవల చెప్పారని, ఆ దిశగా కీలకమైన నిర్ణయం తీసుకున్నట్లు బారువా చెప్పారు. అసోం ముస్లిం వివాహాలు, విడాకుల రిజిస్ట్రేషన్ చట్టం-1935ను రద్దు చేయనున్నామని తెలిపారు. ఇకపైన ముస్లింల వివాహాలు, విడాకులు ఈ చట్టం కింద నమోదు కాబోవని స్పష్టం చేశారు. వీటిని స్పెషల్ మ్యారేజీ యాక్ట్ కిందకు తేవాలని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో బాల్య వివాహాలను నిరోధించడానికి ఈ నిర్ణయం దోహదపడుతుందని సీఎం హిమంత అన్నారు. అసోం ప్రభుత్వ నిర్ణయంపై సమాజ్‌వాది పార్టీ ఎంపీ ఎస్.టి. హసన్ స్పందించారు. దీన్ని అంతగా పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వాలు ఎన్ని చట్టాలైనా రూపొందించుకోవచ్చని, అయితే ప్రతి మతానికి సొంత ఆచారాలు ఉంటాయని, వేలాది సంవత్సరాలుగా పాటిస్తున్న ఆచారాలను ముస్లింలు ఇకపైనా కొనసాగిస్తారని తెలిపారు.

# టీఎంసీకి ఓటేయలేదని చిత్రహింసలు!

**» సందేశ్‌ఖాలీలో షాజహాన్, అనుచరుల అకృత్యాలు**

**» ఎస్టీ కమిషన్ బృందం పర్యటనలో వెలుగులోకి**

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఫిబ్రవరి 24: పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖాలీలో తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నేతల అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తమ పార్టీకి వ్యతిరేకంగా ఓటేశారని అక్కడ నివసించే పేద గిరిజనులను టీఎంసీ స్థానిక నేత షేక్ షాజహాన్, అతడి అనుచరులు చిత్రహింసలకు గురిచేసినట్లు జాతీయ ఎస్టీ కమిషన్(ఎన్‌సీఎస్టీ) గుర్తించింది. అలాగే ఉపాధి హామీ వేతనాలు సైతం వారినుంచి బలవంతంగా లాక్కున్నట్లు నిర్ధారించింది. షాజహాన్, అతడి అనుచరుల లైంగిక వేధింపులు, భూ కబ్జాలకు సంబంధించి 50కి పైగా ఫిర్యాదులు తమకు అందాయని కమిషన్ వైస్ చైర్మన్ అనంత నాయక్ వెల్లడించారు. గ్రామానికి పది కిలోమీటర్ల పరిధిలో వెయ్యి మందికి పైగా గిరిజనులు, గిరిజనేతరుల భూములను షాజహాన్ కబ్జా చేసినట్లు ఆరోపణలు వచ్చాయని చెప్పారు. తమకు ఎదురుతిరిగిన వారి పొలాల్లోకి సముద్రపు నీటిని వదిలిపెట్టి ఉప్పు కయ్యలుగా మార్చేవారని ఆరోపించారు. దేశంలో ఎక్కడా కూడా ఇలాంటి దారుణాలను చూడలేదని నాయక్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై కేంద్రానికి నివేదిక ఇస్తామని తెలిపారు. కాగా, సందేశ్‌ఖాలీలో అరాచకాలపై ఈ నెల 18న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సహాయ శిబిరాల్లో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకూ 1,250కి పైగా ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

# రాజస్థాన్‌లో ముగ్గురు మహిళా టీచర్ల సస్పెన్షన్

**» సరస్వతీ దేవి ఫొటో పెట్టనందుకు ఒకరిపై,**

**లవ్ జిహాద్‌కు సహకరిస్తున్నారని మరో ఇద్దరిపై చర్యలు**

జైపూర్, ఫిబ్రవరి 24: రాజస్థాన్‌లో ముగ్గురు మహిళా టీచర్లను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. సరస్వతీ దేవిని అవమానపరిచి మతపరమైన మనోభావాలను దెబ్బతీశారన్న కారణంతో ఒకరిపై, లవ్‌జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలతో మరో ఇద్దరిపై ఈ చర్యలు తీసుకొంది. మరో మహిళా టీచరుపై చర్యలు తీసుకునే ఆలోచనలో ఉంది. మతపర విద్వేషాలను రెచ్చగొట్టారంటూ బరన్ జిల్లా లక్డాయ్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రబోధక్ (లెవల్-1)గా పనిచేస్తున్న హేమలత బైర్వాను అధికారులు సస్పెండ్ చేశారు. రిపబ్లిక్ డే రోజున పాఠశాలలో జెండా ఎగరవేసిన సందర్భంగా గాంధీ, అంబేడ్కర్ ఫొటోలు పెట్టారు. సరస్వతీ దేవి ఫొటో కూడా పెట్టాలని గ్రామస్థులు కోరగా హేమలత అంగీకరించలేదు. చదువులకు సరస్వతీ దేవి ఏమి చేశారని ఎదురు ప్రశ్న వేశారు. దీంతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఆదేశాలతో ఉన్నతాధికారులు ఆమెను సస్పెండ్ చేశారు. లవ్ జిహాద్, ఇస్లామిక్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణపై కోటా జిల్లా ఖజూరీ ఓడ్‌పూర్ గ్రామంలోని ప్రభుత్వ సీనియర్ సెకండరీ పాఠశాలకు చెందిన ఇద్దరు మహిళా టీచర్లను మీర్జా ముజాహిద్, ఫిరోజ్ ఖాన్‌ను సస్పెండ్ చేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సర్వ హిందూ సమాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నారు. మరో టీచరు షబానాపై చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు చెప్పారు.

# బస్సుల్లోనూ సీటు బెల్టు ఉండాలి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: రోడ్డు ప్రమాదాల్లో మరణాలను నివారించేందుకు బస్సుల్లో కూడా సీటు బెల్టులను తప్పనిసరి చేయాలని అంతర్జాతీయ రోడ్డు సమాఖ్య (ఐఆర్ఎఫ్) కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. నిత్యం ఏదో ఒకచోట రోడ్డు ప్రమాదం జరుగుతుండడం, పెద్ద సంఖ్యలో ప్రాణనష్టం జరుగుతున్న నేపథ్యంలో.. ప్యాసింజర్ బస్సులు, స్కూల్ బస్సులు సహా భారీ వాహనాలన్నింట్లోనూ సీటు బెల్టులు ఏర్పాటు చేసే నిబంధన తీసుకురావాలని ఐఆర్ఎఫ్ అధ్యక్షుడు కేకే కపిల.. కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖకు సూచించారు. అమెరికా, చైనాలో ఇప్పటికే బస్సుల్లో సీటు బెల్టులను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. 2021 గణాంకాల ప్రకారం.. అమెరికాలో ఆ ఏడాది బస్సు ప్రమాదాల్లో కేవలం 14 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు.

# జాహ్నవి కేసు విచారణపై భారత్ అసంతృప్తి

సియాటెల్, ఫిబ్రవరి 24: అమెరికాలోని సియాటెల్ నగరంలో పోలీస్ వాహనం ఢీకొని మృతి చెందిన జాహ్నవి కందుల కేసు వ్యవహారంపై భారతీయ కాన్సులేట్ స్పందించింది. అమెరికన్ అధికారుల వద్ద కేసు దర్యాప్తు తీరు తెన్నులపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. కింగ్స్ కౌంటీ ప్రాసిక్యూటర్ కార్యాలయం బుధవారం ఓ ప్రకటన చేస్తూ... 'పూర్తి స్థాయి ఆధారాలు లేకపోవడంతో కందుల మరణానికి కారణమైన పోలీస్ అధికారి కెవిన్ దేవ్‌పై క్రిమినల్ నేరారోపణ చేయలేము' అని పేర్కొనడంపై కాన్సులేట్ స్పందిస్తూ... 'విచారణను తరువాతి స్థాయికి తీసుకువెళ్లే విషయమై సియాటెల్ పోలీసులతో మాట్లాడుతున్నాం. జాహ్నవికి, ఆమె కుటుంబానికి తగిన న్యాయం జరిగే వరకూ మా పూర్తి సహకారాన్ని అందిస్తాం' అని పేర్కొంది.

# యుద్ధానికి రెండేళ్లు.. రష్యాపై ఆంక్షల వర్షం

మాస్కో, ఫిబ్రవరి 24: రష్యాపై అగ్ర రాజ్యం అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) ఆంక్షల కొరడా ఝుళిపించాయి. ఉక్రెయిన్‌పై యుద్ధానికి దిగి రెండేళ్లు పూర్తయిన నేపథ్యం, ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ అనుమానాస్పద మృతి నేపథ్యంలో రష్యాకు చెందిన 500 మంది పైగా వ్యక్తులు, సంస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. ఆర్థికం, ఇంధనం రంగాలకు చెందిన ఈ సంస్థల్లో రష్యా రెండో అతిపెద్ద బ్యాంకు కూడా ఉంది. రష్యన్ వ్యాపారుల మీద అమెరికా న్యాయ శాఖ ఐదు కేసులు నమోదు చేయగా, యుద్ధానికి అవసరమైన టెక్నాలజీని సరఫరా చేసిన కంపెనీలపై ఈయూ చర్యలు తీసుకుంది. వీటిలో భారత్, శ్రీలంక, తుర్కియేలకు చెందిన సంస్థలు ఉండడం గమనార్హం. నావల్నీ భార్య, కుమార్తెతో అమెరికా అధ్యక్షుడు బైడెన్ సమావేశమయ్యారు. నావల్నీ అరెస్టుకు పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, ఉక్రెయిన్‌కు సంఘీభావంగా ఇటలీ, కెనడా, బెల్జియం ప్రధానమంత్రులు, యూఈ కమిషన్ చైర్ పర్సన్ ఉర్సులా వాన్‌డెర్ శనివారం కీవ్‌లో పర్యటించారు.

# ధాన్యం నిల్వ పథకానికి రూ.1.25 లక్షల కోట్లు

## ప్రపంచంలోనే అతిపెద్ద స్కీమ్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ

**» దేశవ్యాప్తంగా వేలాదిగా గోదాములు, గిడ్డంగుల నిర్మాణం**

న్యూఢిల్లీ/వారాణసీ, ఫిబ్రవరి 24: దేశంలోని రైతన్నలకు లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రపంచంలోనే అతిపెద్ద ధాన్యం నిల్వ పథకాన్ని ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ పథకం కింద వచ్చే ఐదేళ్లలో వేలాది గోదాములు, గిడ్డంగులను నిర్మించడం ద్వారా సహకార రంగంలో 700 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని సృష్టించనున్నట్టు శనివారంనాడిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ పేర్కొన్నారు. ఇందుకోసం రూ.1.25 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. 11 రాష్ట్రాల్లో 11 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఏర్పాటు చేసిన 11 గోదాములను ఆయన ప్రారంభించారు. అలాగే మరో 500 పీఏసీఎస్‌లలో గోదాములు, ఇతర వ్యవసాయ మౌలిక సదుపాయాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ "ఈ రోజు మన రైతుల కోసం ప్రపంచంలోనే అతిపెద్ద నిల్వ పథకాన్ని ప్రారంభించాం" అని పేర్కొన్నారు. దేశంలో నిల్వకు సంబంధించిన మౌలిక సదుపాయాలులేని కారణంగా రైతులు భారీగా నష్టాలను భరించాల్సి వస్తోందని ఆయన అన్నారు. భారీగా నిల్వ సదుపాయాలను సృష్టించడం ద్వారా రైతులు తమ ఉత్పత్తులను గోదాములు/గిడ్డంగులలో నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని, దీనిపై సంస్థాగత రుణాన్ని పొందడానికి, మార్కెట్లో మంచి ధరలు వచ్చినప్పుడు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. వంట నూనెలు, పప్పులు వంటి ఆహార ఉత్పత్తులతోపాటు ఫెర్టిలైజర్స్ దిగుమతులను తగ్గించే దిశగా పని చేయాలని సహకార సంస్థలను ప్రధాని కోరారు. కోఆపరేటివ్స్‌లోని ఎన్నికల విధానంలో పారదర్శకతను తీసుకురావాల్సిన అవసరం ఉందన్న ప్రధాని.. దీని వల్ల సహకార ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. "సహకార్ సే సమృద్ధి" విజన్‌లో భాగంగా సహకార రంగాభివృద్ధి కోసం గత పదేళ్ల కాలంలో అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు ప్రధాని తెలిపారు. ఇందులో భాగంగా సహకార రంగం కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసినట్టు గుర్తు చేశారు. మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టాన్ని సవరించామని, పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేస్తున్నామని చెప్పారు. రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్‌పీవో) గురించి ప్రధాని మాట్లాడుతూ.. చిన్న రైతులు ఆంత్రప్రెన్యూర్లుగా మారుతున్నారని, తమ ఉత్పత్తులను ఎగుమతి కూడా చేస్తున్నారని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో 2 లక్షల పీఏసీఎస్‌లను ఏర్పాటు చేయాలన్న లక్ష్యం ఉందని, ఇందులో మత్స్య, అనుబంధ వ్యవసాయ రంగాల్లోనే ఎక్కువ ఉంటాయని చెప్పారు. ఆహారం, ఇంధన ఉత్పత్తులకు సంబంధించిన భారత్ దిగుమతుల బిల్లును తగ్గించేందుకు సహకార రంగం సహాయపడాలన్నారు.



ధాన్యం నిల్వ పథకం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ, సహకార మంత్రి అమిత్ షా

### 65వేల పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ

ఈ ఏడాది ఆగస్టుకల్లా దాదాపు 65వేల పీఏసీఎస్‌లను కంప్యూటరీకరణ చేయనున్నట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. దీని వల్ల వాటి సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు. 65వేల పీఏసీఎస్‌లలో ఇప్పటికే 18,000 పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ పూర్తయిందని, ఎన్నికలకన్నా ముందే 30వేల పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ జరుగుతుందని చెప్పారు. రూ.2,516 కోట్లతో పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణకు గత ఏడాది జూన్‌లో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది.

### కాంగ్రెస్‌కు కుటుంబమే ముఖ్యం: మోదీ

కుటుంబ, బుజ్జగింపు రాజకీయాలు, ఆశ్రిత పక్షపాతం, అవినీతికి మించి కాంగ్రెస్ పార్టీ ఆలోచించలేదని ప్రధాని మోదీ విమర్శించారు. దేశాభివృద్ధి అనేది ఆ పార్టీ అజెండాలో ఎప్పుడూ లేదన్నారు. శనివారం ఆయన 'వికసిత్ భారత్ వికసిత్ చండీగఢ్' కార్యక్రమంలో వర్చువల్‌గా ప్రసంగించారు. రూ.34,400 కోట్ల విలువైన పది అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కాగా, మోదీ గురువారం తన నియోజకవర్గం వారాణసీలో 'నారీ శక్తి వందన్ - అభినందన్' కార్యక్రమంలో 5 వేల మంది మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఆమోదం అనంతరం ఆశీస్సులు అందుకోవడానికి వచ్చానన్నారు. రాణీ లక్ష్మీబాయి జన్మస్థలం కాశీయేనని గుర్తుచేస్తూ స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి చంద్రయాన్ వరకు మహిళలు పోషించిన పాత్రను కొనియాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదింపజేసినందుకు కృతజ్ఞతగా మోదీపై మహిళలు పూలజల్లు కురిపించారు.

# కేంద్ర ఉద్యోగులకు వచ్చే నెలలో డీఏ పెంపు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మార్చి నెలలో 4 శాతం డీఏ పెంచే అవకాశం ఉంది. ఏటా వినియోగదారుల ధరల సూచిక(సీపీఐ) ఆధారంగా డీఏ ఎంతమేరకు పెంచాలో కేంద్రం నిర్ణయిస్తుంది. ప్రస్తుతం సీపీఐ 12 నెలల సగటు 392.83 పాయింట్ల వద్ద ఉంది. దీని ప్రకారం కేంద్ర ఉద్యోగులకు డీఏ మూల వేతనంలో 50.26 శాతం ఉండవచ్చు. కేంద్రం ఏటా జనవరి, జూలై నెలల్లో డీఏని సవరిస్తుంది. అయితే గతేడాది అక్టోబరు నెలలో డీఏని 4% పెంచగా మొత్తం 46 శాతానికి చేరింది. కాగా మార్చిలో పెంచనున్న డీఏ ఈ ఏడాది జనవరి 1 నుంచే అమలవుతుంది. ఈమేరకు కేంద్ర ఉద్యోగులు, పింఛనుదారులకు బకాయిలు చెల్లించే అవకాశం ఉంది.

# కొత్త నేర న్యాయ చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): బ్రిటిష్ కాలం నాటి నేర న్యాయ వ్యవస్థను ప్రక్షాళన చేసేలా కొత్తగా రూపొందించిన మూడు నేర న్యాయ చట్టాలు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు నోటిఫికేషన్లు జారీ చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న భారతీయ శిక్షా స్మృతి-1860, నేర శిక్షాస్మృతి-1898, భారతీయ సాక్ష్యాధార చట్టం-1872 స్థానంలో భారతీయ న్యాయ సంహిత-2023, భారతీయ నాగరిక సురక్షా సంహిత-2023, భారతీయ సాక్ష్య-2023 చట్టాలు దేశమంతా అమలవుతాయని పేర్కొంది. గతేడాది డిసెంబరు 21న పార్లమెంటు ఈ బిల్లులకు ఆమోదం తెలిపింది. డిసెంబరు 25న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. శనివారం కేంద్ర హోం శాఖ కొత్త చట్టాల వర్తింపుపై మూడు నోటిఫికేషన్లు జారీ చేసింది. కాగా హిట్ అండ్ రన్ కేసులకు కొత్త చట్టం అమలు చేయడంపై కేంద్ర ప్రభుత్వం తాత్కాలికంగా మినహాయింపు ఇచ్చింది. భారతీయ న్యాయ సంహితలోని 106 (2) సెక్షన్ నిబంధన మినహా కొత్త చట్టాలు జూలై 1 నుంచి అమల్లో వస్తాయని నోటిఫికేషన్‌లో పేర్కొంది. నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఓ వ్యక్తి మరణానికి కారణమైన హిట్ అండ్ రన్ కేసులో 10 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా విధించేలా చట్టంలో చేర్చిన ఈ సెక్షన్ అమలుపై డ్రైవర్లు నిరసన తెలపడంతో కేంద్రం తాత్కాలికంగా వెనక్కి తగ్గింది.

## లద్దాఖ్‌కు రాష్ట్ర హోదాపై పరిశీలన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈశాన్య రాష్ట్రాలు మాదిరిగానే గిరిజన ప్రాంతంగా పరిగణించి, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చే అంశంపై కూడా అధ్యయనం చేస్తామని తెలిపింది. ఆరో షెడ్యూలులో చేర్చితే స్వయంప్రతిపత్తిగల అభివృద్ధి మండళ్ల ఏర్పాటు చేయడంతో పాటు, భూములు, ఆరోగ్యం, వ్యవసాయం వంటి అంశాల్లో సొంతంగా నిబంధనలు రూపొందించుకోవచ్చు. ప్రత్యేక సర్వీసు కమిషన్ ఏర్పాటును కూడా పరిశీలించనున్నట్టు తెలిపింది. శనివారం ఇక్కడ లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రాటిక్ అలయెన్స్ సంస్థల ప్రతినిధులతో జరిగిన చర్చల్లో కేంద్ర హోం శాఖ అధికారులు ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా, కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలో మంచులో నిరవధిక నిరాహార చేయాలన్న తన నిర్ణయాన్ని వాయిదా వేసుకుంటున్నట్టు పర్యావరణ ఉద్యమకారుడు సోనం వాంగ్‌చుక్ ప్రకటించారు.

# అమాయకుల మీదికే బుల్డోజర్లు

**యూపీ సర్కార్‌పై ప్రియాంక ధ్వజం.. రాహుల్‌తో కలిసి యాత్ర**



జోడో యాత్రలో రాహుల్‌తో ప్రియాంక

లఖ్‌నవూ, ఫిబ్రవరి 24: యూపీలో అమాయకుల ఇళ్లను కూల్చేస్తున్న బుల్డోజర్లు నేరస్థుల ఇళ్ల జోలికి మాత్రం వెళ్లవని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ విమర్శించారు. పేపర్ లీకేజీకి పాల్పడిన, మహిళలను హింసించిన, రైతులను జీపులతో తొక్కి చంపిన నేరస్థుల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చడం లేదంటూ యూపీలోని బీజేపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర రెండ్రోజుల విరామం అనంతరం యూపీలోని మొరాదాబాద్‌లో శనివారం తిరిగి ప్రారంభమైంది. రాహుల్‌తో కలిసి ఈ యాత్రలో పాల్గొన్న ప్రియాంక మొరాదాబాద్‌లో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఇదిలా ఉండగా, సోమవారం ఆగ్రాలో జరిగే యాత్రలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ పాల్గొంటారు. కేంబ్రిడ్జి యూనివర్సిటీలో ప్రసంగించేందుకు రాహుల్ గాంధీ యూకే పర్యటనకు వెళుతుండడంతో ఫిబ్రవరి26 నుంచి మార్చి 1 దాకా జోడో న్యాయ్ యాత్రకు విరామం ప్రకటించారు. మార్చి 2న ధోల్‌పూర్ నుంచి యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది.

### యూపీలో మళ్లీ కానిస్టేబుల్ నియామక పరీక్ష

ప్రశ్నాపత్రాలు లీకైన పోలీస్ కానిస్టేబుల్ నియామక పరీక్షను మళ్లీ నిర్వహించాలంటూ యూపీ యువత నిర్వహిస్తున్న ఉద్యమానికి యోగి సర్కారు దిగి వచ్చింది. ఆరు నెలల్లో పరీక్షను తిరిగి నిర్వహిస్తామని, పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను ప్రభుత్వ ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా తీసుకెళ్తామని శనివారం ప్రకటించింది.

# 5 రాష్ట్రాల్లో ఆప్-కాంగ్రెస్ ఉమ్మడి పోరు

## పంజాబ్‌లో మాత్రం ఎవరికివారే

**» అవినీతి పొత్తు మాబాగా కుదిరింది: బీజేపీ**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: పార్లమెంటు ఎన్నికల్లో పొత్తులపై అనేక తర్జనభర్జనల నడుమ ఢిల్లీ అధికార పార్టీ ఆప్.. కాంగ్రెస్ పార్టీతో చేతులు కలిపింది. ఢిల్లీ, గోవా, గుజరాత్, హరియాణా, చండీగఢ్‌లలోని పార్లమెంటు స్థానాల్లో ఉమ్మడిగా పోటీ చేయాలని రెండు పార్టీలూ నిర్ణయించాయి. ఆప్ ప్రధాన కార్యదర్శి సందీప్ పాఠక్ శనివారం మీడియాతో మాట్లాడుతూ.. "రాజకీయ ప్రాధాన్యాల కన్నా దేశ ప్రయోజనాలు మిన్న అని భావించాం. కాంగ్రెస్‌పై నమ్మకంతోనే ఆ పార్టీతో చేతులు కలిపాం" అని పేర్కొన్నారు. ఇండియా కూటమిలో ఆప్ కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ మాట్లాడుతూ.. ఢిల్లీ సహా పశ్చిమ ఢిల్లీ, దక్షిణ ఢిల్లీ, తూర్పు ఢిల్లీ స్థానాల్లో ఆప్ పోటీ చేస్తుందన్నారు. చాందినీ చౌక్, ఈశాన్య ఢిల్లీ, వాయువ్య ఢిల్లీ సీట్లలో కాంగ్రెస్ పోటీలోకి దిగుతుందని తెలిపారు. ఈ ఏడు స్థానాల్లోనూ 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ విజయం దక్కించుకుంది. ఇక, గుజరాత్‌లోని మొత్తం 26 స్థానాల్లో రెండు చోట్ల(భారుచ్, భావ్‌నగర్) ఆప్, మిగిలిన స్థానాల్లో కాంగ్రెస్ పోటీ చేయనున్నాయి. అదేవిధంగా గోవాలోని రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ పోటీ చేయనుండగా, చండీగఢ్‌లోని ఒకే ఒక స్థానం నుంచి కూడా బరిలోకి దిగనుంది. అయితే, గోవాలోని దక్షిణ నియోజకవర్గం నుంచి ఆప్ ఇదివరకే తన అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే వెంజీ వేగాస్‌ను ప్రకటించింది. అయితే, ఆయనను పక్కకు తప్పించి కాంగ్రెస్ అభ్యర్థి ఫ్రాన్సిస్కో సర్దిన్హా ఇక్కడ నుంచి పోటీ చేయనున్నారు. హరియాణాలోని 10 స్థానాలో కాంగ్రెస్ 9 చోట్ల, ఆప్ ఒక స్థానం(కురుక్షేత్ర) నుంచి పోటీ చేయనున్నాయి. కీలకమైన పంజాబ్‌లో మాత్రం కాంగ్రెస్, ఆప్‌లు ఎవరికి వారుగా పోటీ చేయనున్నారు. "ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాం" కాంగ్రెస్ నేత వాస్నిక్ తెలిపారు.

| రాష్ట్రం | సీట్లు | కాంగ్రెస్ | ఆప్ |
|---|---|---|---|
| ఢిల్లీ | 7 | 3 | 4 |
| గుజరాత్ | 26 | 24 | 2 |
| గోవా | 2 | 2 | 0 |
| ఛండీగఢ్ | 1 | 1 | 0 |
| హరియాణా | 10 | 9 | 1 |

### సహకరించేది లేదు: పటేల్ కుటుంబం

గుజరాత్‌లోని భారుచ్ స్థానాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత అహ్మద్ పటేల్ కుమారుడు ఫైజల్ పటేల్ ఆశించారు. కానీ, ఈ సీటును ఆప్‌కు ఇవ్వడంతో ఆయన భగ్గుమన్నారు. ఆప్‌కు సహకరించేది లేదని కుండబద్దలు కొట్టారు. గతంలో అహ్మద్‌పటేల్ 1970-1980 మధ్య మూడు సార్లు భారుచ్ నుంచి విజయం సాధించారు. అయితే, ఆప్ నుంచి పోటీకి సిద్ధమైన చైతర్ వాసవ మాత్రం తాను ఇక్కడ నుంచి గెలిచి అహ్మద్ పటేల్‌కు అంకితమిస్తానని వ్యాఖ్యానించారు. కాగా, కాంగ్రెస్, ఆప్ పొత్తులపై బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కేంద్ర మంత్రి మీనాక్షి లేఖి మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్-ఆప్‌ల మధ్య 'అవినీతి పొత్తు' మాబాగా కుదిరిందన్నారు.

# బదిలీల్లో అలసత్వం సహించబోం

**» అధికారిని తాను పనిచేసే జిల్లాకు పక్కనే, అదే నియోజకవర్గంలోని జిల్లాకు పంపొద్దు**

**» బదిలీ మార్గదర్శకాలను పాటించాల్సిందే.. రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికలసంఘం నిర్దేశాలు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 : సార్వత్రిక ఎన్నికలవేళ అధికారుల బదిలీల విషయంలో రాష్ట్రాలకు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్దిష్ట మార్గదర్శకాలను జారీచేసింది. బదిలీ ప్రక్రియలో అలసత్వాన్ని సహించబోమని స్పష్టం చేసింది. పని చేస్తున్న జిల్లాకు పక్కనే ఉన్న, అదే నియోజకవర్గం పరిధిలోని జిల్లాకు అధికారిని పంపితే.. దానిని బదిలీగా పరిగణించబోమని స్పష్టం చేసింది. ఎన్నికలకు ముందు అధికారులకు స్థానచలనం కలిగించడం ఎన్నికల నిబంధనల్లో భాగం. సొంత జిల్లాల్లో పని చేస్తున్నవారినీ, పనిచేస్తున్న చోట మూడేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న అధికారులను తప్పనిసరిగా బదిలీ చేయాల్సి ఉంటుంది. పోటీలో ఉన్న ఏదో ఒక రాజకీయ పార్టీ లేక అభ్యర్థికి అనుకూలంగా తమ అధికారాలను అధికారులు వినియోగించకుండా ఈసీ ఈ నిబంధనను గట్టిగా అమలు చేస్తోంది. అయితే, కొన్ని చోట్ల బదిలీ ప్రక్రియను తూతూమంత్రంగా చేపడుతున్నట్టు ఈసీ తన పర్యటనల్లో గమనించింది. దీనిని ఈసీ చాలా తీవ్రంగా పరిగణించింది. బదిలీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని రాష్ట్రాలకు గట్టిగా సూచించింది. "సమదృష్టిలో అధికారులు ఎన్నికల నిర్వహణ చేపట్టాలి. ఎవరి వల్లా ఈ ప్రక్రియ ఇబ్బందుల్లో పడకుండా మార్గదర్శకాలను మరింత బలోపేతం చేశాం. మార్గదర్శకాల్లో మేం గుర్తించిన చిన్న చిన్న లొసుగులను కూడా సరిదిద్ది సమగ్ర విధానంతో ఈసారి ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్నాం" అని శనివారం ఒక ప్రకటనలో సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు.

# 36% రాజ్యసభ అభ్యర్థులపై క్రిమినల్ కేసులు

**బరిలోని 58 మంది అఫిడవిట్‌ల విశ్లేషణ**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24: ఈ ఏడాది ఏప్రిల్‌లో ఖాళీ అయ్యే 56 రాజ్యసభ స్థానాల కోసం ఈనెల 27న పోలింగ్ నిర్వహించనున్నారు. 15 రాష్ట్రాల నుంచి 59 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో ఒకరు మినహా మొత్తం 58 మంది అఫిడవిట్‌లను విశ్లేషించిన ఏడీఆర్, నేషనల్ ఎలక్షన్ వాచ్ సంస్థలు వారిపై క్రిమినల్ కేసుల వివరాలను వెల్లడించాయి. 58 మందిలో 21 మంది (36%)పై క్రిమినల్ కేసులున్నాయి. అందులోనూ 10 మంది (17%) తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటున్నారు. పార్టీల పరంగా చూస్తే 30 మంది బీజేపీ అభ్యర్థుల్లో 8 మందిపై, 9 మంది కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఆరుగురిపై, ముగ్గురు వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల్లో ఒకరిపై, పోటీలో ఉన్న ఒకే ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిపై కూడా క్రిమినల్ కేసులున్నాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No. 76, Ashwini Layout, Huda Heights, Road No. 70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.




గిరిప్రదక్షిణలో వాహనాన్ని లాగుతున్న ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు, మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తికి పూజలు నిర్వహిస్తున్న ఈవో రామారావు తదితరులు

## ఘనంగా గంగా పార్వతీ మల్లేశ్వరుల

# గిరిప్రదక్షిణ

**వన్‌టౌన్, ఫిబ్రవరి 24:** మాఘ పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం గంగా పార్వతీ మల్లేశ్వరుల గిరిప్రదక్షిణ నిర్వహించారు. ఇంద్రకీలాద్రి టోల్‌గేట్ వద్ద ఉత్సవ మూర్తులను వేదికపై ఉంచిన వాహనం బయలుదేరక ముందు స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ముఖ్య అర్చకుడు యజ్ఞనారాయణలు వేద మంత్రోచ్ఛారణల మధ్య బలిహారణలు సమర్పించారు. ఉత్సవమూర్తులకు హారతులు సమర్పించాక భక్తుల జయ జయ ధ్వానాల మధ్య గిరిప్రదక్షిణ బయలుదేరింది. ఈవో రామారావు, ఈఈ కోటేశ్వరరావు, స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు లాంచనంగా వాహనాన్ని లాగారు. అనంతరం అమ్మవారి సేవలో తరించేందుకు భక్తులు కొందరు వాహనాన్ని లాగారు. కుమ్మరిపాలెం,విద్యాధరపురం, నాలుగుస్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేళా రోడ్డు, చనుమోలు వెంకట్రావు బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట బ్రాహ్మణవీధి రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి ఉత్సవమూర్తులు చేరుకున్నారు, అనంతరం ఉత్సవమూర్తులను గర్భాలయంలోకి చేర్చారు. కాగా ఇద్దరు ఔత్సాహికులు తొలిసారిగా గిరిప్రదక్షిణలో పాల్గొని శంఖారావాన్ని పూరించారు. భక్తుల చెవులకు శంఖారావం ఆద్యంతం ఓంకార నాదం వినిపించింది.

**తప్పెట్లు లేవు.. మేళ తాళాలు లేవు..**

గిరిప్రదక్షిణలో తప్పెట్లు, మేళతాళాలు లేవు. కేవలం అమ్మవారి ప్రచార వాహనానికున్న మైక్ ద్వారా అమ్మవారి భక్తిపాటలను వినిపించారు. కోలాట నృత్య బృందం ఒకటి పాల్గొంది కాని, ఆకర్షణగా ఉత్సవశోభకు తగ్గట్లుగా కోలాట నృత్యం చేయలేదు. తప్పెటలు ఎందుకు లేవని ఆరాతీస్తే ఇప్పటివరకు ఎంతో ఆకట్టుకునేలా తప్పెట్లను వాయించి భక్తజనాన్ని ఉత్సాహపరిచిన గరికపర్రుకు చెందిన తప్పెట వాయిద్య కారులకు డబ్బులివ్వకపోవడతో వారు రాలేదని చెబుతున్నారు. మరోవైపు దేవస్థానంలో 30 మంది సన్నాయి, డోలు వాయించేవారుండగా, వారిలో కొంతమందినైనా గిరిప్రదక్షిణ దారి పొడవునా వినియోగించుకోలేదు. కొన్ని గజాల వరకు గిరిప్రదక్షణలో కొనసాగి వెనుతిరిగారు. ఈవోగా భ్రమరాంబ ఉన్నపుడు ఆమె గిరిప్రదక్షిణలో నడిచి మిగతావారికి స్ఫూర్తినిచ్చేవారు.

**దుర్గాఘాట్‌లో మంగళాద్రి నారసింహుడుడికి పూజలు**

మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం మంగళగిరి లక్ష్మీ నరసింహస్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. సీతానగరంలోని ఆంజనేయస్వామి ఆలయానికి తొలుత విచ్చేసిన ఉత్సవమూర్తులను అక్కడి నుంచి కృష్ణానదిలో తెప్పోత్సవంలో ఊరేగించారు. ఈసందర్భంగా దుర్గాఘాట్‌కు వచ్చిన గరుడ వాహనారూఢుడైన స్వామికి దుర్గగుడి ఈవో రామారావు ముఖ్య అర్చకుడు శంకరశాండిల్య ప్రత్యేక అర్చనలు, హారతులు సమర్పించారు. ఆలయం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు.

**రేపటి నుంచి దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం**

ఈనెల 26న నుంచి మార్చి 1 వరకు ప్రముఖ శతావధాని మాడుగుల నాగ ఫణి శర్మచే దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం దుర్గగుడిలో జరుగుతుందని ఈవో రామారావు వెల్లడించారు. ఉప కార్యనిర్వహణ అధికారి లీలాకుమార్, పాలక మండలి సభ్యుడు చింకా సింహాచలం, స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాదశర్మ పాల్గొన్నారు.



**ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన**

ధర్మపథం వేదికపై శనివారం సాయంత్రం చింతా వెంకట శివరామకృష్ణకుమార్ ఆధ్వర్యంలో భక్తికీర్తనలకు నాట్య బృందంచే నాట్యప్రదర్శన జరిగింది. సాయి అక్షిత, చంద్రిక వైష్ణవి, సాయి, హారిక, యశస్విని జశ్విక, లిఖిత శ్రీ, ప్రియాంక, గ్రీష్మ, నహుష్ నాట్య బృందంలో ఉన్నారు.

# ఖబరస్తాన్ ధ్వంసం

## అభివృద్ధి పేరుతో జేసీబీలతో పెద్దల సమాధుల తొలగింపు

● ఎమ్మెల్సీ రుహుల్లా అత్యుత్సాహంపై ముస్లింల తీవ్ర ఆగ్రహం ● ముస్లింల పెద్దల పండుగ షబేబరత్‌కు ముందురోజు కూల్చివేత

**అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 24:** నెల రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్, మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సెంట్రల్‌లో మైనార్టీలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా వైసీపీ ఖబరస్తాన్ అభివృద్ధి పేరుతో సమాధులు కూల్చడంపై నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అజిత్‌సింగ్‌నగర్‌లోని ముస్లిం శ్మశానవాటిక ఖబరస్తాన్ అభివృద్ధి అంటూ వైసీపీ నేతలు 4 నెలలుగా అర్భాటం చేస్తూ వచ్చారు. ఆ పనిని స్థానిక ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లాకు అప్పగించారు. అయితే ఎమ్మెల్సీ రుహుల్లా అత్యుత్సాహం, అవగాహన రాహిత్యం ఇప్పుడు వైసీపీ కొంప ముంచింది. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే సమాధులను పూర్తిగా పెకిలించివేయడమే కాకుండా సమాధులపై నుంచి జేసీబీలు, లారీలు చక్కర్లు కొడుతుండటంపై మైనార్టీలు తీవ్ర ఆగ్రహంతో ఊగిపోతున్నారు. ఖబరస్తాన్ అభివృద్ధి చేస్తానని చెప్పి తమ తండ్రులు, తాతల సమాధులను జేసీబీలతో కూలగొట్టడంపై మైనార్టీలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. ముస్లింలు ఖబరస్తాన్‌లో జరుపుకునే పెద్దల పండుగ షబేబరత్‌కు 2 రోజుల ముందే సమాధులు తొలగించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

**అభివృద్ధి పేరుతో సమాధులు ధ్వంసం**

అజిత్‌సింగ్‌నగర్ వాంబేకాలనీ రోడ్డులో 3దశాబ్దాలకు పైగా హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశానవాటికలున్నాయి. 4నెలల క్రితం ముస్లిం శ్మశానవాటికను రూ.50లక్షల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఈపనులను ఎమ్మెల్సీ రుహుల్లా దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నిధులు తెచ్చింది తానేనని ప్రచారం చేసుకున్నాడు. రెండ్రోజుల క్రితం ఖబరస్తాన్‌లోకి జేసీబీలను తరలించి దశాబ్దాలుగా ఉన్న సమాధులను తొలగించి వేశారు. మెరక వేసేందుకు వచ్చిన మట్టి లారీలు సైతం సమాధులపై నుంచే వెళ్లి వస్తున్నాయి.



ఖబరస్తాన్‌లో సమాధులు తొలగించిన ప్రాంతంలో తిరుగుతున్న ట్రాక్టర్

శ్మశానమంతా జేసీబీలు, లారీలు చక్కర్లు కొడుతుండటం, కింద సమాధులుండటంపై మైనార్టీలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తాము ఎంతో పవిత్రంగా భావించే తమ పెద్దల సమాధులపై వాహనాలు తిరుగుతుండటం సమాధులను తొలగించివేయడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**పెద్దల పండుగకు ముందు రోజే..**

ముస్లింలు పవిత్రంగా జరుపుకునే పెద్దల పండుగ షబేబరత్ (ఆదివారం) ముందు రోజే సమాధుల తొలగింపుపై మైనార్టీలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పండుగ నాడు ఉదయం మసీదులో ఫజర్ నమాజ్ చేసుకుని అనంతరం ఖబరస్తాన్‌కు వెళ్లి తమ పెద్దల సమాధులపై పువ్వులు, అత్తరు చల్లి దరుద్ చదివి ఫతెహా చేసి తమ పెద్దలను స్మరించుకుంటారు. అయితే ఈ ఏడాది అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు. కనీసం తమ పెద్దల సమాధులు ఎక్కడున్నాయో ఆనవాళ్లు లేకుండా చేయడంపై ముస్లింలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**పెద్దల సమాధులు కూల్చే హక్కు ఎవరిచ్చారు: షేక్ బాష**



షబేబరత్ పండుగకు రెండ్రోజుల ముందు సమాధులను కూల్చడంలో వైసీపీ నేతల ఉద్దేశం ఏంటో తెలీడం లేదు. అయినా తమ పెద్దల సమాధులను కూలగొట్టే హక్కు వారికి ఎవరిచ్చారు.

**సమాధులను కూల్చేయడం దుర్మార్గం: షేక్ అన్వర్**



దశాబ్దాలుగా తమ పెద్దల సమాధుల వద్ద పండుగ చేసుకుని వారిని స్మరించుకుంటాం. ప్రతి ముస్లిం కుటుంబం ఆరోజును పవిత్రంగా భావిస్తారు. అలాంటి సమాధులను కూలగొట్టడం దుర్మార్గపు చర్య.

## మైనార్టీలు టీడీపీకి అండగా ఉండాలి: అహ్మద్

**సత్యనారాయణపురం, ఫిబ్రవరి 24:** వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతంలో ఎన్నడూ లేని విధంగా మైనార్టీలపై దాడులు జరిగాయని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్రగౌరవాధ్యక్షుడు ఎం.డి. ఇంతియాజ్ అహ్మద్ ఆరోపించారు. దుర్గాపురం కొత్తవంతెన సెంటర్ బోస్ బొమ్మ సెంటర్ వద్ద సీ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్రస్థాయి కార్యవర్గం జరిగింది. ఈ సందర్భంగా వచ్చే ఎన్నికల్లో మైనార్టీలు ఎలా ముందుకు సాగాలన్న అంశంపైన చర్చించారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మైనార్టీలకు అండగా నిలిచే టీడీపీకే అండగా ఉండాలన్నారు. గత ఎన్నికల్లో మైనార్టీలు జగన్మోహనరెడ్డిని నమ్మి ఓటు వేస్తే ఆ నమ్మకాన్ని విస్మరించారన్నారు. ఐదేళ్ల పాలనలో మైనార్టీలపైన ఎన్నడూ లేనివిధంగా దాడులు చేయించారని ధ్వజమెత్తారు. మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన బడ్జెట్‌ను నవరత్నాలకు తరలించి ద్రోహం చేశారన్నారు. ముస్లింలందరూ ఐక్యంగా ఉండాలలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీకే అండగా ఉండాలని సమావేశంలో తీర్మానించామన్నారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నేతలు

## రేపు జరిగే ఆందోళనల్లో పాల్గొనండి

**ధర్నాచౌక్:** ఢిల్లీ రైతు ఉద్యమానికి మద్దతుగా, ప్రపంచ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించాలని కోరుతూ ఈ నెల 26న దేశవ్యాప్తంగా జరగబోయే ఆందోళనల్లో భాగస్వామ్యం కావాలని ఏపీ రైతు సంఘం రాష్ట్రంలోని రైతులకు పిలుపునిచ్చింది. స్థానిక దాసరిభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జి.ఈశ్వరయ్య, పి.జమలయ్య మాట్లాడారు. రైతులపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దమణకాండను వైసీపీ, టీడీపీ, జనసేన ఖండించకపోగా తమ భుజాలపై బీజేపీని మోయడం సిగ్గుచేటన్నారు. 26న జిల్లాలో సబ్‌డివిజన్ ఆర్‌డీవో లేక నియోజకవర్గ స్థాయిలో అన్ని రైతు, వ్యవసాయ కార్మిక సంఘం, ట్రేడ్ యూనియన్లు, విద్యార్థి, యువజన, మహిళ తదితర సంఘాలతో ఆందోళన నిర్వహిస్తున్నామన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు ఎం.యలమందరావు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు

**అజిత్‌సింగ్‌నగర్:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. కటారి నాగరాజు (40) దావు బుచ్చయ్య కాలనీలో నివాసముంటున్నాడు. శుక్రవారం ఉదయం తన ద్విచక్రవాహనంపై మేడారం అమ్మవారి ఆలయానికి వెళ్లాడు. శనివారం తిరిగి వస్తూ అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ద్విచక్రవాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే ప్రమాదంలో ఎదురు వాహనంపై వస్తున్న మురళీనగర్‌కు చెందిన మండపాటి మురళీకృష్ణ, నల్లమోతు ధనుంజయరావు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పుస్తక పఠనం అలవర్చుకోవాలి: మస్తానయ్య**

**పటమట:** విద్యార్థులు పాఠ్యపుస్తకాలతో పాటు విజ్ఞాన పుస్తకాలు చదవడం వల్ల మేధోశక్తి పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవర్చుకోవాలని సీమ్యాట్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య అన్నారు. ఎన్‌ఆర్‌ఐ వాసవీ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక మిత్ర జీడీఈటీ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగింది. సీమ్యాట్ డైరెక్టర్ వీఎస్ మస్తానయ్య, డీఈవో యూవీ సుబ్బారావు పాల్గొని రూ.50వేల విలువైన పుస్తకాలు, రూ.10వేల నగదును బీరువాల కోసం ఇచ్చారు. ఎన్‌ఆర్‌ఐ వాసవీ అసోసియేషన్ గ్రూప్ డైరెక్టర్ పల్లవి శ్రీరామ్, ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, వరంగల్ నిట్ విశ్రాంత కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ రామారావు, సౌత్ ఇండియా నయాతాలీమ్ సభ్యులు సీఏ ప్రసాద్, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

**లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో అమీన్‌భాయ్‌కు చోటు**

**పెనమలూరు:** ఏ1 ఫౌండేషన్ చైర్మన్ అమీన్‌భాయ్‌కు ప్రతిష్ఠాత్మక లండన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్సులో చోటు దక్కింది. కొన్నేళ్లుగా ఆయన చేస్తున్న సామాజిక సేవలకు అవార్డులు దక్కినట్లు తెలిపారు. మానవ హక్కుల సంఘం అధ్యక్షుడిగా, ముస్లిం మైనారిటీ రాష్ట్ర నేతగా ఆయన సేవలకు గుర్తింపు లభించిందని పలువురు వ్యాఖ్యానించారు. అవార్డు సాధించిన అమీన్‌భాయ్‌ను వారు అభినందించారు.

**20మందికి ఉచితంగా యాంజియోగ్రామ్**

**గన్నవరం:** కృష్ణా మిల్క్ యూనియన్‌కు పాలు పోసే రైతుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్టు గన్నవరం క్లస్టర్ మేనేజర్ కోట ప్రసాద్ తెలిపారు. శనివారం క్లస్టర్ పరిధిలోని 20మందికి రాధా - లక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ వరుణ్ కార్డియాక్ అండ్ న్యూరో సైన్సెస్‌లో ఉచితంగా యాంజియోగ్రామ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు చొరవతో పాడి రైతులకు ఉచిత వైద్య సేవలందిస్తున్నారన్నారు.

**షూటింగ్‌బాల్ పోటీలకు మేనేజర్‌గా పరశురాముడు**

**విజయవాడ స్పోర్ట్సు:** ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ ఇండోర్ స్టేడియంలో మార్చి 2,3న జరిగే వరల్డ్‌కప్ షూటింగ్ పోటీల్లో పాల్గొనే భారత మహిళా జట్టుకు మేనేజర్‌గా పరుశరాముడు ఎంపికయ్యారని షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ జనరల్ రవీంద్రసింగ్ తోమర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పరుశరాముడు ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు అభినందించారు.

## దళిత, ఆదివాసీ స్త్రీలపై హింసను అరికట్టాలి

● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**గవర్నర్‌పేట, ఫిబ్రవరి 24:** దేశాభివృద్ధికి దళిత, ఆదివాసీ స్త్రీ శక్తి ఎంతో అవసరమని, సమాజంలో వారిపై జరుగుతున్న హింసను రూపుమాపడంలో దళిత స్త్రీ శక్తి లాంటి సంస్థలు కృషి మరింతగా పెంచాలని రిటైర్డ్ జిల్లా జడ్జి జ యరాజ్ అన్నారు. దళిత స్త్రీ శక్తి సంస్థ ఆధ్వర్యంలో శనివా రం లెనిన్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ ఐక్యభవన్‌లో దళిత, ఆదివాసీ స్త్రీలు, బాలికలపై హింసకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జ్యూరీ సభ్యుడిగా ఉన్న జయరాజ్ మాట్లాడుతూ డబ్బుల కోసం దళిత, ఆదివాసీలు చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే నానుడి ప్రచారంలో ఉందని, ఈ సమావేశానికి హాజరైన బాధిత మహిళలను చూస్తుంటే ఎవ రూ చటాన్ని సక్రమంగా అమలు కాకుండా దుర్వినియోగం చేస్తున్నారో అర్థమవుతోందన్నారు. జ్యూరీ సభ్యుడు రిటైర్డ్ జడ్జి జేసురత్న కుమార్, ఎన్‌సీపీసీఆర్ సభ్యుడు రాజేంద్రప్రసాద్, సమావేశానికి అధ్యక్షత వహించిన దళిత స్త్రీ శక్తి సంస్థ జాతీయ కన్వీనర్ ఝాన్సీ గడ్డం, ఎస్టీ అసోసియేషన్ జాతీయ సభ్యులు శ్రీనివాస్ నాయక్, రత్నప్రదీప్, రాజ గృహ ఫౌండర్ కుమార్ పాల్గొన్నారు. సమావేశంలో 20 హింసాత్మక సంఘటనలకు సంబంధించిన బాధితులు హాజరై జ్యూరీ సభ్యులకు కేసుల వివరాలను అందజేశారు. మైనర్లపై అత్యాచారాలు, దాడులు, భూమి వివాదాలు, పంటనాశనం చేసిన కేసులు, హత్యాప్రయత్నం కేసులను జ్యూరీ ముందు పెట్టారు.



చోడవరం ఇసుక రీచ్‌లో అర్ధరాత్రి జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలను తెలుగుదేశం పార్టీ శ్రేణులతో కలిసి అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

# ప్రజాదరణతో అసెంబ్లీలో అడుగుపెడతా: యార్లగడ్డ

**హనుమాన్‌జంక్షన్,ఫిబ్రవరి 24:** జనసేన పార్టీ మద్దతుతో గన్నవరం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రానున్న ఎన్నికల్లో విజయం సాధించి నారా భువనేశ్వరికి కానుకగా ఇస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం జంక్షన్‌లో జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు జన్మదిన వేడుకల్లో యార్లగడ్డ పాల్గొన్నారు. రమేష్‌బాబుకు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో ఉండగానే గన్నవరం టీడీపీ అభ్యర్థిగా యార్లగడ్డ వెంకట్రావు పేరును పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. దీంతో ఆయన చలమలశెట్టి రమేష్ బాబు నివాసం నుంచి టీడీపీ, జనసేన పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయానికి ర్యాలీగా వెళ్లారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి స్వామి ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం ప్రజలు తనకు అన్యాయం చేయరని ఎమ్మెల్యేగా అసెంబ్లీలో అడుగుపెడతానని జగన్‌తో సవాల్ చేశారన్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా విజయం సాధిస్తానన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

తనపై నమ్మకం ఉంచి గన్నవరం నియోకవర్గానికి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రాతినిధ్యం వహించడానికి అవకాశం ఇచ్చిన టీడీపీ జాతీయ అధ్యక్షు డు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యద ర్శి నారా లోకేశ్, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. జనసేన నియోజకవ ర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షకార్యదర్శులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు, వడ్డిల్లి లక్ష్మి, గండేపూడి నితీష్‌కుమార్, అ ట్లూరి శ్రీనివాసరావు, నూలు నరసింహారావు, జనసేన మం డలాధ్యక్షుడు వడ్డి శివనాగేశ్వరరావు, వీరమహిళలు, అభిమానులు పాల్గొని యార్లగడ్డకు శుభాకాంక్షలు తెలిపారు.

### ఆధ్యాత్మిక ప్రదేశంలో మంత్రి రాజకీయ విమర్శలు

● ప్రముఖ తెలుగు పత్రికపై విమర్శలు

**వన్‌టౌన్:** స్థానిక బ్రాహ్మణవీధిలోని దుర్గగుడికి చెందిన జమ్మిదొడ్డిలో మంత్రి కొట్టు సత్యనారాయణ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఒక ప్రముఖ తెలుగు దినపత్రికపై సుమారు 35 నిముషాల పాటు విమర్శలు గుప్పించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక జరిగిన సంఘటనలను పదే పదే ఆ పత్రిక ప్రచురించడం చంద్రబాబు అధికారంలోకి రావడం కోసమేనన్నారు. దీన్ని బట్టి ఆ ఘటనల వెనుక చంద్రబాబు, పత్రిక పాత్ర ఉన్నట్టు అనుమానాల వ్యక్తమవుతున్నాయన్నారు. ఆ పత్రిక (ఆంధ్రజ్యోతి కాదు) కేవలం చంద్రబాబు ప్రయోజనాల కోసమే పనిచేస్తూ మీడియా విలువలను కాలరాస్తోందన్నారు. జనసేన-టీడీపీ పొత్తులపై విమర్శలు గుప్పిస్తూ తాను ఏ పార్టీతో పొత్తుపెట్టుకున్నా ప్రతిసారీ చరిత్రాత్మక నిర్ణయం అని చంద్రబాబు చెబుతాడన్నారు. పవన్ మాటపై నిలబడే వ్యక్తి కాదన్నారు.

**కేబీఎన్‌లో నాక్ బృందం పర్యటన**

**వన్‌టౌన్:** కేబీఎన్ కళాశాలలో నాక్ బృందం నాలుగోసారి పర్యటించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి నారాయణరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఐదేళ్లకోసారి నేషనల్ అసెస్మెంట్ ఎక్రిడేషన్ కౌన్సిల్ (నాక్) బృందం కళాశాలలను పరిశీలించి పనితీరును మదింపు చేస్తాయన్నారు. మంగుళూరు విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య వై మునిరాజ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించారన్నారు. గౌహతి వర్సిటీకి చెందిన ఎస్ కుమార్ శర్మ, కోయంబత్తూరులోని సుగుణ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీకి చెందిన డాక్టర్ కిట్టప్ప వైద్యనాథన్ సభ్యులుగా ఉన్నారన్నారు. కళాశాల అధ్యక్షుడు తొమ్మండ్రు శేషయ్య పాల్గొన్నారు.

### దగా డీఎస్సీని వెంటనే రద్దు చేయాలి

**గతంలో ఎంబీబీఎస్ సీట్లు అమ్ముకున్న వైసీపీ: జడ**

**ధర్నాచౌక్:** డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన అభ్యర్థులకు తీరని అన్యాయం జరుగుతుందని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీనగర్‌లోని తన కార్యాలయంలో శనివారం అమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌పై నోటిఫికేషన్‌లో ముందుగా చెప్పలేదని, చివరలో ఎడిట్ ఆప్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇది 10 లక్షల మంది డీఎస్సీ అభ్యర్థులకు అన్యాయం చేయడమేనని మండిపడ్డారు. డీఎస్సీ అభ్యర్థుల అభ్యర్థన మేరకు సాయంత్రం దీ క్ష విరమించారు. అనంతరం సాంబమూర్తిరోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి సీఎం జగన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు.

**ఓటర్ల చైతన్యం కోసం నేటి నుంచి కళాజాతా**

**ధర్నాచౌక్:** 'ఓటు వేద్దాం-ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం' అనే ప్రచార నినాదంతో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి రాష్ట్రస్థాయి కళాజాత నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ఓటర్లను జాగృతం చేసేందుకు ఈ కళాజాతను విశాఖపట్నం నుంచి ప్రారంభిస్తున్నామని మార్చి 8న కర్నూలులో ముగింపు సభ నిర్వహిస్తామన్నారు. మాజీ మేయర్ జంధ్యాల శంకర్, ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యదర్శి డి. సోమసుందర్, నాగార్జున వర్సిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.రంగయ్య, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ ఎంసీ దాస్, వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుబ్బారావు పాల్గొన్నారు.

### 27న జరిగే చలో విజయవాడను విజయవంతం చేద్దాం

● ఉపాధ్యాయ సంఘాల నేతలు

**పెనమలూరు, ఫిబ్రవరి 24:** ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక జేఏసీ పిలుపు మేరకు ఈనెల 27న జరిగే చలో విజయవాడను విజయవంతం చేద్దామని వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. శనివారం కానూరు ఉన్నత పాఠశాలలో జరిగిన నిరసనలో వారు పాల్గొని నినాదాలు చేశారు. నాలుగేళ్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కావడం లేదని, సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. డీఏల బకాయిలు, పీఆర్సీ బకాయిలు, ఐఆర్ అమలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ బిల్లులు లేవంటూ ఆందోళన వ్యక్తం చేశారు. అమరావతి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే రెడ్డమ్మ, కార్యదర్శి ఇనయతుల్లా, పెన్షనర్స్ అసోసియేషన్ సుబ్బారావు, పెనమలూరు ఏపీటీఎఫ్ అధ్యక్షుడు పార్థసారథి, జిల్లా కార్యదర్శి నాగిడి రాంబాబు, యూటీఎఫ్ బాధ్యులు నారగని రాంబాబు, హెచ్‌ఎం విజయలక్ష్మి పాల్గొన్నారు.

### టైర్ల దుకాణంలో అగ్నిప్రమాదం

● మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

● లక్షన్నర వరకు ఆస్తి నష్టం

**ఆటోనగర్ (పెనమలూరు):** ఆటోనగర్ మూడో క్రాస్ రోడ్డులోని ఒక టైర్ల దుకాణంలో శనివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. దుకాణం బయట ఉంచిన టైర్లు ప్రమాదంలో కాలిపోయాయి. టైర్లకు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి వచ్చిన షార్టు సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది భావిస్తున్నారు. ఆటోనగర్ ఎస్ఎఫ్ఓ కే నరేష్ నేతృత్వంలోని ఫైర్ సిబ్బంది అప్రమత్తమై మంటలను అదుపులోకి తెచ్చారు. షుమారు రూ.లక్షన్నర వరకు ఆస్తినష్టం ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

**బియ్యం సరఫరా కాంట్రాక్టర్‌కు నోటీసు**

**వన్‌టౌన్:** టెండర్ నిబంధనల మేరకు సూచించిన బ్రాండ్ బియ్యాన్ని కాకుండా ఇతర రకాల బియ్యాన్ని సరఫరా చేస్తున్న దుర్గగుడి కాంట్రాక్టర్ సీహెచ్ విశ్వేశ్వరరావుకు ఈవో నోటీసు జారీ చేశారు. టెండర్ ఫారంలో సూచించిన బియ్యానికి బదులు వేరే రకం బియ్యం ఇస్తున్న వైనాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చింది. దీనిపై విచారణ జరిపిన డిప్యూటీ ఈవో లీలాకుమార్ అన్నదాన విభాగంలో పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా బియ్యం సరఫరా లేదని గుర్తించారు. ఈ అంశంపై కాంట్రాక్టర్ వివరణ ఇవ్వాలని నోటీసు ఇచ్చారు. మిగిలిన బియ్యాన్ని రిటర్న్ తీసుకుని మంచి బియ్యాన్ని సరఫరా చేయాలని, లేదంటూ బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

**సీవీ రెడ్డి చారిటీస్ అసిస్టెంట్ కమిషనర్ సాయిబాబా**

దుర్గగుడి దత్తత సంస్థ సీవీ రెడ్డి చారిటీస్‌కు అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) సాయిబాబా నియామకమయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో దుర్గగుడిలోనే పలు హోదాల్లో పనిచేశారు. తరువాత ఉమ్మడి కృష్ణాజిల్లా ఏసీగా పనిచేసి అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. బందరులో ఏసీగా పనిచేస్తుండగా సీవీ చారిటీస్‌కు నియమించారు. మరికొద్ది రోజుల్లోనే ఆయన పదవీ విరమణ చేయనున్నారు.

**సాహితీ రూపకాల్లో 'మహతి' ముద్ర**

[illegible]

**సాహితీ రూపకాల్లో 'మహతి' ముద్ర**

[illegible]

### దస్తావేజు లేఖర్ల జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

**ధర్నాచౌక్:** జిల్లా దస్తావేజు లేఖర్ల వృత్తి పరిరక్షణ సమితి నూతన అధ్యక్షుడిగా పైలా సతీష్ ప్రమాణస్వీకారం గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం జరిగింది. సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు తుమ్మలపల్లి హరికృష్ణ, గుంటి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు నేరేళ్ల జ్ఞాన సత్య వెంకటనారాయణ, కోశాధికారి చింతకాయల నాగ సత్యనారాయణమూర్తి నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. హరికృష్ణ మాట్లాడుతూ దస్తావేజు లేఖర్లు, సహాయకుల, స్టాంప్ వెండర్ల, డీటీపీ ఆపరేటర్ల సమస్యలను చర్చించి పబ్లిక్ డేటా ఎంట్రీ సందర్భంగా వీరు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పైలా సతీష్ మాట్లాడుతూ దస్తావేజులేఖర్ల లైసెన్సులు మంజూరు చేసి వారి వృత్తికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.



## ఎమ్మెల్యే చినరాజప్పకు తృటిలో తప్పిన ప్రమాదం

పెద్దాపురం, ఫిబ్రవరి 24: కాకినాడ జిల్లా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రయాణిస్తున్న కారుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. పెద్దాపురంలోని దర్గాసెంటర్ వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. జె. తిమ్మాపురం గ్రామం నుంచి కారులో ర్యాలీగా పెద్దాపురం వస్తున్న చినరాజప్ప దర్గాసెంటర్ వద్దకు వచ్చేసరికి రోడ్డు సరిగా లేకపోవడంతో అదుపుతప్పి ఒక్కసారిగా డివైడర్‌ను ఢీకొంది. ఆ సమయంలో కారులోనే చినరాజప్ప ఉన్నారు. కారు నెమ్మదిగా వెళ్లడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎవరికీ ఏమీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## మొదటి జాబితాకే తాడేపల్లి ప్యాలెస్ కంపించింది: బొండా ఉమ

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన 118 స్థానాలు ఒకే సారి ప్రకటించడంతో తాడేపల్లి ప్యాలెస్ కంపించిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరావు అన్నారు. శనివారం ఆయన ఓ ప్రకటన చేశారు. 'జగన్ ఫ్రస్టేషన్‌లో ఉన్నారు. టీడీపీ-జనసేన అభ్యర్థుల ప్రకటనతో వైసీపీ నేతలకు ప్యాంట్లు తడిశాయి. దీంతో సజ్జల తెరమీదకు వచ్చి అవాకులు చవాకులు పేలుతున్నారు. పవన్ కల్యాణ్ సీటు ప్రకటించలేదన్న సజ్జల... జగన్ ఏ సీటు నుంచి పోటీ చేస్తారో ఇంకా ఎందుకు ప్రకటించలేదో చెప్పాలి. మా పొత్తులు, సీట్ల గురించి ఓవర్‌గా రియాక్ట్ అవుతున్నారంటే మీరు భయపడుతున్నట్లేగా..!' అంటూ సజ్జలను ఎద్దేవా చేశారు.

### మొదటి జాబితాలో ఎస్సీలకు అగ్రతాంబూలం: వర్ల

టీడీపీ అభ్యర్థుల జాబితాలో అధినేత చంద్రబాబు ఎస్సీ వర్గానికి సముచిత స్థానం కల్పించారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 'మొదటి జాబితాలోనే 20 సీట్లు ఎస్సీ మాల, మాదిగ వర్గాలకు కేటాయించడం చరిత్రాత్మకం. ఇది ప్రతి దళితుడూ గర్వంగా చెప్పుకోవాల్సిన విషయం. టీడీపీ బలహీనవర్గాలకు చెందిన పార్టీ అని మరో సారి రుజువైంది. జగన్ గత ఐదేళ్లుగా ఎస్సీలను అణిచివేస్తున్నారు. వారిని కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు. మొదటి జాబితాలో ఎస్సీలకు అగ్రతాంబూలం వేసిన టీడీపీకి దళితులంతా మద్దతు తెలపాలి' అని వర్ల కోరారు.

### వైసీపీ నేతలకు వణుకుడు రోగం: నక్కా ఆనందబాబు

టీడీపీ-జనసేన పొత్తుతో వైసీపీ నేతలకు వెన్నులో వణుకు పుట్టిందని మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ఎద్దేవా చేశారు. శనివారం టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ప్రతిపక్ష పార్టీ పొత్తుపై ఏడ్చే బదులు ఐదేళ్లలో తాను చేసింది జగన్ ఎందుకు చెప్పలేకపోతున్నారు? పవన్ కల్యాణ్‌పై జగన్ వ్యక్తిగత విమర్శలు చేసినప్పుడు వైసీపీలోని కాపు నేతలకు తమ వర్గం ఆత్మాభిమానం గుర్తుకు రాలేదా?' అని ప్రశ్నించారు.

## వైసీపీకి షాకిచ్చిన సిమ్స్ భరత్‌రెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): అధికార వైసీపీకి గుంటూరు జిల్లాలో షాక్ తగిలింది. గుంటూరుకు చెందిన సిమ్స్ విద్యాసంస్థల డైరెక్టర్ భీమనాథం భరత్‌రెడ్డి, కరస్పాండెంట్ శిరీష శనివారం యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఉండవల్లి నివాసంలో భరత్‌రెడ్డి, ఆయన సతీమణి శిరీషలకు లోకేశ్ పసుపు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వారితో పాటు వైసీపీ, కాంగ్రెస్ పార్టీల్లో వివిధ పదవుల్లో ఉన్న వారి అనుచరులు కూడా లోకేశ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

## తీవ్ర నిరాశలో వేదవ్యాస్

- నైరాశ్యంతో కుప్పకూలిన బూరగడ్డ



వేదవ్యాస్‌కు సపర్యలు చేస్తున్న అభిమానులు

కృత్తివెన్ను, ఫిబ్రవరి 24: కృష్ణా జిల్లా పెడన నియోజకవర్గం టికెట్ ఆశించిన బూరగడ్డ వేదవ్యాస్ నైరాశ్యంలో మునిగిపోయారు. అభిమానులతో మాట్లాడుతూనే కుప్పకూలిపోయారు. ఆయన వెన్నంటి వున్న కార్యకర్తలు వేదవ్యాస్‌ను హుటాహుటిన చినప్రాండ్రాక పీహెచ్‌సీకి తరలించారు. శనివారం ఆయన కృత్తివెన్ను మండలం చినపాండ్రాకలో పర్యటనలో ఉన్నారు. అదే సమయంలో టీడీపీ, జనసేన అభ్యర్థుల జాబితా వెల్లడైంది. టికెట్ రాలేదని తెలిసిన వెంటనే ఆయన తీవ్ర నిరాశకు గురయ్యారు. 2014లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చవిచూసిన వేదవ్యాస్ అనంతరం 2016లో టీడీపీలో చేరారు. 2019లో ఆయనకు టీడీపీ టికెట్ దక్కలేదు. తాజా జాబితాలో కూడా టికెట్ రాకపోవడంతో బూరగడ్డ తీవ్ర నిరాశకు గురై సొమ్మసిల్లిపడిపోయాడు.

## వైసీపీని వీడిన తుమ్మల చంద్రశేఖర్

- కమ్మ కార్పొరేషన్ చైర్మన్ పదవికీ రాజీనామా.. రేపు టీడీపీలో చేరిక



కంకిపాడు, ఫిబ్రవరి 24: ప్రాధాన్యత లేని పార్టీలో కొనసాగలేమని కమ్మ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ అన్నారు. శనివారం కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోలవెన్నులోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'పార్టీ ఆవిర్భావం నుంచి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన నాకు, ఇతర నాయకులకూ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా స్థానికేతరుడు అయిన మంత్రి జోగి రమేశ్ పేరును ప్రకటించటం ఎంత వరకు సమంజసం? ఈ నెల 26న నా రాజకీయ గురువు పార్థ సారథితో కలిసి టీడీపీలో చేరుతున్నా' అని తుమ్మల ప్రకటించారు.

## శంకర్‌రెడ్డి కొడుకు 20 కోట్లు ఇస్తానన్నాడు

- జైల్లో ఉన్నా నన్ను ప్రలోభాలకు గురిచేశారు
- తెలంగాణ సీఎంను కలిసి సెక్యూరిటీ కోరుతా
- భవిష్యత్తులో రాజకీయాల్లోకి వస్తా: దస్తగిరి



కడప, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): "దేవిరెడ్డి శంకర్‌రెడ్డి కొడుకు జైల్లో ఉన్న నా దగ్గరకు వచ్చి రూ.20 కోట్లు ఇస్తానన్నాడు. 'కృష్ణారెడ్డి కాంప్రమైజ్ అయ్యాడు నువ్వూ కావాల్సిందే' అని ప్రలోభాలకు గురిచేశాడు" అని మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అన్నారు. కిడ్నాప్ చేయలేదంటూ స్వయంగా అమ్మాయి చెబుతున్నా వినకుండా తనను ఎర్రగుంట్ల పోలీసులు అరెస్టు చేశారని, వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన సెక్యూరిటీ నా వెంటే ఉండగా నేనెలా కిడ్నాప్ చేస్తానని ప్రశ్నించారు. రెండు వేర్వేరు కేసులకు సంబంధించి మూడు నెలలకు పైగా కడప సెంట్రల్ జైలులో ఉన్న ఆయన శుక్రవారం బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం పులివెందులలోని ఇంటి వద్ద ఏబీఎన్-ఆంధ్రజ్యోతితో దస్తగిరి మాట్లాడారు. "మా బంధువుల అమ్మాయి ఒక అబ్బాయితో పారిపోయింది. వాళ్ల అమ్మవాళ్లు కేసు పెట్టారు. నేను వారి ఊరికి వెళ్లి ఇలా చేయడం పద్ధతి కాదని చెప్పా. తర్వాత ఆ అమ్మాయిని నేనే బలవంతంగా కిడ్నాప్ చేశానని కేసు సృష్టించారు. కేవలం సీఎం జగన్, అవినాశ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, జమ్మలమడుగు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిల కారణంగా నన్ను జైలుకు పంపారు. రెస్టు ఎందుకు చేశారని ప్రశ్నించడంతో ఎర్రగుంట్ల సీఐ శంకరయ్య, డీఎస్పీ తీవ్రంగా కొట్టారు" అని అన్నారు. తనకు ఇచ్చిన సెక్యూరిటీని కూడా తోలుబొమ్మలను చేసి సీఎం జగన్ ఆడిస్తున్నారని ఆరోపించారు. కేసు తెలంగాణలో జరుగుతోంది కాబట్టి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తనకు సెక్యూరిటీని కల్పించాలని కోరుతానన్నారు.

## కోస్తాలో చెదురుమదురుగా వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మరట్వాడ పరిసరాల్లో ఆవరించిన ఉపరితల ఆవర్తనం నుంచి తమిళనాడు వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. రాష్ట్రంలో ఎండ తీవ్రత కారణంగా వాతావరణ అనిశ్చితి ఏర్పడి శనివారం కోస్తాలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. దేశంలోనే అత్యధికంగా అనంతపురంలో 38.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో వర్షాలు కురుస్తాయి.

# ఎవరి కోసం బుల్లెట్ ప్రూఫ్ బస్సులు!

### బెజవాడకు చేరిన 2 ఓల్వో బస్సులు

- ఆర్టీసీ డిపోలో పరదాలు కప్పి.. సెక్యూరిటీ
- ఖరీదు రూ.20 కోట్లు..
- ఢిల్లీ పెద్దలకు గిఫ్ట్ ఇస్తారనే వదంతులు
- క్యారవాన్‌లా మరో 3 మినీ బస్సుల రాక
- ఎన్నికల కోసమే ఆర్టీసీతో ఖర్చు చేయించారా?!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ముఖ్యమంత్రి భద్రత కోసమో!.. ఢిల్లీ పెద్దలకు గిఫ్ట్‌గా ఇవ్వటం కోసమో తెలియదు కానీ.. అత్యంత ఖరీదైన రెండు బుల్లెట్ ప్రూఫ్ బస్సులు విజయవాడకు చేరుకున్నాయి! రాజస్థాన్ నుంచి రోడ్డు మార్గాన పది రోజుల పాటు ట్రాలీలో ప్రయాణిస్తూ వచ్చిన ఈ బస్సులు శనివారం ఆర్టీసీ విజయవాడ డిపో గ్యారేజీకి చేరాయి. ఎవరి కంట పడకుండా రాత్రి సమయంలో వీటిని విజయవాడ గ్యారేజీకి చేర్చి పరదాలు కట్టారు. ఓల్వో కంపెనీకి చెందిన ఈ బస్సులు సకల హంగులతో సిద్ధమై వచ్చాయి. వీటి కోసం రూ.20 కోట్లను ఖర్చు చేయడం గమనార్హం. ఇవి కాకుండా ఐషర్ కంపెనీకి చెందిన మరో మూడు నాన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సులు రెండు, మూడు రోజుల్లో విజయవాడ గ్యారేజీకి చేరుకోనున్నాయి. మొత్తంగా బస్సులన్నిటికీ కలిపి దాదాపుగా రూ.40 కోట్ల మేర ఆర్టీసీ ఖర్చు చేసినట్టుగా తెలుస్తోంది. ఈ బస్సులను ముఖ్యమంత్రి జగన్ పర్యటనల కోసం కొనుగోలు చేసినట్టుగా ఆర్టీసీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ బస్సుల గురించి ఎవరూ బయటకు చెప్పవద్దని, మీడియాకు అస్సలు తెలియకూడదంటూ ఆర్టీసీ ఉన్నతాధికారులు.. అధికారులకు ప్రత్యేక ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. గ్యారేజీలో ఈ బస్సులకు పూర్తిగా పరదా కప్పి గట్టి సెక్యూరిటీ ఏర్పాటు చేసిన వైనం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది.

### ఇప్పటికే రెండు బస్సులున్నాయి!

సీఎం పర్యటనలకైతే ఇప్పటికే రెండు అత్యాధునిక బుల్లెట్ ప్రూఫ్ బస్సులు ఉన్నాయి. మూడేళ్లపాటు నిరుపయోగంగా ఉన్న ఆ బస్సులను సీఎం జగన్ ఏడాదిన్నరగా తన పర్యటనల్లో వినియోగిస్తున్నారు. ఇటీవలే వీటి మెయింటెనెన్స్ పేరుతో ఆర్టీసీ ఉన్నతాధికారులు రూ.1.50 కోట్లను ఖర్చు చేశారు. నాన్ బుల్లెట్ ప్రూఫ్ బస్సులను క్యారవాన్‌లుగా, ప్రచార రథాలుగా కూడా ఉపయోగించేలా తీర్చిదిద్దినట్టుగా సమాచారం. ఈ బస్సులను ఎన్నికల ప్రచార సభలలో ఉపయోగించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.



పరదా మాటున బస్సు

# మిల్లర్ల మాయాజాలం

### ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు

- స్కూటర్లు, ఆటోలు, స్కూల్ బస్సుల్లో తరలించారట!
- దొంగ ట్రక్ షీట్లతో ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి
- బయోమెట్రిక్, జీపీఎస్ నిబంధనలకు తూట్లు
- లోతుగా దర్యాప్తు చేస్తే పెద్ద కుంభకోణమే!

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ధాన్యాన్ని కల్లాల నుంచి రైసు మిల్లులకు తరలించడానికి సాధారణంగా ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, లారీలు వంటి గూడ్స్ వెహికల్స్‌నే వినియోగిస్తారు. అంతే తప్ప మోటారు సైకిళ్లు, ఆటోలు, స్కూలు బస్సుల్లో కొన్ని లక్షల క్వింటాళ్ల ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం సాధ్యమా?!.. తమది రైతు ప్రభుత్వంగా గొప్పలు చెప్పుకుంటున్న జగన్ సర్కారు రివర్స్ పాలనలో మోటారు సైకిళ్లపై కూడా వందలు, వేల టన్నుల ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించడం సుసాధ్యమేనని తేలింది!. పార్వతీపురం మన్యం జిల్లాలో ఒక స్కూల్ బస్సులో ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించారు!. ఈ జిల్లాతోపాటు పశ్చిమగోదావరి తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఆటోల్లో ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించినట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇంకా విచిత్రమేమిటంటే.. గోదావరి జిల్లాలతోపాటు మన్యం, విజయనగరం, శ్రీకాకుళం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో మోటారు సైకిళ్ల మీద వందల క్వింటాళ్ల ధాన్యాన్ని రైసుమిల్లులకు తరలించారట. రాష్ట్ర రవాణాశాఖ అధికారుల విచారణలోనే ఈ నమ్మలేని నిజాలు వెలుగులోకి రావడం గమనార్హం. వైసీపీ జమానాలో వెలుగుచూసిన ఈ దందాలోని వింతలు.. విడ్డూరాలు చదవండి!.

రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని గొప్పలు చెబుతున్న జగన్ సర్కారు ఆచరణలో మాత్రం చేతులెత్తేస్తోంది. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో ధాన్యం వ్యాపారం మొత్తం రైసు మిల్లర్ల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. రాష్ట్రంలో రైసు మిల్లులను నడుపుతున్నవారిలో వైసీపీకి చెందినవారే అధికం. దీంతో ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ సొంత మనుషుల ద్వారా రూ. వేల కోట్లు 'కప్పం' కట్టించుకుంటూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను అనధికారికంగా రైసు మిల్లర్లకే అప్పగించేస్తున్నారు. క్షేత్రస్థాయిలో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సహాయకులు మొదలు కొన్ని రాష్ట్రస్థాయిలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఉన్నతాధికారుల వరకు అందరూ రైసు మిల్లర్లతో కుమ్మక్కై రైతులను నిండా ముంచేస్తున్నారు. ఈ క్రమంలోనే మరో అడుగు ముందుకేసి ఈ ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లలో భారీ కుంభకోణానికి తెరతీశారు.

### 73 శాతం ధాన్యం కొనుగోళ్లు ఆఫ్‌లైన్‌లోనే..

ఆన్‌లైన్ విధానంలో ధాన్యం సేకరిస్తున్నా అక్రమాలకు అడ్డుకట్ట పడలేదు. మిల్లర్లు, దళారుల చేతిలో దగా పడుతున్న రైతులకు మద్దతు ధర కల్పించాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం ఈ ఖరీఫ్ సీజన్ నుంచి నిబంధనలను మరింత కఠినతరం చేసింది. రాష్ట్రంలోని అన్ని ఆర్బీకేలు, ఇతర ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా బయోమెట్రిక్ పరికరాలను ఏర్పాటు చేయాలని, వాటి ద్వారా ధాన్యం విక్రయించే ప్రతి రైతు వేలిముద్రలను తీసుకోవాలని, రైతులు అమ్మిన ధాన్యాన్ని రైసు మిల్లులకు తరలించే వాహనాలకు జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. జీపీఎస్ పరికరాలను అమర్చిన వాహనాల్లోనే ధాన్యం రవాణా చేయాలని స్పష్టం చేసింది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిబంధనలను ఎక్కడా చిత్తశుద్ధితో అమలు చేయడం లేదు. మిల్లర్లతో కుదుర్చుకున్న ముందస్తు ఒప్పందాల మేరకు దొడ్డిదారిన ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అనుమతి ఇచ్చింది. సీజన్ ప్రారంభంలో రెండు మూడు రోజులు వర్షాలు కురిసినా.. తర్వాత వర్షాలు ఆగిపోయాయి. అయినా సీజన్ మొత్తం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అనుమతివ్వడం మిల్లర్లు, దళారుల దోపిడీకి అవకాశంగా మారింది. దాంతో రైతులు పండించిన ధాన్యం మొత్తం దళారులు, మిల్లర్ల గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వం మాట నమ్మి ఆన్‌లైన్‌లో అమ్మిన రైతులకు సొమ్ము చెల్లించకుండా ముప్పుతిప్పలు పెడుతుండటంతో మద్దతు ధర కోసం ఆశ పడకుండా ఈ సీజన్‌లో పండించిన ధాన్యాన్ని మిల్లర్లు, దళారులు ఇచ్చిన ధరలకే అమ్మేసుకున్నారు. పల్నాడు, గుంటూరు, కాకినాడ, ఎన్టీఆర్, తూర్పుగోదావరి, కృష్ణా, ఏలూరు, అనకాపల్లి, విజయనగరం, కోనసీమ, పశ్చిమగోదావరి, బాపట్ల, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కేవలం 27 శాతం మంది రైతులు మాత్రమే ఆన్‌లైన్‌లో బయోమెట్రిక్ ఆధారంగా తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోగా.. మిగిలిన 73 శాతం మంది రైతులు ఆఫ్‌లైన్‌లో దళారులు, మిల్లర్లు ఇచ్చినంత తీసుకుని తమ ధాన్యాన్ని అమ్ముకున్నట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరల ప్రకారం సాధారణ రకం ధాన్యం క్వింటాకు 2050 లు, 75 కేజీల బస్తాకు రూ. 1637 లు చొప్పున మద్దతు ధరలను రైతులకు చెల్లించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అనుమతివ్వడంతో దళారులు, మిల్లర్లు రైతులను నిండా ముంచేశారు. వివిధ ఖర్చుల పేరుతో రూ.300 నుంచి రూ.500 వరకు మినహాయించుకుని.. 75 కేజీల ధాన్యం బస్తాకు గరిష్ఠంగా రూ.1,300 మాత్రమే రైతులకు చెల్లించారు. వాస్తవానికి గన్నీలు, లేబర్, ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉన్నా.. ఆ నిధులను వెంటనే విడుదల చేయకపోవడం వల్ల మిల్లర్లు ముందుగానే రైతుల నుంచి ఆ చార్జీలు వసూలు చేసుకున్నారు. దీంతో సన్న, చిన్నకారు రైతులు, కౌలు రైతులు ఘోరంగా నష్టపోయారు. ఇదంతా ఒకెత్తయితే.. తర్వాత మరో రకమైన దోపిడీకి మిల్లర్లు తెరతీశారు. రైతుల నుంచి ఆఫ్‌లైన్‌లో బస్తా రూ. 1300 చొప్పున కొనుగోలు చేసిన ధాన్యాన్ని తమ మిల్లుల్లో నిల్వ చేసుకుని.. అదే ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయించుకుంటూ ప్రభుత్వానికి మద్దతు ధరకు అమ్ముకునే ప్రక్రియకు తెరతీశారు. అయితే నిబంధనల ప్రకారం ఆన్‌లైన్‌లో ధాన్యం అమ్మకానికి సంబంధిత రైతుల వేలిముద్రలు, ధాన్యాన్ని రవాణా చేసే వాహనాల రిజిస్టరు నంబర్లు తదితర వివరాలు నమోదు చేసి ట్రక్ షీట్లు జనరేట్ చేయాల్సి ఉంటుంది. అయితే ఈ-క్రాప్ యాప్‌లో తప్పుడు వివరాలు నమోదు చేయించి వారి పేరు మీద ఆన్‌లైన్‌లో వందల క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించినట్లుగా దొంగ లెక్కలు చూపిస్తున్నారు. ఆ ధాన్యాన్ని వాహనాల్లో మిల్లులకు తరలించినట్లుగా తప్పుడు రిజిస్టర్ నంబర్లు నమోదు చేయించారు. ఈ వాహనాల రిజిస్టరు నంబర్లు దొరకకపోవడంతో స్కూటర్లు, ఆటోలు, స్కూల్ బస్సుల రిజిస్టర్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ నుంచి ఇప్పటికే రూ.వందల కోట్లు అక్రమంగా కాజేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలు పుష్కలంగా ఉండటంతో ఇప్పటికే లక్షల టన్నుల ధాన్యాన్ని ఆన్‌లైన్ చేయించుకుని వాటికి మద్దతు ధరతో పాటు జీఎల్‌టీ చార్జీలను కూడా రాబట్టుకున్నారని తెలుస్తోంది. ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యాన్ని రవాణా చేసినట్లుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసిన వాహనాల వివరాలను రవాణాశాఖ అధికారులు ర్యాండమ్‌గా చెక్ చేసినప్పుడు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మేనేజర్ విచారణ జరిపించాలంటూ డీఎంలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ప్రభుత్వం చొరవ తీసుకుని దర్యాప్తు సంస్థలతో లోతుగా విచారణ జరిపిస్తే భారీ కుంభకోణమే వెలుగులోకి వస్తుందని సివిల్ సప్లయిస్ వర్గాలే చెబుతున్నాయి.



# కునుకు కరువాయె!

- దేశంలో ఓఎస్ఏ బాధితులు 10 కోట్లు
- మహిళల కంటే పురుషులే అధికం
- ఢిల్లీ ఎయిమ్స్ అధ్యయనంలో వెల్లడి
- ఒత్తిడితోనే అధిక సమస్య
- సాంకేతికత వాడకం కూడా కారణం
- నిద్రలేమితో ఎన్నో ఆరోగ్య సమస్యలు
- రోజుకు కనీసం 6 గంటలు
- నిద్ర అవసరమని నిపుణుల సూచన

(హైదరాబాద్-ఆంధ్రజ్యోతి)

దేశంలో నాణ్యమైన ఆహారం తీసుకుంటున్నవారు ఎక్కువే ఉండొచ్చు కానీ.. నాణ్యమైన నిద్ర పోతున్నవారు ఎందరు ఉంటారంటే చెప్పడం కష్టమే! ఎంతసేపు మంచం మీద ఉంటున్నాం అని కాదు.. ఎంత నాణ్యమైన నిద్ర పోయారనేది ముఖ్యమనేది వైద్య నిపుణుల మాట. రోజుకు నాలుగు గంటలు మాత్రమే నిద్రపోతామని చెబుతున్నవారు హార్మోన్ల లోపాలతో బాధపడుతుంటారని పేర్కొంటున్నారు. నిద్ర లేమితో బాధపడేవారికి రక్తపోటు, గుండెజబ్బులు, ఒబేసిటీ, ఆర్థరైటిస్, మధుమేహం వంటి ఎన్నో ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని చెబుతున్నారు. నాణ్యమైన నిద్ర కనీసం ఆరు గంటలైనా కావాల్సిందేనని సూచిస్తున్నారు. ఈ అంశానికి సంబంధించి ఢిల్లీ ఎయిమ్స్ పరిశోధకులు చేసిన అధ్యయనం ప్రస్తుత పరిస్థితిని చాటుతోంది. దేశంలో 10.4 కోట్లమంది అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ అప్నియా (ఓఎస్ఏ)తో బాధపడుతున్నారని వెల్లడించారు. వీరిలో మహిళల కంటే పురుషులే ఎక్కువ మంది ఉన్నారు. ఈ వివరాలు స్లీప్ మెడిసిన్ రివ్యూ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. దేశంలో అతి ప్రధానమైన ప్రజారోగ్య సమస్యగా ఓఎస్ఏ మారుతుందని ఎయిమ్స్ పరిశోధకులు చెబుతున్నారు. అత్యంత తీవ్రమైన అనారోగ్య పరిస్థితులు కూడా ఎదురవుతాయని హెచ్చరిస్తున్నారు. మరోవైపు స్లీప్ ఫౌండేషన్ నివేదికల ప్రకారం 90% మంది తమ నిద్రను పెంచుకోవాలనుకుంటుంటే, 48% మాత్రమే ఆ ప్రయత్నంలో విజయం సాధించారని, 56% మంది అతి అరుదుగా మాత్రమే నిద్రపై దృష్టిసారిస్తున్నామని చెబుతున్నారట. "ప్రశాంతంగా నిద్రపోవడానికి నేటి తరానికి ఎన్నో అడ్డంకులున్నాయి. ఒత్తిడి మొదటి కారణమైతే, ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సోషలైజింగ్‌తో పాటుగా సౌకర్యవంతమైన పడక లేకపోవడం మరో కారణం. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్‌లో ఓఎస్ఏ కేసులు బాగా పెరుగుతున్నాయి" అని వివరించారు పల్మనాలజిస్ట్ డాక్టర్ ప్రభాకర్.

### సుఖ నిద్రకు ఎన్ని అడ్డంకులో..

ఆహారం లేకుండా ఆరోగ్యవంతమైన వ్యక్తి 40 రోజులు బతకగలడేమో కానీ, నిద్ర పోకుండా గరిష్ఠంగా 11 రోజులు మాత్రమే జీవించగలడు. అయితే, ఇప్పుడు వయసుతో సంబంధం లేదు. సుఖ నిద్రకు ఎన్నో అవరోధాలు. ఓటీటీల్లో సినిమాలు, మొబైల్ ఫోన్లో సోషల్ మీడియా.. వీటిలో ఏదో ఒకదానితో రాత్రిళ్లు కాలక్షేపం చేయాల్సిందే. వాటి కారణంగా కంటి నిండా నిద్ర ఉండడం లేదు. ఇక టీనేజర్లు పరీక్షల ఒత్తిడితో నిద్రను త్యాగం చేస్తుంటారు. ఓ విధంగా చెప్పాలంటే సరిగా నిద్రపోతున్న యూత్ పెద్దగా కనిపించడం లేదిప్పుడు. జర్నల్ ఆఫ్ చైల్డ్ సైకాలజీ అండ్ సైకియాట్రీలో ప్రచురితమైన ఓ అధ్యయనమైతే యువత నిరాశలో కూరుకుపోవడానికి నిద్రలేమి కూడా ఓ కారణమని పేర్కొంది. టీనేజర్లకు కనీసం 8.5-10 గంటలు నిద్ర అవసరమని సూచించింది. ఇక రెండు వారాల పాటు నిద్ర లేమిని ఎదుర్కొన్నవారు డిప్రెసివ్ డిజార్డర్ బారినపడే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### నిద్రలేమిని గుర్తించడం ఎలాగంటే?

ముఖంలో అలసట, కళ్ల కింద వలయాలు, కనురెప్పలను పూర్తిగా తెరవని పరిస్థితి ద్వారా ఒక వ్యక్తి సరిగా నిద్రపోతున్నదీ, లేనిదీ తెలుసుకోవచ్చు. నిద్రలేమి బాధితులు చురుగ్గా ఉండలేరు. ఉదయం లేచిన తరువాత కూడా అలసటగా ఉంటారు. చర్మం పొడిబారడం, దురదలు రావడం వంటి సమస్యలూ ఎదుర్కొంటారు. తరచూ అనారోగ్యానికి గురయ్యే అవకాశాలూ ఉన్నాయి. ఏకాగ్రత చూపకపోవడం, పగటి పూట నిద్రపోవడం, అధికంగా ఆహారం తీసుకోవడం వంటివన్నీ నిద్రలేమికి నిదర్శనాలని నిపుణులు చెబుతున్నారు.

### నాణ్యమైన నిద్ర కోసం ఏం చేయాలంటే

'మనిషికి నిద్ర అవసరం. అది విలాసం కాదని గుర్తించాలి. కనీసం 8 గంటలు నిద్రపోవడానికి ప్రయత్నించాలి' అంటున్నారు మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచానీ. "రోజూ నిద్రకు నిర్దేశిత సమయం పెట్టుకోవాలి. తద్వారా జీవ గడియారాన్ని సరిగా నిర్వహించవచ్చు. కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ (డిజిటల్ డిటాక్స్) వంటివాటిని పక్కమీదకు తీసుకురావొద్దు. కనీసం గంట ముందే వాటికి దూరంగా ఉండాలి. పుస్తకాలు చదవడం, ధ్యానం చేయడం మంచిది. సరైన నిద్ర కావాలంటే సరైన వాతావరణం కూడా ఉండాలి. అంటే, నాణ్యమైన పరుపులు, దిండ్లను ఎంచుకోవాలి. పడక గదిలో ఆహ్లాదకరమైన రంగులు, బ్లాకవుట్ కర్టెన్లు లాంటివి ఎంచుకోవాలి. హెవీ మీల్స్ తినకూడదు. పక్క మీదకు వెళ్లేముందు కెఫిన్, నికోటిన్ అసలు తీసుకోకూడదు. పగటి వేళ నీరు ఎక్కువ తాగాలి. రాత్రిళ్ల చాలా తక్కువగా నీళ్ల తాగాలి. ఆకలి వేస్తుందని స్నాక్స్ వంటివి తినొద్దు. 'గోరువెచ్చటి నీటితో స్నానం తొందరగా నిద్ర పట్టేందుకు దోహదం చేస్తుంది' అని వివరించారు.



### వైసీపీ అరాచకం

వైసీపీ అల్లరి మూకలు రెచ్చిపోయాయి. ఉండవల్లి కరకట్టపై చంద్రబాబు నివాసానికి వెళ్లే దారిలో.. టీడీపీ ఫ్లెక్సీలపై విరుచుకుపడ్డాయి. కరకట్ట పొడవునా చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో ఉన్న ఫ్లెక్సీ బోర్డులను కొందరు వైసీపీ కార్యకర్తలు.. కర్రలు, కత్తులు, గొడ్డళ్లతో ఛిద్రం చేసి తొలగించి తమ రౌడీయిజాన్ని ప్రదర్శించారు. ఓవైపు జనాన్ని బెదిరించి దుకాణాలు, ఇళ్లు, ఇతర పబ్లిక్ స్థలాల్లో వైసీపీ 'సిద్ధం' పోస్టర్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేసుకుంటూనే.. ఇలా ప్రతిపక్ష పార్టీలపై బ్యానర్లను, ఫ్లెక్సీలను తొలగించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



## 'మూడేళ్ల ప్రాక్టీస్' నిబంధన
# చట్టవిరుద్ధం

- ప్రభుత్వం రూపొందించే నిబంధనలు చట్టాలకు లోబడి ఉండాలి: హైకోర్టు
- అసిస్టెంట్ కమిషనర్ పోస్టుల భర్తీలో పిటిషనర్లను పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నియామక అర్హతకు సంబంధించి హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. ఈ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థి కనీసం మూడేళ్లు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలన్న నిబంధనను తప్పుపట్టింది. ఆ నిబంధన చట్టవిరుద్ధమని ప్రకటించింది. అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యేవారు కనీసం మూడేళ్లు హైకోర్టు న్యాయవాదిగా ఉంటే సరిపోతుందని దేవదాయ శాఖ చట్టంలోని సెక్షన్ 4(5)(ఏ) చెబుతోందని గుర్తు చేసింది. మూడేళ్లపాటు హైకోర్టులో ప్రాక్టీస్ చేసి ఉండాలన్న నిబంధన 3(5)(1).. దేవదాయశాఖ చట్టంలోని సెక్షన్ 4(5)(ఏ)కు విరుద్ధమని పేర్కొంది. పిటిషనర్లలో ప్రతిభావంతులను అసిస్టెంట్ కమిషనర్ పోస్టులకు పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్. రఘునందనరావుతో కూడిన ధర్మాసనం తీర్పు ఇచ్చింది. దేవదాయశాఖలో అసిస్టెంట్ కమిషనర్ పోస్టుల భర్తీకి 2021లో ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థి న్యాయ విద్యను అభ్యసించి ఉండాలని, హిందూ మతాన్ని ఆచరిస్తూ ఉండాలని అందులో పేర్కొన్నారు. అలాగే మూడేళ్లు ఏపీ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసి ఉండాలని స్పష్టం చేశారు. కాగా, ఈ పరీక్షకు చీరాల బార్ అసోసియేషన్ సభ్యురాలు కె. రేఖ, గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యురాలు కాకి లలిత, బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యురాలు ఎం. మంజులాదేవి దరఖాస్తు చేశారు. రాతపరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అయితే, మూడేళ్లు హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయనందున అసిస్టెంట్ కమిషనర్ పోస్టుకు పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో వీరు హైకోర్టులో వేర్వేరుగా రెండు పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది జీవీ శివాజీ, పి. దుర్గాప్రసాద్‌లు వాదనలు వినిపించారు. దేవదాయశాఖ తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ వాదించారు. ఇరుపక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. దేవదాయశాఖ చట్టంలోని సెక్షన్ 153 ప్రకారం నిబంధనలు రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, అవి చట్టానికి విరుద్ధంగా ఉండకూడదని పేర్కొంది. పిటిషనర్ల పేర్లను అసిస్టెంట్ కమిషనర్ పోస్టుల భర్తీలో పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను ఆదేశించింది.

# ముగింపు నుంచి మొదలు




మన యువ హీరోలు జోరు మీదున్నారు. ఒకట్రెండు సినిమాలు సెట్స్‌పై ఉండగానే, కొత్త సినిమాలకు పచ్చ జెండా ఊపుతున్నారు. చేతిలో ఉన్న చిత్రాల షూటింగ్ చివరి దశలో ఉండగానే గ్యాప్ రాకుండా తదుపరి చిత్రాలకు సన్నాహాలు మొదలుపెడుతున్నారు. ఆ వివరాలేంటో చూద్దాం.

ప్రస్తుతం 'సలార్' సక్సెస్‌ను ఆస్వాదిస్తున్నారు ప్రభాస్. ఇప్పుడు ఆయన 'సలార్' సీక్వెల్‌తో పాటు మారుతి దర్శకత్వంలో 'రాజాసాబ్' చిత్రం చేస్తున్నారు. ఇవి రెండూ పూర్తయ్యాక ఆయన సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రం చేస్తున్నారు. 'యానిమల్' చిత్రం ఘన విజయం సాధించడంతో సందీప్ మరోసారి ఎలాంటి మ్యాజిక్ చేయబోతున్నారో అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. ఇన్నేళ్ల కెరీర్‌లో ప్రభాస్ ఈ చిత్రంలో తొలిసారి పోలీస్ ఆఫీసర్‌గా కనిపించబోతున్నారు. టీ సిరీస్ భూషణ్‌కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'స్పిరిట్' స్క్రిప్ట్ వర్క్ దాదాపు పూర్తయినట్లే అని సందీప్‌రెడ్డి ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. వీలయినంత త్వరగా ప్రీ ప్రొడక్షన్ పూర్తి చేసి ఈ ఏడాది చివరల్లో 'స్పిరిట్'ను సెట్స్‌పైకి తీసుకెళ్తామని ఆయన చెప్పారు.

### వార్‌కు రెడీ

'జనతా గ్యారేజ్' చిత్రం లాంటి సూపర్‌హిట్ తర్వాత ఎన్టీఆర్‌తో దర్శకుడు కొరటాల శివ రూపొందిస్తున్న చిత్రం 'దేవర'. చిత్రీకరణ చివరి దశకు వచ్చింది. కొంత టాకీ పార్ట్‌తో పాటు కొన్ని పాటల చిత్రీకరణ మిగిలి ఉంది. త్వరలోనే ఎన్టీఆర్ 'వార్ 2' చిత్రంతో బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. హృతిక్‌రోషన్, టైగర్‌ష్రాఫ్ నటించిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. ఇందులో ఎన్టీఆర్ పాత్ర అంచనాలను మించి ఉండబోతోందని టాక్. త్వరలోనే 'వార్ 2' చిత్రం షూటింగ్ ప్రారంభించనున్నట్లు హృతిక్‌రోషన్ ఇటీవలే తెలిపారు. అంటే ఎన్టీఆర్ కూడా ఈ సినిమా సెట్లోకి అడుగుపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లే. యష్ రాజ్ ఫిల్మ్స్ పై యూనివర్స్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి దర్శకుడు అయాన్ ముఖర్జీ. వచ్చే ఏడాది ఆగస్టు 14న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

### మూడోసారి పుష్పగా వస్తారా?

'పుష్ప' చిత్రంతో జాతీయ స్థాయిలో ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్నారు అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన 'పుష్ప 2' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఆయన చేయబోయే తదుపరి సినిమా ఇప్పటిదాకా ఖరారు కాలేదు. అయితే ఇటీవలే బెర్లిన్ చిత్రోత్సవాల్లో పాల్గొన్న సందర్భంగా 'పుష్ప'కు కొనసాగింపుగా 'పుష్ప 3' చేసే అవకాశాన్ని కొట్టిపారేయలేమని బన్నీ చెప్పారు. పుష్ప చిత్రంతో అల్లు అర్జున్‌కు దేశవ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. హీరోగా ఆయన మార్కెట్ రేంజ్ భారీగా పెరిగింది. అచ్చొచ్చిన ఫ్రాంఛైజీలో మరో చిత్రం చేయడానికి బన్నీ వెనుకాడకపోవచ్చు. అదే జరిగితే బన్నీ తర్వాత చేయబోయే సినిమా 'పుష్ప 3'నే అవుతుంది.

### 16తో సెట్స్‌పైకి

'ఆర్ఆర్ఆర్' తర్వాత రామ్‌చరణ్ రేంజ్ మరింత పెరిగింది. ఆ ఇమేజ్‌కు తగ్గట్లు కొత్త సినిమాలను ఎంచుకుంటున్నారు చరణ్. ఆయన ప్రస్తుతం 'గేమ్‌ఛేంజర్' చిత్రం చేస్తున్నారు. శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశలో ఉంది. దీని తర్వాత రామ్‌చరణ్ చేయబోయే సినిమా బుచ్చిబాబు సానా దర్శకత్వంలోనే. దీనికి 'ఆర్ సీ 16' వర్కింగ్ టైటిల్. త్వరలోనే ఈ చిత్రాన్ని సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### సరికొత్త మేకోవర్‌తో

'గుంటూరు కారం' చిత్రంతో సందడి చేశారు మహేశ్‌బాబు. సంక్రాంతికి విడుదల చేయాలనే లక్ష్యంతో ఆ సినిమా చిత్రీకరణ చాలా వేగంగా పూర్తి చేశారు మహేశ్. ఇప్పుడు ఆయన రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం కోసం సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ పూర్తి చేసినట్లు రచయిత విజయేంద్ర ప్రసాద్ చెప్పారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభించాల్సి ఉంది. అది పూర్తవగానే మహేశ్ రాజమౌళి సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతారు. ఇప్పటికే ఆయన తన పాత్ర కోసం సరికొత్తగా మేకోవర్ అవుతున్నారు.

### పోలీస్ కథతో

'లైగర్' తర్వాత 'ఖుషీ' చిత్రంతో థియేటర్ల దగ్గర మేజిక్ చేశారు విజయ్ దేవరకొండ. ఈ సారి మరో చక్కని లవ్‌స్టోరీతో ప్రేక్షకుల ముందుకొచ్చేందుకు ఆయన సన్నద్ధమవుతున్నారు. పరశురామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. ఏప్రిల్ 5న విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో త్వరగా చిత్రీకరణ పూర్తి చేసి, ప్రచార కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని విజయ్ భావిస్తున్నారు. ఆ తర్వాత ఆయన వెంటనే గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం షూటింగ్ మొదలుపెట్టనున్నారు. సితార ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'వీడీ 12' అనేది వర్కింగ్ టైటిల్. ఇందులో విజయ్ శక్తిమంతమైన పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు.





## అట్లీ...హాలీవుడ్ అనౌన్స్‌మెంట్




గతేడాది షారూఖ్‌ఖాన్ కథానాయకుడిగా నటించిన 'జవాన్' చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన విషయం తెలిసిందే. బాక్సాఫీసు దగ్గర ఆ సినిమా ధాటికి పాత రికార్డులు చెరిగిపోయాయి. గతేడాది అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా 'జవాన్' నిలవడంతో దర్శకుడిగా అట్లీ పేరు మార్మోగింది. రూ. వెయ్యికోట్ల వసూళ్లను అందుకొన్న చిత్రాల దర్శకుడిగా ఆయన అరుదైన ఘనత సాధించారు. ఆ సినిమా ఘన విజయం తర్వాత అట్లీ తన మనసులో మాట బయటపెట్టారు. ఓ హాలీవుడ్ సినిమాకు దర్శకత్వం వహించాలనేది తన కల అని చెప్పారు. ఆ తర్వాత ఆయన ఆ విషయంపై ఎక్కడా స్పందించలేదు. అయితే త్వరలోనే తన హాలీవుడ్ కోరిక నెరవేరబోతోందని అట్లీ తెలిపారు. తాను హాలీవుడ్ సినిమా చేయడం ఖాయమైనట్లు ఓ ఇంటర్వ్యూలో ఆయన ప్రకటించారు. బాలీవుడ్‌కు చేరడానికి నాకు ఎనిమిదేళ్లు పట్టింది, రాబోయే మూడేళ్లలో నా నుంచి ఓ భారీ అనౌన్స్ మెంట్ వింటారు అని ఆయన చెప్పారు. తన కలల ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాలను ఇప్పుడే వెల్లడించలేనని అన్నారు. మంచి వినోదం అందించగలగడం దర్శకుడిగా నా బలం, హాలీవుడ్‌లో సినిమా చేసినా ఎంటర్టైన్‌మెంట్‌కు పెద్ద పీట వేస్తాను అని అట్లీ తెలిపారు.

## పెళ్లితో జోరు పెరిగింది



సిద్ధార్థ్ మల్హోత్రాతో వివాహం తర్వాత హీరోయిన్‌గా తన కెరీర్ మాంచి జోరుమీదుందంటున్నారు కియార అద్వాణీ. హీరోయిన్లు వివాహబంధంలోకి అడుగుపెడితే ప్రేక్షకులు తిరస్కరిస్తారు అనుకోవడం సరికాదు అన్నారు. గతేడాది కియారా బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను వివాహమాడారు. 'పెళ్లితో హీరోయిన్‌గా కెరీర్ దెబ్బతింటుంది, మంచి పొజిషన్‌లో ఉన్నావ్, ఇప్పుడప్పుడే పెళ్లి చేసుకోవద్దని ఆ సమయంలో చాలా మంది సలహా ఇచ్చారు కానీ నేను వినలేదు' అని కియారా అన్నారు. 'ఇప్పుడు నా జీవితంలో వాళ్లు చెప్పినదానికి పూర్తి భిన్నంగా జరుగుతోంది. పెళ్లయినా ప్రేక్షకులు నా చిత్రాలను గతంలోలానే ఆదరిస్తున్నారు. సిద్ధార్థ్‌తో పెళ్లి తర్వాతే నా కెరీర్‌లో అతిగొప్ప అవకాశాలను అందుకున్నానని భావిస్తున్నాను' అని తెలిపారు. తెలుగులో రామ్‌చరణ్ సరసన గేమ్ ఛేంజర్, హిందీలో రణ్‌వీర్ సింగ్ సరసన 'డాన్ 3' చిత్రాల్లో ఆమే హీరోయిన్. ఆ రెండు సినిమాలను ఉదహరిస్తూ... పెళ్లి అయ్యాకే ఈ రెండు భారీ క్రేజీ ప్రాజెక్ట్‌ల్లో నాకు అవకాశం వచ్చింది, ఇదొక మంచి మార్పు అని చెప్పారు. వీటితో పాటు హృతిక్‌రోషన్ సరసన 'వార్ 2' చిత్రంలోనూ కియారా నటిస్తున్నారు.

## వైఫల్యాన్ని అంగీకరించడానికి టైమ్ పట్టింది





ఆమిర్‌ఖాన్

తాను చేసిన పొరపాట్లే 'లాల్‌సింగ్‌చద్దా' చిత్రం ఘోర వైఫల్యానికి కారణమయ్యాయని ఆమిర్‌ఖాన్ పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల విరామం తర్వాత ఆయన నటించిన చిత్రమిది. ఈ చిత్రంలో టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య కీలకపాత్రలో కనిపించారు. హాలీవుడ్ చిత్రం 'ఫారెస్ట్ గంప్'కు రీమేక్‌గా రూపొందిన 'లాల్‌సింగ్ చద్దా'పై ఆమిర్‌ఖాన్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆయన ఆశలన్నీ అడియాసలయ్యాయి. మమ్మురంగా ప్రచారం చేసినా ప్రేక్షకులు కన్నెత్తి చూడకపోవడంతో బాక్సాఫీసు దగ్గర ఆ చిత్రం డిజాస్టర్‌గా మిగిలింది. ఆ అపజయంతో కంగుతిన్న ఆమిర్ మళ్లీ సినిమాలకు విరామం ఇస్తున్నట్లు ప్రకటించారు. దాదాపు ఏణ్ణార్థం అవుతున్నా ఇప్పటిదాకా కొత్త చిత్రం ప్రకటించలేదంటే ఆయన ఎంత సందిగ్ధంలో ఉన్నారో అర్థమవుతోంది. ఇటీవలే ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమిర్ 'లాల్‌సింగ్ చద్దా' సినిమా అపజయం ఆయన కెరీర్, జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందో వివరించారు. "లాల్‌సింగ్ చద్దా" అపజయానికి పూర్తి బాధ్యత నాదే. సినిమా వైఫల్యంతో చాలా మథనపడ్డాను. వాస్తవాన్ని అంగీకరించడానికి నాకు చాలా టైమ్ పట్టింది. నాతో సహ దర్శకుడు అద్వైత్, హీరోయిన్ కరీనా కపూర్, చిత్రబృందం అంతా తీవ్రంగా శ్రమించారు. అయినా సినిమా ఆడలేదు. ఇన్నేళ్ల తర్వాత ఎంతో కష్టపడి చేసిన సినిమాకు డిజాస్టర్ టాక్ రావడంతో స్నేహితులు, కుటుంబ సభ్యులు నన్ను పరామర్శించేందుకు మా ఇంటికి వరుస కట్టారు. ఒక సినిమా ఫ్లాప్ అయిన తర్వాత కూడా ఇంతమంది పరామర్శకు రావడం నాకు ఓదార్పునిచ్చింది. అలాగే నా పొరపాట్లను సమీక్షించుకున్నాను. ఆ సినిమా వైఫల్యం నాకు జీవితకాలానికి సరిపడా పాఠాలు నేర్పింది. సినిమా మేకింగ్‌లో ప్రతి స్థాయిలోనూ చాలా పొరపాట్లు చేశాను. అయితే ఇలాంటి పొరపాట్లు ఈ ఒక్క సినిమాలోనే కదా చేసింది అని నాకు నేను సర్దిచెప్పుకున్నాను' అని తెలిపారు. ఆమిర్‌ఖాన్ 'సలామ్ వెంకీ' అనే చిత్రంలో అతిథి పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఆయన చిత్ర నిర్మాణంపై దృష్టి సారించారు. తన సొంత బేనర్‌లో నిర్మించిన 'లాపతా లేడీస్' చిత్రం మార్చి 1న విడుదలవుతోంది.

### ఈ వారమే విడుదల


ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

| ఓటీటీ వేదిక | సినిమా/సిరీస్ | విడుదల తేదీ |
|---|---|---|
| **నెట్‌ఫ్లిక్స్** | | |
| కోడ్ 8 | హాలీవుడ్ మూవీ | ఫిబ్రవరి 28 |
| మామ్లా లీగల్ హై | హిందీ సిరీస్ | మార్చి 01 |
| స్పేస్‌మాన్ | హాలీవుడ్ మూవీ | మార్చి 01 |
| **అమెజాన్ ప్రైమ్** | | |
| వెడ్డింగ్ ఇంపాజిబుల్ | కొరియన్ సిరీస్ | ఫిబ్రవరి 26 |
| ఎనీవన్ బట్ యూ | హాలీవుడ్ మూవీ | ఫిబ్రవరి 27 |
| పూర్ థింగ్స్ | హాలీవుడ్ మూవీ | ఫిబ్రవరి 27 |
| నైట్ స్విమ్ | హిందీ డబ్బింగ్ | మార్చి 01 |
| **జీ 5** | | |
| సన్‌ఫ్లవర్ | హిందీ సిరీస్ 2 | మార్చి 01 |
| **ఆహా...** | | |
| బూట్‌కట్ బాలరాజు | తెలుగుచిత్రం | ఫిబ్రవరి 26 |
| **బుక్ మై షో** | | |
| ఫియర్ | హాలీవుడ్ మూవీ | ఫిబ్రవరి 17 |



## జీవితం... నీకే అంకితం



బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా జంటగా నటించిన చిత్రం 'యోధ'. మార్చిలో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. శనివారం తొలిగీతాన్ని విడుదల చేసింది. 'జిందగీ తెరే నామ్' అంటూ సాగే ఈ పాటలో అందమైన పర్వత సానువులు, ఆహ్లాదాన్ని పంచే ప్రదేశాల్లో చిత్రీకరించిన ఈ రొమాంటిక్ గీతంలో హీరో హీరోయిన్లు జంటగా బైక్‌పై విహరిస్తూ ఊహాలోకంలో తేలిపోతూ కనిపించారు. కౌశల్ కిశోర్ సాహిత్యం అందించగా విశాల్ మిశ్రా స్వరాలు సమకూర్చడంతో పాటు మధురంగా ఆలపించారు. సిద్ధార్థ్ ఈ చిత్రంలో పూర్తి స్థాయి యాక్షన్ పాత్ర పోషిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● ఆదివారం 25 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com



# ఎన్‌ఎఫ్ఎస్‌యూలో అడ్మిషన్స్

నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ (ఎన్‌ఎఫ్ఎస్‌యూ)- పలు ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సంస్థ ఆధ్వర్యంలోని వివిధ స్కూళ్లు వీటిని నిర్వహిస్తున్నాయి. గాంధీనగర్, ఢిల్లీ, త్రిపుర, గోవా, భోపాల్, ధర్వాడ, మణిపూర్ క్యాంపస్‌లలో ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంఏ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎల్ఎల్ఎం, బీటెక్-ఎంటెక్, బీబీఏ-ఎంబీఏ, బీఎస్సీ-ఎల్ఎల్‌బీ ఆనర్స్, బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్, పీజీ డిప్లొమా తదితర ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. పీజీ డిప్లొమాలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు సంస్థ సీబీటీ మోడ్‌లో నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ స్కోర్, అకడమిక్ ప్రతిభ, ఇంటర్వ్యూల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

**ఎన్‌ఎఫ్ఎస్‌యూ స్కూళ్లు**

- స్కూల్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్
- స్కూల్ ఆఫ్ మెడికో లీగల్ స్టడీస్
- స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్
- స్కూల్ ఆఫ్ ఫార్మసీ
- స్కూల్ ఆఫ్ లా-ఫోరెన్సిక్ జస్టిస్ అండ్ పాలసీ స్టడీస్
- స్కూల్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్
- స్కూల్ ఆఫ్ పోలీస్ సైన్స్ అండ్ సెక్యూరిటీ స్టడీస్
- స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ
- స్కూల్ ఆఫ్ బిహేవియరల్ ఫోరెన్సిక్స్

## పీజీ

**ఎమ్మెస్సీ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
**స్పెషలైజేషన్‌లు:** ఫోరెన్సిక్ సైన్స్, ఫోరెన్సిక్ బయోటెక్నాలజీ, మల్టీమీడియా ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ, హోంలాండ్ సెక్యూరిటీ, ఫోరెన్సిక్ నానో టెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, క్లినికల్ సైకాలజీ, న్యూరో సైకాలజీ, ఫోరెన్సిక్ సైకాలజీ, టాక్సికాలజీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ
**అడ్మిషన్ టెస్ట్:** ఇది 100 మార్కులకు ఉంటుంది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, బేసిక్స్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, ఐటీ, లాజికల్ రీజనింగ్, లైఫ్ సైన్స్, ఫుడ్ సైన్స్ తదితర అంశాల నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
**ఎంబీఏ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. స్పెషలైజేషన్‌ను అనుసరించి సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. క్యాట్ 2023 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లు; అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ద్వారా మిగిలిన సీట్లు భర్తీ చేస్తారు.
**స్పెషలైజేషన్‌లు:** ఫోరెన్సిక్ అకౌంటింగ్ అండ్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, సైబర్ సెక్యూరిటీ మేనేజ్‌మెంట్, హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్, బిజినెస్ అనలిటిక్స్-ఇంటెలిజెన్స్
**అడ్మిషన్ టెస్ట్:** జనరల్ నాలెడ్జ్, లాజికల్ రీజనింగ్ అండ్ ఆప్టిట్యూడ్, మేథమెటికల్ రీజనింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ అంశాల నుంచి 60 శాతం; ఫండమెంటల్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సబ్జెక్ట్స్ అంశాల నుంచి 40 శాతం మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు.
**ఎంఫార్మసీ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కనీసం 55 శాతం మార్కులతో బీఫార్మసీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**స్పెషలైజేషన్‌లు:** ఫోరెన్సిక్ ఫార్మసీ, ఫార్మాస్యూటిక్ క్వాలిటీ అష్యూరెన్స్
**అడ్మిషన్ టెస్ట్:** బీఫార్మసీ సిలబస్ నుంచి మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు.
**ఎంటెక్:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. గేట్ 2024 స్కోర్ ద్వారా 50 శాతం సీట్లను, అడ్మిషన్ టెస్ట్ స్కోర్ ద్వారా మిగిలిన సీట్లను భర్తీ చేస్తారు. అడ్మిషన్ టెస్ట్‌లో నిర్దేశిత స్పెషలైజేషన్ సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
**స్పెషలైజేషన్‌లు:** సైబర్ సెక్యూరిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్(సైబర్ సెక్యూరిటీ), సివిల్ ఇంజనీరింగ్(ఫోరెన్సిక్ స్ట్రక్చరల్ ఇంజనీరింగ్)
**ఎల్ఎల్ఎం:** ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**స్పెషలైజేషన్‌లు:** సైబర్ లా అండ్ సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్, క్రిమినల్ లా అండ్ క్రిమినల్ జస్టిస్ అడ్మినిస్ట్రేషన్
**ఎంపిక:** పీజీ క్లాట్ 2024 స్కోర్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
**ఎంఫిల్:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. రెండేళ్ల వ్యవధి గల (ఎంఏ/ఎమ్మెస్సీ)(సైకాలజీ) ఉత్తీర్ణులు అర్హులు.
**స్పెషలైజేషన్:** క్లినికల్ సైకాలజీ
**అడ్మిషన్ టెస్ట్:** జనరల్ సైకాలజీ సిస్టమ్స్, సైకో పాథాలజీ, సైకో థెరపీ, సోషల్ సైకాలజీ, బయలాజికల్ సైకాలజీ, సైకలాజికల్ మెజర్‌మెంట్, రీసెర్చ్ మెథడాలజీ, స్టాటిస్టిక్స్ తదితర అంశాల నుంచి 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. అర్హత పొందినవారిని ఇంటర్వ్యూకి పిలుస్తారు.

## పీజీ డిప్లొమా

ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**స్పెషలైజేషన్‌లు:** ఫింగర్‌ప్రింట్ సైన్స్, ఫోరెన్సిక్ డాక్యుమెంట్ ఎగ్జామినేషన్, డీఎన్ఏ ఫోరెన్సిక్స్, క్రైం సీన్ మేనేజ్‌మెంట్, ఫోరెన్సిక్ జర్నలిజం(ఆన్‌లైన్), ఫోరెన్సిక్ బాలిస్టిక్స్, సైబర్ క్రైం ఇన్వెస్టిగేషన్, సెమి కండక్టర్ సెక్యూరిటీ అండ్ ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్, సెక్యూరిటీ స్టడీస్, సైబర్ సైకాలజీ, ఇన్వెస్టిగేటివ్ సైకాలజీ, హ్యూమానిటేరియన్ ఫోరెన్సిక్స్ డిజాస్టర్ విక్టిమ్ ఐడెంటిఫికేషన్, ఇండస్ట్రియల్ సేఫ్టీ-హైజిన్-ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, సైబర్ లా

## ఇంటిగ్రేటెడ్ కోర్సులు

**ప్రోగ్రామ్‌లు:** బీఎస్సీ-ఎమ్మెస్సీ (ఫోరెన్సిక్ సైన్స్/క్రిమినాలజీ అండ్ ఫోరెన్సిక్ సైన్స్); బీఏ-ఎంఏ(క్రిమినాలజీ); బీఎస్సీ ఎల్ఎల్‌బీ ఆనర్స్; బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్; బీటెక్-ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ), బీబీఏ-ఎంబీఏ

- ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. కోర్సుకు నిర్దేశించిన ప్రకారం సంబంధిత గ్రూప్ సబ్జెక్టులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

**ఎంపిక:** బీఎస్సీ ఎల్ఎల్‌బీ; బీబీఏ ఎల్ఎల్‌బీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లకు క్లాట్ 2024 స్కోర్ ఆధారంగా; బీటెక్-ఎంటెక్ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సైబర్ సెక్యూరిటీ) ప్రోగ్రామ్‌నకు జేఈఈ మెయిన్ 2024 ర్యాంక్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఈ టెస్ట్‌లో నిర్దేశించిన సబ్జెక్టుల నుంచి ఇంటర్ స్థాయిలో వంద ఆబ్జెక్టివ్ ప్రశ్నలు అడుగుతారు.
**ఎంఏ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**స్పెషలైజేషన్‌లు:** మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫోరెన్సిక్ జర్నలిజం, పాలసీ అండ్ సెక్యూరిటీ స్టడీస్, క్రిమినాలజీ
**అడ్మిషన్ టెస్ట్:** మాస్ కమ్యూనికేషన్ అండ్ ఫోరెన్సిక్ జర్నలిజం స్పెషలైజేషన్‌కు జీకే, లాజికల్/మేథమెటికల్ రీజనింగ్, ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ అంశాలనుంచి 60 శాతం ప్రశ్నలు; జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా, మీడియా లాస్ అంశాల నుంచి 40 శాతం ప్రశ్నలు అడుగుతారు. పాలసీ అండ్ సెక్యూరిటీ స్టడీస్ స్పెషలైజేషన్‌కు జీకే, రీజనింగ్, మేథమెటిక్ ఆప్టిట్యూడ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, బేసిక్స్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్, నేషనల్ సెక్యూరిటీ, ఇండియన్ సెక్యూరిటీ ఫోర్సెస్, హిస్టరీ ఆఫ్ టెర్రరిజం, కరెంట్ అఫైర్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. క్రిమినాలజీ స్పెషలైజేషన్‌కు సోషియాలజీ, సోషల్ సైకాలజీ, సోషల్ వర్క్, క్రిమినాలజీ సబ్జెక్టుల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు.

### ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ టెస్ట్ దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **అడ్మిషన్ టెస్ట్(ఎన్ఎఫ్ఏటీ) 2024 తేదీలు:** జూన్ 15, 16
- **అభ్యర్థుల మెరిట్ లిస్ట్‌లు, కౌన్సెలింగ్‌లు:** జూన్ 24 నుంచి జూలై 12 వరకు
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** జూలై 22 నుంచి
- **వెబ్‌సైట్:** www.nfsu.ac.in

---

# లిటిల్స్



## తల తిరిగే కొలువు

ఒక ఊరిలో వెంకన్న అనే ఓ వ్యక్తి ఉండేవాడు. అతనికి ఎప్పుడూ ఏదో నిరాశ. తనెంతో కష్టపడుతున్నానని అనుకుండేవాడు. అది కూడా తను చేసే పని రోడ్లను శుభ్రపరిచే కొలువు. ఆ ఊరికి దగ్గరలోనే రాజుగారు ఉండేవారు. ఆయన పాలనలోనే గ్రామాలన్నీ ఉండేవి. రాజుగారో, మంత్రిగారో వచ్చినప్పుడు.. శుభ్రంగా ఉండాలని వీధులను శుభ్రపరచటానికి ఇతను కూడా మిగతా పనివాళ్లతో కలసి వెళ్లేవాడు. తనెంతో గొప్ప వ్యక్తిని అవుతానని కలలు కనేవాడు. అయితే ఎవరూ పట్టించుకునేవారు కాదు అతని మాటలను.

వెంకన్న తన భార్య, పిల్లలను పోషించుకుంటూ జీవనం గడిపేవాడు. ఎంత బతికినా ఇంతే కదా! అని తిట్టుకునేవాడు. ఒక రోజు వెంకన్నకు రాజుగారి కొలువులో ఉద్యోగం వచ్చిందని ఒకభటుడు వచ్చి చెప్పాడు. తన ఊరు విడిచి పోవాలంటే వెంకన్నకు ఇష్టం లేదు. అదే రోజు రాజుగారి కొలువులోని




ఓ రాజాధికారి అనారోగ్యంతో చనిపోయాడు. దీంతో రాజుగారు హుటాహుటిన సమావేశం ఏర్పరిచాడు. ఏదో వ్యక్తిని తీసుకోమని మంత్రిగారితో చెప్పాడు.

రాజుగారి బంధువులూ, కొందరు కొలువులోని మంత్రులు వారి బంధువుల పేర్లు ప్రస్తావించారు. ఆ కొలువు నాకే కావాలని అందరూ వాదించుకున్నారు. కొట్లాడుకున్నారు. ఎవరి సిఫారసు చెల్లదని మంత్రిగారు ఆ పంచాయితీని రాజుగారి దగ్గర పెట్టించారు. ఒక చిన్న కొలువుకు ఇంత తలనొప్పా? అంటూ రాజుగారు అందరినీ తిట్టారు. మీరు చిన్న కొలువుకోసం ఇంతలా కొట్లాడుకుని నా దగ్గరికి వచ్చారా? ఎవరికీ ఇవ్వను. తెలిసినవారికి అసలే ఇవ్వనని రాజుగారు ఆజ్ఞాపించారు. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. వారంతా వెళ్లిపోయారు. వెంటనే మంత్రిగారికి రాజుగారు చెవులో ఇలా చెప్పారు. ఇది రహస్యంగా ఉంచాలి. రేపొద్దున మన రాజ్యంలోకి ఎవరు ముందొస్తారో వాళ్లదే ఈ కొలువు అన్నారు.

వెంకన్న ఆరేడు రోజులు కొలువు దగ్గరకు పోలేదు. రాజుగారి రాజ్యంలో పని చేయాలనే ఆశ లేదు అతనికి . భార్య, పిల్లలకోసం తప్పదనుకుని ఉదయాన్నే రాజుగారి కోటకు వచ్చారు. లోపలికి వస్తూనే అతన్ని 'రాజాధికారి'గా అక్కడి భటులు పిలిచారు. అతనికి అర్థమే కాలేదు. పైగా రాచరికపు దుస్తులు ఇచ్చారు. అవి ధరించాడు వెంకన్న. భటులు వచ్చి పల్లకీలో కూర్చోబెట్టారు. రాజుగారి దగ్గరకు తీసుకుపోయారు. 'అయ్యా.. చీపురు పని చేసేవాడిని' అని చెప్పాలనుకున్నాడు వెంకన్న. ఆ రాచమర్యాదలను చూసి మర్చిపోయాడు. తన గురించి రహస్యంగా ఉంచాడు. తన పేరు వెంకటాద్రిగా చెప్పుకున్నాడు.

వెంకన్నకు యోగం పట్టిందిరో.. అంటూ ఊరంతా వార్తలు వినిపించాయి. వెంకన్న భార్య రాజుగారి కోటకు పోయింది. వెంకన్న పల్లకీలో ఊరేగుతున్నాడు. తన భార్య వెళ్లి.. 'నువ్వు మా వెంకన్నవే కదూ' అని అడిగింది. 'అవునా.. నిన్ను మాత్రం నేనెరుగుదును. నన్ను తెలుసునని చెప్పకు. నా గురించి నాకే తెలీదు' అన్నాడు వెంకటాద్రి. వెంకన్న తలబిరుసు, పదవికి అతని భార్య మండిపడి ఇంటికి పోయింది. ఆ తర్వాత వెంకన్న చేష్టలు చూసి అందరూ అతని మీద ఫిర్యాదు చేశారు. అతని వాలకం ఏదోలా ఉందని రాజుకు అర్థమైంది. పూర్వం ఏమి చేశావు? అని అడిగాడు రాజుగారు. చీపురు పని చేసేవాన్ని అన్నాడు. మరి రాజాధికారిగా పని చేస్తావా? అని అడిగాడు రాజుగారు. నావల్ల కాదన్నాడు వెంకటాద్రి. ఇతని మీద ఇతనికే నమ్మకం లేదు తరిమేయండి ఇక్కడ నుంచి అని కోప్పడ్డారు రాజుగారు. తిరిగి ఊరికి పారిపోయాడు. అర్ధరాత్రికి ఇంటికి చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి తలుపు కొట్టాడు. వెంకన్నను అన్నాడు. అవేమీ పట్టించుకోకుండా తన భార్య తలుపు మూసింది. రాత్రంతా చలికి గజగజా వణికిపోయాడు వెంకన్న. తనకు బుద్ధి వచ్చిన తర్వాతనే వెంకన్న భార్య అతనితో మాట్లాడింది.

### 6 తేడాలను గుర్తించండి




### సరైన నీడ ఏది?




### డైలీ సుడోకు - 239

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 8 | | | | | | 3 |
| | | | | 5 | | 6 | 8 | |
| 3 | 1 | | 4 | | | 5 | | |
| 2 | | | 5 | 7 | | | | |
| | 9 | | 8 | | 6 | | 3 | |
| | | | | 4 | 2 | | | 6 |
| | | 6 | | | 7 | | 5 | 1 |
| | 7 | 9 | | 3 | | | | |
| 1 | | | | | | 9 | | |

**సుడోకు - 238 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 5 | 8 | 7 | 2 | 9 | 1 | 4 | 3 |
| 9 | 4 | 2 | 3 | 5 | 1 | 6 | 8 | 7 |
| 3 | 1 | 7 | 4 | 6 | 8 | 5 | 2 | 9 |
| 2 | 6 | 1 | 5 | 7 | 3 | 4 | 9 | 8 |
| 7 | 9 | 4 | 8 | 1 | 6 | 2 | 3 | 5 |
| 8 | 3 | 5 | 9 | 4 | 2 | 7 | 1 | 6 |
| 4 | 8 | 6 | 2 | 9 | 7 | 3 | 5 | 1 |
| 5 | 7 | 9 | 1 | 3 | 4 | 8 | 6 | 2 |
| 1 | 2 | 3 | 6 | 8 | 5 | 9 | 7 | 4 |

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

---

# ఏకలవ్య ఆదర్శ గురుకులాల్లో ఆరో తరగతి ప్రవేశాలు



తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని 23 ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్య శిక్షణ అందిస్తారు బోధన మాధ్యమం ఆంగ్లంలో సీబీఎస్ఈ సిలబస్ బోధిస్తారు. అర్హులైన గిరిజన, ఆదివాసి గిరిజన, సంచార గిరిజన, పాక్షిక సంచార గిరిజన, డీనోటిఫైడ్ ట్రైబ్ కేటగిరీలకు చెందిన మార్చి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు

### పరీక్ష వివరాలు

**అడ్మిషన్:** తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతి ప్రవేశాలు.
**పరీక్ష పేరు:** ఈఎంఆర్ఎస్ సెలెక్షన్ టెస్ట్(ఈఎంఆర్ఎస్ఎస్‌టీ)-2024
**సీట్ల వివరాలు:** ప్రతి ఏకలవ్య ఆదర్శ గురుకుల విద్యాలయాల్లో ఆరో తరగతిలో 60 సీట్ల చొప్పున మొత్తం 23 విద్యాలయాల్లో 1,380(690 బాలురు, 690 బాలికలు) సీట్లు ఉన్నాయి.


### పాఠశాలలు ఉన్న ప్రాంతాలు

- ఉట్నూరు, సిర్పూర్-టి(ఆసిఫాబాద్ జిల్లా), నర్నూరు, ఇంద్రవెల్లి(ఆదిలాబాద్ జిల్లా, గండుగలపల్లి, పాల్వంచ, గుండాల, టేకులపల్లి, చర్ల, దమ్ముగూడెం, ముల్కలపల్లి(భద్రాది కొత్తగూడెం జిల్లా), కల్వకుర్తి(నాగర్‌కర్నూలు జిల్లా), బాలానగర్(మహబూబ్‌నగర్ జిల్లా), కురవి, సీరోలు, బయ్యారం, కొత్తగూడ, గూడూరు(మహబూబాబాద్ జిల్లా), గాంధారి(కామారెడ్డి జిల్లా), ఇందల్వాయి(నిజామాబాద్ జిల్లా), మర్రిమండ్ల, ఎల్లారెడ్డిపేట(రాజన్న సిరిసిల్ల జిల్లా), సింగరేణి(ఖమ్మం జిల్లా).

**అర్హతలు:** ఆరో తరగతిలో ప్రవేశాలు పొందగోరే విద్యార్థులు తప్పనిసరిగా 2023-24 విద్యా సంవత్సరంలో అయిదో తరగతి చదివి ఉండాలి.
**వయసు:** 2024 మార్చి 31 నాటికి ఆరో తరగతికి 10-13 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
**ఎంపిక:** రాతపరీక్ష, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా.
**పరీక్ష విధానం:** ఆరో తరగతికి 100 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ(50 ప్రశ్నలు, అర్థమెటిక్(25 ప్రశ్నలు), లాంగ్వేజ్(25 ప్రశ్నలు) అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో పరీక్ష నిర్వహిస్తారు.
**దరఖాస్తు ఫీజు:** రూ.100
**దరఖాస్తు విధానం:** ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.
**దరఖాస్తుల స్వీకరణకు చివరితేదీ:** మార్చి 23
**ప్రవేశ పరీక్ష నిర్వహణ:** ఏప్రిల్ 21
**మొదటిదశ ప్రవేశాలు:** మే 23
**రెండో దశ ప్రవేశాలు:** జూన్ 5
**వెబ్‌సైట్:** tsemrs.telangana.gov.in/

---

# జాబ్ కార్నర్



## సింగరేణిలో ఎగ్జిక్యూటివ్/నాన్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 272

కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్... వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

**ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు**

1. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(మైనింగ్), ఈ2 గ్రేడ్: **139 పోస్టులు**
2. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఎఫ్ అండ్ ఏ), ఈ2 గ్రేడ్: **22 పోస్టులు**
3. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(పర్సనల్), ఈ2 గ్రేడ్: **22 పోస్టులు**
4. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(ఐఈ), ఈ2 గ్రేడ్: **10 పోస్టులు**
5. జూనియర్ ఎస్టేట్స్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **10 పోస్టులు**
6. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(హైడ్రో జియాలజిస్ట్), ఈ2 గ్రేడ్: **2 పోస్టులు**
7. మేనేజ్‌మెంట్ ట్రెయినీ(సివిల్), ఈ2 గ్రేడ్: **18 పోస్టులు**
8. జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్, ఈ1 గ్రేడ్: **3 పోస్టులు**
9. జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్, ఈ3 గ్రేడ్: **30 పోస్టులు**

**నాన్ ఎగ్జిక్యూటివ్ కేడర్ పోస్టులు**

10. సబ్-ఓవర్సీస్ ట్రెయినీ(సివిల్), టీ అండ్ ఎస్ గ్రేడ్-సి: **16 పోస్టులు**

**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభం:** మార్చి 1
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 18
**వెబ్‌సైట్:** https://scclmines.com/

## ఎస్‌బీఐలో క్రెడిట్ అనలిస్ట్‌లు

ఖాళీలు 50

ముంబయిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ)... రెగ్యులర్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టు:** క్రెడిట్ అనలిస్ట్(మిడిల్ మేనేజ్‌మెంట్ గ్రేడ్-3)
**అర్హత:** డిగ్రీ, ఎంబీఏ(ఫైనాన్స్)/పీజీడీబీఏ/పీజీడీబీఎం/ఎంఎంఎస్(ఫైనాన్స్)/సీఏ/సీఎఫ్ఏ)ఐసీడబ్ల్యూఏఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
**వయోపరిమితి:** 25 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి
**జీతభత్యాలు:** నెలకు రూ.63,840 - రూ.78,230
**దరఖాస్తు ఫీజు:** రూ.750
**ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
**దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 4
**వెబ్‌సైట్:** https://www.sbi.co.in/

## బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

ఖాళీలు 20

ముంబయిలోని బ్యాంక్ ఆఫ్ బరోడా...రెగ్యులర్ ప్రాతిపదికన రిస్క్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
**పోస్టులు:** మేనేజర్, సీనియర్ మేనేజర్, చీఫ్ మేనేజర్
**విభాగాలు:** పోర్ట్ ఫోలియో మానిటరింగ్ అండ్ ఎక్స్‌పోజర్ మేనేజ్‌మెంట్, సెక్టార్/ఇండస్ట్రీ అనలిస్ట్, ఎంటర్‌ప్రైజ్ రిస్క్ మేనేజ్‌మెంట్, క్లైమెట్ రిస్క్, మోడల్ వ్యాలిడేషన్, అనలిటిక్స్, మోడల్ డెవలప్‌మెంట్, ఎన్‌బీఎఫ్‌సీ అండ్ ఎఫ్ఐ సెక్టార్ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్, ఎంఎస్ఎంఈ క్రెడిట్ రిస్క్ మేనేజ్‌మెంట్.
**అర్హత:** సంబంధిత విభాగంలో సీఏ, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ, సర్టిఫికెట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం తప్పనిసరిగా ఉండాలి.
**దరఖాస్తు రుసుము:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600; ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.
**ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్, సైకోమెట్రిక్ టెస్ట్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 8
**వెబ్‌సైట్:** https://www.bankofbaroda.in/career